sanguine about students' stupendous stamina. While praising JKCians' contributions in various walks of life, he observed the youthfulness of students was very admirable. They might earn laurels in studies in foreign countries but they should remember the dictum of " learn, earn and return" to India. He quoted Vivekananda who said that the 21st century belonged to the youth. He asked students to rise above sectarian outlook. "We may have different castes, creeds and customs but unity in diversity is in our culture and it should be celebrated as it has an educative value. He also talked about the import of four C's – commitment, calibre, capacity and conduct. While other countries, including China, were entangled in the cobwebs of the global slowdown, India moved forward. He advised students not to neglect or forget the mother tongue, the place of birth and the motherland. He asked the state government to take proactive measures to promote mother tongue and make it an integral part of curriculum.

Distinguished Guest, Sri Nara Chandra Babu Naidu, Hon'ble Chief Minister of Andhra Pradesh remarked that India was rightly poised to become '*Vishwaguru'* . She can outstrip China and other countries owing to its demographic dividend which was conspicuous by the overwhelming presence of youth between the ages of 14 -35. Even during recessive period India's economy surged forward. He asked students to become conscious of the terrain of politics but not at the expense of studies. "DGP Malakondaiah, an alumnus of JKC, should be a right model and motivating force. AP is going to make a knowledge hub and therefore, students should update their knowledge and enhance their skills", he observed. He glorified the adventurous spirit of youth marked by innocence. He urged students to exploit the immense potential of Internet of Things (IoT) and artificial intelligence. He called upon the students to be the true inheritors of Indian cultural heritage. He cautioned students against overuse of mobile phones. "If students use JKC brand sanely they would be on the path of success in all walks of life", the CM said.

Both Sri M. Venkaiah Naidu and Sri N. Chandra Babu Naidu recollected their fruitful association with Sri Jagarlamudi Chandramouli garu in the AP Assembly and his righteous life. They also complimented the Management for running the institution on sound lines.

All the distinguished guests were felicitated with mementos and shawls by Sri Murali Mohan, Dr. R. Srinivas and office bearers of old students' Association. Vote of thanks was proposed by Sri J. Murali Mohan, Secretary & Correspondent. Dr. I. Nageswara Rao, Principal and Sri SRK Prasad, Director, PG Courses were present. Sri P.Koti Rao, President of JKC College Old Students' Association and its Secretary, Sri Chukkapalli Ramesh along with Sri Chukkapalli Suresh, Sri Madala Vasu and its office bearers were also present.

The college witnessed heavy rush with more than eight thousand students and others listening to the speeches. The college reverberated with slogans showing students' excitement and liveliness. The police deployed forces and used drones to monitor the movement of audience.

The Golden Jubilee Celebrations were followed by another programme, "JKC College Golden Souvenir Release" by APSCHE Vice Chairman, Prof. P. Narasimha Rao. He asked students to be studious and make use of the wonderful facilities provided by the Management. Dr. K. Basavapunnaiah presided over the function. He gave a brief evolution and growth of JKC College. Sri J. Muralimohan explained the efforts being put in to make the Golden Jubilee Celebrations a grand success. He called upon students to work hard. Dr. I. Nageswara Rao, Principal, advised students to emulate old students'. The distinguished alumni of the college, Dr. M.Mala Kondaiah, DGP Sri Mata Rama Rao, an IAS Officer, Sri Ch. Dwaraka Thirumala Rao, DGP (CID), Sri Boyapati Srinivas, Film Director, Dr. P. Vijaya of Lalitha Nursing Home, while recollecting the happy days spent on the campus, asked students to be industrious and sincere. The inordinate delay of distinguished dignitaries owing to inclement weather necessitated postponement of 50th College Annual Day Celebrations to 17th February, 2018.

Musical Extravaganza

The surge of students peaked towards the evening to watch cultural programmes, The ground seemed to burst at the seams as members of Management, staff, old students, students and well-wishers of the college could be seen on the sprawling lush green lawns. They patiently waited with baited breath to view the scintillating performances.

Ms Anjali Patel troupe's performance was classy. Their awesome Kathak was set to Sufi qawwali and other soul-elevating songs. They transported audience to ethereal worlds. Michael Makhal's symphonic scores provided a rare treat to music lovers. Mrs Smita's Threeory Band performed devotional *Ishana* – the path of the divine. Though created for a cause in praise of Isha Foundation's work in several domains, *Ishana* took the audience to loftier heights of enjoyment. Popular TV anchor and artiste, Ms Jhansi compered the cultural programmes with her ready wit and repartee.

50th College Annual Day Celebrations

The College Annual Day Celebrations started at 4 pm on 17th February, 2018. Dr. K. Basavapunnaiah presided over the function. Speaking on the occasion, Dr. K. Basava-punnaiah gave a sketchy outline of the growth of JKC College. He remembered the noble service rendered by Sri Jagarlamudi Chandramouli, the Founder-President of JKC College and other members of Nagarjuana Education Society. He observed that NES represented renowned galaxy of Guntur elite. Sri J. Muralimohan while expressing satisfaction over the year-long preparations said that the strength of JKC College was students. He praised the signal service rendered by Sri J. Narendernath who brought about a sea-change in the infrastructural facilities during his stint as Secretary & Corrspondent spanning over 25 years. He advised students to utilize facilities and come off with flying colours. Dr. I. Nageswara Rao, Principal said that JKC College took care of the all-round development of students. Students should conduct themselves properly since the Management was very generous and kind in creating right type of academic culture on the campus. He congratulated all those who got through campus selections and won prizes in extra-mural competitions. Sri SRK Prasad, Director of PG Courses, recollected the humble beginnings of the college. He added that the beautiful infrastructure was an outcome of the Management's ceaseless endeavours. The Chief Guest, Sri Prathipati Pulla Rao, Hon'ble Minister for Civil Supplies, advised students to have a role model like Sri Vivekananda. They should also take a leaf from Jagarlamudi Chandramouli's life. He asked students to be good at academics because illustrious personalities like Abdul Kalam, Satya Nadella gained many laurels owing to education. Dr. A.S. Ramakrishna, MLC rued that human relations were on the decline owing to the onslaughts of technology. He disapproved the texting and emailing indiscriminately. He also talked about the importance of emotional intelligence. He advised students to use their intellectual faculties aright. Great personalities like Bill Gates and Mark Zuckerberg created ripples in contemporary history when they were in the prime of their youth. Sri Mannava Subba Rao, Chairman, Guntur Agricultural Market Yard suggested that students should give utmost importance to discipline.

Felicitations

The Management felicitated Principal, Director, PG Courses, Vice Principal and all the other members of staff both teaching and non-teaching with mementos and shawls. Dr. K. Basavapunnaiah, Sri J. Muralimohan, Dr. Ch. N.M. Srinivas along with Dr. A.S. Rama Krishna and Sri M. Subba Rao gave away the mementos.

Cultural Programmes

Vice Chairman of Fine Arts, Sri P. Gopi Chand organized cultural programmes. It is striking to note that students' performance in skits, dances, mono action, mimicry drew the attention of the audience.

In fine, the iconic Golden Jubilee Celebrations showcased the essential strength of JKC College. It bears an ample testimony to the fact that any institution worth its name can weather any storm – be it financial stringency or apathetic treatment meted out by the respective governments in their ruthless pursuits of privatization. It also proves that when stakeholders work in unison "with one equal temper of heroic hearts", great deeds can be embarked and accomplished with considerable felicity.

Long Live JKC! Long Live JKCians!



Vedula Raghu Ram Krishna
III B.Com (C)

During Golden Jubilee Celebrations of JKC, I found many old students visiting the college campus. They looked at the buildings with a feeling of nostalgia. Many of them looked at the college in disbelief. As they entered the college, a kind of dreaminess was writ large on many of their faces. "There was complete change. I could not find a trace of bygone times when I studied here". In their eyes I found a feeling of a love-lorn child waiting for her mother's embrace.

One day I heard honks blaring at the main gate followed by an orchestra. Popular numbers of yesteryears were played. Old students made a ring and were dancing. We too gathered round them. It took us little time to catch their enthusiasm. We too danced along with them.

Another unique thing about the gatherings was friendliness. They used to call one another " Arey and Orey". It seems that there prevailed some understanding. During the alumni meets they recollected their old memories. They also shared their joys and sorrows. There might be some gap between their financial status. But they were on intimate terms. It did not prevent them from sharing jokes.

One day an IAS officer came. He made enquires about his sirs. He moved about the campus remembering the days he spent in the college. He honoured his teachers. It really moved us to see his attachment towards the college.

The Alumni Wing is always active. It arranged many meets to make alumni day a grand success. Why do they love the college? They love the college because they learnt much from her. Their teachers were devoted. Their students too shared sirs' commitment. They settled well. They occupied many prestigious positions in society. Wherever they are, they remember JKC.

During celebrations, old students came to college as if it were some great fair or some festival. They came in the morning. There was much happiness, joy, warmth in the air. They kept on greeting their friends, batchmates and their sirs. Many of them were very generous and announced "tokens of gratitude". The programmes did not take place as planned owing to the inordinate delay of some dignitaries. The cultural programmes too tested patience. Later their classiness took us by pleasant surprise. Thus the mood remained the same in spite of some hiccups. The programmes came to an end about 10 p.m. But all were glued to their seats.

JKC College is special because her name brings enthusiasm. Some would become enraptured. Some become over-awed at her glory. Everyone here is duty-conscious. JKC teaches many useful lessons. It was our fortune to have participated in many cultural, academic programmes. May God bless us all!

Long Live JKCians!

Long Live JKC!

JKC College Teachers' Association : A Symbol of Accountability



Sri R. Srinivasa Rao

Secretary (ACTA)

JKC College Teachers' Association is unique in many ways. While promoting the legitimate interests of teachers and bringing its issues to the Management and the Government, it acts as a catalyst. When the institution was established, no body felt its need since the Management was very generous. However, the apathetic ways of the successive governments entailed its need. The members "had to weather the cold gusts of political inaction and bureaucratic indifference before they could get the much-needed grant-in-aid. Meanwhile the sufferers were the members of teaching staff who were often underpaid and overworked". ACTA, popularly known as Affiliated College Teachers' Association made fervent efforts and made the government concede to grant-in-aid to deserving institutions and JKC College was one among them. In 1998, 1999, 2000 and 2002 a good number of lecturers were recruited with the generosity of the Management and efforts of the Association. It was a significant achievement.

It is important to deliberate on the establishment of Staff Association. Though the teaching staff of JKC College was very intimate with the Management owing to the indisputable fact that they had always received salaries in the initially period according to the U.G.C scales, they had to make the historic option of joining the ACTA to ensure the various aspects of the welfare of its members as well as the welfare of the college at large; for, it was becoming increasingly difficult to run a large academic institutions without a regular influx of funds from the Government. Dr. K.Sadasiva Rao, Founder-Secretary of JKC College, always generous and democratic, immediately condescended to its formation.

JKC College Teachers Association was inaugurated by Sri M.J.Manikya rao, Sri V.V Krishna Rao and Sri Y. Rajagopala Rao in July 1973 when the Affiliated College Teachers Association (ACTA) had given a strike call with a charter of demands which included the admission of unaided degree colleges that had completed five years of experience into grant-in-aid, extension of pensionary benefits to the staff etc. The Association elected Sri E. Bhaskara rao as Chairman and Sri. P. Vengala Rao as Secretary. The Association immediately joined the strike and called off the strike when the state government conceded the just demands of the college teachers.

The JKC College Teachers Association continued its activities in getting the regular grant-in-aid, in fixing the pay of lecturers in 1975 pay scales, 1976 pay scales, weightages, U.G.C pay scales and career advancement scheme in 1986, 1996 and 2006. The Association conducted elections to the office bearers periodically. The following is the list of Chairmen and Secretaries from 1975-2019.

Year	Chairman	Secretary
1975-76	Sri E.Bhaskara Rao	Sri. M.Koteswara Rao
1976-77	-----	Sri. P.Koteswara Rao
1977-78	Sri Y. Venkata Rao	Sri K.S.R Raju
1978-90	Sri Y. Venkata Rao	Sri. S.R.K Prasad

1990-92	Sri A.Madan Mohan	Sri C.Krishna Prasad
1992-94	Sri G.Lakshmi Narayana	Sri C.Krishna Prasad
1994-96	Sri G.Someswara Sharma	Sri C.Krishna Prasad
1996-98	Sri B.Subba Rao	Dr.S.Sivaram Babu
1999-2001	Sri B.Subba Rao	Dr.S.Sivaram Babu
2001-2002	Sri B.Subba Rao	Dr.N.Nageswara Rao
2002-2003	Sri V.Rama Rao	Sri K.Sambasiva Rao
2003-2004	Sri V.Rama Rao	Sri R.Srinivasa Rao
2004-2005	Smt. P.Santha Kumari	Sri R.Srinivasa Rao
2005-2007	Smt. M.Arjuna Devi	Sri R.Srinivasa Rao
2007-2019	Sri Ch.Ramprasad	Sri R.Srinivasa Rao

The office bearers for the period 2017-2019

Chairman	:	Sri. Ch. Ramprasad	HoD, Dept. of Physics
Vice- Chairman	:	Dr.Y.Suresh Babu	Professor,Dept.of Computer Science
Secretary	:	Sri R.Srinivasa Rao	Lecturer in Mathematics
Add. Secretary	:	Sri T.Subba Rao	Lecturer in Telugu
Joint secretary	:	Sri K.Charan Choudary	Lecturer in Commerce
Treasurer	:	Dr.I.Hatti	Lecturer in Chemistry
Lady Representative	:	Smt.P.Naga Suseela	Lecturer in English

The JKC College Teachers Association has always stood behind the ACTA during every crisis. The Association joined the strike call given by the ACTA in 1978 and 1986. Right from the day the JKC College Teachers Association joined the ACTA, it was always honoured with posts of responsibility at the state level. Sri P.Vijay Kumar, Librarian, was elected to the ACTA Executive for the period 1974-76. Sri K.Seshagiri Rao, Lecturer in Mathematics, was elected to ACTA Executive for the period 1976-80. Sri P.Koteswara Rao, Lecturer in Chemistry, was elected for twice to the post of Vice-Chairman of ACTA and served ACTA during 1980-84. Sri S.R.K Prasad, Secretary of our Association was elected five times to the Executive of ACTA and served ACTA from 1980-90. He was elected to the post of Vice-president, Nagarjuna University area, during September, 1992. Later he was elevated as President of the Association.

It should be kept in mind that the Association is not just organization or instrument to wage battles for the rights and privileges of its members only. It is also conscious of duties and responsibilities. It always censures the erring members and exhorts all the members to attend to their work with scrupulous care and dedication. Moreover, the Association had great joy in involving itself in the developmental programmes taken up by the Management. Therefore, the Association donated a large amount of nearly one lakh rupees to the college as a token of its commitment to the college and the Management was gracious enough to name an entire block after the staff association. Now the block, allotted to the Department of Botany is called Staff Association's Department of Botany. The Association is grateful to the Management, in particular to Dr.K.Basavapunnaiah, the then Secretary of the College, for the magnanimous gesture of naming a block after the Staff Association. All the members of the Association also feel proud of another achievement of theirs- the installation of the bronze bust of late Sri Jagarlamudi Chandramouli garu, Founder President of the Nagarjuna Educational society and of JKC College. As a token of respectful affection for the Founder-President, the Association got the bronze Bust of their beloved departed god-father installed with their own

contribution on the campus of the college. The members of the non-teaching staff Association also contributed for it. The Association, being aware of the Founder-Principal Sri Y.Rosayya's contribution to the academic growth and administrative soundness of our college, instituted an endowment in memory of late Sri Y.Rosayya by depositing a sum of Rs 10,000 the interest which accrues on this amount will be awarded to students who stand first in English and Telugu at the end of the second-year degree examinations. The Association, as a token of its gratitude, donated one lakh rupees (1,00,000) to Chandus' Silver Cup Tournament for AP College Teachers. It also donated 90,000 rupees for the bronze bust of Sri J. Narendernath garu who had been very sympathetic and generous to the issues of the teaching staff.

It is obvious that the successive governments in the aftermath of liberalization and privatization in the nineties started following policies like waiving aid as reflected in GO No 35 with unflagging zeal to the dismay of ACTA. Meanwhile self-financing courses and travails unaided Lecturers have been on the rise. It stands to reason that the government has been indifferent to the genuine problems of unaided lecturers and running of unaided sections. It is incumbent on its part to support an aided college since it always espouses to the cause of education of the marginalized and economic backward sections of society. Despite callous attitude of the government, the Association keeps on making many endeavours to bring the travails of privatization to higher echelons of the government. Some of its initiatives have turned out to be useful. Earned Leave Encashment is one of the significant one. Taking salary on the first of every month is also a major achievement. Recently the government issued GO No.182 to the effect of which aided employees are going to get salaries on the first of every month on par with government employees. When the issues of unaided lecturers were brought to their notice they would say that they would consider in the earnest.

After bifurcation of the state, the collective strength of the Association dwindled and the state confronts many problems with its deficit budget. In fact, there are many issues which remain unsolved and therefore, the Association works hard in tandem with the ACTA protesting against measures to privatize higher education. The Association feels that indiscriminate privatization is the root cause of all the present problems. It should be remembered that only collective efforts will bear fruits. Hence, its members in the ACTA try to bring pressure on the government for more proactive measures. It is important to note that Sri R. Srinivasa Rao, Secretary of the Association, was selected as a Special Invitee to ACTA Secretariat for two years (2017-2019). Meanwhile, the Association represents issues to the Management which responds to them with empathy and generosity. It is very pertinent to inform that our present Teacher MLC, Dr. AS Ramakrishna garu, who served in Rayapati Venkata Ranga Rao College of Education run by Nagarjuna Education Society, has been very supportive trying to solve and alleviate all our genuine issues.

In spite of the problems that accompany ACTA after privatization and bifurcation and the subsequent weakening of Association to some extent, the JKC College Teachers Association works very hard to promote the welfare of the teachers of our college in particular, the welfare of the other college teachers in general by its active participation in the constructive programmes of the ACTA. The Alumni who are working in the college donated money to the college on the occasion of Golden Jubilee Celebrations to JKC COSA. The Association is particularly happy that the Management and the Golden Jubilee Celebration Committee have honoured the members of the staff (teaching and non-teaching). It is indeed a thoughtful gesture which reveals and emphasizes the mutual affection and respect that the Management and the Staff always have for each other. Thus the Association with all accountability strives to promote the legitimate interests of staff with the kind support of the management and the Government.

విషయసూచిక

1.	మధుర స్మృతులు	విద్వాన్ గోగినేని కనకయ్య	212
2.	మేరునగధీరుడు – చల్లని చందమామ	శ్రీ దరువూరి వీరయ్య	214
3.	అమృతమూర్తి చంద్రమౌళి గారు	శ్రీ ఆవుల మదన్‌మోహన్	223
4.	వెజ్జేలకు ఒజ్జే – ఒజ్జేలకు వెజ్జే	శ్రీ రావెల సాంబశివరావు	224
5.	మా మాస్టారు రోసయ్య గారు	డాక్టర్ అమరేంద్ర	227
6.	జె.కె.సి.లో నా విద్యా వికాసం	శ్రీ ఎస్. సుబ్బారావు	229
7.	నన్ను మార్చిన జె.కె.సి. – పవిత్ర వారణాసి	డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి	231
8.	మాతృ సంస్థ జె.కె.సి. కళాశాలకు ప్రణామాలతో...	డా॥ పాతూరి రాధిక	233
9.	గుంటూరు తెలుగు	డా. పాపినేని శివశంకర్,	235
10.	నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన మరో మాతృమూర్తి	శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు	239
11.	జ్ఞాన వృక్షం	శ్రీ బండ్ల మాధవరావు	239
12.	అకల్మష ప్రతిభాధురీపరాయణులు–శ్రీ కుప్పుస్వామి గారు !	డా॥ యలవర్తి ప్రశాంతి	240
13.	జె.కె.సి. కళాశాల ఆవిర్భావం	శ్రీ నామినేని కోటేశ్వరరావు	244
14.	జె.కె.సి. కళాశాల ఒక వజ్రం	శ్రీ పాతూరి కోటేశ్వరరావు	247
15.	కళాశాల ఆధునిక రూపశిల్పి శ్రీ జాగర్లమూడి నరేందర్‌నాథ్	శ్రీ ఎస్.ఆర్.కె. పసాద్	252
16.	మా జె.కె.సి. కళాశాల – మా ఆంధ్రశాఖ	శ్రీ గొల్లపూడి ప్రకాశరావు	255
17.	అభినందనలు	శ్రీ బాలినేని రామారావు	259
18.	పరమాన్నం	కీ॥శే॥ పులిచర్ల సుబ్బారావు	261
19.	(ఆ) పాత మధుర క్షణాలు	డా॥ నాగభైరవ ఆదినారాయణ	266
20.	జె.కె.సి. కాలేజి బతకడమెలాగో కూడా నేర్పింది	డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు	270
21.	జె.కె.సి. కళాశాల – నా మజిలి	శ్రీ గుంటుపల్లి సాంబశివరావు	272
22.	తల్లిదండ్రుల ఆవేదన	కె. దివ్య	274
23.	నేను–నా కళాశాల	శ్రీ తల్లపనేని బాలనరేంద్ర ప్రసాద్	275
24.	జె.కె.సి. కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం	శ్రీ యెండూరి పాండురంగారావు	278

మధుర స్మృతులు



"సౌందర్యసార సర్వస్వం
మందస్మిత మనోహరం
వందారు జనమందారం
వందే సాయి మహేశ్వరమ్"

మన కళాశాల స్థాపన ఒకనాటి కల – ఈనాటి విద్యార్థుల, తల్లిదండ్రుల నోముల పంట. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' – అని అన్నారు గురజాడ. అదికాక 'దేశమంటే బిడ్డలోయ్' – అని అంటున్నారు కొందరు. దేశ భవిష్యత్తు, సర్వతోముఖాభివృద్ధి భావిపౌరులపై ఆధారపడి ఉంది. నేటి మన జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల ఉత్సవాలను జరుపు కొనటం ముదావహం. దీనినొక సువర్ణాధ్యాయంగా పేర్కొనవచ్చు. ఈ సంస్థకు మన జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే ఒక సముచిత స్థానముంది. విద్యా బోధనలో, క్రమశిక్షణలో ప్రవేశ పెట్టబడిన సంప్రదాయాలు, ఉన్నత ప్రమాణాల సాధనకు సోపానాలయ్యాయి.

కళాశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపల్, వివిధ కళాశాలల్లో పనిచేయుచున్న అధ్యాపకులు చక్కని ప్రజ్ఞాసామర్థ్యాలను కల్గి ఉండటమే కాక సంస్థను ఆదర్శ వంతంగా నిర్వర్తిస్తున్న పాలకవర్గంతో సత్సంబంధాలను కొనసాగించటం ఒక ప్రత్యేకత. అదేవిధంగా అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు కళాశాల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందిస్తున్నవారే. కనుక ఈ సందర్భంలో అందరూ అభినందనీయులే.

విద్వాన్ గోగినేని కనకయ్య

మాన్యులు నన్ను మన్నింతురుగాక. నా ఆవేదనను – ఆనందాన్ని కొన్ని మాటల్లో చెప్పదలచుకున్నాను. 1965వ సంవత్సరంలో తాడికొండ గ్రామానికి గ్రాంటుతో మంజూరు కాబడిన కళాశాలను ప్రారంభించుకొనే సదవకాశాన్ని తాడికొండ కోల్పో యింది. అదృష్టవశాత్తు నేను రాజకీయాల నుండి విరమించు కొన్న తర్వాత ఉన్నత విద్య నభ్యసించుటకు సీట్లు దొరక్క బిడ్డలు పడు పాట్లు "కులాలకు–మతాలకు" పరిమితమైన కళాశాలల తీరుతెన్నులు నాకు చాలా బాధ కల్గించాయి. అవసరమైన ప్రదేశాల్లో విద్యా సంస్థలను స్థాపించుటకు ప్రయత్నించాలని నిశ్చయించు కొన్నాం. మానవ జన్మకు జ్ఞానం, ఆరోగ్యం, తగిన స్థితిగతులు కల్పించిన ఆ శక్తి స్వరూపానికి ప్రతీకలైన మానవులకు స్వార్థ రహితంగా సేవ చేయటంకన్న నిస్వార్థమైన సేవా కార్యక్రమాలే అన్న భావన స్ఫురణకు వచ్చింది. తదుపరి భగవాన్ శ్రీ సత్యసాయి వారి ఆశీస్సులతో ఆ మార్గాన్నే పయనిస్తున్నాను.

ఆనాడు రాష్ట్రంలో గుంటూరు పట్టణం ఒక విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకొక కళాశాల స్థాపనావశ్యకతను గుర్తించి దానికై ఆలోచిస్తూ నా పేరు బయటకు రానీయకుండా కళాశాల విషయమై పుర ప్రముఖులతో సంప్రదించమని ఒక మిత్రునకు సూచించాను. ఆ సంగతి తెలుసుకున్న డాక్టర్ సదాశివరావు గారు నాకు కబురుపెట్టి శ్రీ కుప్పుస్వామి చౌదరి పేరుతో కళాశాలను స్థాపించడం సాధ్యమేనా? అని ప్రశ్నించటం జరిగింది. సాధ్యమే – అసాధ్యం మాత్రం కాదు. ఐతే కష్టసాధ్యమని అన్నాను. ఆ కథ అంతా చెప్పి మిమ్మల్ని విసిగించటం మంచిది కాదు. (ఆ మిత్రుడు శ్రీ కొల్లా కృష్ణారావు).

ఆ తరువాత శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారిని, తదితరులను కలుసుకొని మాట్లాడి మొదట కమ్మ హాస్టల్‌లో సమావేశమై కళాశాలను స్థాపించటానికే నిర్ణయించటం జరిగింది. అందుకు కావలసిన

నిధులను సమకూర్చు కొనుటకే హరిహరమహల్‌లో శ్రీ చంద్రమౌళి గారి అధ్యక్షతన మరొక సమావేశం జరిగింది. సర్వశ్రీ చేబ్రోలు హనుమయ్య, వై.కె.యస్. ప్రకాశరావు, డాక్టర్ సదాశివరావు, మంగళదాసు మున్నగు ప్రముఖులు పాల్గొన్నారు. ఆ సమయములోనే కొందరు తమ తమ విరాళాలను ప్రకటించారు. భవన నిర్మాణానికై కావలసిన స్థల సేకరణ వెంటనే జరిగింది. కళాశాల నిర్వహణలో అనుభవజ్ఞుడైన ఒక విద్యావేత్త ఉన్నచో బాగుండునని అభిప్రాయపడి ప్రముఖ జిల్లా విద్యాధికారిగా ప్రఖ్యాతి గాంచిన పశ్చిమగోదావరి నుండి రిటైర్ అౌతున్న శ్రీ నన్నపనేని వీరయ్య చౌదరి గారికి లేఖ రాశాను. వారు వెంటనే అంగీకరించి సహకరించుట సంతోష దాయకం. దీని ఫలితంగా చిలకలూరిపేట, ధరణికోట, పెదనంది పాడు మున్నగుచోట్ల కళాశాలలు స్థాపించ బడటం గమనార్హం.

ఈ కళాశాల ప్రారంభంలో కళాశాల స్థాయి వరకే పరిమితం కాదనుకొన్నాం. కాని చాలాకాలం అట్లే ఉండిపోయింది. ఒకనాడు మన ప్రేమమూర్తి శ్రీ బాబు గారు (శ్రీ చంద్రమౌళి గారు) ఆప్యాయంగా ఫోనులో పిలిచి శ్రీ వై.కె.యస్. ప్రకాశరావు గారు రాజీనామా చేశారు కనుక నీవు జె.కె.సి. కళాశాలకు కోశాధికారిగా ఉండాలని అన్నారు. అవసరమనుకుంటే మీ ఆదేశాన్ని కాదనలేను అని అన్నాను. శ్రీ చంద్రమౌళిగారు అన్ని విద్యా సంస్థలకు జీవితాంతం అధ్యక్షులుగా ఉండి అజాతశత్రువుగా అందరి మన్ననలను పొందారు. డాక్టర్ సదాశివరావు, డాక్టర్ బసవపున్నయ్య, డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ హనుమంత రావు, శ్రీ లక్ష్మణరావు, శ్రీ రామానాయుడు, శ్రీ నరేంద్ర, శ్రీ రాయపాటి సాంబశివరావు, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు అందరూ అదేబాటలో కలసిమెలసి ఉండటం మన విద్యార్థుల అదృష్టం.

ఈ నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యాన పేరేచర్ల హైస్కూలు, శ్రీ కొండబోలు లక్ష్మీ ప్రసాద్ పబ్లిక్ స్కూలు, శ్రీ రాయపాటి వెంకట రంగారావు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, అక్కడే ఎం.యిడి. గూడ ఏర్పాటు చేయటం జరిగింది. ఆర్.వి.ఆర్. అండ్ జె.సి.ఒ.పి. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (చోడవరం) (ఇప్పుడు రాయపాటి వెంకట రంగారావు అండ్ శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్) – శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి కాలేజి ఆఫ్ లా మొదలైనవి ఆదర్శమైన రీతిలో నడుపబడు తున్నాయి. కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ మొదలగు కోర్సులు కూడ ఉన్నాయి.

విద్యాలయాలు డిగ్రీల వరకే పరిమితమనే భావన వలన కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పలుఆందోళనలకు గురౌతున్నాయి. చదువుతో పాటు సంస్కారం కలిగి విద్య – దాని సార్థకత – విద్యార్థులు – వారి కర్తవ్యం గుర్తించి ఈ విద్యాసంస్థలు మన కొరకే ఏర్పాటు చేయబడ్డాయి. మనమందరం ఒకటేనని, ఆ శక్తిస్వరూపుని అంశలేనని తెలిసికొనగల్గినపుడు ప్రశాంతి లభిస్తుంది. ఇక అధ్యాపకులు విద్యార్థులతో జాతీయభావాన్ని, సేవాదృక్పథాన్ని పెంపొందించి వారిలో నున్న శక్తి సామర్థ్యాలను సమాజాభి వృద్ధికి తోడ్పడునట్లు చేయాలి.

“అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ”

(ఈ వ్యాసం జె.కె.సి. కళాశాల రజతోత్సవ స్మారక సంపుటిలో ప్రచురించబడినది)

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి

శ్రీ దరువూరి వీరయ్య

"సూర్యుడు నిప్పులు చెరగే ఎండలకు ప్రతీక ఐతే చంద్రుడు హృదయాల్లో ఆహ్లాదం కలిగించే చలువ వెన్నెలకు ప్రతీక. కొందరు రజోగుణ ప్రధానులైతే, కొందరు సత్వగుణ ప్రధానులు.

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారు ఈ రెండవ కోవకు చెందిన వారు. అందులోనూ మహిమాన్వితులైన వారు కూడా. శాంతమే భూషణంగా – అనురాగమే అలం కారంగా, ప్రజాహితమే పరమావధిగా – ప్రేమామృతాన్ని కురిపిస్తూ తన జీవితాన్ని సాగించిన ధన్యజీవి మన కుప్పుస్వామి చౌదరి.

పాటలీపుత్ర కోటకొమ్మల మీద, తెలుగు జెండాలు రెపరెప లాడించిన రోజులున్నాయి. కమ్మవారని పేరు తెచ్చిన నాయక రాజులున్నారు. ఆ కమ్మ ప్రభువుల్లో చల్లని చందమామగా కవుల ప్రశంసలకు పాత్రుడైన మేరునగ ధీరుడు మన కుప్పుస్వామి చౌదరి.

ప్రముఖ కవులు, కవిబ్రహ్మ బిరుదాంకితులు, శ్రీ ఏటుకూరి వెంకటనరసయ్య గారు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి తాను రచించిన "ప్రేమాలోకం" అనే కావ్యాన్ని అంకితం చేస్తూ రచించిన ఈ కింది పద్యముతో ఈ నా రచన ప్రారంభిస్తున్నాను."

"అమిత శౌర్యధురంధరులాంధ్రు–లందు
ప్రాభవ భ్రాజితులు కమ్మ ప్రభువు–లందు
ఓడమన్నీలు జాగర్లమూడి దొరలు
అందు కుప్పయ్య చల్లని చందమామ"

–కవిబ్రహ్మ

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారి పూర్వీకులెవరు? ఎక్కడ నుండి వచ్చారు?

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరికి పూర్వీకు లెవరు? ఎక్కడ నుండి వచ్చారు? ఎందుకు వచ్చారు? ఎప్పుడు వచ్చారు? ఈ ప్రశ్నలు అప్పుడప్పుడు అనేకసార్లు శ్రీ చౌదరి గారినే అడిగాను. దక్షిణాది – అంటే తమిళనాడు నుండే వచ్చాము. ఎప్పుడొచ్చామో? – ఎందుకొచ్చామో? మా పూర్వీకులు ఎక్కడా పేర్కొనలేదు. వారికా ఆసక్తి కూడా ఉన్నట్లు లేదు.

నేనొకప్పుడు మా పూర్వీకుల కంటే కూడా ముందు అసలు ఈ కమ్మవారెవరు? వారికీ కుల నామమెందుకు? ఎలా వచ్చింది? పరిశోధన చేయించాలనే ఆలోచన కలిగింది. అలా ఆలోచన కలగడమే తరువాయి గొప్ప రచయిత, చారిత్రక పరిశోధకులు, శ్రీ కొసరాజు రామయ్య చౌదరి గారిని పురమాయించాను. ఆయనకు తోడుగా శ్రీ రాఘవయ్య. వారంతా చాలాకాలంపాటు తంజావూరులో ఐదు వందలేండ్ల కిందట నాయకరాజులు అచ్యుత నాయకుడు, రఘునాథ నాయకుడు చరిత్రకందని మరెందరో స్థాపించి, విస్తృత పరచి ప్రపంచంలోనే తనదైన ఒక ప్రత్యేకతను సంతరించుకొన్న సరస్వతీమహల్ అనే గ్రంథాలయంలో ప్రాచీన శిలాశాసనాలు తిరగవేసి కొంత సమాచారాన్ని సేకరించారు. గండికోట, చంద్రగిరి, ఆనాటి రాజధాని నగరాల్లోని ప్రముఖ కవుల తాళపత్రాలను పరిశోధించారు. ఇంకెంతో పరిశోధన చేశారు. రచన ప్రారంభిం చారు. పూర్తి చేయకండానే వేరు వేరు వృత్తులకు అంకితమై పోయారు. పర్యవసానమేమంటే పరిశోధన కుంటుపడింది.

తరువాత కాలంలో హైహయులు, దుర్జయులు, అనేక దేశాలు జయించి రాజ్యాలు స్థాపించినవారు కమ్మవారు అని తేల్చారు. రఘునాథ నాయకుడు అనేక గ్రంథాలు రచించారు. చేమకూర వెంకటకవి అనే ఒక మహా కవి తాను రచించిన అనేక గ్రంథాల ఆధారంగా కూడా పరిశోధనలో కమ్మవారి చరిత్ర కొంత లభ్యమైంది. ఇలా చెప్పుకొంటూపోతుండేవారు.

1959లో ప్రథమ ముద్రణ, 1964లో ద్వితీయ ముద్రణ కావించబడిన "గుంటూరు మండల సర్వస్వంలో" కమ్మవారికి సంబంధించిన విశేష సమాచారం సేకరించి ముద్రించాను.

శతాబ్దానికి అటూ, ఇటూగా కాకతీయ సామ్రాజ్య పాలకులుగా, సైనికాధికారులుగా, సర్వసైన్యాధ్యక్షులుగా, సాధారణ సైనికులుగా శూద్రులు అని పిలుచుకొంటున్న రైతులు ముందుకొచ్చారు. (వివరాల లోనికి పోవడం లేదు). అందులో ప్రముఖులుగా చరిత్ర కెక్కినవారు గన్నమనాయకుడు, కాపయనాయకుడు, ప్రోలయ నాయకుడు, జాయపసేనాని. వీరంతా కమ్మవారుగా నిర్ధారించుటకు అనేక ఆధారాలు లభ్యమయ్యాయి.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఈ సైనికాధి కారులంతా మూకుమ్మడిగా విజయనగరం చేరుకొన్నారు. అక్కడ మనకు చరిత్ర

కందినంత వరకు నాగమ నాయకుడు సర్వసైన్యాధ్యక్షుడు. నాగమ నాయకుడే ఒకానొక సందర్భంలో చెప్పినట్లు, ఆయన తండ్రి, ఆయన తాత, ముత్తాతలు విజయనగర సామ్రాజ్య సర్వసైన్యాధ్యక్షులుగా ఉన్నారట.

పాండ్య, చోళ దేశాలను జయించిన నాగమ నాయకునితో సైనికులుగా, సైనిక నాయకులుగా, వేలు, లక్షలు తరలిపోయారు. వారిపై యుద్ధం చేసి జయించిన నాగమ నాయకుడు, పాండ్య, చోళ దేశాల పాలకుడుగా స్వతంత్రం ప్రకటించుకోగా, నాగమ నాయకుని కుమారుడు సర్వ సైన్యాధ్యక్షులుగా నియమించబడ్డాడు. తండ్రిని జయించి ఆయన్ని పట్టి బంధించి తెస్తానని శపథం చేసిన విశ్వనాథుని వెంట మరో లక్ష మంది తరలి వెళ్ళారు. యుద్ధానంతరం విశ్వనాథ నాయకునకు సామంతరాజు పరిపాలన అప్ప జెప్పగా, ఈ లక్షల సంఖ్యలో వెళ్ళిన సైనికులు, సైనిక నాయకులు, వారి పరివారంతో తమిళనాట స్థిరపడిపోయారు.

అలా స్థిరపడిపోయినవారు ఐదు వందల యేండ్ల నాయకుల పాలనలో రాజకీయంగా, పారిశ్రామికంగా, వ్యవసాయకంగా ఉన్నత స్థాయికి ఎదిగారు. పరిశ్రమలు స్థాపించారు. ఓడ వ్యాపారం చేశారు. దక్షిణాపథమంతట విస్తరించారు. ఇంతవరకు చారిత్రకు లంతా అంగీకరించి నదే. ఐతే వీరంతా కమ్మవారేనా ! ఔను. ఇదే నా సమాధానం.

ఇక్కడ ముందుగా, ప్రస్తుతానికి ఒకే ఒక ఉదాహరణ చూడండి. తమిళ, కర్ణాటకల్లో నాయుళ్లుగా, నాయక్‌లుగా పరిగణనలో ఉన్న యావన్మంది ఇండ్ల పేర్లు – ఆంధ్రదేశం లోని కమ్మవారి ఇండ్ల పేర్లు ఒకటిగానే ఉన్నాయి. ఇప్పటికే నేనొక వంద ఇండ్ల పేర్లను సేకరించి, ఆంధ్రలో పోల్చి చూపేందుకు తయారుగా ఉన్నాను.

ఇక విషయానికి వద్దాం. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి ముత్తాత, లేదా ఆయన తండ్రి గాని, తమిళనాడు నుండి వ్యాపారం – అదే ఓడ వ్యాపారం కారణంగా తీర ప్రాంతమైన చీరాలకు చేరారు. నల్లరేగడ భూములు గల కారంచేడులో స్థిరనివాసం ఏర్పరచుకొని ఉండవచ్చని నేనగా–ఔను, యదార్థమే–అందులో అనుమానంలేదే? అన్నారు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు.

తన పేరు "కుప్పుస్వామి" ఆంధ్రలో ఎక్కడా కనపడదే – వినపడదే – మీకెలా వచ్చిందీ పేరనే ప్రశ్నకు ఆయన సమాధానం తమిళనాడులో ద్రావిడ సంప్రదాయవాదులకు ఆరాధ్య దేవత ఈ "కుప్పుస్వామి" అనే దేవత. అలా, ఆ దేవత పేరే నాకూ పెట్టారు అన్నారాయన.

శ్రీ తిపురనేని రామస్వామి చౌదరి గారు "కుప్పుస్వామి" మకుటంతో "కుప్పుస్వామి శతకం" రాశారు గదా! అది మీ పేరు మీదగానే గదా అనే నా ప్రశ్నకు – ఔను నా పేరే అందులో ఉంది. నన్ను సంబోధిస్తూ రాసిందే. ఐనా ద్రవిడ దేవత పేరకూడా అనుకోవచ్చు. ద్రవిడ జాతి, ద్రవిడ సంప్రదాయం, ద్రవిడ భాషలపై ఆయన అపారమైన పరిశోధన చేశారు అంటూ, మన దురదృష్ట మేనేమో యాభై యేండ్లన్నా నిండకుండా మనలను విడిచి పోయారు అంటూఅనేకసార్లు కంటనీరు పెట్టుకున్నారు. ఆ సంభాషణ వచ్చినప్పుడల్లా, నిశ్చేష్టులై పోయేవారు.

శూద్రులుగా, మనువు నామకరణం చేసిన జాతి అంతా వీరులు, శూరులు,పరాక్రమవంతులు, ధైర్యశాలురు, ప్రాణాన్ని తృణప్రాయంగా నెంచి పోరుసాగించి, రాజ్యాధి కారాన్ని చేజిక్కించు కొన్న అనుపమానమైన, అపురూపమైన బలోపేతమైన జాతి.

యుద్ధకాలంలో, భార్యాబిడ్డలను, బంధుమిత్రులను వదలి జన్మభూమికి దూరంగా పోయి, కత్తి, డాలు, శూలం పట్టి యుద్ధ భూమిలో ప్రాణాలొడ్డి అమరులైన వారు కాగా, మిగిలినవారు శాంతి కాలంలో కండకలిగిన నల్ల, ఎర్ర రేగడి నేలలు ఎంపిక చేసుకొని వ్యవసాయం చేపట్టి కృషీవలురుగా ప్రసిద్ధిచెందిన రైతులే ఈ శూద్రులు.

తమ భుజ బల, పరాక్రమాలతో, యుద్ధతంత్రాల ద్వారా శత్రు రాజులను సంహరించి ఓటమి పాలుచేసి రాజ్యాలు స్థాపించగానే, వారినే క్షత్రియులుగా ముద్రవేసి స్తోత్రాలు చేయడం ప్రారంభిస్తారు.

చూడండి, మనపురాణాలు, ఇతిహాసాలను ఒకసారి. దేవుళ్ళంతా "క్షత్రియులే గదా !" రాముడు – కృష్ణుడు – బుద్ధుడు – జైనుడు – మహావీరుడు. మీరే దేవుళ్ళంటూ స్తోత్రాలు చేస్తూ వారిని తమ ఆధీనంలో ఉంచుకొనేవారు.

(చూడండి "మహాత్మా ఫూలే" రచనలు – చదవండి డాక్టర్ అంబేద్కరు రచనలు – మీకే అర్థమౌతుంది)

అలాగా విజయనగర సామ్రాజ్య పతానంతరం, గండికోట పతనానంతరం లక్షల కొలది శూద్రులని పిలవబడే యుద్ధతంత్రా లలో ఆరితేరిన వీరులంతా, ఆంధ్ర నాలుగు చెరగులా భూములు ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకొంటున్న కృషీవలురే కమ్మవారు, రెడ్లు, వెలమ, తెలగలు.

11వ శతాబ్దం తరువాత సైనిక నాయకులైన రైతులకు వేరువేరు కుల నామాలు మొదలయ్యాయి. పై కథాక్రమం ననుసరించి,

తమిళనాడు నుండి నాలుగైదు వందలేళ్ళ కిందట జాగర్లమూడి వారు ఆంధ్రకు వచ్చి ఉంటారు.

శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు ప్రథమ వివాహం మద్రాసులో స్థిరనివాసం యేర్పరచుకొన్న గడ్డిపాటి వారి ఆడపడుచునే చేసు కొన్నారు.

గత యాభయ్యేళ్ళుగా వేలాదిగా ఆంధ్రకు చెందిన కమ్మవారు, తమిళనాట స్థిరపడిపోయిన కమ్మవారితో సంబంధాలు పెంచు కొంటున్నారనే విషయం గమనించవచ్చు.

మద్రాసు శాసనసభలో పాతిక-ముప్పై మంది కమ్మవారు శాసనసభ్యులుగా, నలుగురైదుగురు పార్లమెంటు సభ్యులుగా అనేక పురపాలకసంఘాలకు అధ్యక్షులుగా, జిల్లాపరిషత్ అధ్యక్షులుగా, వేల సంఖ్యలో ఉన్నతోద్యోగాలతో కమ్మవారున్నారనే విషయం కూడా గమనార్హం.

దక్షిణాదిన దాదాపు నూలు, బట్టల మిల్లులు కమ్మవారివే. యావద్భారతావనికి దీపావళి, సంవత్సరాది, ప్రముఖుల జన్మదిన వేడుకలకందిస్తున్న టపాసులన్నీ శివకాశి చుట్టు కొని ఎగుమతి చేయబడుతున్నాయి. ఈ పరిశ్రమలో నూరింట తొంభై వంతులు తమిళనాట కమ్మవారే.

పంట పొలాలకు నీరు తోడే పంపుసెట్ల వ్యాపారమూ కోయం బత్తూరు జిల్లా పరిసర ప్రాంతాల కమ్మవారిదే పరిశ్రమ మొత్తంగా.

ఇన్ని ఉన్నా తమిళనాట కమ్మవారు పాడి, పంటలు వదలరు, వదలలేరు. ప్రతి ఇంట గేదెలు, ఆవులు మేపుతూ ఉంటారు. పశు పోషణ కళ కమ్మవారికొక హాబీ – హాబీ అనేకన్న అదొక వేడుక.

ఆ ఆనవాయితి నుండి తప్పుకోలేదు కుప్పుస్వామి చౌదరి. రాజకీయాలలో మునిగితేలుతున్నా, వ్యాపారాలెన్ని ఉన్నా వ్యవ సాయాన్ని మాత్రం వదలక దానినొక జీవన విధానంగా, దానినొక పవిత్ర కర్తవ్యంగా ఎంచుకొన్నా రాయన. అంతేకాదు. కారంచేడు గ్రామ నివాసాన్నొదిలి పట్టణానికి తరలివెళ్ళని పల్లెపట్టుల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొన్నారు జీవితకాలమంతా.

శ్రీ కుప్పుస్వామి చౌదరి 19వ శతాబ్దారంభం నుండి మొత్తంగా పూర్వపు కృష్ణాజిల్లాలో, రాజకీయంగా, ఆర్థికంగా ప్రసిద్ధి చెందిన గొప్పచరిత్ర సంతరించుకొన్న కుటుంబానికి చెందినవారు. 1905వ సంవత్సరానికి పూర్వం గోదావరి, కృష్ణ, పెన్న నదుల పరీవాహక ప్రాంతమంతా కృష్ణాజిల్లాగా ఉండేది. దీనికి మచిలీపట్నం (బందరు) జిల్లా కేంద్రం. యుద్ధతంత్ర రీత్యా ఓడల రేవుకు అనువుగా ఉండే సముద్ర తీర పట్టణాలకు గొప్ప పరిగణన ఉండేది. గిరిదుర్గముల ప్రాముఖ్యం అంతరించిన తరువాత ఓడరేవు పట్టణాలే రాజ్యాంగ రక్షణకు అనువైనదిగా ఉండేవి.

మచిలీపట్నం జిల్లా కేంద్రంగా గల గోదావరి, కృష్ణ, పెన్న నదీపరీవాహక ప్రాంతమంతా వ్యాపించియున్న ఆనాటి కృష్ణాజిల్లా బోర్డుకు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి పినతాత "నాయుడు" గారు మెంబరుగా ఎన్నికయ్యేవారు. ఆయన రావుబహద్దూర్, మన్నెసుల్తాన్ మున్నగు ఆనాటి అత్యంత ప్రతిష్ఠాకరములైన బిరుదులతో సత్కరించబడ్డారు.

శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి సమకాలికులు, స్థానిక పరిపాలనా వ్యవహారాలలో సలహాదారైన కవి, పండితులు శ్రీ కొండముది నరసింహం పంతులు గారు, వారి పినతాత నాయుడు గారిని ప్రస్తుతిస్తూ "మీ పినతాత నాయని పేరు విన్నంతనే శత్రుకోటి గుండె జలదరించు" అని రాశారు.

కుప్పుస్వామి చౌదరి గారి తాత "చౌదరి" గారు, పురాణ కాలాల్లో జరిగాయని మనం చదువుకొనే, రాజులు నిర్వహించిన యజ్ఞాల వంటి "గొప్ప యజ్ఞం" పూర్తిచేసి అనేకమంది వేదపండితులను, కవులను, బ్రాహ్మణులను, భూరి విరాళములతో సత్కరించారని ప్రశంసల నందు కొన్నారు.

శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి తండ్రి లక్ష్మయ్య నాయుడు గారు, ఆంగ్ల, ఆంధ్ర భాషల్లో మంచి ప్రవేశం గలవారు. ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడ నేర్చినవారట. కవి, పండితుల పోషించుట లోనూ, దానధర్మములు చేయుటలోనూ, వీరిది ఎముక లేని చేయి అంటూ పలువురు ప్రశంసిస్తూ కవనములల్లారు. గద్వాల, పిఠాపురం, విజయనగరం రాజ సంస్థానాల్లో గండపెండేరాల, సత్కారాలు, పొంది, ప్రసిద్ధి చెందిన "శ్రీ కార్యమపూడి రాజమన్నారు" గారు జాగర్లమూడి వారి కుటుంబ ఆస్థాన కవిగా ఉండేవారు. ఆయన గారు బహు గ్రంథకర్తలు, పండితులునట. వారిది చీరాల. పద్మశాలి కులస్తులట.

శ్రీ లక్ష్మయ్య నాయుడు గారికి శ్రీ కుప్పుస్వామి చౌదరి, శ్రీ చౌదరి గార్లు ఇరువురు పుత్ర సంతానం. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు బాపట్ల హైస్కూల్లో ఆనాడు ప్రధానోపాధ్యాయులుగా ఉన్న శ్రీ పంచాపకేశయ్యరు శిక్షణ, ప్రత్యక్ష పర్యవేక్షణలో స్కూల్ ఫైనల్ పాసయ్యారు.

తండ్రి మరణించడంతో కుటుంబ భారం వహించ వలసి రావడం కారణంగా చదువుకు స్వస్తి చెప్పారు. అప్పటికే తాలుకా

బోర్డు రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, రాజకీయంగా ఎదుగుతూ ఉన్నారు. అప్పుడే 1920ల్లో మాంటేగ్ – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ఆధారంగా మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలు ఎన్నికలు వచ్చాయి. అదే కాలంలో మహాత్మాగాంధి, శాసనసభలు, ఆంగ్ల విద్యాలయాలు బహిష్కరించుతూ శాసనోల్లంఘనోద్యమం ప్రారంభించారు.

గుంటూరు జిల్లాకు మద్రాసు కౌన్సిల్లో మూడు స్థానాలున్నాయి. మూడు స్థానాలకు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు, బారిష్టరు శ్రీ పంగులూరి సుబ్బారావు గారు, శ్రీ ఎన్. యతిరాజులు నాయుడు గారు ఎన్నికయ్యారు. దీంతో కుప్పుస్వామి చౌదరి రాజకీయరంగం మద్రాసు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగింది. పానగల్లు రాజా రాజా రామారాయణింగారు ప్రధానిగా జస్టిస్ పార్టీ ప్రభుత్వం పాలనకు వచ్చింది.

కుప్పుస్వామి రాజనీతిజ్ఞత

ఇక్కడే శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి రాజనీతిజ్ఞత, దేశభక్తి, మిత్రులపట్ల వాత్సల్యం, జాతీయోద్యమం పట్ల అభిమానం – తోడుత తాను మెంబరుగా ఉన్న జస్టిస్ పార్టీ పెత్తనానికి తోడ్పాటు. ఎలా పొసగుతుందనుకొనవచ్చు గదా !

1921 శాసనోల్లంఘనోద్యమం – గుంటూరు జిల్లాలోనే మహోజ్వలంగా సాగింది. శాసనోల్లంఘనోద్యమ నాయకులు శ్రీయుతులు దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, బారిష్టరు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, స్వామి సీతారాం, పరుచూరి వీరయ్య చౌదరి గారలు ఐదుగురు ప్రేమాస్పదులు, గౌరవనీయులైన మిత్రులు. పోరాటమా ! ఉన్నత శిఖరాలపై నడుస్తుంది. పారా మిలటరీ దళాలు, జిల్లా అంతటా మోహరించి ఉన్నాయి. ప్రధానమంత్రి పానగల్లు రాజారామారాయణిం గారు చీరాల పర్యటనకు వచ్చారు. మూర్ఖపు పట్టుదలతో, ఉద్యమాన్ని కాలరాయా లంటూ ప్రగల్భాలు పలుకు తున్నారు. చీరాల్లో ఆంధ్రరత్న ప్రజలను పోరుకు సమాయత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు చాకచక్యంగా ఉభయుల మధ్య ఉద్రిక్తలకు చోటివ్వకుండా లాఠీచార్జీలకు గాని తుపాకి కాల్పులకు గాని అవకాశం కలుగనీయక శాంతియుతంగా ముగించేందుకు కృషిచేశారు. రాజారామారాయణిం గారి మాట బదనాం గాకుండా – ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారి ప్రతిష్ఠకు భంగం కలుగకుండా, అధికారుల చెవిలో ఏదో ఊది ప్రధానమంత్రిని రైలెక్కించి పంపించారు శ్రీ కుప్పుస్వామి చౌదరి.

శ్రీ కుప్పుస్వామి చౌదరి రాజనీతిజ్ఞత, శాంతియుత సహజీవన విధానం ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న విషయ మొకటుంది. అదేమంటే ఆయనది జస్టిస్ పార్టీ. దాని ప్రాథమిక ఆశయం బ్రాహ్మణ వ్యతిరేకత. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తొలగించటమే జస్టిస్ పార్టీ సిద్ధాంతం.

చౌదరి గారికి బ్రాహ్మణుల్లో రాజకీయ నాయకులు, కవులు, పండితులు, సహాధ్యాయులున్నారు. స్నేహితులు ఉన్నారు. సహచరు లున్నారు. అనుచరులున్నారు. ఆయన జస్టిస్ పార్టీ ప్రముఖులుగా ఉన్నత పదవులు చేపట్టినా తన చిన్ననాటి సహాధ్యాయులను, స్నేహితులను, సహచరులను, అనుచరులను, సాదరంగా ఆదరించారు, అభిమానించారు, ప్రేమించారు, గౌరవించారు. వారి మధ్య మైత్రికి ఎన్నడు రాజకీయాలు అడ్డు రాలేదు – రానీయ లేదాయన.

పరిపాలనలో నైతిక విలువలు కాపాడిన పాలనాదక్షుడు శ్రీ కుప్పుస్వామి చౌదరి. పరిపాలనా దక్షతకు కూడా శ్రీ జాగర్లమూడి వంశం పందొమ్మిదవ దశాబ్ద ప్రారంభం నుండి గణనకెక్కింది. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు కృష్ణా, గోదావరి, పరీవాహక ప్రాంత మంతా కృష్ణా జిల్లాగా, మచిలీపట్టణం, కేంద్రంగా ఉన్న నాటి నుండి, జిల్లా బోర్డు మెంబరుగా, ఇంకెన్నో ప్రభుత్వ సలహా సంఘాలకు సభ్యులుగా ఎంపిక చేయబడుతూనే ఉన్నారు.

"మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ కమిటి రూపొందించిన చట్టం ఆధారంగా 1920లో మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ యేర్పాటు చేయగా (అప్పట్లో శాసనసభ లేదు) గుంటూరు జిల్లాకు మూడు స్థానాలుండేవి. అందులో శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు ఎన్నికయ్యారని చెప్పు కొన్నాము గదా! మద్రాసు కౌన్సిలులో ప్రముఖపాత్ర శ్రీ చౌదరి గారిదేనట. రాజారామారాయణిం, బొల్లిని మునుస్వామి నాయుడు, బొబ్బిలి రాజాగార్లకు అత్యంత సన్నిహితంగా ఉండేవారట.

ఉద్యోగాలు, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు దరిజేరనిచ్చేవారు కాదట. నైతికంగా గొప్ప ప్రతిష్ఠ సంపాదించుకొన్న ఇద్దరు ముగ్గురులో శ్రీ కుప్పు స్వామి చౌదరి గారు ఒకరని ప్రతీతి సంపాదించు కొన్నారు. అయితే సాహసించి ఏ పనీ చేయరనే అపప్రథ కూడా ఉండేదంటారు కొందరు. పన్నెండేళ్ళ కాలంలో ఎన్నడూ ప్రయాణ బత్తాలు, ఎలవెన్సులు తీసుకొని ఎరగరని ప్రతీతి. రాజారామారాయణిం గారికి శ్రీ కుప్పుస్వామి చౌదరి గారంటే ఎనలేని గౌరవమట. సాధారణంగా తాను జోక్యం చేసుకొని యే సలహా చెప్పరట. ఐతే ప్రధానమంత్రి పిలిచి ఏదైనా క్లిష్ట సమస్య ఎదురైనప్పుడు సలహా అడిగితే మాత్రం

నిర్మొహ మాటంగా, నిష్కర్షగా, నిర్ద్వంద్వంగా అవతలివారికి కష్టం కలిగినా మొఖం మీదనే చెప్పేవారని ప్రతీతి.

1928లో ప్రప్రథమంగా గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. శ్రీ ఎన్. యతిరాజులు నాయుడు గారు ప్రత్యర్థిగా పోటీలో ఉన్నారట. ఐనా ఇరువురిలో ఏ ఒక్కరు ఒకరినొకరు విమర్శించుకొనకపోగా ఒకరి సుగుణాల నొకరు ప్రస్తుతించు కొనేవారట.

గుంటూరు జిల్లా బోర్డులో ఒక అసిస్టెంటు ఇంజనీరు పోస్టు ఖాళీ ఏర్పడగా, అనేకమందితో పాటు, తన గురువు పంచాప కేశయ్యరు కుమారుడూ ఒకరుగా ఉన్నారు. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు, బాపట్ల హైస్కూలులో చదువు కొనే రోజుల్లో శ్రీ పంచాప కేశయ్యరు ప్రధానోపాధ్యా యులు, అయ్యరుగారు దక్షత గల ప్రధానోపాధ్యాయులని బహుముఖ ప్రశంసలనందుకొన్నవారు. విద్యార్థుల పట్ల ఎనలేని ఆదరణ గలవారు. శ్రద్ధతో పాఠాలు బోధించేవారు.

బోర్డు మెంబర్లలో మెజారిటి సభ్యులు పంచాప కేశయ్యరు కుమారునికి ఉద్యోగం ఇవ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదట. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు ఒకరోజు ఉదయం సభ్యుల నందరిని తన ఇంటికి బ్రేక్‌ఫాస్ట్‌కు పిలిచి, శ్రీ పంచాపకేశయ్యరు తన అభిమాన గురువు అనీ, అందునా ఆయన కుమారుడనే కాక, అతడికి అన్ని అర్హతలున్నాయని – అందువలన అతనిని ఎంపిక చేయడం మీకు ఇష్టం లేనట్లయితే – ముందుగా నా రాజీనామాను ఆమోదించండి అంటూ, నాలుగు మాటలలో టైప్ చేయబడిన రాజీనామా కాగితాన్ని అందించారు. సభ అంతా నిశ్చేష్టులయ్యారట. కాదు, కూడదు, మీ రాజీనామా ఆమోదించేది లేదు. మీ అభీష్టం ప్రకారమే సెలక్షను చేయండి అంటూ ఏకగ్రీవంగా చెప్పారట. అదీ ఆయన పట్టుదల, దీక్ష, నిజాయితి. ఇలాంటివి ఇంకెన్నో సంఘటనలు.

ఇక అభివృద్ధి పనులా ! కలకత్తా మద్రాసు గ్రాండ్ ట్రంక్ రోడ్‌లో, ఒంగోలుకు యీవల గుండ్లకమ్మ పైనా, టంగుటూరు వద్ద మూసినది పైనా వంతెనలు కట్టాలని తీర్మానం చేయించి, మద్రాసు వెళ్ళి ప్రభుత్వ ఆమోదం సంపాదించి, వంతెనలు కట్టించిన ఘనత శ్రీ కుప్పుస్వామి చౌదరి గారిదే.

అలానే ముగ్గురు మహాకవులు, శ్రీ తుమ్మల సీతారామమూర్తి, శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య, శ్రీ గుర్రం జాషువా గార్లను ఎగ్జష్షన్ ఇప్పించి జిల్లా బోర్డు పాఠశాలలో తెలుగు పండితులుగా నియమించిన ఘనత కూడ వారిదే –

"ఒరులేయని యొనరించిన
నరవర అప్రియము తన మనమ్మునకగుతా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్"

"మహాభారతం"

ఇందలి సూక్తి అత్యున్నతమైంది, అనన్య సామాన్య మైంది, అపురూపమైంది, మహోన్నతమైంది, ఉదాత్తమైంది. మానవ జీవితం సుఖప్రదమూ, శాంతియుతమూ, మనోరంజకమూ, మార్గదర్శనమూ నైన మార్గంలో పయనించాలంటే పై మహాభారత సూక్తిని ఆచరణలో పెట్టడమే ధ్యేయంగా ఎంచుకోవాలనేది శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి ఆదర్శం.

అనుక్షణం, అసంతృప్తి, అసహనం, అశాంతి, అసూయా ద్వేషములకు దూరంగా ఉండాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గాలను జయించాలంటే కూడా పై భారత సూక్తి అనుసరణీయ మంటారు శ్రీ కుప్పుస్వామి చౌదరి.

వెలది – జూదంబు – పానంబు – వేట – పలుకు – ప్రల్లదనంబును – దండంబును – అనేవి సప్త వ్యసనాలు.

ఈ సప్త వ్యసనాలు – అరిషడ్వర్గాలు జయించి, ఉత్తమ మానవునిగా, మానవతా విలువలు తలదాల్చాలంటే పై భారత సూక్తి ఆచరణీయం, అనుసరణీయమనేది శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి దృఢ విశ్వాసం.

శ్రీ కుప్పుస్వామి చౌదరి, తన చుట్టూ చేరిన కవి, పండితులతోనే గాక, సామాన్య ప్రజలు తోడైనప్పుడూ వారితో మహాభారతం నుండి పై సూక్తిని వల్లిస్తూ ఉంటారు.

ఆంధ్రపత్రిక సంపాదక వ్యాసం, పైభాగంలో అనుదినం విడవకుండా పై మహాభారత సూక్తి ఒకమారు చదువుకుంటానంటూ ఉండేవారాయన. కేవలం దానిని కంఠస్థం చేయడమే గాక అలా నడచుకొంటున్నానా అని పరీక్షించుకొనేవారట.

శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు తనకు అపకారం చేసిన వారినైనా కక్ష సాధించరు. "అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి" అన్న సుమతీ శతక సూక్తి కూడా ఆయనకు శిరోధార్యమే. అందుకే ఆయనను స్వపరబేధం లేకుండా అజాతశత్రువు అంటుంటారు. అలాగని "ఎప్పట కెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి... తప్పించుకు తిరుగువాడు ధన్యుడ"న్న సుమతి శతక కారుని సూక్తి శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి సుతరామూ గిట్టదు. దానిని దగుల్బాజీ సూక్తిగా అభివర్ణిస్తూ ఉంటారాయన.

తానుమెచ్చిన, తానునమ్మిన, తన కభిమానపాత్రమైన విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు, స్పష్టంగా, సుస్పష్టంగా, విస్పష్టంగా చెప్పడంలో ఎదుటి వ్యక్తి ఎంతటి ఉన్నతోన్నత పదవులలో ఉన్నా వెనుదీయని వ్యక్తిత్వమాయనిది.

ఇంతెందుకు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు సాధ్యమైనంతవరకు వివాదాలకు దూరంగా ఉంటారు. ఇక సంఘర్షణ లంటే ఆమడ దూరంలోనే ఉంటారు. అపోహ లకు, అనుమానాలకు తావివ్వరు. అయితే అవసరమైన చోట మాత్రం తలవంచరు. జంకూ, గొంకూ లేకుండా ఎదిరించైనా పని సాధిస్తారు.

సౌశీల్యం, సౌజన్యం, సౌకుమార్యం, సామరస్యం, సహజీవనం, సమభావం శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి అమూల్యాభరణాలు.

సంపన్నులు, జమిందారి, జాగిర్దారి, భూస్వామ్య వర్గాలకు సహజంగా ఉండే దురహంకారం దరిజేరనీయరు. జూదములు, వేటలు, భోగలాలసత ఆయనకు ఆమడ దూరంలో ఉంటాయి. ఎన్నో ఉన్నత పదవులు చేపట్టారు గదా ! ఐనా డాబు, దర్పం పొరపాటున కూడా ప్రదర్శించ రాయన. నిరాడంబర జీవితం సాగించడమొక ధర్మంగా ఎంచుకొంటారు. నిష్కాపట్యం, నిర్మొగమాటం మాటల్లోనే గాక, చేతల్లో కూడా అలవరుచుకొన్నారు.

అరవయ్యేళ్ళనాటి జ్ఞాపకాలు. అదుగో ఆనాటి సహాయ నిరాకరణోద్యమం. మహాత్మాగాంధి నాయకత్వాన ప్రజా ఉద్యమంగా, పన్నుల నిరాకరణ, అడవి పుల్లరి వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టి గ్రామాలకు కాంగ్రెసు చేరువైన రోజులు. అప్పుడే దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు నాయకత్వాన పెదనందిపాడు ఫిర్కా వంద గ్రామాల ప్రజలను ఒక్క త్రాటిపై నడుపుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్న శ్రీ పర్వతనేని వీరయ్య చౌదరి వీరోచితమూ, సాహసోపేతమూ, చరిత్రాత్మకమూనైన పోరాటము ద్వారా యావత్ భారతదేశ దృష్టి నాకర్షించిన రోజులవి. అంతేగాదు. పలనాటిలోని మించాలపాడులో విప్లవవీరుడు, రైతాంగయోధుడు, కన్నెగంటి హనుమంతు మిలటరీ, పోలీసు పటాలాల, తుపాకులకు ఎదురుగా నిలచి సాగించిన పోరాటంలో 21 గుండ్లు దూసుకుపోయి నేలకొరిగి అసువులు బాసిన రోజులు. సత్తెనపల్లి తాలూకా, పాపయపాలెం, చంద్రాజుపాలెం, ఆవులవారిపాలెంలలో బారిష్టరు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు మరో బారిష్టరు పోలిశెట్టి హనుమయ్య గుప్త, మాడభూషి నరసింహాచార్యులు మున్నగు ప్రజాదరణ పొందిన నాయకులు నేతృత్వంలో అడవి పుల్లరిని వ్యతిరేకించి యాభైమందికి పైగా రైతులకు జైలు శిక్షలు విధించిన రోజులు. పలనాట మాచర్లకు రారాదంటూ, బారిష్టర్లు ఉన్నవ లక్ష్మీనారాయణ, పోలిశెట్టి హనుమయ్య గుప్త గార్లకు 144 సెక్షన్ విధించిన రోజులు. ప్రభుత్వ ఆంక్షలను ధిక్కరించి మాచర్లకు చేరిన నాయకులను కోర్టులో విచారించి శిక్షలు విధించిన రోజులు.

గుంటూరు మండలం, సహాయనిరాకరణోద్యమానికే కేంద్ర స్థానంగా ఉంది. మొత్తం ఆంధ్రకు నాయకత్వం వహించిన నాయకులనేకమంది జన్మించిన పోతుగడ్డగా పరిగణనకు వచ్చింది. అందునా పలనాడు వీరభూమిగా వీరులకు జన్మభూమిగా, చరిత్ర ప్రసిద్ధి చెందింది. అట్టి పలనాటిలో భాగమైన సత్తెనపల్లికి శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారు ఆగమనం గురించిన వార్తలు చేరాయి.

ఒక సంప్పన్న వైశ్య ప్రముఖులు శ్రీ వెలుగూరి శరభయ్య గుప్త గారు రాజకీయంగా, తాలూకా బోర్డు మెంబరుగా, జిల్లా బోర్డు మెంబరుగా, అనేక ప్రజాహిత సంస్థల కార్యనిర్వాహకులుగా ఎదిగారు. సంతానం లేదు. సత్తెనపల్లిలో కనీసం ఒక ఉన్నత పాఠశాల స్థాపించాలనే సంకల్పం కలిగింది. అప్పట్లో సత్తెనపల్లిలో క్రైస్తవ మిషనరీల ఆధిపత్యంలో ఒక హయ్యరు ఎలిమెంటరీ స్కూలు మాత్రమే ఉంది. అందువల్లనేమో శ్రీ వెలుగూరి శరభయ్య గారు హైస్కూలు స్థాపించనున్నారనే వార్తకు గొప్ప ప్రాముఖ్యం కలిగింది. ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. శ్రీ శరభయ్య గారు సత్తెనపల్లిలో హైస్కూలు స్థాపించాలనే నిర్ణయాన్ని శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి విన్నవించగా ప్రభుత్వం నుండి అందుకు కావలసిన అనుమతిని సంపాదించించి పెట్టడంలో శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి అండదండలు తోడ్పడ్డాయి.

శరభయ్యగుప్త హైందవోన్నత పాఠశాలగా నామకరణం చేశారు. దానిని శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి చేత ఆవిష్కరించుకో దలచి వారిని ఆహ్వానించారు. చౌదరి గారి ఆమోదం లభించిందనే వార్త తాలూకా అంతా పాకింది. ముహూర్తం రానే వచ్చింది. తాలూకా నాలుగు చెరగుల నుండి ప్రజలు భాజాభజంత్రీలతో, కోటప్పకొండ తిరునాళ్ళకు తరలివెళ్ళినట్లుగా పయనమయ్యారు. గ్రామాలకు గ్రామాలే తరలి వచ్చాయి.

శ్రీ కుప్పుస్వామిచౌదరిగారు ఆజానుబాహుడు కాదు. కాని పొట్టివాడని కూడాఅనలేము. కృష్ణవర్ణము. విశాలమైన ఫాలభాగము. ముఖముపై తేజస్సు వెలుగులు విరజిమ్ముతూ ఉంటుంది. బొద్దుగా మంచి అవయవ సౌష్ఠవం కలవారు. మనిషి ఆకర్షణీయంగా ఉంటారు. మిలమిల మెరిసే మంచులాంటి తెల్లని ధోవతి బిళ్లగోచితో

కట్టేవారు. ధోవతి పైన చొక్కా, కోటు, నెక్‌టై ధరించారు. జరీ అంచుతో కోపులు తీరిన తలపాగ, కళ్ళకు చలువ జోడు, చేత కర్ర, హాఫ్ బూట్లు. ఇవీ – ఆనాటి ఆయన అలంకారాలు.

ఇక అన్నింటి కంటే ఆనాటి ఆయన అలంకారాల్లో ప్రజలకు కొట్టొచ్చినట్లు కనిపించేవి తెల్ల ఒంటిరాయి చెవుల దిద్దులు. మిలమిల, తళతళ మెరుపులు – సూర్యరశ్మి చెవుల దిద్దులపై బడినప్పుడల్లా మెరుపు మెరిసినట్లుగా ఉండి ప్రజలు అచ్చెరువొందేట్లుగా చేశాయి. సభ అంతా ఆయన ధరించిన చెవుల దుద్దులకు తాపిన తెల్ల నీలం రాయిని గురించే చర్చ. దాని ఖరీదు అప్పట్లో రెండు వేల రూపాయలని తెలుసుకొని ఆశ్చర్యం కలిగింది.

ఇక మాట మంతి విషయానికొస్తే – సంభాషణల్లో సాహిత్యం పాలెక్కువగానే ఉంటుంది. తెలుగు సామెతలు, నుడికారాలు, సూక్తులు కోకొల్లలుగా దొర్లుతూ ఉంటాయి. సంభాషణ పొడవునా ప్రశ్నలే హెచ్చుగా ఉంటాయి. ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టడం ద్వారా, ఎదుటి మనిషిలోని శక్తి సామర్థ్యాలను బేరీజు వేయడం ఆయనకు సరదా. తెలుగులో మంచి ప్రావీణ్యత ఉన్నవారు. ప్రసంగం అంతటా విషయ ప్రాధాన్యత సంతరించుకొని ఉండేది. భారత, భాగవత, రామాయణ కావ్యాలేగాక, ప్రబంధ సాహిత్యంపై కూడా మంచి పట్టు ఉంది. కావ్యాల నుండి, అనేక పద్యభాగాలు ఉదహరిస్తూ ఉంటారు. మంచి వక్త మాత్రం కాదు కానీ, చతురత, హాస్యం తొణికిసలాడుతూ ప్రేక్షకులను అలరించేది.

నేనానాటికే స్వాతంత్ర్యోద్యమ ప్రభావానికి లోనైన వాడిని. 1931-32 ఉప్పు సత్యాగ్రహంలో మా గ్రామం నుండి మా సమీప బంధువైన, కవి, పండితుడు, రచయిత, నిరాడంబరుడు అయిన శ్రీ బత్తుల రామదాసు,సత్తెనపల్లిలో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, వారి కుటుంబ సభ్యులు, ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనడం, కేసుపెట్టి, విచారణ తతంగం జరిపి, శిక్షలు విధించి, రాజమహేంద్రవరం జైలుకు పంపడం – ఇలా నిత్యం ఏదో ఒక సంఘటన. ఆ సంఘటనలు కళ్లారా చూడడం – సభలలో పాల్గొనడం – జరుగుతుండేది. ఆవిధంగా జాతీయోద్యమ ప్రభావం, వలన మహాత్మాగాంధీజీ పట్ల అభిమానం పెంచుకొన్నాను.

ఆకారణంగానేనేమో నాలో కుప్పుస్వామిగారి రాక అంతగా ఆసక్తి కలిగించలేదు. ఐతే ఆనాడు మా గ్రామాలన్నీ ఉత్సవ వాతావరణం నెలకొని సమూహాలుగా కొత్తబట్టలు ధరించి, భజనలు, కోలాటాలు, సాముగరిడీలతో ఇసక వేస్తే రాలనంతగా వచ్చారు. నేనూ జనంతో కలిసి సభకు వచ్చాను.

అరుగో వస్తున్నారు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు – ఆ కారు నుండి దిగుతున్నారే ఆయనే – ఆయనే అంటూ జనం పరుగులు – హర్షధ్వానాలు, జయజయనినాదాలు ప్రతిధ్వనించాయి. నిన్న మొన్ననే కదా ! కాంగ్రెసు కార్యకర్తలను జైళ్ళకు పంపుతుంటే, బ్రిటీష్ సామ్రాజ్యవాద నిరంకుశ ప్రభుత్వం నశించాలి, డౌన్, డౌన్ అంటూ నినాదాలతో నిరసనలు తెలిపారే ! వారేనా యీ జనమంతా. మరి శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు జస్టిస్ పార్టీ. బ్రిటీష్ ప్రభుత్వానికి అండగా ఉంటారే ! మరి ఎందుకింతగా ఆయన రాకకు హర్షం ప్రకటిస్తున్నారనే ప్రశ్నలు నాలో ఆలోచనలు రేకెత్తించాయి.

సభ ప్రారంభమైంది. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారిని, వేదిక వద్దకు సాదరంగా "రెడ్‌కార్పెట్" గుండా తీసుకొని వచ్చారు. సభకు శ్రీ చెరుకూరి సీతారామయ్య గారు అధ్యక్షత వహించారు. కలెక్టరు యూరోపియన్ – విద్యాశాఖ డైరక్టరు యూరోపియన్. అంతా వేదిక నలంకరించారు. సభ నిశ్శబ్దంగా సాగుతూ ఉంది. జనం ఆనందంతో తన్మయులై పోతున్నారు. ఇదంతానాకేమీ మింగుడుపడకుండా ఉంది.

ఇంతలో మా తాలూకా ప్రముఖులు, కవి, పండితుడు శ్రీ భీమిరెడ్డి వెంకటప్పారెడ్డి గారు ప్రసంగం ప్రారంభించారు. ఆశ్చర్య మేసింది – ఎందుకు? ఆయన వేదికపైకి వస్తూనే శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి తలవంచి, వినయ విధేయతలతో నమస్కరించి ప్రసంగం ప్రారంభించారు.

"శ్రీ కుప్పుస్వామి చౌదరి గొప్ప దేశభక్తుడు, ఉదారవాది, దానకర్ణుడు, సాహితీప్రియుడు, విద్యావినయ సంపన్నుడు, మహోన్నత వ్యక్తిత్వం కలవారు, అంటూ సాగిపోతుందాయన ప్రసంగం. అంతవరకు ఆశ్చర్యమే ముంటుంది. యదార్థమేగా ! జాతీయోద్యమానికి అనుప మానమైన సహకారం అందించారు. చీరాల పేరాల ఉద్యమానికి ఆర్థిక సహాయం అందించిన వ్యక్తి. స్వామీ సీతారామ్ స్థాపించిన వినయాశ్రమానికి 33 ఎకరాల భూమిని (తొంభై/తొంభై తొమ్మిది సంవత్సరాలకు లీజుకు ఇవ్వటం) దానం చేసిన వదాన్యులు. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు గుంటూరులో స్థాపించిన "శారదా నికేతనం"కు భూరి విరాళముతో పాటుగా, మరో నలభై ఎకరాల భూమిని దానం చేసిన త్యాగధనుడు. కవులను, పండితులను, కళాకారులను, కళలను, పోషిం చిన, మహోన్నత వ్యక్తి" అంటూ ప్రసంగం సాగుతుంటే జనం నిశ్చేష్టులయ్యారు.

ఆనాటి నుండే నేను శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి జీవితంపై

అధ్యయనం సాగించడం మొదలెట్టా. నా గురుదేవులు శ్రీ ఆచార్య రంగా శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి పరిపాలనాదక్షత, ప్రజాసేవా తత్పరత, నైతిక ప్రతిష్ఠ, నిరాడంబరతల గురించిన సమగ్రమైన రచన చేశారు. దానిని చదివాను. ఆ తరువాత రంగాజీ రచన ఆధారంగా చౌదరి గారి గురించి ఆసక్తితో పరిశోధన సాగించాను.

రాజకీయాల నుంచి విరమించి, స్వగ్రామం కారం చేదులోనూ, తరచుగా గుంటూరులో వారి పెద్ద కుమారుడు చంద్రమౌళి గారి ఇంట విశ్రాంతి తీసు కొంటున్న సమయంలో నేననేకమార్లు గంటల కొద్దీ అనేక విషయాలు పరిశీలన చేశాను. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారితో సంభా షణ గొప్ప విజ్ఞాన పరిశోధనగా, చరిత్ర పరిశోధనగా ఉంటుంది. వారితో పరిచయం కారణంగానే వేమన, సుమతి, కృష్ణ దాశరథి, కాళహస్తీశ్వర శతకములను అధ్యయనం చేశాను. ఈనాడు, నాకు రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి కలగడానికి ఆ రచనలు పలువురు కవి పండితుల ప్రశంసల నందడానికి శతక సాహిత్య విజ్ఞానార్జనే ప్రధాన కారణం.

జీవులెందరో – ధన్యజీవులు కొందరే
పురుషులెందరో – పుణ్యపురుషులు కొందరే
ధనికులెందరో – వితరణశీలురు కొందరే
ధనికులలోను – ధార్మికులు కొందరే
ధన్యజీవి – పుణ్యపురుషుడు – వితరణశీలి
ధార్మికుడు – అతడే శ్రీ కుప్పుస్వామి చౌదరి
"సంపదల కెల్ల స్నేహసంపద మిన్న"

స్నేహసంపద, విశిష్టత, ప్రత్యేకత, ఉత్కృష్టతలు తెలుసు కొనుటకు పోతనామాత్యుని భాగవత గాథల యందలి కృష్ణుడు, కుచేలుడు – ద్రుపద మహారాజు, ద్రోణాచార్యుల మధ్య సాగిన కథల నొకమారు పరామ ర్శించుకొంటే బోధపడగలదు.

శ్రీకృష్ణుడు–కుచేలుడు (సుధాముడు) బాల్యమిత్రులు. సహచరులు, సహపాఠులు కూడా. ఇక గురువా ! ఒకే గురువు సాందీపుడు.

శ్రీకృష్ణ, కుచేలుర వలెనే ద్రుపద మహారాజు, ద్రోణాచార్యులు కూడా బాల్యమిత్రులు, సహచరులు, సహపాఠులు, సాందీపుడే ఇరువురకు గురువు.

కుచేలుడు ఆగర్భ దరిద్రుడు. గంపెడు సంతానం. తిన తిండి,, కట్ట బట్ట, పండ నిల్లు కరువయిన బీదరికం. ఇక శ్రీకృష్ణుడు సాక్షాత్ శ్రీమహావిష్ణువు అవతారం. ఒక దేశానికి మహారాజు.

ద్రోణాచార్యులు, విలువిద్యాచార్యులు, బతుకు బండలయ్యే బడిపంతులు. ఇక ద్రుపదుడేమో షట్చక్రవర్తుల కోవకు చెందినవాడు.

కుచేలుడు శ్రీకృష్ణుని దర్శించి సహాయమర్థించ పయనమై, స్నేహితుడు, బంధువు, గురువు సన్నిధికి వెళ్తూ రిక్తహస్తాలతో వెళ్ళరాదనే సంప్రదాయం కారణంగానేమో గుప్పెడు అటుకులు కొంగున కట్టి సాగనంపింది భార్య.

ద్వారకానగరం చేరి చిన్ననాటి మిత్రుడు కుచేలు డొచ్చారు, మిమ్ము దర్శింప అని ద్వారపాలకుల చేత కబురంపాడు కుచేలుడు.

కబురందుతూనే పరుగు పరుగున వచ్చి – మిత్రుని ఆలింగనం చేసుకొని, కుచేలుని కొంగున కట్టిన అటుకులను ఆప్యాయంగా అందుకొని, తాను తింటూ తోటివారికి అందిస్తూ పేరుపేరున పిలచి, ఇదుగో ఈయన ఎవరనుకొన్నారు. నా బాల్యమిత్రుడు సుధాముడు అంటూ అందరికి పరిచయం చేశారు.

కుచేలుని రాకకు కారణ మారసి, ధన, కనక, వస్తు, వాహనా లతో సత్కరించి, స్నేహానుబంధపు పవిత్రతను, విశిష్టతను జ్ఞప్తికి తెచ్చుకొనేట్లు సాగింది సంభాషణ. పరివారమంతా నిశ్చేష్టులయ్యారు.

మరి ద్రుపద మహారాజును దర్శించబోయిన ద్రోణా చార్యుల వారిని శృంగభంగం చేసి పంపాడు. ఆహా ! ఓహో! నీవు నా సహచరుడివా! సహపాఠివా ! నీ అంతస్తేమిటి – నా అంతస్తేమిటి ! నలుగురు నవ్విపోరా ! అంటూ భటుల చేత మెడబట్టి నెట్టించాడు ద్రుపదుడు ద్రోణుడిని.

చూశారుగదూ ! అర్థమైందిగదూ ! ఆ వ్యత్యాసం. ఇరువుర మనోభావాలు, మనస్తత్వాలు.

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారు స్నేహితుల పట్ల అనుసరించిన ప్రేమాభిమానాలు, ఆదరాభిమానాలు, ప్రేమాను రాగాలు, తరతమ భేదాలకు తావివ్వరాయన. శ్రీకృష్ణ, కుచేలుర స్నేహం వంటిదే ఆయన స్నేహం.

బాపట్ల హైస్కూలులో తన బాల్యమిత్రుడు సహపాఠి, సహచరుడైన తరువాతి కాలంలో మహాకవిగా ప్రఖ్యాతి వహించిన శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిని ఆదరించి, గౌరవించి, సహాయమందించి, తనతో సమానంగా తన ఇంట పరిచర్యలందింప చేశారు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు.

ఆ రోజుల్లోనే మరో సహపాఠి, బాల్యమిత్రుడు శ్రీ సముద్రాల రాఘవాచార్యులు గారు, శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి ఆదరాభి మానాలు, సహాయ, సహకారాలతో సినిమా ప్రొడ్యూసర్ల పరిచయం పొంది, తానొక కవిగా, రచయితగా మహోన్నత స్థానం పొందారు.

బాపట్ల హైస్కూల్లోనే స్కూలు ఫైనలు దాకా తనకు అత్యంత ప్రేమపాత్రుడుగా, సహచరుడుగా ఉంటూ వచ్చిన శ్రీ పంగులూరి సుబ్బారావు గారిని తన డబ్బుతో ఇంగ్లండ్ చదువులకు పంపించిన వితరణశీలి. ఇక్కడొక చిన్న కథ చెప్పుకోవాలి. ప్రథమంలో, ఇరువురూ ఇంగ్లండు పోవాలను కొన్నారు. ఆ యేర్పాట్లన్నీ ఇరువురూ కలిసి మెలసి సహకరించుకొనేవారు. పాస్‌పోర్టు వీసా అన్నీ సంపాదించారు.

ఆఖరి క్షణంలో కుప్పుస్వామి చౌదరి గారి తండ్రి శ్రీ లక్ష్మయ్య నాయుడు గారి చెవులకు అందింది సమాచారం. కొడుకును పిలిచి శ్రీ సుబ్బారావు ఎక్కడకైనా పోగలడు, అలా నీవెలా పోగలవు. ఇంటికి పెద్దవాడవు. సంసార భారాన్ని మోయవలసినవాడవు, వద్దు – నా మాటవిను అని మందలించారు. తండ్రిమాటే సుగ్రీవాజ్ఞ కుప్పుస్వామికి. దాంతో ఇరువురూ నీరుగారిపోయారు. కుప్పకూలి పోయారు. నోట మాట పెగల్లేదు. అంతలో కుప్పుస్వామి తేరుకొని మిత్రమా, సుబ్బారావూ నేను మానుకొన్నా – నీవు ఇంగ్లండ్ పోవలసిందే. ఇదుగో డబ్బు. సర్దుకో సామాన్లు, రాత్రి మెయిలుకే ప్రయాణం అని బయలు దేరదీసి, మద్రాసు దాకా పోయి, ఓడ నెక్కించిన వదాన్యుడు, స్నేహపాత్రుడు. శ్రీ పంగులూరి సుబ్బారావు బారిష్టరుగా స్వదేశం తిరిగి వచ్చేంత వరకు ఆర్థిక సహాయం చేశారు.

సహపాఠులూ కాదు, సహచరులూ కాదు గాని స్వకులస్తులు – స్వయంభువులు, ఇరువురూ కవులు, పండితులు, రచయితలు. సమర్థత, యోగ్యతలు గలవారు. ఐతే బీదవారు. విన్నాడు కుప్పుస్వామి చౌదరి ఆనోటా, ఈనోటా. కబురంపాడు. వచ్చారు. అందులో ఒకరు శ్రీ గూడవల్లి రామబ్రహ్మం గారు. తెలుగు సినిమా రంగానికి ప్రథమా చార్యులు, ఆద్యులు, శ్రీ బి.ఎన్. రెడ్డి గారే గురువుగా సంబోధించిన వారు. విజయవాడలో వ్యాపారం వెలగబెట్టి దివాలాతీసి, ముందు గతి కానక జీవితమే భారమైపోయి, నిరాశ, నిస్పృహలతో కుంగిపోయి ఉన్నారాయన.

కబురు పెట్టారు. ఆఘమేఘాల మీద, కారంచేడు వచ్చి కుప్పుస్వామి చౌదరి గారి ఎదురుగా చేతులు కట్టుకొని తలవంచుకొని నిలబడ్డాడట. ఒరే రామబ్రహ్మమూ, ఇంటికి పోయి, బట్టలు, సామాన్లు సర్దుకొని మద్రాసు చేరు అన్నాడట. మద్రాసు చేరడమంటే మాటలా ! ఆ రోజుల్లోనే పది రూపాయలైనా కావాలి. ఒక రూపాయి సంపాదించి కారంచేడు చేరడమే ఎంత కష్టమైందో – ఆలోచిస్తూ, కాలి వ్రేళ్ళతో నేల సర్దుతూ నిలబడ్డాడట. ఏమిట్రా ఆలోచిస్తు న్నావు, తప్పదుపో, మెయిలుకు మద్రాసు ప్రయాణం కట్టు అంటూ జేబులో నుండి వంద రూపాయల నోటు అందించాడట. ఆ కథను "ప్రజామిత్ర"లో ఎంతో మనోజ్ఞంగా వర్ణించారు శ్రీ రామబ్రహ్మం గారు. శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు ఆనాడు అందించిన సహాయంతో మద్రాసు చేరిన శ్రీ రామబ్రహ్మం "రైతుబిడ్డ", "మాలపిల్ల" లాంటి సాంఘిక చిత్రాలు అందించి భావ విప్లవాన్ని రేకెత్తించారు. ఎందరో కవి, పండితులచే వెండితెరకు మాటలు, పాటలు రాయించారు.

అలాంటి మరో కథ చూడండి – అతడే బాలకవి శ్రీ కొసరాజు రాఘవయ్య చౌదరి. ఒరే రాఘవయ్యా, నీ లల్లాయి పదాలు బాగానే ఉన్నాయిరా ! సినిమాలకేమైనా పనికొస్తాయేమో చూడరాదూ ! అంటూ ఒక పాతిక రూపాయలిచ్చి, వెళ్ళి రామబ్రహ్మాన్ని కలువ మంటూ పరిచయం రాసి చేతికిచ్చారు.

ఐదు వేల జానపదుల పాటలు, పద్యాలూ, కథలూ, చారిత్రిక గ్రంథాలూ రచించి బహుముఖ ప్రశంసల నందుకొన్న శ్రీ రాఘవయ్య చౌదరి కూడా శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి పరిశోధనలో లభించిన వాడే. ఇలా ఎన్నో కథలు ఎన్నెన్నో గాథలు, కోకొల్లలుగా ఉన్నాయి. మచ్చుకు కొన్ని మాత్రమే మీ ముందుంచుతున్నా.

అందుకే 1964లో గుంటూరు మండల సర్వస్వం ద్వితీయ ముద్రణకు పూనుకొంటూనే దానిని శ్రీ కుప్పుస్వామి చౌదరి గారికి అంకితం చేయ నిర్ణయించు కున్నాను. అప్పుడు మరొకమారు శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి జీవితంపై సమగ్రంగా అధ్యయనం చేశాను. వారితో నాకు గల ప్రగాఢమైత్రి, నాయందు వారికి గల ప్రేమ వాత్సల్యములు కారణంగా "గుంటూరు మండల సర్వస్వము"ను అంకితం చేశాను.


(ఈ వ్యాసం జె.కె.సి. కళాశాల రజతోత్సవ స్మారక సంపుటిలో ప్రచురించబడినది)

అమృతమూర్తి చంద్రమౌళి గారు

(శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు)

శ్రీ ఆవుల మదన్‌మోహన్

పూర్వ ఆంగ్లోపన్యాసకులు, జె.కె.సి. కళాశాల



జీవితంలో మనకు ఆప్తులు, ఆత్మీయులు, ఆరాధ్యులు అరుదుగా తారసపడుతుంటారు. అలా తారసపడ్డప్పుడు వారి అవ్యాజ ఆదరణాభిమానాలలో ఓలలాడుతూ సంతుష్టులమై తృప్తిగా కాలం వెళ్ళబుచ్చవచ్చు. శ్రీ చంద్ర మౌళి గారిని స్మరించుకుంటుంటే, స్మరించటం కాదు – వారు మన మదిలో సజీవులే – వారి స్మృతులు మాకు దీప్తి – స్ఫూర్తి – శ్రీరామరక్ష.

1967లో జె.కె.సి. కాలేజి ఆవిర్భావానికి పూర్వం కొందరం కూడి మనవూళ్ళో మనం ఒక కాలేజిని స్థాపించు కుంటే ఎంత బాగుంటుంది అని అనుకుంటున్నప్పుడు శ్రీ చంద్రమౌళి గారిని కలిసి వారి అభిప్రాయాన్ని, ఆశీస్సు లను పొందితే శుభం జరుగుతుందని తలపోశాం. వెంటనే వారిని దర్శించాం. పరోక్షంగా వారిని వారి కుటుంబాన్ని గురించి ఎంతో విని ఉన్నాం. వారు చేసిన పనులు చూసి వున్నాం. వారి తండ్రి గారు కీ॥శే॥ శ్రీ కుప్పుస్వామి చౌదరి గారి దర్శనం కూడా చేసుకొని ఉన్నాం.

అదే చంద్రమౌళి గారిని ముఖాముఖి దర్శించటం. ప్రథమ సందర్శనంలోనే మా మనస్సులను చూరగొన్నారు. మాకెంతో ఆప్తులు, ఆత్మీయులుగా కనపడ్డారు. దానికి కారణం వారిలోని విశాల హృదయం, సామాజిక దృక్పథం, సంఘ శ్రేయోభిలాష. ముఖ్యంగా అన్నింటికీ మించిన నిస్వార్థత. మా విన్నపాన్ని ఆలకించి సాలోచనా నేత్రులై "గో ఎహెడ్". తప్పకుండా ప్రయత్నిద్దాం. మన ఊళ్ళో ఇంకొక కాలేజి ఎంతైనా అవసరం. "గో ఎహెడ్" అని మమ్ము వీపు దట్టి ఏనుగంత బలాన్ని, కొండంత శక్తిని మాలో ప్రేరేపించారు.

పెద్దల సహకారంతో గుంటూరు జిల్లా పౌరుల ఆదరాభిమానాలతో 1968 నాటికల్లా శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల ఆవిర్భవించింది. మా కలలు ఫలించాయి. మా జీవితాలలో వెలుగు నిండింది. మేము మా కాలేజీలో సంవత్సరం సంవత్సరం చదువుకునే విద్యార్థులమందరం వారికి సర్వదా సర్వదా కృతజ్ఞులం. వినమ్రులమై ఉంటాం.

కాలేజీ ఎవరి చేత ప్రారంభింపజేయాలి అన్న ప్రశ్న జనించి నప్పుడు పలువురు పలు విధాలుగా అభిప్రాయ పడ్డారు. శ్రీ చంద్రమౌళి గారు మాత్రం కీ॥శే॥ శ్రీ బుద్ధిరాజు రామచంద్రరావు గారి చేత చేయిద్దాం అన్నారు. మిగతావారు మారు మాట్లాడలేదు. ఆరోజు శ్రీ రామచంద్రరావు గారు అస్వస్థులుగా ఉండడం చేత వారిని చేతులమీద తీసుకొని వచ్చారు. శ్రీ చంద్రమౌళి గారు సజల నయనాలతో ఎదురేగి వారిని పూలమాలాలంకృతులను గావించుకొని తేవటం మా మదిలో చెరగని ముద్రను వేసింది. శ్రీ రామచంద్రరావు గారికి ఒక కాలు కొంత భాగం తీసివేయబడి వారు నిలబడే స్థితిలో లేరు. అయినా వారు కళాశాలకు ప్రారంభోపన్యాసం చేయబోగా కూర్చొని మాట్లాడండని అందరూ సవినయంగా ప్రార్థించారు. వారు మాత్రం టేబుల్ ఊతంతో ఒంటికాలు మీద నిలబడే ఉపన్యసించారు. వారు అన్నారు "కూర్చొని మాట్లాడటం ఉపాధ్యాయుడికి తగదు – అందులో పెద్దలకు అసలు కూడదు" అని. ఆ రోజు వారి ఉపన్యాసం, ఆ సంఘటన తిలకించిన వారికి జీవితంలో మరుపురాదు. అప్పుడు అర్థమైంది. శ్రీ చంద్రమౌళి గారు శ్రీ రామచంద్ర రావు గారిని ఎందుకు ఎన్నుకున్నారో.

శ్రీ చంద్రమౌళి గారిది సామాన్య మానవులకు అగోచరమైన ఉదాత్త దృష్టి, ఉన్నత భావనా సరళి.

తరువాత అధ్యాపకుల ఎన్నిక కార్యక్రమం. శ్రీ చంద్రమౌళి గారిది ఒకటే నియమం, నిర్ణయం. కుల మతాభిమానాలకు అతీతమైనది. సర్వామోదమైనది. సుసం ప్రదాయ సమన్వితమైనది. తద్వారా కొందరు స్వలాభాపేక్ష దారులకు కొంత సంకటం కావచ్చునేమో. "ఎక్సలెన్స్" వారి కొలమానం. "మీడియోకర్"

చదువుల వ్యాసంగంలో పనికిరారు. వారికి వేరే వ్యాసంగం చూపండి. ఇక్కడ మాత్రం ప్రతిభకే పట్టం. అదే ఆధారం, తదానుసారంగానే అధ్యాపకుల సెలక్షన్లు పూర్తయ్యాయి. ఒక మీటింగు పెట్టి వారు చెప్పిన మాటలు ఈనాటికీ చెవుల్లో మారుమ్రోగు తుంటాయి. "ఈ కాలేజీ మీది, మాది, మనందరిది. దీని ఉన్నతి మనందరి సమష్టి బాధ్యత. మీరు మీమీ పనులు సక్రమంగా నిర్వర్తించండి. మేము మీకు కావలసిన సదుపాయాలు సమకూరుస్తాం. మన కాలేజీకి బంగారుబాట వేద్దాం. విద్యాభివృద్ధికి, విద్యావ్యాప్తికి పాటుపడదాం. ఏ లెవల్లో కూడా క్రమశిక్షణను పాటిద్దాం. క్రమశిక్షణ లేకుంటే ఏమి చేసినా బూడిదలో పోసిన పన్నీరే. కనుక మనమంతా ఇది మాది. మేము దీనిని తీర్చిదిద్దుతున్నాము అన్న భావంతో నిగర్వంగా చెప్పుకునేటట్లు తీర్చిదిద్దుదాం" అని పితృ వాత్సల్యంతో ఆనాడు పలికారు. అట్లానే మమ్ములను ఆదరించారు. వారి ఆశయసిద్ధికి, వారు ఏర్పరచిన బాటలో పయనించటం మా పరమావధి.

ఒకసారి ఏదో జీతాల ప్రస్తావన వచ్చినది. అప్పుడు మాకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ లేదు. అయినా అందరిలా కాక మాకు పూర్తి జీతాలు ఇస్తూ ఉండేవారు. బహుశా ఆంధ్రదేశంలో ఇదొక్కటే కాలేజి అలా ఎయిడ్ లేకుండా పూర్తి జీతాలు ఇచ్చిన కాలేజి. ఒకసారి శ్రీ చంద్రమౌళి గారు మాకు అస్యూరెన్స్ ఇస్తూ "మీ పని మీరు సక్రమంగా చెయ్యండి. మీ జీతాలు అవసరమైతే మా ఆస్తులు అమ్మైనా సరే మీకు సక్రమంగా అందేటట్లు చూస్తాను" అని ఆన్నారు. మాకు అంతకంటే కావలసింది ఏముంది. అలాంటి ఉదాత్త హృదయుల ఆశీస్సులు చాలవా. ఉత్సాహంతో ఎంతయినా పని చేయటానికి.

కాలేజికి సంబంధించిన వారు – అధ్యాపకులు కానివ్వండి – విద్యార్థులు కానివ్వండి – ఎవరయినా సరే ఏదయినా లబ్ధిని పొందారంటే, ఉన్నతిని సాధించారంటే వారి ఆనందం వర్ణనాతీతం. వారి వాత్సల్యం అపారం. స్వవిషయం. నేను ఎం.ఏ. పరీక్ష రాసి యూనివర్శిటీ ఫస్ట్ గోల్డ్ మెడల్ పొంది నమ్రతతో వారికి విన్న వించాను. ఆనాడు వారు చూపిన ఆప్యాయత, అనురాగం నాకు మాటల్లో చెప్పశక్యం కానిది. కమిటీ రూములో కూర్చొని ఉన్న ఇతర మెంబర్లను పిలిచి "చూడండయ్యా, మనవాడికి గోల్డ్ మెడల్ వచ్చింది" అని ఎంత సంబరపడిపోయారో. మా నాన్న గారు నాకు గోల్డ్ మెడల్ వచ్చినందుకు ఎంత సంబరపడిపోయారో శ్రీ చంద్రమౌళి గారు అంతకు మిన్నగా సంబరపడి నన్ను అభినందిస్తూ వీపుతట్టిన విధానాన్ని నేను ఎన్నటికీ మరువలేను. వారికి మేమంతా బిడ్డలం. బిడ్డలు లారెల్స్ పొందితే తండ్రి పొందే సంతోషం వారిది. మేము జె.కె.సి. థియట్రికల్స్ స్థాపించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వేంకటేశ్వర విజ్ఞాన మండపంలో వీరపాండ్య కట్టబ్రహ్మన నాటకం వేస్తూ వారిని ఆహ్వానించాం. వారు అందరికన్నా ముందు వేంచేసి గ్రీన్ రూముకు వచ్చి ఎంతో సంతోషంగా మమ్మలనందరినీ పేరు పేరున పలుకరించి ఆశీర్వదించి వెళ్ళి ఆడియన్స్‌లో కూర్చొని నాటకం సాంతం తిలకించి మాకు ఎనలేని ఆనందాన్ని కలిగించారు.

ఆనాడు జరిగిన సంఘటన తలుచుకుంటుంటే వారి మానవతా దృక్పథానికి, వారివద్ద పనిచేసేవారి యందు వారికిగల పితృ వాత్సల్యానికి ముగ్ధులమవ్వటమే గాదు. పులకిత హృదయులమై వారికి నిండు మనస్సుతో ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేం.

నాటకం ముగియవస్తుంది. వారు వేరే కార్యక్రమంలో పాల్గొనాలి. కారు చూస్తే డ్రైవరు కారులో ఆదమరచి నిద్రిస్తున్నాడు. వెంటనే చంద్రమౌళి గారు, "పోన్లే పాపం వాడు నిద్రపోతున్నాడు లేచింతర్వాత వస్తాడులే" అని రిక్షా ఎక్కి వెళ్ళిపోయారు. ఈ సంఘటన మమ్ములను అవాక్కులను గావించి వారి ప్రేమానురాగా లను మాలో మాటలకందని ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని సంచరింప జేసింది.

శ్రీ చంద్రమౌళి గారికి చిన్నవారంటే ఎంత వాత్సల్యమో, పండితులన్నా వారికి అంత గౌరవం. ఒకసారి ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంగ్లీషు ప్రొఫెసర్ శ్రీ అయ్యంగారిని మా కాలేజికి ఆహ్వానించారు. శ్రీ అయ్యంగారు వచ్చినప్పుడు శ్రీ చంద్రమౌళి గారు ఎదురేగి గేటు దగ్గర వారిని పూలామాలాలంకృతులను గావించి పూలవర్షపు జల్లుల మధ్య వారిని లోపలికి ఆహ్వానించిన దృశ్యం చూడవలసిందే గాని వర్ణనాతీతం. శ్రీ చంద్రమౌళి గారిని స్టేజి మీద కూర్చోమన్నా కూడా నిరాకరించి, వారి ఉపన్యాసం వినాలి నేను కిందే కూర్చుంటానని ఆడియన్స్‌లో కూర్చున్న సంఘటన మాకెంతో కనువిప్పు, గుణపాఠం.

ఇలా చంద్రమౌళి గారితో మా అనుబంధం ఎన్నో ఎన్నెన్నో స్మృతులతో ముడివడి మమ్ములను ఆలోచనా సుడులలో ముంచెత్తు తుంది. వారు చూపిన బాటలో పయనిస్తూ మా విధి నిర్వహణలో మా కళాశాలకు కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేయటమే మేము వారికిచ్చే గౌరవం. అందుకు వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటాయని ఆశిస్తున్నాం.

(ఈ వ్యాసం శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారి జ్ఞాపకార్థం ప్రచురింపబడిన వ్యాససంపుటిలోనిది)

వెజ్జేలకు ఒజ్జే – ఒజ్జేలకు వెజ్జే

డా॥ కాసరనేని సదాశివరావు

(శ్రీ కాసరనేని సదాశివరావు గారు కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి)



శ్రీ రావెల సాంబశివరావు

మాజీ రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

"విద్య నిగూఢగుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి, విద్యగురుండు, విదేశబంధుడున్
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగని వాడు మర్త్యుడే"

ఈ సుభాషితం చదివినా, విన్నా గుర్తుకొచ్చినా వెంటనే నాకెందుకో కాసరనేని సదాశివరావు గారి రూపు కన్నుల ముందు నిలుస్తుంది. ఈయన వెజ్జేలకు ఒజ్జే – ఒజ్జేలకు వెజ్జే ! విద్యాదాత, విద్యాపరిశీలకుడు, విద్యాపరి పాలకుడు.

ఈయన వృత్తి రీత్యా వెజ్జే అయినా ప్రవృత్తి రీత్యా ఒజ్జే. విద్యాబుద్ధుల్లోని విద్యకు ఎంత ప్రాధాన్యతనిస్తారో బుద్ధులకు అంతే ప్రాధాన్యత నిస్తారు. అంతకంటే ఎక్కువ కాదనుకుంటే ఎక్కడ ఎక్కడ వక్రత ఉన్నా దాన్ని సక్రమంగా సరిదిద్దాలనేదే ఈయన తపన. గుండెలు తీసిన బంటే కావక్కర్లేదు, చొక్కా గుండీలు తీసిన బంటును కూడా చూసి సహించేవాడు కాదు. వెంటనే గుండీలు పెట్టించేవారు.

ఏభై ఏళ్ళనాడు ఇన్ని కళాశాలలు లేవు. రైతుల ఇళ్ళల్లో కళాశాలల గడపదొక్క గలిగిన పిల్లలు ఒక్కరో ... ఇద్దరో. ఆ ఒక్కరిద్దరు కూడ సీటు దొరక్క బిక్కమొగం వేయటం చూసి వాళ్ళ కళ్ళల్లో ఆశాజ్యోతులు వెలిగి విజ్ఞాన కళాకాం తులు వెల్లివిరియాలనే సత్సంకల్పంతో నెలకొల్పబడింది ఆనాడు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల.

కళాశాల మొదటి కరస్పాండెంట్ డా॥ కాసరనేని సదాశివరావు గారు సాహితీ సమితి అధ్యక్షులుగా సంజీవదేవ్ గారి ద్వారా తెలుసు. కళాశాల ప్రారంభించే నాటికి నేను ధన్‌గారు స్థాపించి నిర్వహిస్తున్న రవి కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నా. అప్పట్లో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలలో నా నియామకానికి కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. అతను మంచి ఉద్యోగమే చేస్తున్నాడు గదా – ఈ మార్పు ఎందుకు? ఒకవేళ మార్పుకు అంగీకరించినా ప్రిన్సిపాల్, ఆఫీసు సూపరింటెం డెంట్ ఇద్దరూ కొత్తవాళ్ళయితే కాలేజీ సవ్యంగా నడుస్తుందా. ఈ విషయం అలా నలుగుతూ వుండగానే ఆ సంవత్స రమే ధరణికోటలో నెలకొల్పబడిన రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుని కళాశాల యాజమాన్యం పొదిలె అప్పారావు గారి సలహా మేరకు నన్ను ఆ కళాశాల ఆఫీసు మేనేజరుగా నియమించింది.

అప్పుడు ఒక పర్యాయం కళాశాల వేడుకల్లో పాల్గొనేందుకు ధరణికోట వచ్చిన డాక్టరు సదాశివరావు గారు నేను గడించిన అనుభవానికి సంతృప్తి చెందారేమో – నన్ను జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలలో ఆఫీసుసూపరింటెండెంటుగా నియమించే నిర్ణయం జరిగేట్లు చూశారు.

జాగర్లమూడి చంద్రమౌళి గారు, చేబ్రోలు హనుమయ్య గారు, కాసరనేని సదాశివరావు గారు, వై.కె.ఎస్. ప్రకాశరావు గారు, గోగినేని కనకయ్య లాంటివారు పాలకవర్గంలో ఉన్న కళాశాలలో పనిచేయటం అంటే ఎందుకో కొంత జంకు ఏర్పడింది

జె.కె.సి. కళాశాల లోనికి అడుగు పెట్టే ముందు డాక్టర్ గారు పిలిచి – "రేపటి నుండి కలిసి మెలిసి పని చెయ్యాలి కదా ... ఓసారి రోసయ్య గారిని కలిసిరా" అన్నారు.

రోసయ్య గార్ని కలసిన తరువాత సరాసరి డాక్టరు గారింటికి చేరాను. నా నడక తీరులో ఏం పసిగట్టారో – "ఏమిటీ ! రోసయ్య గారింటి నుండేనా రావటం" అంటూ పకపకా నవ్వసాగారు డాక్టరు గారు.

"అవునండీ ! రేపటి నుండి ఎలాగూ తప్పదు. ఇవ్వాళ్టి నుండే ఎందుకొచ్చిన తిప్పలండీ ఇవన్నీ" అన్నాను. సమాధానంగా అందమైన ఓ మందహాసమే ! అటువంటి మందహాసం మందుల్లేకుండా ఎన్ని జబ్బుల్ని సునాయాసంగా మాయం చేసిందో...!

అలా అకారణంగా మొదటి పరిచయంలోనే విముఖతను ప్రదర్శించి పెడంకె వేసిన ప్రిన్సిపాల్ గారిని మెల్లగా నావైపుకు తిప్పుకుంటానికి మూణ్ణెల్లు పట్టింది. పకపకా నవ్వించేందుకు పదినెలలు పట్టింది.

ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల ఎంపికలో యాజమాన్యం గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించింది. విశ్వవిద్యాలయాలిచ్చిన క్లాసులు ముఖ్యం

కాదు, అభ్యర్థులు క్లాసును నిర్వహించగలిగే తీరు ముఖ్యం అంది. అభ్యర్థులకు బోధనా వృత్తి అభిమాన విషయమా? కాదా? అని చూసేవారు. అందుకే ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలు నెలకొల్పే విషయంలో తలమానికంగా నిలిచేందుకు ఈ కళాశాల పరుగు పందెంలో పోటాపోటీగా ముందున్నది.

డాక్టరు గారు దాదాపు ఒక పది సంవత్సరాల పాటు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల కరస్పాం డెంటుగా, వ్యవహ రించారు. అప్పటి కళాశాల దశ యిప్పటి దశకాదు. బాలారిష్టాలన్నీ తట్టుకుంటూ ఎదుగుతూ వచ్చింది. మంచి మంచి ఉపాధ్యాయుల ఎంపిక జరిగింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారి సహకారంతో భవన నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈయన కరస్పాండెంట్‌గా ఉన్న కాలంలో కీ॥శే॥ యలవర్తి రోసయ్య, డా॥ యస్. అనంతం, డా॥ సి.యన్. శాస్త్రి (అమరేంద్ర) గార్లు ప్రిన్సిపల్స్‌గా పదవికి వన్నె తెచ్చారు.

డాక్టరు గారు కరస్పాండెంటుగా ఉన్న తరుణంలో ఒక గుమాస్తా ఆర్థిక నేరానికి పాల్పడ్డాడు. నేరం బుజువయ్యింది అతణ్ణి ఉద్యోగం నుండి తొలగించారు. అతని నుండి డబ్బు రాబట్టవలసి ఉంది. అతడు తిరిగి చెల్లించగలిగే స్థితిలో లేడు. అప్పుడు ఆయన కళాశాల అభివృద్ధికి తాము విరాళంగా యిచ్చిన సొమ్ము నుండి ఆ డబ్బును చెల్లించే ఏర్పాటు చేయమన్నారు. అలా చేస్తే దాతల కేటగిరీలో డాక్టరు గారి పేరును క్రిందిస్థాయిలో రాయాలి. అయినా ఫర్వాలేదన్నారు. అలా ఎవరో చేసిన తప్పులకు కూడ బాధ్యత వహించగల కరస్పాండెంట్లు ఎందరు? అదీ సదాశివరావుగారి ప్రత్యేకత.

డాక్టరు సదాశివరావు గారికి, డాక్టరు బసవపున్నయ్య గారికీ మధ్య కొంతకాలం డాక్టరు ఆంజనేయ చౌదరి గారు కరస్పాండెంట్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. నన్నెందుకో బాగా అభిమానించే వారు. ఉన్నట్లుండి ఒకరోజు "ఎదుగూ బొదుగూ లేని ఈ ఉద్యోగంలో ఎంత కాలమని ఇలా వుండిపోవటం? యూనివర్శిటీకి వెళ్ళకూడదూ?" అన్నారు. "అక్కడ మనకెవరు తెలుసండీ" అన్నాను నేను. తరువాత ఆయన డాక్టరు సదాశివరావు గారితో మాట్లాడి నట్లున్నారు. ఒక నెల రోజులు గడిచాయి. డాక్టరు సదాశివరావు గారు పిలిచి "చౌదరి ఏదో అంటున్నాడు... అప్లికేషను, బయోడేటా పట్టుకురా" అన్నారు. ఆవిధంగా ఈ కళాశాలలో ఉద్యోగం నా తదనంతర ఉద్యోగ జీవితానికి ఒక స్ప్రింగ్‌బోర్డు. నాకే కాదు – మరెందరో ఉపాధ్యాయులు ప్రిన్స్‌పాల్స్, శాఖాధిపతులు అయ్యేందుకు, ఎందరో విద్యార్థులు ఎన్నో రంగాలలో ఖ్యాతి నార్జించేందుకు, కొందరు విదేశాలలో స్థిర పడేందుకూ ఈ కళాశాల స్ప్రింగ్‌బోర్డ్‌గా తన విధిని నిరంతరం నిర్వర్తిస్తూనే వుంది.

గుంటూరు ప్రభుత్వ వైద్యాలయంలోనూ, వైద్య కళాశాలలోనూ కొన్నాళ్ళు గౌరవ ఆచార్య పదవిని నిర్వహించారు. అప్పుడెందరో ఈయనకు శిష్యులు, ఏకలవ్య శిష్యులు. వాళ్ళ అభివృద్ధిని చూచి ముసిముసి నవ్వులేకాని బొటనవ్రేలు గురుదక్షిణగా అడిగిన దాఖలాలు లేవు. ఈయన మనిషిలో భయమూ భక్తీ పోగొట్టాలని చూస్తారుగాని కొందరికి ఈయన్ని చూడగానే భయభక్తులు ఏర్పడతాయి. కొందరు నటిస్తారు. ఈయనకు మాత్రం వాళ్ళంతా సమానమే !

శిష్యులవో, ప్రశిష్యులవో, ఏకలవ్య శిష్యులవో ఈయన చేతిమీదుగా క్లినిక్‌లో డిస్పెన్సరీలో, వైద్యశాలలో నాలుగు వందలకు మించి ప్రారంభించబడినాయంటే వైద్యంలోనే కాదు, చికిత్సా కేంద్రాల అభివృద్ధికి కూడా ఈయన హస్తవాసి మీద ప్రజలకున్న నమ్మకం ఏనాడూ వమ్ము కాలేదు.

సదాశివరావు గారితో పరిచయం అంటే జ్ఞానానికి తలుపు తట్టటమే. అవగాహనను పెంచుకోవటమే. మానవత్వాన్ని పంచు కోవటమే. మరిఅటువంటప్పుడు ఈ వెజ్జే ఒజ్జే గాకమరేమవుతాడు?!

ఈయన వైద్యం నుండి విశ్రాంతి తీసుకున్నా విద్య నుండి విశ్రాంతి తీసుకోలేదు. వైద్యాలయాలకు వెళ్ళటం మానుకున్నా విద్యాలయాలకు వెళ్ళటం మానుకోలేదు. ఈయన ఏ సభలో ఉంటే ఆ సభకో నిండుదనం. హుందాతనం. ఆపరేషన్ సమయంలో కూడ అముక్త మాల్యదలోని పద్యం గుర్తుకు తెచ్చుకోగల ఈయన సాహిత్యాభి లాషను కొలిచేదెలా...?!

కొంతకాలం నిరాటంకంగా నిర్వహించబడిన వీరి సాహితీ సదస్సు ఎంతటి విద్యాదానం చేసిందో ఎన్ని సాహితీ విలువల్ని వెలికితీసిందో ఎందరు ప్రజ్ఞగల సాహితీమూర్తుల్ని గుంటూరుకు పరిచయం చేసిందో మళ్ళీ అది పునరుజ్జీవం పొందితే ఎంత బాగుంటుందో.

చదువుకున్న వాళ్ళు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే అవి బాగుపడతా యని భావించారు. అక్కడ ఈయనకు ఒరిగిందేమి లేకపోయినా తలవొగ్గిందిలేదు. అక్కడా ఈయనది గురుస్థానమే. ఈయన ఎవరికీ శిష్యుడు కాలేదు. ఈయన చూపు చోద్యం, పలుకు పద్యం, నడత సవ్యం, బతుకు కావ్యం.

కలిసి జీవిస్తానని మాటయిచ్చిన జయప్రదాంబ గారు జీవనయానంలో కనిపించని దూరతీరాలకేగిన జయ ప్రదాంబ గారిని కనులముందు నిలుపుకోవాలని జయప్రదాంబ డిగ్రీ కళాశాలను నెలకొల్పారు. చదువులో సహజీవనాన్ని సాగించారు.

ఈయన ఒజ్జేగా వెజ్జేలకు శిక్షణ నిచ్చారు. వెజ్జేగా ఒజ్జేలకు చికిత్సలు చేశారు ! ఈయన చెడ్డవాళ్ళకు చేదుమాత్ర. మంచి వాళ్ళకు ముంతకజ్జోయం. కొందరికి ఈయన మాట టానిక్. కొందరికది కషాయమైనా ఠక్కున రోగం కుదుర్చుతుంది !

సదాశివరావు గారు ఎన్నటికి గురువే. లఘువు అయ్యేందుకు వీలులేదు, లఘువు, బిగువులు తెలిసిన గురువు. జీవన సంద్రంలో ఏ శిష్యుడు కష్టాలలో చిక్కుకున్నా ఈయనే లంగరు. ఆయన స్మృతులు మనకు ఎల్లవేళలా స్ఫూర్తి నిచ్చేవే.

మా మాస్టారు రోసయ్య గారు

(శ్రీ యలవర్తి రోసయ్య గారు కళాశాల ప్రథమ ప్రిన్సిపల్)

డాక్టర్ అమరేంద్ర

మాజీ ప్రిన్సిపల్, జె.కె.సి. కళాశాల



"మాన్యుమా యలవర్తి రోసయ" అనే పాదం "మొయిలు రాయబారం" అనే కావ్యంతో మొదటిసారి నాకు రోసయ్య గారితో పరిచయం కలిగించింది. ఆ కావ్యం మాకు బి.ఏ. తరగతిలో పాఠ్యగ్రంథం, అది కాళిదాసు మేఘసందేశ కావ్యానికి త్రిపురాన దొరగారు చేసిన అనువాదం. ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో మాకు ఆ కావ్యం పాఠం చెప్పిన కొమాండూరి కృష్ణమాచార్యులు గారు రోసయ్య గారిని బాగా ప్రశంసించి "ఆయన మన కాలేజీ లోనే ఇంగ్లీషు డిపార్టుమెంటులో పని చేస్తున్నారు తెలుసా?" అన్నారు. వెదుక్కుంటూ వెళ్లాను మర్నాడు.

అప్పుడు మాష్టారు తరుణప్రాయంలో ఉండేవారు. అందమైన నొక్కుల క్రాపు, ముచ్చటగొలిపే రూపం. ఒక్కసారి మాట్లాడితే చాలు ఆప్యాయంగా దగ్గరకు తీసుకునే శిష్యవాత్సల్యం. సాహిత్యాధ్యయనం పట్ల గాఢమైన అభినివేశం కలిగించే సంభాషణాచాతుర్యం. ఒక అయస్కాంత శిలలాగా విద్యార్థులను తనచుట్టూ గుమికూడేట్లు చేసుకోగల ఆకర్షణశక్తి. ఇతరుల క్లాసుల్లో వచ్చిన తలనొప్పికి రోసయ్య గారి లెక్చరు అమృతాంజనం. పాఠ్యభాగానికి పరిమితం కాకుండా ఎన్నెన్నో రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య ప్రస్తావనలతో ఆంగిక వాచక విన్యాసాలతో కొనసాగే ఆయన బోధన ఎందరిలోనో సారస్వత పిపాసనూ జిజ్ఞాసనూ ఉద్దీపనం చేసింది. ఆయన టీచర్ ఆఫ్ టీచర్స్ !"

ఆంగ్ల ఆంధ్ర భాషా సారస్వతాల్లో ఆయన పాండితీ వైభవానికి రోసయ్య సేకరించిన అపూర్వ గ్రంథాలే సాక్ష్యమిస్తాయి. వ్యాకరణ శాస్త్రమన్నా, శాస్త్రీయ సంగీత మన్నా అపారమైన మమకారం. క్లాసికల్ కవిత్వం మీద, కళల మీద వల్లమాలిన అభిమానం. జీవితాన్ని ఒక మహాకావ్యంగా మలచుకున్న మిల్టన్ కవిశేఖరుని పేరు చెబితే వీరావేశం. నేలబారు ఆలోచనలన్నా, చౌకబారు అభిరుచులన్నా తీవ్రమైన నిరసనం. ఉన్నతాశయాలకోసం పరిస్థితులతో రాజీ పడకుండా నిత్యమూ పెనుగులాడే ఆదర్శవాదం. తాను నమ్మిన విశ్వాసం కోసం కాల ప్రవా హానికి ఎదురీదగల గుండెనిబ్బరం. ఇవన్నీ నాకు రోసయ్య గారిలో గోచరించే విశిష్ట లక్షణాలు. నాటికి నేటికీ మారని మనిషి ఆయన.

అంతకు పూర్వం సాహిత్య విశారదులుగా, పండిత వరేణ్యులుగా మన్ననలు పొందిన రోసయ్యగారు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల ప్రిన్సిపాల్‌గా పరిపాలనా దక్షతనూ నిర్వహణా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యాప్రమాణాల సాధనకూ, క్రమశిక్షణా వికాసానికీ పునాదులు వేశారు. చక్కటి రాజమార్గం నిర్మించారు. అమూల్యమైన గ్రంథ సంపదతో లైబ్రరీని సుసంపన్నం చేశారు. ఆయన తరువాత ఆ కుర్చీలో కూర్చునే వారందరూ అనుదినమూ ఆయనను తలుచుకునే విధంగా కళాశాల బాలారిష్టాలన్నిటినీ దాటించి కుదురైన నడకను నేర్పించారు. నేటికీ ఆయన తీసిన దారి వెంబడే అడుగులు వేస్తున్నది కళాశాల, రెండువేల గుండెల వైజయంతీమాల. నిర్దుష్ట కర్తవ్య పాలనమే ధ్యేయంగా జీవించే ఉత్తమ కర్మయోగి ఆయన. అర్ధాంగి, ప్రమాద స్థితిలో ఆసుపత్రిలో ఉన్నప్పుడుకూడా ఆయన కాలేజిలోనే ఉన్నారు, అంతటి ఉన్నత ప్రమాణం చేరుకోవటం అందరికీ సాధ్యం కాదు. కళాశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటం కోసం వ్యక్తిగత విషయాలెన్నింటినో ఉపేక్షించి ఏకైక దీక్షతో కృషి చేసిన కర్తవ్య పరాయణులు మా మాస్టరు గారు. నిర్దిష్టమైన విధులను నిర్దుష్టంగా నిర్వహించటమే ఆయన పరమలక్ష్యం.

ఆయన ప్రిన్సిపాలుగా ఉన్న కాలంలో కళాశాలలో అధ్యా పకులుగా పనిచేసిన మాకందరికీ ఒక్క సత్యం నిత్యం అనుభవంలోకి వచ్చేది. "పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యం" కావచ్చును గాని "నిండు మనంబు నవ్య నవనీత సమానం". ఈ లక్షణంలోనే కాదు శిష్టాచార పాలనలో కూడా ఆయన విప్రోత్తముడు. ఆయన మాటలతో నొప్పించినా చేతలతో ఎవరికీ అపకారం చేయని ఉపకారి.

సాంఘిక విషయాల్లో సంస్కరణపట్ల అభిమానం, భాషా విషయంలో సంప్రదాయం పట్ల అంతటి గాఢమైన విశ్వాసం, భారత సంస్కృతి అంటే ఆదరం. హేతువాద విలసితమైన విశ్వజనీన దృక్పథం అంటే అభినివేశం. పరస్పర విరుద్ధాలుగా కనబడే ద్వంద్వాలకు చిత్తశుద్ధితో సమన్వయం కుదుర్చుకోగలిగిన విశిష్ట మేధా సంపద రోసయ్య గారు. జీవిత సాగరాన్ని తీవ్రంగా మధించి సాధించిన అమృత కలశం.

ఆయన, అసాధారణమైన వ్యక్తి. విధి విలాసం చేత గుంటూరు మండలంలో ఆలస్యంగా ఆవిర్భవించిన పందొమ్మిదో శతాబ్దపు ఆంగ్లమేధావి ఆయన. లండను చూడకపోయినా ఆ నగరపు సందుగొందులన్నీ ఆయనకు తెలుసు. ఆంగ్ల కవుల జీవితాల్లోని వివరాలూ, విశేషాలూ వెలుగు నీడలూ ఆయనకు తెలిసినంతగా మా కెవరికీ తెలియవు. "నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్" అని గిరీశం డాబులు కొట్టాడు. కాని రోసయ్య గారితో సంభాషించటమే ఎడ్యుకేషన్. విజ్ఞానమూ వినోదమూ సరియైన తూకంలో అందించే మధురానుభూతి. ఆయన ఒక సజీవ గ్రంథాలయం. నడయాడే విజ్ఞాన సర్వస్వం.

ఒక్కమాటలో చెప్పాలంటే సాహితికీ సంస్కృతికీ పూలశయ్య మా యలవర్తి రోసయ్య.

(ఈ వ్యాసం రోసయ్య గారి జ్ఞాపకార్థం ప్రచురింపబడిన వ్యాససంపుటి నుండి గ్రహింపబడినది)

అద్వైతం

శ్రీ అమరేంద్ర

కురిసి కురిసి వెలిసింది వాన
చురకలు వేస్తూ వచ్చింది వెలుగుదొరసేన !
టెలిఫోన్ తీగల మీద చినుకుల ముత్యాలు
ఒక చుక్క జరుగుతున్నది
మక్కువతో మెల్లగా పక్కనున్న దానికోసం
ఒక్కటై తళుక్కున మెరిసి
సుందర మరంద బిందువుగా
జారిపోయి రాలిపోయి
మరుసటి క్షణమే మటుమాయం
రాగరంజిత సంయోగం
క్షణమైనా అది అనంతం
నితాంతం సుఖాంతం

జె.కె.సి.లో నా విద్యా వికాసం

శ్రీ ఎస్. సుబ్బారావు

సి.ఓ.ఓ., కృష్ణపట్నం పోర్ట్



జె.కె.సి. కళాశాల పూర్వ విద్యార్థి శ్రీ సుబ్బారావు. సాధారణ పాఠశాలలో విద్యాభ్యాసం, రైతు కుటుంబం వారి నేపథ్యం. కేవలం అకుంఠిత దీక్షతో అంచలంచలుగా ఎదుగుతూ, విద్యా ఉద్యోగ విషయాలలో ఇతరులకు తనవంతు సహాయం చేస్తూ, సివిల్ సర్వెంట్‌గా కొన్ని దశాబ్దాలు సేవలు అందించి ప్రస్తుతం కృష్ణపట్నం సి.ఓ.గా పనిచేస్తున్నారు. వీరిని కలసినప్పుడు తన విద్యా, ఉద్యోగ జీవితం గురించి, మన కళాశాల గురించి తన ఆలోచనలు మౌఖికంగా పంచుకొన్నారు. ఆ ఆలోచనల సంక్షిప్త రూపమే ఈ వ్యాసం.

–ఎడిటర్

నా పేరు సుబ్బారావు. మా గ్రామం పొన్నూరు దగ్గర దొప్పల పూడి. మా ఊరు పచ్చని పొలాలతో కళకళలాడుతూ వుండేది. నా బాల్యం అంతా ఆటపాటలతో ఎక్కువగా గడిచింది. పశువులు, పంట పొలాల దగ్గర కాలం గడిపేవాడిని.

బాల్య దశలో నాకు బాగా జ్ఞాపకం వున్న సంఘటన ఒకటి 1977 దివిసీమ తుఫాను. దాని గురించిన వార్తలను ఎక్కువగా చదివేవాడిని. దానికి కొద్దిగా ముందు 1975 అత్యవసర పరిస్థితి విధించబడినది. దానిమూలంగా ప్రజా జీవితంలో వచ్చిన మార్పులు నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నాయి. మా ఊరి రైసుమిల్లు వద్ద నేను 6వ తరగతి నుండి ఈనాడు పేపరును క్రమం తప్పకుండా చదివేవాడిని. వార్తాపత్రిక చదవడంలో కాలం తెలిసేదికాదు. ప్రతి వార్త ఆసక్తిదాయకంగా వుండేది. ఏదో పైపైన సంచలనమైన విశేషమైన వార్తలను చదవడమే కాకుండా విషయ మూలాల్లోకి వెళ్ళి కూలంకుషంగా వార్తలను చదివేవాడిని. ఎడిటోరియల్ పేజీలో ఉన్న విషయాలను అర్థావగాహనకు బాగా ప్రయత్నం చేసేవాడిని. నేను ఆర్థిక, సాంస్కృతిక, చారిత్రాత్మక వార్తలపైన కూడా దృష్టి సారించడానికి హేతువైనది.

బి.ఎస్సీ. (అగ్రికల్చర్)లో సీటు రాకపోవడంతో ఇంటర్మీ డియట్ తరువాత పొన్నూరులోని పి.బి.యన్. కాలేజీలో చేరాను. కాని అక్కడ అధ్యాపకుల కొరత కారణంగా అక్కడ నుండి టి.సి. అయితే తీసుకున్నాను కానీ ఎక్కడ చేరాలనేది మాత్రం అంతా అగమ్యగోచరం. కారణం గుంటూరులో ఏ కాలేజీలో కూడా రెండవ సంవత్సరంలోకి అడ్మిషన్ పొందడం చాలా కష్టం అని తెలిసింది. ఆ పరిస్థితిలో తక్కెళ్ళపాడులోని మా చిన్నమామ నన్ను ఆనాటి జె.కె.సి. కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆయన సానుకూలంగా స్పందించి చేసిన సిఫారసుతో నాకు జె.కె.సి. కళాశాలలో 1981 బి.జెడ్.సి.లో అడ్మిషన్ దొరికింది.

ఆనాటి జె.కె.సి. కళాశాల వాతావరణం నాకు కొత్తగా చదువుకు అనుకూలంగా అనిపించి ఒక పక్కన కళాశాలలో చదువుకుంటూనే మరోపక్క రెగ్యులర్‌గా ఎ.సి. కాలేజికి ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయానికి తరుచుగా వెళ్ళేవాడిని. ప్రత్యేకంగా రీడింగ్ రూములోని పోటీ పరీక్ష పుస్తకాలను సూక్ష్మంగా చదువుతూ ఉండేవాడిని.

జె.కె.సి. కాలేజిలో అధ్యాపక బృందం చాలా గొప్పగా అనిపించేవారు. వారు ఎంతో అంకితభావంతో బోధించేవారు. కళాశాలలో విద్యార్థినుల పట్ల చక్కగా మెలిగేవారు. విద్యార్థినులను ఎవరైనా ఏదైనా అంటే స్టాఫ్ ఏమాత్రం ఊరుకునేవారు కాదు.

జీవితంలో జె.కె.సి. కాలేజి నాకు చక్కటి స్నేహితులను ప్రసాదించింది. సి.ఓ., ఐ.పి.ఎస్ పాస్ అయ్యి యస్.పి., డి.ఐ.జి. లాంటి బాధ్యతలను కేరళలో చేపట్టి ప్రస్తుతం కృష్ణపట్నం సి.ఓ.గా పనిచేస్తున్న వై. అనిల్‌కుమార్ నా స్నేహితుడే. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎన్.టి.ఆర్. ట్రస్ట్‌లో పనిచేస్తున్న మోహన్ కూడా నా స్నేహితుడే. మేం ముగ్గురం మా కుటుంబాలలో తరచుగా కలుస్తుంటాం.

ఆ రోజుల్లో విశ్వవిద్యాలయాల్లో సీటు సంపాదించడం అంత సులువుగా వుండేది కాదు. అయితే జె.కె.సి. కళాశాలలో సాగిన నా విద్యాప్రస్థానం వల్ల అది సాధ్యపడింది.

విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు ప్రస్తుత తాడికొండ ఎం.ఎల్.ఏ., శ్రావణ్‌కుమార్ నా రూమ్‌మెట్. విశ్వవిద్యాలయంలో కేవలం చదువుకు మాత్రమే పరిమితమైపోకుండా, స్టూడెంట్స్ యూనియన్ రాజకీయాలలో చురుకుగా పాల్గొనాలన్నది నా అభిప్రాయం. విద్యార్థులు ఈ సున్నితమైన విభజనరేఖను గమనించాలి. రాజకీయాల గురించిన అవగాహన సమాజాన్ని అర్థం చేసుకోవటానికి, విద్యా వికాసానికి తోడ్పడాలి గాని, మన వ్యక్తిగత గమ్యాలకు, లక్ష్యసాధనకు అడ్డుకారాదు. రాజకీయాల అంతిమ లక్ష్యం సమాజసేవ.

నా తోటి విద్యార్థులకు పోటీ పరీక్షల గురించి అవగాహన కల్పించటం, వివిధ అంశాల గురించి చర్చించటం సమాజసేవలో భాగంగానే చూసేవాడిని. మారుతున్న నేటి ప్రపంచంలో కొత్త విలువలు, కొత్త సంప్రదాయాలు, కొంగ్రొత్త భావాలు చోటుచేసుకొంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ప్రపంచ, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వాతావరణాన్ని అవగతం చేసుకొంటూనే మరో పక్క జ్ఞాన సముపార్జనకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

ఆ రోజుల్లో సివిల్ సర్వీసెస్‌కు వయస్సు పరిమితి 26 సంవత్సరాలు. నా వయస్సు పెద్దది కావడంతో మిగతావారి కంటే భిన్నంగా ఎం.ఎస్సీ. మెరైన్ బయాలజీ చదువుతూనే మరొకవైపు సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అయ్యాను. తొలి ప్రయత్నంలోనే మా బ్యాచ్‌లో నేను మొదటగా ప్రిలిమ్స్‌లో పాస్ అవడంతో మరికొందరు ఉత్సాహంగా కలిసి గ్రూప్ స్టడీ చేసేవాళ్ళం. తర్వాత ప్రయత్నంలో నేను ఐ.ఆర్.టి.యస్. సాధించాను.

2010 వ సంవత్సరంలో వాలంటరీ రిటైర్మెంట్ కోసం నేను పెట్టుకున్న విజ్ఞాపన పత్రాన్ని నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ గారు తిరస్కరించారు. అయితే 2014వ సంవత్సంలో ఆమోదింప బడింది. పదవీ విరమణ అనంతరం కృష్ణపట్నం పోర్ట్‌లో సి.ఓ.గా పనిచేస్తున్నాను. నేను చేసే ఉద్యోగం ద్వారా భారతదేశంలో ప్రైవేటు రంగంలో ఉన్న అతి పెద్ద పోర్టు అయిన కృష్ణపట్నం అభివృద్ధికి తోడ్పడడం తద్వారా దేశ అభివృద్ధిలో భాగం కావడం సంతోష దాయకం. కృష్ణపట్నంలో నా విధినిర్వహణ బహుముఖంగా వుండి నిరంతరం నాకు నూతనోత్తేజాన్ని నింపుతుంది.

చివరకు ఒకమాట. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చదవటానికి జె.కె.సి. కళాశాల కారణం. సివిల్ సర్వీసెస్‌లో ర్యాంక్ సాధించటానికి జె.కె.సి. కళాశాల మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయాలు ముఖ్య కారణం. భవిష్యత్తుకు మంచి పునాది వేసి అభ్యున్నత పథంలో ఉన్నతంగా ఎదగటానికి తోడ్పడినది నా మాతృసంస్థ. ఈ విద్యావికాసం జె.కె.సి. కళాశాల వల్ల సాధ్యపడింది. నా మాతృసంస్థకు ధన్యవాదాలు!

నన్ను మార్చిన జె.కె.సి. – పవిత్ర వారణాసి

డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి
ఎం.ఏ., పిహెచ్.డి.
డైరెక్టర్
త్రివేణి – కృష్ణవేణి విద్యాసంస్థలు, తెలంగాణ



నా చిన్నతనాన్ని గూర్చి తలచుకుంటే చిన్నతనం, ఆటలంటే ఆసక్తి, చదువంటే చిరాకు. బ్రాడీపేట బజారులన్నీ నావే. చదవకుండా తిరిగే అల్లరి పిల్లలంతా నా ఆత్మీయులే. బ్రాడీపేట పాండురంగ విద్యాలయానికి వెళ్లటం విద్యకోసం కాదు, బడిలో పాఠాలు వినటం కంటే బడి బయట ముసలమ్మ అమ్మే జీడీలు తినటం, మిత్ర బృందానికి పంచడం, ఆ చేసిన అప్పులన్నీ మా నాయనమ్మ తీర్చడం.

ఆరవ తరగతిలో మాజేటి గురవయ్య హైస్కూల్‌లో చేర్చారు. పాఠశాల మారిందేకాని నాపంథా మారలేదు. చెడు తిరుగుళ్లు మానలేదు. స్కూలుకు వెళ్లటం తక్కువ, బయట తిరగటం ఎక్కువ. లూద్రన్ బి.ఇడి. కాలేజి గేటు లోపల ఫౌంటెన్‌లో చేప పిల్లలున్నాయంటే చూడటానికి గేటు దూకి లోపలకు వెళ్లే ప్రయత్నంలో, వాడి గేటు చువ్వ గుచ్చుకొని కాలికి గాయమైంది. గాయం అప్పుడే మానింది గాని మచ్చ ఇప్పటికీ మిగిలింది.

ఆ స్కూలులో లాభం లేదనుకొని, క్రమశిక్షణతో ఉంచడానికి శాంత ట్యుటోరియల్ కాలేజిలో నన్ను చేర్పించారు. స్థలం మారాను కాని నా బుద్ధి మార్చలేక పోయారు. అక్కడా షరామామూలే. ఒకసారి మా నాయనమ్మ కాలేజికి వెళ్ళి చూస్తే నేను లేను. కాలేజి వదిలే సమయానికి కాలేజి నుంచి వస్తున్నట్లుగానే ఇంటికి వెళ్లాను. ఎక్కడి నుంచి వస్తున్నావంటే అమాయకంగా కాలేజి నుంచేనని అబద్ధం. కావాలంటే వెళ్ళి కనుక్కోండి అని బుకాయింపు. ఆ రోజు శాంతా శ్రీమన్నారాయణ గారు వాయించిన వాయింపు నాకు ఇప్పటికీ ఒక చేదు జ్ఞాపకం.

మా నాయనమ్మ నేను మెట్రిక్యులేషన్ పాసు కావాలని మా ఇంటి దగ్గరలో విజ్ఞాన్ హాస్టల్‌లో వార్డెనుగా పనిచేస్తున్న మా బంధువు ప్రసాద్ గారి దగ్గరకు ప్రైవేటుకు పంపించింది. అయినా మూడో ప్రయత్నంలో తప్ప నన్ను మెట్రిక్ పాసు అయ్యేటట్లు చేయలేక పోయారు.

ఇక లాభం లేదనుకొని మానాన్నగారు అద్దె ఇంటిని జె.కె.సి. కాలేజి చెంతగల సాంబిరెడ్డి బిల్డింగ్‌కు మార్చారు. మానాన్నగారు జె.కె.సి.లో తెలుగు లెక్చరర్ గొల్లపూడి ప్రకాశరావు గారు. అప్పటికే మా అన్నయ్య, అక్కయ్య జె.కె.సి.లో చదువుతున్నారు. నన్ను, సైన్స్, గ్రూపు కష్టమని ఆర్ట్స్ గ్రూప్ స్పెషల్ తెలుగులో చేర్చారు. జె.కె.సి. కాలేజిలో చేరగానే నాలో మార్పు వచ్చింది. కాలేజిలో మా నాన్న గారంటే అందరికీ అభిమానం. జె.కె.సి. కాలేజి మ్యాగజైన్ తెలుగు విభాగానికి, సారస్వత సమితికి రిటైర్ అయ్యేదాక మానాన్నగారే నిర్వాహకులు. ఆంధ్రా యూనివర్శిటీ దూరవిద్యా కేంద్రంలోని స్టడీ సెంటర్ నిర్వహణ బాధ్యత గూడా వారిదే. మన ప్రకాశరావు గారి పిల్లలని మమ్మల్ని లెక్చరర్లంతా ప్రేమగా చూసేవారు. బాగా చదువుకొమ్మని ప్రోత్సహించేవారు. మిత్రులు కూడా మంచివాళ్ళు లభించారు. చదువు మీద కొంత శ్రద్ధ పెరిగింది. ఇంటికి కాలేజికి కొన్ని గజాల దూరం మాత్రమే. ఉంటే కాలేజిలో పాఠాలువింటూ, కాలేజి కాకపోతే ఇంటి ప్రక్క గులాబీ తోటలో పాఠాలు చదువుతూ – ఇదే కార్యక్రమం. ఇంటర్మీడి యట్‌లో సెకండ్ క్లాసు. మావాళ్ళం దరికీ ఆశ్చర్యానందాలు. బంధుమిత్రులందరి ఆత్మీయాభినందనలు. అభినందనల వలన కలిగే ఆనందం అనుభవంలోకి వచ్చింది.

స్టూడెంట్స్‌లో గూడా మాస్టరు గారి అబ్బాయనే ప్రత్యేకత. నాగార్జున యూనివర్శిటీ వారు నిర్వహించే విద్యార్థి పోటీలలో నాట్యంలో మా అక్కయ్య వరుసగా మూడుసార్లు ప్రథమ బహుమతి పొందడం, జె.కె.సి. కాలేజి ఆడిటోరియంలో కాకతీయ లలిత కళా

అకాడమీ వారు నిర్వహించే లలిత కళల పోటీలకు సహకరించడం, మా నాన్నగారి ఆధ్వర్యంలో అమరావతి సాంస్కృతిక వేదిక నెల నెలా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణలో నాన్నగారికి సహాయపడడం, మిత్రబృందం గూడా చదువు పట్ల శ్రద్ధాసక్తులు గలవారు కావడం మొదలైన వన్నీ నాలో గుణాత్మకమైన మార్పుకు దోహదపడ్డాయి. అన్నింటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా జె.కె.సి. కళాశాలే కారణం. జె.కె.సి.లో చేరకపోతే నా తీరు మారేది కాదు. నా తీరు మారకపోతే పరిస్థితి ఎలా మారేదో?

జె.కె.సి. కాలేజిలో లభించిన ప్రోత్సాహం వలన చదువుకో వాలనే కోరిక, చదివి సమాజంలో రాణించాలనే కోరిక అధికమైంది. బి.ఏ. డిగ్రీలో ఫస్ట్ క్లాస్ సాధించాను. ఎం.ఎ.లో ఫస్ట్ క్లాస్ సాధించాను. నాట్యంలో డిప్లొమా సాధించాను. పండిట్స్ ట్రైనింగ్ పొందాను. దేశంలో పలు ప్రాంతాల్లో మా అక్కయ్య ప్రమద్వరతో పాటు నాట్య ప్రదర్శనలిచ్చాను. ప్రొఫెసర్ యార్లగడ్డ బాలగంగాధర రావు గారి పర్యవేక్షణలో గ్రామనామాలపై ఎం.ఫిల్., పి.హెచ్‌డి. డిగ్రీలు పొందాను. ఈ అభివృద్ధి అంతటికీ కారణం జె.కె.సి. కాలేజిలో పొందిన శిక్షణ, ప్రోత్సాహం.

జె.కె.సి. కాలేజిలో విద్యా విషయంగానే కాక క్రమశిక్షణా పరంగా గూడా ఎంతో మార్పు పొందాను. యన్.సి.సి.లో క్రమశిక్షణ గల విద్యార్థిగా యన్.సి.సి. ఆఫీసర్ల అభిమానం సంపాదించాను. యన్.సి.సి.లో 'సి' సర్టిఫికెట్ అందుకున్నాను. సికింద్రాబాదులో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆర్మిఅటాచ్‌మెంట్ క్యాంపుకు హాజ రయ్యాను. క్రమశిక్షణతో పాటు సేవాదృక్పథాన్ని పెంచే యన్.యస్.యస్.లో చేరి యన్.యస్.యస్. ఆఫీసర్లు నిర్వహించిన సేవా క్యాంపుల్లో పాల్గొని గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకున్నాను. తోటి విద్యార్థులు అభిమానంతో నన్ను క్లాస్ లీడర్‌గా ఎన్నుకున్నారు. జె.కె.సి.లో లభించిన క్రమశిక్షణాయుత ప్రణాళికతో జె.ఆర్.ఎఫ్. నిర్వహించిన పోటీపరీక్షలో లెక్చరర్ పదవికి అర్హత సంపాదించాను. అన్నిటికీ కారణం జె.కె.సి. కాలేజి. అందుకే నాకు జె.కె.సి. పై అంతులేని అభిమానం.

విద్యాదేవి సరస్వతీ దేవి దయ వలన తెలంగాణలో నేను, మా అన్నయ్య జగదీశ్ మరికొందరు మిత్రులతో త్రివేణి – కృష్ణవేణి విద్యాసంస్థలను ప్రారంభించాం. వచ్చే విద్యా సంవత్సరం మేము స్థాపించిన సంస్థలకు కూడా రజతోత్సవ సంవత్సరం. కృష్ణవేణి కాలేజి ఈ సంవత్సరం ఇంటర్‌లో 994 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించింది. కొన్ని పదుల శాఖలతో, కొన్ని వందల మంది బోధకులతో, కొన్ని వేల మంది విద్యార్థులతో విరాజిల్లుతున్న విద్యా సంస్థల నిర్వహణ బాధ్యతను సక్రమంగా నిర్వహించడానికి జె.కె.సి.లో నేను పొందిన విద్యావిశేషమే కారణమని నా భావం.

జె.కె.సి. కాలేజికి ఇప్పుడు స్వర్ణోత్సవం
పూర్వ విద్యార్థులకందరకు ఆనందోత్సవం

ఈ 50 సంవత్సరాలలో నావంటి విద్యార్థులు ఎందరో వివిధ రంగాలలో ప్రవేశించి ఉంటారు. వారిలో కొందరు జీవితంలో రాణించి ఉంటారు. వారందరూ జె.కె.సి. మాతను స్మరిస్తూఉంటారు. ఈ వ్యాసం ద్వారా జె.కె.సి. మాతను స్మరించగలుగుతున్న నేను ధన్యుణ్ణి

స్వర్ణోత్సవం జరుపుకుంటున్నది జె.కె.సి.
ఇప్పుడు ఆంధ్రదేశం చూపంతా జె.కె.సి కేసి
జె.కె.సి. వివిధ విధ విజ్ఞాన వారాశి
నా దృష్టిలో జె.కె.సి. పవిత్ర వారణాసి.

మాతృదేవోభవ

మాతృ సంస్థ జె.కె.సి. కళాశాలకు ప్రణామాలతో...



డా॥ పాతూరి రాధిక,

M.Sc., M.S., M.Tech., Ph.D.,

ప్రిన్సిపల్, విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కాలేజి

పెదపలకలూరు రోడ్డు, గుంటూరు

శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల నా మాతృ సంస్థ. మా నాన్న గారు శ్రీ పాతూరి కోటేశ్వరరావు గారు రసాయన శాఖ విభాగాధిపతిగా ఈ సంస్థలో పని చేశారు. నాకన్నా ముందు మా అన్నయ్య, ప్రస్తుతం గుంటూరులో ఆర్థోపిడిక్ సర్జన్‌గా ప్రాక్టీసు చేస్తున్న డాక్టర్ పాతూరి కిరణ్ చౌదరి, నా తరువాత మా తమ్ముడు MBA చేసి ప్రస్తుతం గుంటూరులోనే స్థిరపడ్డ శ్రీ పాతూరి శ్రీకాంత్‌లు కూడా జె.కె.సి.లోనే చదివారు. మా అన్నయ్యను Bi.P.C. లో, నన్ను M.P.C. లో, మా తమ్ముడిని M.E.C. లో చేర్పించి మా నాన్న విజ్ఞత చూపించారు. అదేంటి అమ్మాయిని M.P.C. లో చేర్పించారని ఆశ్చర్యంగా అడిగేవారు. దానికి కారణం ఒకటి నాకు మ్యాథ్స్‌లో అభిరుచి కలిగి ఉండడం, రెండు మెడిసిన్ కోర్సు ఎక్కువ కాలం పడుతుందని భయం. నాన్న ఆలోచనకు తగ్గట్టు నేను 22 ఏళ్లకే ఉద్యోగంలో చేరాను. నాన్న సన్నిహితులతో చెప్తుండేవాడు మా కిరణ్‌ని మా అమ్మాయే చదివిస్తుందని.

ఇంటర్మీడియట్ తరువాత ఇంజనీరింగ్ చేరకుండా నాన్న ఆలోచన మేరకు బి.యస్సి.లో చేరాను. కాకపోతే నాన్నకు ఒక షరతు పెట్టాను. ఈ మూడు సంవత్సరాలు కనీసం ఒక పీరియడన్నా మీరు మా క్లాసు తీసుకోవాలని. అది ఆయన నెరవేర్చారు. ఆ షరతుకు నా క్లాస్‌మేట్స్ అంతా సంతోషించారు. మా క్లాసులో ఆడపిల్లలం, మగ పిల్లలతో పోటీగా చదివేవాళ్లం. మార్కులు ఎక్కువ మందికి 75% పైనే వచ్చేవి. అదేమి విచిత్రమో మ్యాథ్స్‌లో 150 కి 150 దాదాపుగా 95% మందికి వచ్చేవి. మూడు సంవత్సరాలు అవే ఫలితాలు. గుంటుపల్లి సాంబశివరావు గారు ఆఫీసులో పరీక్షల విభాగం సూపరింటెండెంట్‌గా మార్కులు ఎంటర్ చేసిన తరువాత రిజిస్టరు అందరికి చూపించి "ఇది సెంటు కంపు కొడుతుందని, భరించలేకపోతున్నానని" ఆనందంతో కూడిన బాధను అందరితో పంచుకునేవారు. రసజ్ఞులకు అర్థమయ్యేది. మిగిలిన వారికి నూటికి నూరు మార్కులు (100 per cent) ప్రహసనాన్ని వివరించేవాడు.

భౌతిక శాస్త్ర, రసాయన శాస్త్రాల్లో నూటికి నూరు సాధ్యం కాదు కనుక విశ్వవిద్యాలయంలో అత్యున్నత మార్కులు వేమే సాధించేవాళ్లం. ఒకసారి ఫైనల్ ఇయర్‌లో ఫిజిక్స్ పేపరు పరీక్ష ముందు రాత్రి నాకు మైండ్ బ్లాక్ అయ్యింది. నాన్న ఊళ్లో లేరు. విపరీతమైన భయం, ఏడుపు. అమ్మకు ఓదార్చడం రాదు. అమ్మ అప్పుడు నాన్నకు ఫోన్ చేస్తే, అమ్మాయికివ్వు నేను మాట్లాడతానని నాతో చాలా ప్రశాంతంగా "బాగా చదివిన వారికి ఇలా మైండ్ బ్లాకవ్వడం సహజమే, అమ్మ జ్యూస్ ఇస్తుంది తాగి, ప్రశాంతంగా నిద్రపో. ఈ పేపర్‌లో నీదే యూనివర్శిటి ఫస్ట్, Take it for granted" అని పెట్టేశారు. నాన్న చెప్పినట్లే ఆ పేపర్లోనే కాకుండా మొత్తంగా ఆ సంవత్సరం యూనివర్శిటి ఫస్ట్ నాదే. రెండు బంగారు పతకాలను సాధించి పెట్టింది. నాతోపాటు మా క్లాసుమేట్సు ఐదుగురికి మొదటి ఐదు ర్యాంకులొచ్చాయి. ఆ సంవత్సరం బి.కాం.లో కూడా యూనివర్శిటీ ఫస్ట్ సెవెన్త్ ర్యాంకులు మా జె.కె.సి.కే దక్కాయి. ఆ సంవత్సరం రజతోత్సవ వేడుకల్లో ర్యాంకుల పంటకు విశేష ఆదరణ ప్రాచుర్యం లభించింది. కళాశాల ఖ్యాతి హోజరైన అతిధులందరికి తెలిసింది.

మరువలేని అనుభూతి – రజతోత్సవం

రజతోత్సవ వేడుకలు మూడు రోజులు జరిగాయి. మొదటి రోజు పూర్వ విద్యార్థుల సమావేశం ముఖ్య అతిధి జస్టిస్ ఆవుల సాంబశివరావు గారు జ్యోతి ప్రజ్వలనంతో వేడుకలను ప్రారంభిం

చారు. ఆయన చేతుల మీదుగ బంగారు పతకం అందుకోవడం అనిర్వచనీయమైన అనుభూతి. సాయంత్రం ప్రముఖ పారిశ్రామికవేత్త పాతూరి రామారావు గారు ముఖ్య అతిథిగా స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం చేయడమే కాకుండా, పది లక్షల నిధిని సమకూర్చి పేద విద్యార్థులకు ప్రతి యేటా స్కాలర్‌షిప్పులు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల తరఫున శ్రీ చుక్కపల్లి సురేష్ "నా గాడ్‌ఫాదర్ పాతూరి కోటేశ్వరరావు గారి అమ్మాయి" యూనివర్శిటి ఫస్ట్ సాధించినందుకు గర్వపడు తున్నానని నన్ను ఘనంగా సత్కరించారు. రెండవ రోజు అక్కినేని నాగేశ్వరరావు గారి చేతుల మీదుగా బంగారు పతకం తీసుకొనే సమయంలో నిశితంగా పరిశీలించి నీవు పాతూరి కోటేశ్వరరావు గారి అమ్మాయివా? అని అడిగారు ఆయన సూక్ష్మ దృష్టికి ఆశ్చర్యమేసింది. అవన్నీ మధురాను భూతులు.


నాన్న పేదరికంలో పెరిగి కూడా మమ్ములను బాధ్యతగా పెంచారు. నాన్న కష్టాన్ని ఇష్టంగా తీసుకునే వారు. మా చేత కూడా ఇంటి పనుల్నీ చేయించేవారు. నేను ఇల్లు ఊడ్చి శుభ్రంగా తుడిచేదాన్ని. అన్నయ్య గిలక మీదుగా బావిలో నీళ్లు తోడేవాడు. వస్త్రధారణ పరిశుభ్రంగా ఉండాలనేవారు గాని, అతిపోకడలు నిరసించేవారు. మాది ఉమ్మడి కుటుంబం కనుక మా ఇంటిలోనే ఉండి ఎక్కువ మంది చదువుకునేవారు. అందరికి పోషకాహారం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఒక గేదెను కూడా పెంచారు. మా ఇంటి వాతావరణం చూసి ఇది లెక్చరర్ ఇల్లేనా అని ఆశ్చర్యంగా అడిగేవారు. దానికి తోడు మా జంపని వెంకట్రావు మామయ్య, మేమే అనుకుంటే ఆయనకు బంధువులు మా కన్నా ఎక్కువ. రోడ్డు మీద ఇల్లు. పైగా ప్రహరీ కూడా లేదు. సాయంత్రం రోడ్డున వెళ్లే వాళ్లు చూసి మా ఇల్లు హాస్టలనుకునేవారు. ఎందుకు ప్రస్తావించానంటే ఆ పరిస్థితుల్లో చదువుకున్న మేమూ మా ఉమ్మడి కుటుంబం పిల్లలమంతా ఉన్నత విద్యావంతులమయ్యాం. పైగా బంధుత్వాలు పల్లెటూరు మనుష్యుల మధ్య ఆప్యాయతలు, నిష్కపటత్వం, జీవిత పాఠాలుగా నేర్చుకున్నాం. సెలవుల్లో స్వంత ఊరు వెళ్లినప్పుడు పనివాళ్లు అన్యోన్యంగా, ఆప్యాయంగా, కులాల కతీతంగా వరుసలతో పిలుచుకోవడం వారి అనురాగాలకు నిదర్శనం. మాకు అది ఒక మార్గదర్శనం.

జె.కె.సి. కాలేజి చదువులు ప్రతిభకు ప్రమాణాలైతే అను బంధాలు చిరస్మరణీయమైన ఆప్యాయతలకు నెలవులు. యాజమాన్య పెద్దల వ్యక్తిత్వం, అధ్యాపకుల ప్రతిభ, మాపై చూపించే శ్రద్ధ, సన్నిహితత్వం, అధ్యాపకేతర సిబ్బంది నిబద్ధత చిరస్మరణీయమైన అనుభూతులు. అవే మా భావి జీవితానికి మార్గ దర్శకాలయ్యాయి. ఐదు సంవత్సరాలు ఐదు క్షణాలుగా గడిచాయి. డిగ్రీ మూడు సంవత్సరాలు సత్సంబంధాలు పెంచుకునే వయస్సు గనుక చదువుతో పాటు ఆత్మీయతలు పెరిగాయి. అవి తరువాత కాలంలో విస్తృత మయ్యాయి. కొందరితో మరింత బలపడ్డాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినందువల్ల చూస్తూ మాట్లాడుకునే అవకాశం లభ్యమైంది. మిగతా బ్యాచ్‌ల సంగతి తెలియదు గాని, మా బ్యాచ్‌లో ఎక్కువ మంది విద్యారంగంలోనే స్థిరపడ్డాం. పదిమందికి సరియైన విద్య నందిస్తు న్నందుకు గర్వపడుతున్నాం. నేను ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్‌గా, రమేష్ ప్రముఖ సంస్థ (FIITJEE) డైరెక్టరుగా, సుబ్బారావు KITS ఇంజనీరింగ్ కాలేజి స్థాపకుడిగా, కోమలి గుంటూరులోని ప్రముఖ SPS హైస్కూలు HM గా, ఇంకా చాలామంది అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడటం ఒక విశేషం.

మాతృ సంస్థ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల స్వర్ణోత్సవాలు జరుపుకోవడం మాకెంతో సంతోషంగా ఉంది. మరింత ఆనందంగా ఉంది. మా కన్నా మమ్ముకన్న తల్లి మా ఎదుగుదలను చూసి ఎంతో మురిసిపోతుంది. ఈ మధ్యనే నాన్న గారు facebook లో మా అమ్మ ఒడిలో పెరిగి ఉన్నత స్థితికి చేరిన కొందరిని గురించి వివరించడం చూశాను. అమ్మకు తన బిడ్డలను గూర్చి పదిమంది కీర్తించడం కన్నా ఆనందం ఏముం టుంది? అలాంటి స్వర్ణోత్సవ వేడుకలకు ఎదురుచూస్తూ మాకన్నా ముందు తరం వారిని, మా తరువాత తరాల వారిని చూసి ఆస్మృతులను దృశ్యకావ్యంగా మలచుకోవాలని అభిలషిస్తున్నాను. ఈ సందర్భంగా ఒక శిలను శిల్పంగా చెక్కిన నా గురువులందరికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

గుంటూరు తెలుగు

డా॥ పాపినేని శివశంకర్, ఎం.ఏ., పిహెచ్.డి.
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, పూర్వ విద్యార్థి



అకట! తెల్గునేల, అందున గుంటూరు
మండలమున బుట్టు మానవుండు
కొసరి కొసరి యింత గోంగూర దిననిచో
ఏమి బ్రతుకు వానిదేమి మెతుకు

అన్నారు తెనుగులెంక, మా పరమగురువు తుమ్మల సీతారామ మూర్తి. ఆ గోంగూర రుచే గుంటూరు మాండలికంలోను చేరింది.

గుంటూరు మండల చరిత్ర శాతవాహనుల కాలంతో మొదలవుతుంది. క్రీ.శ. 2వ శతాబ్దంలో ధాన్యకటకం (ధరణికోట) శాతవాహనుల రాజధాని. ఆ తరువాత ఈ ప్రాంతాన్ని ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, వెలనాటి చోళులు, కాకతీయులు, కొండవీటి రెడ్డిరాజులు, విజయనగర రాజులు పాలించారు. ఆ కాలంలో ఇది వెలనాడు, పాకనాడు పేర్లతో వ్యవహరించబడేది. తళ్ళికోట యుద్ధానంతరం నవాబుల వశమైంది. తర్వాత ఆంగ్లేయులు. 1904లో కృష్ణాజిల్లా నుంచి విడివడి గుంటూరు జిల్లా ఏర్పడింది. 1971లో కొంత భాగం ప్రకాశం జిల్లాలో కలిసింది. ప్రస్తుతం ఉత్తరాన కృష్ణానది హద్దుగా గుంటూరు మండలం 12 వేల చ.కి.మీ. విస్తీర్ణంలో 100 కి.మీ. సముద్ర తీరంతో అలరారుతుంది. ఒక ప్రత్యేక భాషావ్యవస్థ కూడా ఇక్కడ రూపు దిద్దుకొన్నది. నారాయణ తీర్థులు, మహాకవి తిక్కన, జాషువ, తుమ్మల, ఏటుకూరి, జంధ్యాల పాపయ్య శాస్త్రి, ఉన్నవ, స్థానం మొదలైన మహనీయులు పుట్టిన గడ్డ యిది.

జీవద్భాష – వైవిధ్యం

ప్రజల నిత్య జీవన వ్యవహారంలో ఉన్న సజీవ భాషని జీవద్భాష అంటాం. జీవద్భాషకి మార్పు సహజమని, ఆ మార్పు వల్ల భాషలో బహురూపత, వైవిధ్యం ఏర్పడతాయని భాషా శాస్త్రజ్ఞులు భద్రిరాజు కృష్ణమూర్తి చెప్పారు. ఈ బహురూపత 1. చారిత్రకం, 2. ప్రాంతీయం, 3. సాంఘికం అని మూడు విధాలుగా ఉంటుందని తేల్చారు. అంటే భాషలో ఒక కాలంలో ఉన్న రూపాలకి, తదనంతర కాలాల్లో ఉన్న రూపాలకి తేడాలుంటాయి. ఒకే కాలంలో నైనా భిన్న ప్రాంతాల్లో సమాన పదాల్లోను భేదాలుంటాయి. ఇక సంఘంలో వివిధ వర్గాల పలుకుబడిలో తేడాలుంటాయి. వీటిని వర్గ మాండలికాలు అనుకోవచ్చు. ఇంకా అవాంతర భేదాలు చాలా ఉంటాయి. వ్యవహారాన్ని బట్టి వాడుక భాష – లిఖిత భాష, ఇంటి భాష – బయటి భాష, సంభాషణ భాష – ఉపన్యాస భాష, ప్రజల భాష – పత్రిక భాష, పిల్లల భాష – పెద్దల భాష మొదలైన భేదాలు గుర్తించవచ్చు.

నేటి తెలుగులో భాషావేత్తలు నాలుగు భాషా మండలాలు గుర్తించారు. 1. పూర్వ మండలం (కళింగ), 2. దక్షిణ మండలం (రాయలసీమ), 3. ఉత్తర మండలం (తెలంగాణ), 4. మధ్య మండలం (తీరాంధ్ర / కోస్తా). ఒక మండలంలోని భాషకి, తక్కిన మండలాల భాషకి శబ్దాల్లో, వాక్య విధానంలో, ఉచ్చారణలో తేడాలుంటాయి. ఈ భేదాలన్నీ మన విస్తృత భాషా సంపదని, అందులోని వైవిధ్యాన్ని తెల్పుతాయి.

వ్యావహారికం

ప్రజల వాడుక రచనల్లో ప్రతిఫలించాలనే అభిప్రాయం వ్యావహారిక భాషావాదంగా బలపడింది. గిడుగు, గురజాల దీనిని ఉద్యమంగా సాగించారు.. మధ్యలో శిష్ట వ్యావహారికం అనే మాట వచ్చింది. అది నిలబడలేదు. ఎందుకంటే గ్రాంథికవాది 'వచ్చెను' అంటే మామూలు మనిషి 'వచ్చాడు' అంటాడు. 'వచ్చినాడు' అనేది అరుదు. ఇక వ్యావహారిక భాషావాదం చెప్పినంత తేలికేమీ కాదు. ప్రజలు పలికేది పలికినట్టుగా రచయితలు రాయలేరు. ఒకవేళ రాసినా చదవలేరు. మాట్లాడే భాషలోని 'యాస'ని రచనలో పట్టుకోవటం కష్టం. యాసే కాదు, నుడికారం లోని వెటకారం, ఎత్తిపొడుపు, పుల్లవిరుపు వంటివి రచనలో ధ్వనించవు. 'మా బాగా జెప్పావే' అంటాడు గుంటూరు మనిషి. దాన్ని సంభాషణలో రాయవచ్చు. కాని అందులో వెటకారం ఉందా? లేదా? 'ఆహా అట్టాగా! నాకు తెలీదులే' అన్న మాటలో పుల్లవిరుపు ఉందా? ఆ సంగతి రాతలో తెలియదు. సారాంశం ఏమిటంటే 'కూసే' భాషకీ 'రాసే' భాషకీ ఎంతో అంతరం ఉంది.

భాష – యాస

ఏ మాండలికానికైనా తనదైన పదజాలంతో పాటు పలుకు తీరు కూడా వేరుగా ఉంటుంది. దాన్నే 'యాస' (ఏస) అంటాం.

యాస లేకుండా నాజూకుగా మాట్లాడటం నాగరికతకు ఒక సంకేతంగా భావించటం కద్దు. గుంటూరు మాండలికానికి పైకి విడిగా వినపడే యాస తక్కువ. అందుకే కవికోకిల జాషువ 'ఏస కొంచెము లేని హృదయంగమంబైన / సిసలైన తెలుగు రంజిల్లు చోటు' అని గుంటూరు సీమని మెచ్చుకొన్నారు. 'వీర భాషాభిరామ' అన్నారు. ఒక ప్రాంతపు ప్రజలకు, అందునా కవులకు స్వస్థాన వేష భాషాభిమానం సహజమే. గుంటూరు తెలుగుకీ యాస ఉందని ఇతర ప్రాంతాల వారు అంటారు.

శిష్ట భాష, శిష్టేతర భాష

19వ శతాబ్దిలో కృష్ణానది మీద ఆనకట్ట కట్టటంతో వ్యవసాయంలో మిగులు విలువ పెరిగి, ఒక నూతన సంపన్నవర్గం గుంటూరు ప్రాంతంలో ఏర్పడింది. అట్లాగే ఇంగ్లీషు చదువుల వల్ల విద్యాధిక, ఉద్యోగ వర్గం ఏర్పడింది. ఇక తరతరాలుగా పై ఎత్తున అభివృద్ధి చెందిన వర్గం ఉంది. ఈ సామాజిక వర్గ సముదాయం నాగరికతలోను ముందుంటుంది. తక్కిన వర్గాలకన్న భిన్నంగా వేషభాషల్ని రూపొందించుకొంటుంది. ఆ క్రమంలో శిష్టవర్గంగా విడివడుతుంది. 20వ శతాబ్దంలో సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలెన్నో తీరాంధ్ర ప్రాంతంలో జరిగాయి. ఇక్కడే పత్రికలూ మొదలయ్యాయి. ఆ శిష్ట మార్గ భాషే కొద్ది తేడాతో పత్రికాభాషగా అవతరించింది. దానినే ప్రామాణికంగా భావించారు. అయితే రెండున్నర జిల్లాల భాషే ప్రామాణికభాషగా తెలుగును పాలించిందనటం పొరపాటు. ఎందుకంటే పత్రికల భాష వేరు, ఇక్కడి ప్రజల భాష వేరు. అది పట్టణాల్లో గాక పల్లెటూళ్ళలో బాగా తెలుస్తుంది. ప్రతి ప్రాంతంలో ఒక ప్రత్యేక లక్షణం గల భాషావిధానం వ్యాప్తిలో ఉంటుంది. దానినే మాండలికం అంటాం. నిర్వచన ప్రాయంగా చెప్పాలంటే ఒకానొక మండలంలో సామాన్య జన వ్యవహారంలోని భాషే మాండలికం. అందులో మన గుంటూరు మాండలికంలోని సొగసుని గుర్తిద్దాం. ముందుగా మచ్చుకి ఒక భాషణశకలం చూడండి.

ఊరమ్మటి చింతలతోపు సీయిందం గోయిందంగా ఉంది. ఉత్తరపేపు దరిన పెద్ద చింతచెట్టు దాకా జనం చానామంది జేరారు ఆడపిల్లలు, ఉంకో ఏపు కుర్రకారు. కట్ట కింద నర్సిమ్మ కూతురు మాలక్ష్మి – పదేను పదారేళ్లుంటాయ్యోమో – ఉయ్యాల బల్ల మీనా రయ్యిరయ్యిన ఊగుతుంది' ('చింతలతోపు' కథ, పాపినేని శివశంకర్).

ఇదంతా గ్రామీణ భాష. చిన్నయసూరి 'లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు' అని సూత్రీకరించాడు. గ్రామ్యం అంటే గ్రామాల్లో మాట్లాడుకొనే భాష. 'లక్షణంగా' లేదు గనుక గ్రంథ రచనకి పనికిరాదన్నమాట. ఈ గ్రామీణ మాండలికాలకి కావ్య గౌరవం లేదు. లేకపోగా వాటిని ఈసడించిన, ఎగతాళి చేసిన, హాస్యమాడిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకి 'చంద్రశేఖర శతకం' గుంటూరు ప్రాంతంలో వెలువడిందే. కర్త ఎవరో సరిగ్గా తెలియదు.

నన్ను సదించె బాబు సిననాడు తమాసగ బాగతంబు, రా
మాన్నెము, బాతంబును తమామును కిందియి ముందె నచ్చు నే
నిన్ని సదుండగానె బవు యెత్తము నోరిక బాపనాండ్లు నా
కన్నను లొజ్జటంద్రు పలుగాకులు మూర్ఖులు చంద్రశేఖరా!

ఇట్లా ఈ పద్యాలన్నిట్లో గుంటూరు భాషని, యాసని హేళన చెయ్యటమే ఉంది. ఎటొచ్చీ వచన సాహిత్యంలోనే ఈ భాషకి గౌరవం దక్కింది. అదీ 20వ శతాబ్దం నుంచే. చలం, కొడవటిగంటి, వంటి యిక్కడి చెయ్యి దిరిగిన రచయితలు కూడా స్థానిక భాషని పట్టించుకోలేదు. అయితే మాధవపెద్ది గోఖలే 'సన్న జీవాలు', 'బల్లకట్టు పాపయ్య' కథా సంపుటాల్లో గుంటూరు జీవద్భాషకి అద్భుత కథారూపమిచ్చాడు. ఒక్క ఉదాహరణ చూడండి.

'ఏకువ జామున తొలికోడి కూసే యాల మెట్టపల్లీ, సొట్టపల్లికి మయానా పార్తుండ కిట్టకాలవ గెట్టు మీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తా యింటుంటే, మెట్టపల్లి ఏపుల్నుంచి సీకట్లో బజానా పాటలు ఇనిపించి, యింకూసేపుటికి డొంకల్లోంచి సేతికర్ర పొడుసుకుంటూ ఓ నల్ల యిగ్రహం మిట్టపల్లాలు ఎక్కి దిగుతూ వొచ్చొచ్చి, కిట్టకాలవ గెట్టెక్కి, ఆడ గొలుసుతో కట్టేసుండే బల్లకట్టు కాడికొచ్చి నిలబట్టం తెలసుద్దన్నమాట. ఆ యిగ్రహం బల్లకట్టు పాపయ్య'.

ఇదీ గుంటూరు పల్లె తెలుగు. ఆ తర్వాత అందే నారాయణ స్వామి. అదే ఒరవడిలో కొలకలూరి ఇనాక్, పాపినేని, వల్లూరు శివప్రసాద్, విజయరామరాజు, ఎమ్వీ రామిరెడ్డి, బండ్ల మాధవరావు మొదలైన రచయితలు ఈ మాండలికాన్ని తమ రచనల్లో పదిలపరుస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు జీవద్భాష స్వరూప స్వభావాలు కొంచెం పరిశీలిద్దాం.

ప్రత్యేక పదజాలం

ఎనకమాల, లగెత్తటం, శానా, మల్లె, బొవు, కుశాల, ఉచ్చిలి, ఆవజాన, ఆమైన, మయాన, దబ్బున, దానికల్లె, ఓ పాలి, ఒకోలి, పెడద్రం, ముంగల, కాత్తె లెక్క, ఇలంబ్రం – ఇటువంటి ప్రత్యేక పదజాలం గుంటూరు ప్రాంతంలో పుష్కలంగా దొరుకుతుంది. వికృత రూపాలుగా శాపలు, గేనం, గెప్తి, కూకో, కట్టం, ఇట్టం, నట్టం మొదలైనవి అవపడతాయి. నిందార్థక వాక్యాల్లో గుంటూరు ప్రత్యేకత గుంటూరుదే. 'దీని మొదులార !, నీ పుటమార !, ఆడి జిమ్మదియ్య !, తిత్తి దీస్తా, తల్లి ముండ మొయ్య ! తస్స దియ్య !' మొదలైన గమ్మత్తైన వాక్యాలెన్నో. అందులోనూ పల్నాడు ప్రాంతంలో కాస్త కరుకుదనం ఉంటుంది. 'ఆ, ఏందంట ఏంది?' అని పల్నాడు వాసి రెట్టిస్తే, గుంటూరు మనిషి 'ఏంటి చెప్పు నువ్వు జెప్పేదేందో' అంటాడు.

ఇవిగాక ధ్వన్యనుకరణ శబ్దాలు – లటిక్కిన, గబిక్కిన, దభీల్న, సెర సెరా, క్లె !, క్లె !, వార్నీ ! – ఇటువంటివన్నీ సామాన్య జనజీవనంలో వినపడేవే. ఒకప్రాంతం భాషకి జవజీవాలిచ్చేది ఇటువంటి మాండలిక పదజాలమే. నాగరికతతో నునుపు దేలిన మాటల్లో నాజూకు ఉండవచ్చు గాని సజీవ లక్షణం మాండలికంలోనే ఉంటుంది.

సౌమ్యీకరణ

జనసామాన్య భాషణలో మహాప్రాణాక్షరాలు పలకవు. ఒత్తులు ఎగిరిపోతాయి. పలుకు సౌమ్యంగా, మృదువుగా వినపడుతుంది. అలఘు లకారాలు/మూర్ధన్యాలు (ళ) లఘు లకారాలుగా/దంత్యాలుగా (ల) మారతాయి.

ఉదా : 1. బూర్యన్న తరవాత కాత్త బయ్యం, బత్తి ఉండాల

2. ద్రనం ఎంత గ్రనంగా వున్నా గునం ముక్కెం

3. నీళ్ళల్లో శాప తల్లుక్కుమంది

ఆ మాటకోస్తే మన సినిమాల్లో హీరోలు, టీవీ యాంకర్లు ఒత్తులెప్పుడో ఎగరగొట్టేశారు గదా !

'కల్లల్లో నీల్లు సుల్లు దిరుగుతున్నాయి' అని హీరోయిన్ అంటుంటే బాధతో మన కళ్ళల్లో నీళ్లు దిరగాల్సిందే !

పదాదిని ఉన్న చకారం సకారంగా మారటం (చ>స) గుంటూరుతో పాటు తక్కిన మాండలికాల్లోను ఉండవచ్చు. దీని వల్ల గూడా మాటలు మృదువుగా మారతాయి.

ఉదా: 1. స్రాల్లే స్రంబడం

2. స్రూశావ్ గా స్రల్లగా

3. స్రెట్టుగ్గాదు, నీకే స్రెప్పేది

'యాపారం, యవ్వారం రొండూ జూసుకునే యవదానం లేదు నాకు.' అని ఒక వ్యాపారి మృదువుగా అన్నాడనుకోండి. పదాదిని ఉన్న సంయుక్తాక్షరాల్లో (వ్+య్+అ) మొదటిది ఎగరగొడుతున్నట్టు ఆయనకి తెలియదు. మనం గ్రహిస్తాం. వ్యాపారం, వ్యవహారం, వ్యవధానం అనేవి అసలు రూపాలు గదా?

మా ఊళ్లో అనుమంతు, యెంకటేశ్వర్లు, యీరాస్వామి ఉన్నారు. అయగ్రీవాచారి కూడా ఉన్నాడు. కాకపోతే వాళ్ళంతా తమ పేర్లలో తొలి హల్లులు ఆ పైవాడికి సమర్పించుకున్నారు ! హల్లులే యేమిటి? మాటల మధ్య అక్షరాలకి అక్షరాలే మాయమైపోతాయి. ఆతలికి (అవతలికి), తరాత (తర్వాత), లేపోతే (లేకపోతే), చించెట్టు (చింత చెట్టు) మొదలైన పదాల్లో మధ్య వర్ణాలు లోపిస్తున్నాయన్నమాట. భాషణలో మనిషి బుద్ధి అసంకల్పితంగా, సహజంగా సౌలభ్యం (ease) కోసం చూస్తుంది. దాని ఫలితమే ఇటువంటి మార్పులన్నీ.

శిష్టేతర వ్యవహారంలో ఉన్న ఒత్తులు ఎగిరిపోతుంటే శిష్ట వ్యవహారంలో లేని ఒత్తులు చోటు చేసుకుంటాయి. ఇది Fortition. తమ భాషణ సంస్కారవంతంగా, ఉన్నతంగా ఉండాలనే తపనతో ఈ విధంగా కుహనా సంస్కృతీకరణకి పాల్పడుతుంటారు. 'వీరభద్రయ్య గారూ ! త్రుంగభ్రద్రలో మ్రోకాటి లోతు వుదకం ఉందండీ ! అన్నాడట వెనకటికి ఒకాయన. ఆ మధ్య ఒకింటి దగ్గర 'భ్రూమ్మ గారూ ! మీ భ్రొక్కెన భ్రావిలో పడిందండీ !' అనే వాక్యం వినపడింది. అంత ఒత్తి చెప్పకపోయినా బొక్కెన బావిలోనే పడుతుంది గదా! అదంతా అనవసరమైన హంగామా.

క్రియారూపాలు

క్రియాపదాల్లో బాగుంటది, వచ్చిద్ది, వచ్చుద్ది, ఇప్పిచ్చు, తీసకపో, లెగిశాడు, తెలవలా, పెట్టమాకు, కొనబాకు, తిట్టవాకు, అడగ్గాకు మొదలైన రూపాలు గుంటూరు మండలంలో బాగా వినపడతాయి.

ఇక్కడి శిష్టేతరుల భాషలో క్రియాపదాల్లో ఉత్తమ పురుష ప్రత్యయం 'ను' లోపిస్తుంది. ఉదా. 1. బెజవాడెల్లా(ను). ఇప్పుడే వచ్చా(ను). నీ కోసం గొలుసు కొన్నా(ను).

ఇక నిశ్చయార్థక క్రియాపదాల చివర ఇకారం అకారంగా మారి – కొట్టాల, చెయ్యాల, తినాల – ఈ విధంగా వినపడతాయి. అట్లాగే వ్యతిరేక క్రియల్లో తుది అక్షరం లోపించటం కూడా గమనించవచ్చు.

ఉదా: ఇంకా నూర్పిళ్ళు కాలా (కాలేదు). అన్నం దినలా (తినలేదు). ఊరికి పోలా (పోలేదు). భాషా శాస్త్రం ప్రకారం ఈ మార్పుల్ని Deletion అనవచ్చు.

పదాంత మకారం 'వ్c' కారంగా మారటం గుంటూరు తెలుగులో మామూలు.

ఉదా: 1. ఇదుగో, మేవ్c (మేం) వొచ్చావ్c (వచ్చాం), వానబడింది. 2. రావుఁడూ పాలెవ్c (పాలెం) బొయ్యొచ్చావా? ఈ మార్పుని 'ము > 0 > వ్c' గా సూత్రీకరించవచ్చు.

సంధులు

కొన్ని మాటల్లో వకార లోపమౌతుంది. రెండు మాటలు కలిసే చోట రెండో మాట మొదట్లో ఉన్న వకారం లోపించి సంధి జరుగుతుంది. ఒక్కోసారి 'ఓ' ఆదేశమవు తుంది.

ఉదా: 1. తలాకిలి (తల+వాకిలి) తీసే వుంది. 2. ఆడు మనోడే (మన+వాడు), శానా మంచోడు (మంచి+ వాడు). 3. సందేలప్పుడు (సందె+వేళ), కూతురొచ్చింది (కూతురు+వచ్చింది), పిల్లోళ్ళతో (పిల్ల+వాళ్ళు). 4. ఈ పుచ్చొంకాయలు (పుచ్చు+వంకాయలు), పిచ్చోడైనా (పిచ్చి+వాడు) కొనడు.

పద సామీప్యంలో సంధి లేని చోట కూడా గుంటూరు భాషలో సరళీకరణ వినపడుతుంది. 'ప్రథమమీది పరుషములకు గ స డ ద వ లు బహుళముగా నగు' అని చిన్నయసూరి బాలవ్యాకరణం చెపుతుంది. కాని గుంటూరు వాళ్ళు గ జ డ ద బ లు బహుళంగా వాడతారు.

ఉదా: 1. అమాస రేపు గద్దనంగా (కద్దు+అనంగా) వొచ్చాడు.

2. ఎట్ట జ్ఞావాలంట నీతో? తిత్తి దీస్తా.

3. చెప్పింది జ్ఞాల్లే, యిక తుమ్మల గుంట మీనగా కర్లపూడి బ్రోవాల.

ఇక్కడి శిష్టేతర వ్యవహారంలో అనుబంధ ప్రత్యయాలు ప్రత్యేకంగా కనపడతాయి. ఉదా: 1. నాలుగు దన్నే తలికి పందల్లే గీపెట్టాడు. 2. ఎంత కాడికి ఎండలే దప్ప మా తట్టు సినుకే లేదు. 3. ఈ వారం గడిసినాక నీ కాడ కొత్తా.

తాలవ్యీకరణ

మన వర్ణమాలలో చ, జ అక్షరాలు దంత్యాలని, తాలవ్యాలని రెండు రకాలు. దంత్యాలని ప్రత్యేకంగా ౨ (2) గుర్తుతో తెల్పుతాం.

ఉదా: చ చే జ జే.

దంత్య, తాలవ్యాల ఉచ్చారణ వేరుగా ఉంటుంది. గుంటూరు భాషలో త, ద లకు యకారం పరమైనప్పుడు తాలవ్యీకరణ జరుగుతుంది.

త, ద + య = చ, జ

ఉదా : 1. ఇది ముచ్చెం (ముత్యం) మూడోది. 2. ఈ మజ్జెన (మధ్యన) సచ్చున్నారాయన ఉజ్జోగం (ఉద్యోగం) ఊడిందంటగా? 3. మజ్జానమైంది (మధ్యాహ్నం) ఇంకా రాలా.

వర్ణ పరివర్తనం

చాలా మాటల్లో వర్ణ సమీకరణం (Assimilation) జరుగుతుంది. సామీప్యం వల్ల ఒక ధ్వని దాని పక్క ధ్వనిగా మారిపోవటమే వర్ణ సమీకరణం.

ఉదా: 1. అర్ధరేత్రి (అర్ధరాత్రి) దాకా యాడ పెత్తనాల కెల్లా? 2. వడ్డ (వడ్ల) గింజలో బియ్యం గింజ 3. సెనక్కాయలు (సెనగ+కాయలు) సెరుగ్గడ (చెరుకు+గడ) మల్లే తియ్యగా వుంటయ్యో యేంది?

కొన్ని మాటల్లో వర్ణ వ్యత్యయం జరుగుతుంది. అంటే అక్షరాలు అటు దిటు, ఇటు దటు తారుమారు కావటం. 'ప్రహ్లోదుడు' 'ప్రల్హాదుడు' కావటం లాంటిది. దీన్ని Metathesis అంటారు. ఉదా: 1. కాలికి రాయి తలిగింది. 2. పలక పలిగింది.

ఈ మాట్లో 'గ ల' అనే విధంగా మార్పు జరిగింది.

రెండు టకారాలు పక్కపక్కనే వచ్చినప్పుడుఅవి డకారంగా, తకారంగా మారటం కూడా కద్దు. ఉదా: కొడతం కొడతం (కొట్టటం కొట్టటం) వాడు బొయ్యి నాపరాయి మీన బడ్డాడు. అయినా వాడెవుర్నీ తిడతం లేదు.

ఇక్కడే మరో గమ్మత్తు ఏమిటంటే తక్షణం అనే అర్థంలో క్రియారూపాలు పునరుక్తి చెందుతాయి. 'కొడతం కొడతం' అంటే కొట్టగానే అని అర్థం. 'రాటం రాటం మీద బడ్డాడు' అన్నప్పుడూ అదే విధం. భూతకాల విషయం ప్రస్తావించేటప్పుడు విచిత్రంగా ఒక్కోసారి పుంలింగ ప్రత్యయానికి బదులు స్త్రీ లింగ ప్రత్యయం ఈ ప్రాంతంలో ఉపయోగిస్తారు. మాండలిక భాషావేత్తలు ఇప్పటి దాక ఈ విశేషాలు గుర్తించలా.

ఉదా: సుబ్బయ్య మావ శానా కలుపుగోలు మనిషి. ఎవురవపడ్డా నవ్వుతా పలకరిచ్చేది. యివరాలన్నీ అడిగేది.

'నిందయం దాద్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వ దీర్ఘంబులకు గిగీ లగు' అని బాలవ్యాకరణం సూత్రీకరించింది. ఉదా: రావణుడు గీవణుడు. అయితే నిందా సందర్భంలో ఈ ప్రాంతంలో వేరే అక్షరాలు కూడా వినిపిస్తాయి.

ఉదా: 1. మాకేవన్నా ఏసీలా బ్రోసీలా?

2. యివరం ద్రవరం లేకుండా మాట్టాడమాక.

పళ్ళు, కూరగాయల విషయంలో గుంటూరు ప్రాంతపు పలుకుబడి ఇట్లా ఉంటుంది.

ఉదా: 1. రాములక్కాయ (టొమాటో), 2. పొట్టకాయ (పొట్ల కాయ), 3. కొత్తిమీర (కొత్తిమెర), 4. యాప్లీస్ కాయ (యాపిల్), 5. అర్టికాయ (అరటికాయ).

ఏ సంస్కృతి అయినా స్థిరంగా ఉండదు. ఎల్లప్పుడూ మారుతుంటుంది. అందులో భాగమైన భాష కూడా ఎల్లకాలం కుదురుగా, నిలకడగా ఉండదు. ఆదాన ప్రదానాల వల్ల కొత్త మాటలు చేరతాయి. జన జీవనం వ్యాప్తి చెందే కొద్దీ, ఇతర ప్రాంతాలతో సంబంధాలు పెరిగే కొద్దీ, ప్రాంతీయ ప్రత్యేక పదజాలం వెనకాడి, సామాన్య పదజాలం పెరుగుతుంది. కనుక ప్రాంతాల మధ్య విభజన రేఖలు గీసినట్టు భిన్న మాండలికాల మధ్య కచ్చితమైన విడి గీత గియ్యలేం. గుంటూరు మాండలికానికి, కృష్ణ, ప్రకాశం జిల్లాల మాండలికానికి చాలా పోలికలుంటాయి. ఒక ప్రాంతపు మాండలికాన్ని పరిశీలించేటప్పుడు ఈ అతివ్యాప్తిని (ఒక పరిధి దాటి మరొక దానికి కూడా అన్వయించటం) కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన మరో మాతృమూర్తి



శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డి.ఎస్.పి., ఒంగోలు
పూర్వ విద్యార్థి

హాలిక కుటుంబం నుండి జె.కె.సి. కళాశాల లోకి స్వర్గీయ జాగర్లమూడి చంద్రమౌళి గారి ఆశీస్సులతో ప్రవేశం పొందాను. మట్టి బొమ్మనయిన నాకు జీవితపు విలువలు ఉగ్గుపాలు పట్టిన పూజ్య గురువులు కీర్తిశేషులు డా॥ అనంతం, డా॥ అమరేంద్ర గార్లు. సాహిత్య పరమాన్న రుచులను జున్నుపాలుగా తినిపించిన ప్రియ గురువులు పులిచెర్ల సాంబశివరావు, గొల్లపూడి ప్రకాశరావు, కుమారస్వామి గార్లు. నాలోని నాయకత్వ లక్షణాలను గుర్తించి, వక్తృత్వపు బాణీలను వరుసగా నేర్పిన గురువులు పి.యస్ గారు, మా అన్నయ్య కీర్తిశేషులు గుంటుపల్లి నాగేశ్వరరావు, నర్రా నాగేశ్వరరావు గార్లు. పోలీసు వృత్తిపై నాకు లక్ష్యాన్ని నిర్దేశించిన కీర్తిశేషులు, మేజర్ బెల్లంకొండ సుబ్బారావు గారు. కళాశాల విద్యార్థి సంఘ ప్రెసిడెంట్‌గా నాచే విభిన్నంగా పని చేయించిన పరమ ప్రియ గురువులు కీర్తిశేషులు ఈదర భాస్కరరావు గారు. పాటలో, నటనలో మెళుకువలు నేర్పిన కీర్తిశేషులు, నటచక్రవర్తి, హాస్యప్రియులు మారుపూడి కోటేశ్వరరావు గారు, సేవా కార్యక్రమాలు నేర్పిన గురువులు జంపని వేంకటరావు, శివరాంబాబు, రామదాసు గార్లు. నా క్రీడాసక్తికి పదును పెట్టిన గురువులు కృష్ణమూర్తి, రాఘవయ్య గార్లకి, కళాశాల కార్యాలయ మేనేజర్ మా పెద్దన్నయ్య గుంటుపల్లి సాంబశివరావు, కార్యాలయ సిబ్బంది వెంకటరావు, దండమూడి ఇంకా ఎందరో, మరెందరో, ఆ విద్యా కోవెలలో పూజారులుగా పనిచేసిన ఆ తల్లి సరస్వతి కటాక్షాన్ని నాకు పొందచేసిన అందరూ లబ్ద ప్రతిష్ములే. అందరినీ ఈ స్వర్ణోత్సవ శుభవేళ స్మరించుకుంటున్న నిత్య విద్యార్థి, జె.కె.సి. విద్యార్థి నని గర్వించే మీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డి.యస్.పి.

జ్ఞాన వృక్షం

శ్రీ బండ్ల మాధవరావు
పూర్వ విద్యార్థి

చెట్టుకు నమస్కరించాలి
ఏభై యేళ్ల కిందటి
ఓ మారుమూల నాటిన చెట్టు
విశ్వమంతా విస్తరించడం
కళ్లముందు కదలాడుతోంది
నాలో నాలుగు అక్షరాల్ని నింపిన చెట్టు
అక్కున చేర్చుకొని
నన్నో మనిషిని చేసిన చెట్టు
చిటారు కొమ్మల్ని
ఆకాశపు వీధిలో ఎగరేస్తూ
పండుగ చేసుకొంటోంది
ఆ చెట్టు కొమ్మలకు
నేను కట్టుకొన్న ఉయ్యాలలో
ఇప్పటికీ ఓలలాడుతూనే ఉన్నాను
అప్పుడెప్పుడో తాను రాల్చిన గింజలు
ఇంకా నాపొట్ట నింపుతూనే ఉన్నాయి
ఇప్పుడు నేనూ ఓ చెట్టునై
ఎన్నో కొన్ని గింజల్ని
నలుగురుకీ పంచుతూనే ఉన్నాను
చెట్టు ఓ జ్ఞాపకం
ఎప్పటివో
కొన్ని పరిమళ భరిత సుగంధాలు
ఇప్పటికీ తాజాగా
నాసికా రంధ్రాలలో తిష్ఠవేసుకొని
నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉన్నాయి
గాలికి కదిలే ఆకుల చప్పుళ్లు
నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి
బహుశ ఇప్పటి నేను
మరికొన్నాళ్ళకు చలన రహితం కావచ్చు
కానీ చెట్టు మాత్రం శాశ్వతం
ఎప్పటికీ ఎవరెవరో వచ్చి వాలుతూనే ఉంటారు
దాని ఫలాల్ని అందుకొంటూనే ఉంటారు

అకల్మష ప్రతిభా ధురీపరాయణులు – శ్రీ కుప్పుస్వామి గారు !

డా॥ యలవర్తి ప్రశాంతి
తెలుగు అధ్యాపకులు
ప్రాచీన భాషా విభాగం



కాలం అనంతం.. కాలచక్రంలో తేదీలు మారుతుంటాయి. ఆ తేదీలు నిజాల్ని నూరుతుంటాయి. జయంతులను జోకొడుతుంటాయి. వర్ధంతులను నిలబెడుతుంటాయి. ఎదిగే జీవితాలు కదిలే కాలానికి గుర్తులు. చిట్లే మట్టికి తెలుసు, తనలో ఇంకిన త్యాగ మూర్తుల కీర్తిపతాక ధ్వజాల నిజాలు. విత్తు చిట్లక పోతే మొక్క మొలవదు. తూర్పు చీలకపోతే పొద్దు పొడవదు. చేజారితే గాని తెలియదు క్షణం విలువ. అట్లే మనీషులను కాలం మాయం చేసినా వారి అకల్మష ప్రతిభాధురీపరాయణతలు అజరామరాలు. అటువంటి అకల్మష ప్రతిభా ధురీ పరాయణులు శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారు.

మానవుడు జ్ఞానంతో మాత్రమే జీవించడు. జ్ఞానానికి తోడు ఆనందం ఉంటేనే జీవితం సుఖమయం. ఆనందో పాసిలో ఆలోచనా శక్తి అధిక పరిమాణంలో ఉంటుంది. ప్రతి వ్యక్తి యొక్క జీవితం వారి మనసు యొక్క ప్రతిబింబం. ఈ మనో జీవితానికి సైన్సు – ఆర్టు రెండూ ఉండాలి. అద్వైతం ఒక సైన్సు. ద్వైతం ఒక ఆర్టు. ఆర్టులో దొరికే రసానందం సైన్సులో దొరకదు. సైన్సులోది కాంతి. ఆర్టులోది శాంతి. ఈ శాంతి కాంతి రెండూ సముపాళ్ళల్లో ఉంటే వాళ్ళు లోక కళ్యాణ కారకులు. అట్టి లోకకళ్యాణం కోసం జన్మించిన మహనీయులే కుప్పుస్వామి చౌదరి గారు.

మానవునికి సాంకేతికాభివృద్ధి ఎంత ముఖ్యమో సాంస్కృతికాభి వృద్ధీ అంతే అవసరం. మనిషికి భౌతికావసరాలతోపాటు సౌందర్యాను భూతీ కావాలి. దీనివల్ల ఆనందం, రసానుభూతి, హృదయాహ్లాదం కలిగి మనిషి సమతౌల్యంగా జీవిస్తాడు. సమతౌల్యత బుద్ధికి సంబంధించింది. సౌందర్యోపాసన హృదయానికి సంబంధిం చింది. బుద్ధి ఆలోచననిస్తే హృదయం అనుభూతినిస్తుంది. ఆలోచనతో శాస్త్రాలు పుడితే అనుభూతితో కళలు పుట్టాయి. మనిషికి ఆలోచన, అనుభూతి రెండూ ముఖ్యమైనవే. మేధో వికాసం, హృదయ స్పందన రెండూ ఉన్నప్పుడే జీవితం సమగ్రంగా ఉంటుంది. మేధోవికాసం కలిగిన కరుణామూర్తి శ్రీ కుప్పుస్వామి చౌదరి గారు.

పుడమి తల్లి అదృష్టం వల్ల, ప్రజలహితం కోసం, సాహిత్య పోషణ కోసం జన్మించిన పుణ్యమూర్తులు. వీరిలాగా దాతృత్వం, సాహిత్యాభిలాష మరొకరికుండదు. మహామనీషి. సత్యసంధులు. సద్గుణసముపేతులు. "లోకమున ఒక్కొక్కపనికై ఒక్కొక్కరు జన్మింతురు' అని దువ్వూరి వేంకట రమణ శాస్త్రి గారు పేర్కొన్నారు. "ఒక్కొక్క పనిలో ఒక్కొక్కరు రాణింతురు" అని చిన్నయసూరి గారన్నారు. ఈ రెండూ కుప్పుస్వామి చౌదరి గారి విషయంలో యదార్థాలు. వీరు మూర్తీభవించిన ధర్మగ్లాని.

అవి కాలం పరిపక్వం కాని రోజులు. సామాజిక చైతన్యం నిండిన మేధావులతో, విద్యాధికులతో, కవులతో, రచయితలతో, సంఘ సంస్కర్తలతో, దేశభక్తులతో వారిల్లు దర్బారులాగా విరాజిల్లుతుండేదట. తినేవారు తింటుంటే, వచ్చేవారు వస్తుంటే ఆ ఇంట పొయ్యికి విరామముండేది కాదట. ఏ వేళప్పుడు వచ్చినా ముందు భోజనం చేసి రమ్మని భోజనశాలకు పంపేవారట. బ్రాహ్మణులకు కూడా సత్రంలో భోజన వసతులను వారి ఆచారాలకు తగినట్లుగా ఏర్పరి చారట. లోతైన వారి వ్యక్తిత్వం సాగరమైతే – విశాలమైన వారి హృయం గగనం.

కుప్పుస్వామి చౌదరి గారి నాటి పరిస్థితుల్లో భారతీయుల అవస్థ అసహాయులు, అకర్మణ్యులుగా ఉండేది. నీ జాతి గొప్పది. నీ సంస్కృతి గొప్పది. నీకు ఉజ్జ్వలమైన చరిత్ర ఉంది. నీశక్తిని తెలుసుకో ! పారతంత్ర్యాన్ని పటాపంచలు చెయ్యి – అనే ఉత్తేజాన్ని అంతర్లీనంగా ప్రబోధించే శక్తి కావాలి. ఆ శక్తే కుప్పుస్వామి గారు.

ఐచ్ఛికంగానో, నిర్బంధంగానో అబ్బిన విదేశీయ ఆచార వ్యవ హార భాషా సాంప్రదాయాల పట్ల ఒక వ్యామోహం, స్వజాతి దూషణ – పరజాతి కీర్తన, ఆత్మవిశ్వాసం శూన్యం – నిత్య శంకితాలు వీటన్నింటినీ మించిన దారిద్ర్యం, కులద్వేషాలు, స్వార్థ పరత్వం ఆనాటి సమాజంలోని వ్యక్తులు ఆచరిస్తున్న తీరు. దీనినుండి విముక్తం కావాలి అని పెద్దలు సంకల్పించి జాతిని ఆ మార్గంలో

నడిపించడానికి కంకణం కట్టారు. అందులో అగ్రాగ్రేసరులు కుప్పుస్వామి చౌదరి గారు.

దేశభక్తి ఏ ఒక్కరి సొత్తూ కాదు. నిన్నటికన్నా ఇవ్వాళ ప్రగతి ఉజ్జ్వలం. సంఘంయొక్క వ్యవస్థలను చక్కగా అంచనా వేసి తనదైన బాణిలో ప్రజాహిత పనులను చక్కదిద్దేవారు. క్లిష్ట సమస్యలను పరిష్కరించటంలో దిట్టతనం చూపేవారు. జస్టిస్ పార్టీలో ఉన్నా ఆనాటి కాల మాన పరిస్థితులను అంచనా వేసి ఆయా సమస్యల పోరాటానికి నడుం బిగించిన వ్యక్తులకు తన మన భేదం లేకుండా సాయపడే వారు. అంతర్లీనంగా "స్వభాష – స్వదేశి – స్వజాతి – స్వతంత్రం" అనే నాలుగు అంశాల పట్ల ఆత్మోద్దీపన శక్తితో ఆనాటి జనబాహుళ్యపు పరమా శయాలను పునరుజ్జీవనం చేస్తుండేవారు. ఆనాటి ప్రజల పరాధీనత, నిరాధార స్థితులను అర్థం చేసుకొన్న సమదర్శి. అన్ని పార్టీల పెద్దలు, ఆనాటి రాజకీయ ప్రముఖులు వీరికి సముచిత గౌరవాన్ని ఇచ్చేవారు. వీరుకూడా నిగూఢ జాతీయ పరమాశయంతో దేశభక్తులకు చేయూత నందించారు. దానికి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, స్వామి సీతారాం మొదలైన దేశభక్తులే ఉదాహరణ.

గొప్ప వ్యక్తిత్వాన్ని తనకు తాను అంకితం చేసుకున్న వ్యక్తి పరిమితమైన కార్యక్షేత్రంలో ఒదిగి ఉండటం కష్టసాధ్యం. చదివినది తక్కువే ఐనా ప్రాచ్య విద్యా గరిమ, మంచి విద్వత్తు కలిగిన జ్ఞాన పుంజం. అంతర్లీన భాషా సేవకులు, సాహిత్య శోధకులు, జ్ఞాన పిపాసువులు, తెలుగు సాహిత్యం పట్ల ఎనలేని మక్కువ కలిగిన మహారాజ పోషకులు కుప్పుస్వామి చౌదరి గారు. నైర్మల్య చిత్తంతో సరస్వతీ కళామతల్లిని గారవించి రచనా సౌరభాలను అర్పించిన కవులను చేరదీసి పోషించారు కాబట్టే ఆ తల్లి కూడా త్రిపురనేని రామస్వామి చౌదరి గారి ద్వారా సామాజిక హితకరమైన నీతి శతకంలో 'కుప్పుస్వామి' అనే మకుటాన్నిచ్చి సాహితీ జగత్తులో శాశ్వత కీర్తి మకుట ధారునిగా అనుగ్రహించింది.

రచనా వ్యాసంగాలు, కవితా గరిమలను లిఖించని వ్యక్తి తెలుగు సాహిత్యంలో తనకాలంలో సమకాలీనులుగా ఉన్న కవులను ఆదరించి పోషించటం, వారిలో కొందరికి బతుకుదెరువును చూపించటం వారి సాహితీ ప్రియం భావుకతకే కాక దారిచూపే పెద్దరికానికే కలికితు రాయి. అదే ఒరవడిలో సంఘ సంస్కర్తలు, దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల పట్ల వారి కార్యదక్షత ముమ్మూర్తులా మూర్తీభవించిన సురభిల సౌగంధి కుసుమం. ఎదుటి వారు నోరు విప్పి అడగకుండానే వారి సమస్యలను గ్రహించి నేర్పుగా పరిష్కరించగలగటం వారి కుశాగ్రబుద్ధికి తార్కాణం. ఎంతటి జటిల సమస్య ఎదురైనా "తర్కం వదలకూడదు – వితర్కం చేయకూడదనే" సిద్ధాంతం వారి వన్నెవాసి.

మహాభారత, భాగవత పద్యాలు, ప్రబంధాల విరుపులు, మెరుపులు, పదవిన్యాస లాలిత్యాలు, కవుల చర్చల్లో ప్రౌఢ శబ్దాల అర్థవివరణల చాతుర్యాలు వారి సాహిత్య పిపాసకు నిదర్శనాలు. ఒక్కొక్కప్పుడు వారు స్రష్ట. ఇంకొకప్పుడు ద్రష్ట. దుష్ట సమాసాలు, దుస్సంధి పదాలను గూర్చి, వ్యాకరణ మీమాంసలు వారి చర్చల్లో దొర్లుతుంటాయి. నవ్య కవిత్వ మార్గాల్లోని సంకేతాల అభివ్యక్తిని, పదచిత్రాలను, కవితా నేపథ్యాలను సహృదయంతో అర్థం చేసుకోవాలనేది వారి విశ్లేషణ. ఆయా కాలాల్లో వచ్చిన తెలుగు సాహిత్య మార్పులను స్వాగతించాలనేది వారి దృక్పథం.

మనిషి ప్రధానంగా స్వరూప స్వభావాల కూడిక. స్వరూపం నచ్చితే స్వభావం నచ్చదు. స్వభావం నచ్చితే స్వరూపం నచ్చదు. రెండూ నచ్చితే వారు ధన్య జీవులే. అటువంటి ధన్యత వీరిది. వయస్సు శరీరానికే గాని మనస్సుకు కాదు. వీరి నవనవోన్మేషమైన పట్టుదల, ఉత్సాహం ఈనాటి వారికి మార్గదర్శకాలు. శైలీ నిర్మాణం, పాత్ర పోషణ విన్యాసాలను అర్థం చేసుకోవడంలో వారికి వారే పధికులు. వీరికి సాహిత్య అధ్యయనంతో పాటు సహృదయత, విశాల దృక్పథం కూడా ఉంది. వీరి దృష్టిలో విమర్శ అంటే మెచ్చుకోలూ కాదు. ఎత్తిపొడుపూ కాదు. మనల్ని మనల్నిగా చూపెడుతుందనేది వారి ఆలోచన. సాలోచన.

వీరు తనను గూర్చి పొగిడే వాళ్ళకంటే విమర్శించే వాళ్ళనే ఎక్కువగా పిలిచి మాట్లాడేవారట. వ్యంగ్యాన్ని విమర్శను మెచ్చుకొనే స్వభావం. దానిని ఆనందంగా స్వీకరించటం వీరి నైజం. విమర్శను సవ్యంగా గ్రహించాలంటే అది అందరికీ అబ్బదు. దీనికెంతో నిబ్బరం ఉండాలి. ఇక్కడ కబీర్ పేర్కొన్న దోహా ఒకటి గుర్తుకు వస్తుంది.

"నిందక నియరే రాఖీఏ ఆంగన కుటీ సమాయ్
బిన పానీ సాబున బినా నిర్మలకరై సుహాయ్" ॥

నిందించే వాడి ముంగిట్లో గుడిసె వేసి పెట్టుకో. సబ్బు, నీళ్ళు లేకుండా నీ స్వభావాన్ని కడిగేస్తాడని పై దోహాకర్థం. అట్లే వీరుకూడా అపవాదు, విమర్శను సవ్యంగా గ్రహించి వెంటనే వారిని అభినందించే వారట.

ఆనాడు చెన్నపట్నం తెలుగువాళ్ళకు తీర్థ స్థలం. గూడవల్లి రామబ్రహ్మం గారి నుండి, కొసరాజు రాఘవయ్య చౌదరి, సముద్రాల రాఘవాచార్యులు మొదలైన వారందరినీ మద్రాసు సినిమా రంగానికి పంపించి పరోక్షంగా ఆ రంగం అభివృద్ధికి కూడా సుప్రతిష్ఠ

కారకులు. వీరందరినీ పంపించటమే కాక వారి వారి పనుల్లో వారు నిల దొక్కుకునే వరకు చేయూత సహకారాలనందించిన మనస్వి. వీరు సముద్రాల గారిని ఆనాడు పంపకపోతే ఘంటసాల వంటి గాయకులు మన తెలుగు వారికి అంది ఉండరేమో! ప్రత్యక్షంగానే కాదు పరోక్షంగా ఎన్నో... మరెన్నో.. విజ్ఞాన ధీధితులను వెలార్చారో ఆ పైవాడికే తెలియాలి. బహుశా వారి సిద్ధాంతం – చూపు మగత కాకూడదనేమో ! "అందరూ ఊపిరి పీలుస్తారు – కొందరే జీవిస్తారు" వారిలో శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారొకరు.

కొసరాజు రాఘవయ్య చౌదరి గారి జానపద కవితా హృయాన్ని, నిసర్గ సుందరమైన వారి కవితా వస్తువును, భాషను బాగా మెచ్చుకొనేవారట. కంటి రెప్పకు ఏమాత్రం ఒత్తిడి తగిలినా వెంటనే చెమరిస్తుంది. అలాగే జానపద కవిత్వం కంటిరెప్పవంటిది. గ్రామీణులు వారి అనుభూతులను పరమార్ధంగా, అప్రయత్నంగా, సహజంగా వ్యక్తీకరించగలరు కాబట్టే జానపదాల్లో ప్రత్యేక శోభ కనబడుతుందనేది వారి భావన కావచ్చేమో ! అందుకే ఒరే ! రాఘవయ్యా ! నీలల్లాయి పదాలు బాగున్నాయిరా ! అని అనేవారట. స్వయంకృషితో ఎదిగేవారన్నా, శ్రమించేతత్వం కలవారన్నా వారు ఇష్టపడి ప్రోత్సహించే వారట.

కుప్పుస్వామి చౌదరి గారి పూర్వీకులు కూడా సాహిత్యాభి మానం కలవారే. వీరి తాతగారు చౌదరి గారు తమ గ్రామంలో వెలసిన మాధవస్వామిపై శతకం చెప్పమని తమ ఆస్థానకవియైన కారెంపూడి రాజమన్నారు కవిని కోరారుట. ఈ కవి 19వ శతాబ్ది అంతం, 20వ శతాబ్ది పూర్వంలో గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, వెంకటగిరి, విజయనగరం, పిఠాపురం, నూజివీడు మొదలైన రాజా స్థానాలను సందర్శించి మహీపతులను మెప్పించటమే కాక పలు ప్రాంతాల్లో శతావధానాలు చేసిన ప్రజ్ఞాశాలి.

శంకరగౌడు మైసూరు రాష్ట్రానికి చెందిన వారు. గొప్ప అర్థశాస్త్ర పండితుడు. గుంటూరులోని ఆర్థిక సమస్యలపై పరిశోధన చేసి ఆంగ్లంలో పెద్ద గ్రంథం రాశారు. దీని ప్రచురణకు కుప్పుస్వామి గారే సహాయం చేశారు. వీరిచేత 'గుంటూరు మండల చరిత్ర' అనే గొప్ప గ్రంథాన్ని ఇంగ్లీషులో రాయించి ప్రకటించారు. ఎన్నో గ్రంథాల ముద్రణలకు గుప్తదానాలు చేసిన ఎముకలేని మహాదాత వారు.


కారంచేడు వాస్తవ్యులైన ధర్మవరం సీతారామాంజనేయులు గారు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రాసిన "ఝాన్సీలక్ష్మీ బాయి" అను కావ్యాన్ని తండ్రి గారిపేర కృతిని స్వీకరించి ఆ సభను కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేశారట. ఆంధ్రదేశంలో ప్రసిద్ధికెక్కిన విశ్వనాథ సత్యనారాయణ, కాటూరి వెంకటేశ్వరరావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, పిలకా గణపతి శాస్త్రి మొదలైన వారు ఆ సభకు విచ్చేశారట. ఆ సభకు అధ్యక్షులు కుప్పుస్వామి చౌదరిగారేనట. తరువాత వారు కవుల నందరినీ పిలిచి పరామర్శించి అర్ధనూట పదహార్లు గల కవర్లను ప్రతి ఒక్కరికీ అందించి వారి రాక వల్ల తన గ్రామం పావనమైందన్నారట. గుఱ్ఱం జాషువా, తుమ్మల, ఏటుకూరి, శ్రీపాద, రాయప్రోలు, కాటూరి, పింగళి మొదలైన వారి సాహితీ గరిమా పటిమను శ్లాఘించేవారట.

వీరు అవ్వడానికి రాజకీయ నాయకులే ఐనా రాజకీయాలకు అవసరమైన మందవేసే శక్తి లేదు. కుప్పుస్వామి గారు ఎవరితో ఏమి మాట్లాడినా అందులో సామాజాభివృద్ధి ముఖ్యంగా, సాహిత్యం గౌణంగా ఉంటుంది. ఆనాటి కవులకు వారొక పెద్ద ఆశ్రయం.

మహనీయుల తీరేవేరు. తెలివి తేటదీరిన, బుద్ధి పదును దేరిన, జ్ఞాపకశక్తి గడితేరిన ఏక సంధాగ్రాహులు. క్రియాదక్షులు. వీరి జీవితం స్వార్థరహితం. పరార్థపూరితం. స్నేహశీలురు. స్నేహ పాత్రులు. హృదయం రసప్లావితం. కొందరు గొప్పవారుగా పుడతారు. కొందరు గొప్పతనం సాధిస్తారు. ఏ పూవు తను వెదజల్లే సువాసనల వలన వచ్చే కీర్తిని చాటుకోదు. సూర్యుడు వెలుగును, చంద్రుడు వెన్నెలను లోకమంతా పంచుతారు. చెట్లు నీడను, ఫలాలను ఆశ్రయించిన వారికి అందిస్తాయి. ఐనా నిరాడంబరంగానే వాటి పని అవే చేసుకొని పోతాయి తప్ప ఎక్కడా తమ గొప్పతనాన్ని చాటుకోవు. అటువంటి గొప్పతనం కలవారే మన కుప్పుస్వామి చౌదరి గారు. రాజకీయార్థిక సాంఘిక వ్యవస్థల్లో వచ్చిన మార్పులను ప్రతిభావంతంగా మలిచి అందరికీ పెద్దదిక్కై ఆదర్శనీయులైన నిరాడంబరశీలి! లోపాలను పరిహరించాలి. ఆక్షేపణలను సంయమనం వహించి సరిదిద్దు కోవాలనేది వారి నడత, శైలి.

కుప్పుస్వామి చౌదరి గారి జీవిత చరిత్ర ప్రూఫులు దిద్దుతుంటే వారికి సాహిత్యం పట్ల గల రసజ్ఞత, అభిజ్ఞత, సాహితీశేముషిత్వం తెలిసింది. వీరు ఎంతమంది కవులకు ఆశ్రయం కల్పించారు, వీరిని కలిసిన ప్రసిద్ధ కవులు ఎవరనే అంశం మీద దృష్టి పెట్టి వెలికి తీస్తే కొంతమంది కవులను దేశభక్తులను గుర్తించటం జరిగింది. గుంటూరు మండల చరిత్రని, 20వ శతాబ్ది తెలుగు వెలుగులు గ్రంథాన్ని, సంస్థానాలకు, ఇతర అంశాలకు సంబంధించిన మరికొన్ని గ్రంథాలను పరిశీలించి వారివారి చిత్రాలను సేకరించాం. కొందరి చిత్రాలు లభించలేదు. విద్యార్థుల సాయంతో ఈ చిత్రానికి రూపకల్పన చేశాం.

జాగర్లమూడి కుప్పస్వామి చౌదరి గారు అభిమానించి, ఆదరించిన తెలుగుకవులు, దేశభక్తులు



రాయప్రోలు సుబ్బారావు : కుప్పస్వామి గారికి బాల్యమిత్రులు, ఆంధ్ర సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ఠులు, జాతీయ నైతికులు. 'ఏదేశమేగినా... ఎందుకాలిడినా' అనే గేయం ద్వారా అందరికీ సుపరిచితులు. కుప్పస్వామిగారి సాహిత్య పేపాసకు ముఖ్యకారకులు.



కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి : కుప్పస్వామి గారికి చాలా సన్నిహిత మిత్రులు. హేతువాది. సాంఘిక న్యాయ సాధన కోసం, మానవతా విలువలకోసం జీవితాంతం కృషి చేశారు. తిరుగులేని తమ మైత్రికి చిహ్నంగా హితోక్తులతో నూటొక్క స్పష్టంగా మానవీయతల హేతువునకు దిశానిర్దేశం చేస్తూ తేట తెలుగు మాటలతో 'కుప్పస్వామి' శతకాన్నిరాసిన భావ విష్ణవవాది.




కొప్పరపు సోదర కవులు : వీరు స్వయానా అన్నదమ్ములు. ఆశుకవిత్వంలో దిట్టలు. అవధాన విద్యలో ఆరితేరినవారు. సుప్రసిద్ధ జంటకవులు. కారంచేడు వెళ్ళి కుప్పస్వామిగారిని తరచూ దర్శించి సహాయం పొందేవారట. వీరు చౌదరిగారిపై చెప్పిన శతాధిక పద్య సంచయం అలభ్యం. జాగర్లమూడి వారి వంశ చరిత్రను రాసి ఆ వంశానికి తాము ఆస్థాన కవులమని చెప్పుకున్నారు.



సముద్రాల రాఘవాచార్య : రేపల్లెలో వీరి పద్యాలను విని కుప్పస్వామిగారు ఎంతో అభినందించారు. వారి పరిస్థితులను గ్రహించి కొంతకాలం పోషించారు. సినిమాలలో చేరడానికి ప్రోత్సహించి మద్రాసు పంపించారు. తరువాత 'సముద్రాల' సినిమా కవిగా ప్రసిద్ధిపొంది ఖ్యాతిని గడించారు.



కొసరాజు రాఘవయ్య చౌదరి : వాడుక భాషలోని హొయలు, సొగసులు సంతరించుకొన్న జానపదగేయకవి కొసరాజు. కుప్పస్వామి గారే వీరిని కూడా మద్రాసు పంపి ప్రోత్సహించారు. వీరికి ఎంతో ఇష్టులు. తన సాహిత్యంతో చౌదరిగారిని అలరిస్తూ.... ఆనందింపజేస్తూ ఉండటమే కాక "గొప్పగుణముల ఆసామి కుప్పస్వామి" అని కీర్తించారు. తానూ సినిమాకవి 'కొసరాజు'గా ప్రసిద్ధికెక్కారు.



గూడవల్లి రామబ్రహ్మం : సహృదయులు, స్నేహశీలి. వీరు ఆర్థికంగా దెబ్బ తిన్నప్పుడు కుటుంబం మొత్తానికి తమమేడపై నివాసాన్ని కల్పించటమేగాక మద్రాసు పంపి "సమదర్శిని, ప్రజామిత్ర"లకు సంపాదకులుగా నియమింప చేశారు కుప్పస్వామి గారు. వీరు ఎదగడానికి అడుగడుగునా సాయపడ్డారు. చివరకు గూడవల్లి రామబ్రహ్మం సినీకవిగా అశేషమైన కీర్తి ప్రతిష్ఠలను సంపాదించారు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు : వీరు కుప్పస్వామి చౌదరి గారికి పరమ ఆప్తులు. వీరిరచనల పట్ల అమితమైన మక్కువ. వీరిని అనేక పర్యాయాలు ప్రశంసిస్తూ భూరి సన్మానం చేసేవారట.





దుగ్గిరాల గోపాలకృష్ణయ్య : "ఆంధ్రరత్న" దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారంటే కుప్పస్వామి గారికిచాలా ఇష్టమట. ఆంధ్రరత్న లేకపోతే చేరాల-పేరాల ఉద్యమం లేదు. వీరిద్దరిలో విడదీయరాని సమవాయ సంబంధం. వారికి ఎన్నివేల రూపాయిలిచ్చారో వారిద్దరికే తెలియాలి. ఆంధ్రరత్న చివరరోజుల వరకు ప్రతినెలా కొంతపైకం 200 రూపాయిలకు తక్కువ కాకుండా ఇచ్చేవారట. వారికి కొందంత అండగా ఉన్నారు.



స్వామి సీతారాం (గొల్లపూడి సీతారామశాస్త్రి) : వీరు స్వాతంత్రోద్యమంలో పాల్గొని సర్వస్వంగా పరిత్యాగం చేసి స్వామీ సీతారాంగా ప్రసిద్ధి చెందారు. పూర్వాశ్రమంలో వీరి నామధేయం గొల్లపూడి సీతారామశాస్త్రి గారు. ప్రజాసేవే పరమావధిగా తలచిన త్యాగమూర్తి గాంధీజీ సిద్ధాంతాల ప్రచారం కోసం ఆశ్రమాన్ని స్థాపించదలచి స్థలంకోసం కుప్పస్వామి గారిని అర్థించారు. కోరిందే తడవుగా చౌదరిగారు సుమారు 33 ఎకరాలను 99 సంవత్సరాలు నామమాత్రపు కౌలుమీద రాసిచ్చి అనంతరం దానపట్టా రాసిచ్చారట. ఈ పనిచేసినందుకు బ్రిటీష్ ప్రభుత్వం సంజాయిషీ అడిగేత కుప్పస్వామిగారు ఏమాత్రం సరుకు చేయలేదు. ఇప్పటిది ప్రభుత్వ సంస్థగా, కాపూరి వినయాశ్రమంగా గణుతికెక్కినది.



జననం
15-8-1892

మరణం
24-12-1960



గుఱ్ఱం జాషువా : నవయుగకవి చక్రవర్తిగా పేరుగాంచిన వీరి పద్యాలను విని చౌదరిగారు ఆనందించేవారు. వారి ప్రతిభను మెచ్చుకొని భాషాప్రవీణ కాకపోయినా తెలుగు పండితులుగా పనిచేయడానికి ఎగ్జామ్షన్ రాయించి తొలిసారిగా బాపట్లలో ఉద్యోగం ఇప్పించారు. జాషువా గారంటే ప్రత్యేకమైన అభిమానం. ఎన్నోసార్లు వీరిని ఆదరించి సాయం చేస్తూండేవారు. అందుకే జాషువాగారు కూడా "ఆంధ్రమాతా ఎవరమ్మ నీకొరుకున్న దరహాసమున చూపదగినవాని; దాతలలోన నుత్తమ దీతడను వాదమునకాది పదవి గైకొనిన వాని"గా కుప్పస్వామి గారిని కీర్తించారు.



ఏటుకూరి వెంకట సరసయ్య : వీరు పలనాటి నుడులను, జాతీయాలను రంగరించి పలనాటి భారతాన్ని తేనె లొలికే మధురిమతో రచించినవిట్ట. "కవిబ్రహ్మ"గా కీర్తి గడించిన వీరు తరచుగా కుప్పస్వామి గారిని కలిసి తమ కవిత్వాన్ని వినిపించి సాయంపొందేవారట. వీరి కవిత్వంలోని గ్రామీణ వాతావరణం చౌదరిగారిని ఎంతో ముగ్ధుణ్ణి చేసేదట. వీరు తమ కృతి "ప్రేమాలోకము"ను కుప్పస్వామి గారికి అంకితమిస్తూ "ఓదమన్నీలు జాగర్లమూడి దొరలు - అందు కుప్పయ్య చల్లని చందమామ" అని ప్రశంసించారట.



తెనుగులెంక తుమ్మల సీతారామ్మూర్తి చౌదరి : వీరు యువకవిగా ఉన్నప్పుడే వీరిశక్తి సామర్థ్యాలను కుప్పస్వామి గారు గమనించి జిల్లాబోర్డు ఉన్నత పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయ పదవినిచ్చి ప్రోత్సహించారు. వీరి పద్యాలంటే చౌదరి గారికి చాలా ఇష్టం. అభినవ తిక్కనగా, బాపుజీ ఆస్థానకవిగా పేరుగాంచిన తుమ్మలవారు కుప్పస్వామి గారిని "మాపుణాపులేని రాణదెచ్చిన కర్షక ప్రభుని నిన్ను జెప్పి యెరుఁ జెప్పవలె గదా కుప్పస్వామి" అని కీర్తించారు.



మాగంటి బాపినీడు : వీరు కుప్పస్వామి గారికి మిత్రులు. చేతికి ఎముకలేని మహాదాత కుప్పస్వామి గారు బాపినీడుగారిని "మహాజ్ఞ మహిన్ మద్రాస్" అనే గ్రంథం రాయడానికి ప్రోత్సహించి తనదైన సాయమందించారు.





పింగళి, కాటూరి కవులు : కుప్పస్వామి గారు కాటూరి, పింగళి కవులంటే తన్మయ లయ్యేవారు. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావులు జంటకవులుగా కూడా ప్రసిద్ధులు. వీరి 'పకాంతసేక' రచన అద్వితీయం. ఇందులో 'పింగళి'వారు కుప్పస్వామి గారికి బాల్యమిత్రులు. వీరిని అభిమానించి, ఆదరించి ప్రోత్సహించారు.



పండిత కొత్త సత్యనారాయణ చౌదరి : తెలుగు, సంస్కృత పండితులకు పులిటి గడ్డయిన గుంటూరు జిల్లా అమృతలూరు గ్రామంలో జన్మించి పురాణ వాఙ్మయాన్ని శోధించి కపిపురాణ రచన చేశారు వీరు. వీరిని కుప్పస్వామిగారు జిల్లాబోర్డులో ఆంధ్రోపాధ్యాయులుగా నియమించి అనేక తీరుల ప్రోత్సహించారు. వీరు మనుధర్మశాస్త్రాన్ని తెనిగించి కుప్పస్వామి గారికి అంకితమిస్తూ... "కులపతి యుదారుఁడనఘుఁడౌ కుప్పస్వామి కీర్తి నీ కృతి గౌరవాయత్త చిత్తమునకు మామక ఋణ విమోచనము కొరకు" అని వారిని "కులపతి"గా గౌరవించి కొనియాడారు.



ఉన్నవ లక్ష్మీనారాయణ : జాతీయోద్యమంలో భాగమే మహిళాభ్యుదయం, 'శారదానికేతనం' అను పేరుతో 1922లో సంస్థను ఉన్నవ దంపతులు స్థాపించారు. కుప్పస్వామి గారికి ఉన్నవ గారంటే ఎంతో అభిమానం. వీరు సంస్థకు పదాదికి పుట్టి ధాన్యం (13 బస్తాలు) ఉచితంగా ఇచ్చేవారు. పెదవ దీన్ని రద్దుచేసి సంస్థకు ట్రాడీటల 2/14లో ఉన్న వితాలమైన స్థలాన్ని, సంస్థ నిర్వహణార్థం బిఏనీమలోని '45 ఎకరాల' భూమిని శాశ్వతంగా దానపట్టా రాసిచ్చారు. వీరిచ్చిన భూలి వినాకంతో ఈ సంస్థ నేడు గుంటూరు వడిబొద్దున ఉండి. మహిళా ప్రగతికి ఎంతగానో దోహదపడుతున్నది.



కొత్త భాపయ్యచౌదరి : రైతుగా జీవిస్తూ కమ్మవంశ చరిత్రపై అపూర్వమైన పరిశోధన చేసిన వీరంటే కుప్పస్వామి గారికి ఎనలేని అభిమానం. గ్రామ పంచాయితీ అధ్యక్షులుగా ఉన్న వీరికి జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఉన్న కుప్పస్వామి గారు ప్రతి విషయంలోనూ వెన్నంటి ఉండేవారట. 'కమ్మవారి చరిత్ర' ప్రచురణకు వీరికి ఆర్థిక సహాయాన్ని అందించారట.

జె.కె.సి. కళాశాల ఆవిర్భావం

శ్రీ నామినేని కోటేశ్వరరావు
విశ్రాంత అధ్యాపకులు, జంతుశాస్త్ర విభాగం



వివేకవంతులు తాము చేసే మంచి పనుల కోసం పరిణామం ఏమిటని ఆలోచిస్తారు. జరుగరానిది జరుగదు. జరుగ వలసినది కొన్ని సందర్భాల్లో ప్రయత్నం లేకుండా కూడా జరిగితీరుతుంది. అది 1965వ సంవత్సరం. ఆంధ్ర క్రిష్టియన్ కళాశాలలో ఇంగ్లీషు డిపార్టుమెంట్‌లో యలవర్తి రోసయ్య గారు, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో డా॥ జె.వి., గద్దె మంగయ్యలు, మేథ్స్ డిపార్టుమెంట్‌లో బసవేశ్వరరావు, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నం వెంకట సుబ్బయ్య గారు, జువాలజీలో నేను, బోటనీలో ఆవుల శ్రీకృష్ణ గారు ఉద్యోగం చేస్తున్నాం. మేమంతా ఒకే కులానికి (కమ్మ) చెందిన వాళ్ళం. ఆ సమయంలోనే బ్రాడీపేట 4/1లో 'పూర్ణా ట్యుటోరియల్ కళాశాలని గింజుపల్లి పూర్ణచంద్రరావు, బ్రాడీపేట 7వ లైన్లో "జయంతి ట్యుటోరియల్" కళాశాలని యెండ్లూరి వెంకట్రావు నడిపేవాళ్ళు. బెల్లం సుబ్బారావు గారు మాత్రం "రవి ట్యుటోరియల్" కళాశాల్లో మేథ్స్ చెప్పేవాళ్ళు.

రోజూ సాయంత్రం వేళప్పుడు మేమంతా గుడిపూడి జంగాల వలె ఒకచోట చేరిపోయేవాళ్ళం. గుంటూరు సమాజంలో మారుతున్న పరిస్థితులను గూర్చి చర్చించుకొనే వాళ్ళం. ఆ చర్చల్లో మమ్మల్ని బాగా కదిలించే, ప్రేరేపించే విషయం – గుంటూరులో మన కమ్మవారి ఆధ్వర్యంలో ఒకకళాశాలను స్థాపించాలనే దృఢ సంకల్పం. వయస్సులో మా కంటే పెద్దవారైన శ్రీ కూరపాటి వీరయ్య గారు కూడా మా చర్చల్లో పాల్గొనేవారు. వారే ఒకరోజు నన్ను ఏ.యస్. కృష్ణని, వెంకట సుబ్బయ్య, సుబ్బారావు, వెంకట్రావు, పూర్ణ చంద్రరావులను వెంటపెట్టుకొని స్వర్గీయ శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారింటికి తీసుకొని వెళ్ళి – గుంటూరు సమాజంలో మన కమ్మవారికి కూడా ఒక కళాశాలుం డాలనే సదుద్దేశాన్ని వీళ్ళు కలిగి ఉన్నారు. వాళ్ళ వంతు సాయం వాళ్ళు చేస్తారట. అందుకని అందరికీ పెద్ద దిక్కైన మీ వద్దకు వీళ్ళని తీసుకొచ్చానని చెప్పి పరిచయం చేశారు.

పెద్దాయన చాలా ఆత్మీయంగా – ఒరేయ్ అబ్బాయిలు మీ ఆలోచన మంచిదే. ఇంతకు మునుపే మనలో కొందరికి ఈ ఆలోచన వచ్చింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. మీరే పూనుకొని ఇతర కుల పెద్దలను కూడా కలసి తలపెట్టిన ప్రయత్నాన్ని కార్యరూపం దాల్చేటట్లుగా కొన్ని సలహాలను, సూచనలనిచ్చి సాదరంగా పంపించారు. వారి సూచనల మేరకు సంఘంలో పెద్దవారు, సమాజ హితులు, కుల పెద్దలైన శ్రీమాన్ వై.కె.యస్. ప్రకాశరావు, శ్రీ గోగినేని కనకయ్య, శ్రీ చేబ్రోలు హనుమయ్య, శ్రీ అన్నె సంజీవయ్య, శ్రీ పోసాని భాస్కరరావు, డా॥ కాసరనేని సదాశివరావు, శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య, శ్రీ దరువూరి వీరయ్య, శ్రీనన్నపనేని వీరయ్య చౌదరి గార్లను మేమంతా కలసి మా అభిప్రాయాలను వెలిబుచ్చాం. ఇప్పుడు వీరందరూ స్వర్గీయులే. వీరందరూకూడా చాలా ఉత్సాహంగా మమ్మల్ని ప్రోత్సహించి ముందుకు కదిలేటట్లు చేశారు. దీనిలో భాగంగా ఈ ప్రేరణతో మేము డా॥ మద్దినేని గోపాలకృష్ణ, డా॥ ముద్దన హనుమంతరావు, డా॥ కొండబోలు బసవపున్నయ్య, పెద్ది ఆంజనేయ ప్రసాద్ గార్లతో పాటు మరికొంతమంది పెద్దలను కలసి 1967 నవంబరు 14న అరండ్‌పేటలోని కమ్మ హాస్టల్లో మొట్టమొదటి సారిగా సమావేశమయ్యాం. ఆ సమావేశంలో ఏకాభిప్రాయాలతో తప్పకుండా ఈ కార్యం రూపుదాల్చేటట్లుగా చేద్దామని పట్టుదలగా తీర్మానించారు.

అనంతరం తదుపరి సమావేశం 1968 జనవరి 12వ తారీఖున హరిహరమహల్లో జరిగింది. ఇది ఒక చారిత్రక ఘట్టం. ఎందుకంటే అదేరోజున "నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ" ఆవిర్భవించింది. దీనికి శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారు ప్రెసిడెంట్ గాను, శ్రీ గోగినేని కనకయ్య, శ్రీ చేబ్రోలు హనుమయ్య గార్లు వైస్ ప్రెసిడెంట్లుగాను, డా॥ సదాశివరావు గారు సెక్రటరీగా, శ్రీ వై.కె.యస్. ప్రకాశరావు గారు ట్రెజరర్‌గా, శ్రీనన్నపనేని వీరయ్య చౌదరి గారు జాయింట్ సెక్రటరీగా కమిటీ ఏర్పడింది. ఈ

చారిత్రాత్మకమైన మీటింగులోనే గుంటూరు జిల్లా విద్యాపరంగానూ, విశాల సమాజహితం కోసం పనిచేసి అనేక ప్రజాహిత కార్యక్రమాలకు వన్నె తెచ్చి సేవ చేసిన "శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి" గారి పేరుతో కళాశాలను స్థాపించాలనే నిర్ణయాన్ని అందరూ సంతోషంగా, సాదరంగా అంగీకరించి పెద్దలంతా తమ వంతు విరాళాలను ప్రకటించి ఏకగ్రీవంగా ఒకేతాటిపై నిలబడ్డారు.

శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ వారికి ఒక గదిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వారి అనుమతులు తదితర పనులకోసం ఆఫీసు గది ఉండటం ఎంతో అవసరం. ఈ ఆఫీసు రోజువారీ నిర్వహణ కోసం గుంటుపల్లి సాంబశివరావు గుమస్తాగానూ, ఉల్లంగుల ఆదినారాయణ అటెండర్ గాను నియమింపబడ్డారు. ఈ ఆఫీసు నన్నపనేని వీరయ్య చౌదరి గారి పర్యవేక్షణలో ఉండేది. ఇక తరువాతి అంశం స్థల సేకరణ. మేము వీరయ్య చౌదరి గారిని తరచుగా కలవటం, వారి సూచనలతో గుంటూరు పరిసర ప్రాంతాల్లో సైకిళ్ళపై స్థలాన్వేషణకు దొరికే వరకు తిరగటం ఇదే మా పని. దీనిలో భాగంగా ఆనాడు జొన్నచేల మధ్యలో ఉన్న రింగురోడ్డులో పాములపాటి కృష్ణయ్య గారి సెంటర్‌కి ఉత్తరంగా ఒంటెద్దు సాంబిరెడ్డి గారిని విచారించగా అది మొదట రబ్బరు ఫ్యాక్టరీ అని తరువాత గోల్డెన్ కంపెనీ వారి టుబాకో గోడౌను అనీ ప్రస్తుతం ఖాళీగానే ఉన్నదనీ దాని యజమాని చంద్రమౌళి నగర్ 1వ లైన్లో ఉన్న రాము గారిదని చెప్పారు. గుజ్జనగుండ్లకు చెందిన సైదా, మీరా అనే వ్యక్తులు ఆ గోడౌను కాపలాదారులుగా ఉన్నారు. ఈ విషయాన్ని వీరయ్య చౌదరి గారి దృష్టికి తీసుకొని వెళ్ళగా వారు మాకు 5 అడుగుల టేప్ ఇచ్చి ఆ గోడౌను కొలతలను తీసుకొని రమ్మని చెప్పారు. 1968 మే నెల్లో జిల్లేడు చెట్లపై ఉన్న పసిరకపాములను చంపుకొంటూ కొలతలు తీసుకుంటూ, గులాబీతోటలో నివసించే సాంబిరెడ్డి గారి నడిగి దాహం తీర్చు కుంటూ మా పనిని సఫలీకృతం చేశాం. అప్పుడు అక్కడ సాంబిరెడ్డి గారి ఇల్లు తప్ప ఏ నిర్మాణాలూ లేవు.

"నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ" కమిటీ సభ్యులు తరచుగా కలుసుకోవటం, పనులు ఎంతవరకు వేగిరమయ్యాయో కనుక్కొని సలహాలు ఇవ్వటం చకచకా సాగిపోతుంది. ఈ పనుల గురించి వీరయ్య చౌదరి గారిని, డా॥ సదాశివరావు గారిని ఎక్కువగా కలుస్తూ ఉండేవాళ్ళం. 1968లో జూన్ నాటికి కళాశాలకు సంబంధించిన దరఖాస్తులను (అప్లికేషన్లు) అమ్మటం, స్థలంలో జరిగే నిర్మాణాల్లో మార్పులను సరిచేస్తూ సలహాల కోసం సదాశివరావు గారిని ఎక్కువగా కలిసేవాళ్ళం. దీనితో మాకు వారితో భక్తితో కూడిన చనువు ఏర్పడింది. వీరయ్య చౌదరి గారి సూచన మేరకు Govt. service లో retire ఐన చతుర్వేది కోటయ్య, హరిపుణ్యకోటిలను ఆఫీసులో గుమస్తాలుగా నియమించారు.

కళాశాల స్థాపనానంతరం డా॥ సదాశివరావు గారు మమ్మల్ని పిలిచి అబ్బాయిలూ ! ఉద్యోగం విషయంలో మీ ఆలోచనలేమిటి? అని అడిగారు. ఆవుల శ్రీకృష్ణ, బెల్లం సుబ్బారావు గార్లు వెంటనే స్పందించి ఒప్పుకున్నారు. వారికి ఉద్యోగం అవసరం కూడాను. నేను, వెంకట సుబ్బయ్య ఎ.సి. కళాశాల్లో ఎయిడెడ్ ఉద్యోగంలో ఉన్నా మేమిద్దరం కూడా సరే అన్నాం. వెంకట్రావు, పూర్ణచంద్రరావు ఒకే సబ్జెక్టు (ఎకనామిక్స్) కాబట్టి వారిని సదాశివరావు గారు ఒకరు కాలేజికి రండి. ఒకరు ట్యుటోరియల్ కాలేజీని నడుపుకోండని సలహా నిచ్చారు. దీనిప్రకారం జె.కె.సి. కళాశాల్లో నేను జువాలజీ డిపార్టు మెంట్‌లోనూ, బెల్లం సుబ్బారావు మేథ్స్ డిపార్టుమెంట్‌లోను, వెంకట్రావు ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లోను 1968 జులై / ఆగష్టు నెలల్లో చేరాం.

యాజమాన్యం వారు కళాశాల భవిష్యత్తు దృష్ట్యా అనేకమందిని పరిశీలించిన పిదప ఆనాడు ఆంధ్ర యూనివర్శిటీ ప్రెస్ డైరెక్టరుగా ఉన్న ముత్తుస్వామిని ప్రిన్సిపాల్ గానూ, గుంటూరు ఎ.సి. కళాశాలలో ఉన్న యలవర్తి రోసయ్యగారిని వైస్ ప్రిన్సిపాల్ గానూ నియమించారు. కానీ కొన్ని పరిస్థితుల కారణంగా ముత్తుస్వామి గారు రాకపోవడంతో రోసయ్య గారినే కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్‌ని చేశారు. వీరి ఆధ్వర్యంలో కళాశాల 1968 నుండి 1976 వరకు బాలారిష్టాలను అధిగమించి నిల దొక్కుకున్నది. అందరి సమష్టి కృషితో 1972లో కళాశాల ఆంధ్రా యూనివర్శిటీలో గుర్తింపు పొందటం మా అందరికీ చాలా సంతోషం కలిగిన విషయం. ఆ రోజుల్లో చంద్రమౌళి గారు, సదాశివరావు గారు అధ్యాపకుల బాగోగులను గుర్తించి ఆదరించి చేయూత నిచ్చారు. మన కళాశాల

యాజమాన్యం తమ దగ్గర పనిచేస్తున్న వారి నైపుణ్యాలను అనుసరించి ఎవరి నుండి ఏఏ పనిని రాబట్టవచ్చో ఆయా వ్యక్తుల నుండి ఆయా పనులను ఓర్పు, నేర్పులతో రాబట్టుకొని గుంటూరు సమాజంలో జె.కె.సి. కళాశాలను ఒక విశిష్ఠ స్థానంలో నుంచోబెట్టారు. రాష్ట్ర స్థాయిలో మన కళాశాలకు ఎంతపేరుందో జగమెరిగిన సత్యమే.

నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ కూడా దినదినాభివృద్ధి చెందిన గొప్ప వ్యవస్థ. దీనికి ప్రస్తుత చరిత్రే తార్కాణం. 1968-1976 మధ్య కాలంలో ఒక్క జె.కె.సి. కళాశాల నుండి మాత్రమే గుంటూరు మెడికల్ కళాశాలలో సుమారు 20 నుండి 25 మంది విద్యార్థులకు సీట్లను సంపాదించే వారు. ఇది కళాశాలకు ఘన చరిత్రే. ప్రెసిడెంట్ చంద్రమౌళి గారు, కార్యదర్శి సదాశివరావు గారు ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ రోసయ్య గారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చారు. అడ్మిషన్ల ప్రక్రియలో గాని, ఉద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల కొన్ని నిబంధనలను ఏమాత్రం మొహమాటం లేకుండా ఎంతో కఠినంగా వ్యవహరించే శైలి రోసయ్య గారిది. వీరికి సీట్లు ఇచ్చే విషయంలో తన మన బేధం లేదు. పాలకమండలి వారి పిల్లలైనా సరే వెనుకాడే ప్రసక్తే లేదు. 1976-88 మధ్య కాలంలో కొండబోలు బసవపున్నయ్య గారు సెక్రటరీగా ఉన్నప్పుడు కళాశాల్లో Bi.P.C. సీటు కోసం మంత్రుల రికమండేషన్లను కూడా కాదని చెప్పిన సందర్భాలున్నాయి. వీటిని మేమెంతో గర్వంగా చెప్పుకొనే వాళ్ళం.

రోడ్డుకు తూర్పు నున్న 7 ఎకరాల భూమి శ్రీ చేబ్రోలు హనుమయ్య గారి అన్నయ్య రామయ్య గారి ద్వారా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీకి సంక్రమించింది. ఆ భూమికి తూర్పు, ఈశాన్య దిక్కుల్లో 3 ఎకరాలు కూచిపూడి వారికి చెందింది. కొండబోలు బసవపున్నయ్య గారి చొరవతో నరసింహారావు గారి 3 ఎకరాలను కూచిపూడి వారికి మార్పుచేసి ఆనాటి ధరను నరసింహారావు గారికి చెల్లించారు. ప్రస్తుతం ఉన్న కళాశాల తూర్పు భాగం క్రికెట్‌గ్రౌండ్, బి.ఇడి. కళాశాల, లా కళాశాల, కె.ఎల్.పి. స్కూల్ ఈ స్థలాల్లో రూపుదిద్దుకున్నవే. ప్రస్తుత ఆడిటోరియం ఆనాటి రేకులషెడ్‌లో సగభాగం. ఈ విధంగా కళాశాల స్థలాలను సంతరించుకొని బిల్డింగులను రూపొందించుకొని ఈనాడు మనముందు ఠీవిగా నిలబడింది. దీని పూర్వ చరిత్ర, ప్రస్తుత చరిత్ర అపూర్వం. ఇది ఎవరూ కాదనలేని సత్యం !

శుభాశీస్సులు


(మన కళాశాల ప్రారంభోత్సవ సమయములో
కవిపుంగవులు **శ్రీ పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు** చెప్పిన పద్యం)

శా॥ శీలోపేతులు నీతిమంతులు గుణ శ్రీరాజితుల్ సత్కళా
జాలాంత:కరణుల్ శుభాశయు లుపజ్ఞాశోభి శిష్యాగ్రణుల్
వేలున్ లక్షలు నీదు గర్భమున నావిర్భూతులై భారత
క్ష్మాలక్ష్మిన్ వెలయింప వర్ధిలు కళాశాలా శిరోరత్నమా !

క॥ పాలకులు సేమ మరయగ
బాలకులున్ గురులు వృద్ధిపఱుపగళలమేల్
మేలన కుప్పుస్వామి కళా
శాలా ! గడియింపుమా ! విశాలయశంబున్

జె.కె.సి. కళాశాల ఒక వజ్రం

శ్రీ పాతూరి కోటేశ్వరరావు
విశ్రాంత అధ్యాపకులు, రసాయనశాస్త్ర విభాగం



విద్యారంగంలో విశేష ప్రతిభతో గత 50 సంవత్స రాలుగా ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన సంస్థ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల. ఎందరో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఒక నమ్మకం కలిగించిన సంస్థ. ఆనాడు విద్యారణ్యస్వాముల వారు విజయనగర సామ్రాజ్యానికి స్థల నిర్ణయం చేసినట్లు, మహానుభావు లెవరో ఒక రబ్బరు ఫ్యాక్టరీని కళాశాలకు ఎంపిక చేయడం యాదృచ్ఛికమైనా ఈనాటి వైభవానికి కారణమైంది. యాజమాన్యంలో అనేక కులాలు, మతాల వారున్నారు. అనేక రాజకీయ పార్టీల నాయకులున్నారు. కానీ కళాశాల నిర్వహణలో అందరిదీ ఒకే మాట ఒకే బాట. అధ్యాపకుల ఎంపికలో కూడా మొదటి ప్రాధాన్యత విద్యార్థుల పట్ల, కళాశాల పట్ల ప్రేమ, రెండవ ప్రాధాన్యతే ప్రతిభ. కులాల ప్రసక్తి ఏనాడూ అంశం కాలేదు. దీనికి గొప్ప ఉదాహరణ డాక్టర్ అనంతం గారు. (క్రిష్టియన్), డాక్టర్ అమరేంద్ర గారు (బ్రాహ్మిణ్) అధ్యాపకులుగానే కాకుండా ప్రిన్సిపాల్స్‌గా కూడా నియమింపబడ్డారు. ప్రైవేటు కళాశాలలో ఇది ఒక మార్గదర్శకం. అది జె.కె.సి. కళాశాలకే సాధ్యమైన ఒక అరుదైన ప్రత్యేకత. తరువాతి కాలంలో కొన్ని కళాశాలలు ఈ పద్ధతిని ఆచరించడం ఆదర్శనీయం.

ప్రారంభ దశ :

1967లో విద్యా వ్యాప్తి అవసరాన్ని గుర్తించి గుంటూరులోని కొందరు ప్రముఖులు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు విద్యాసౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో కళాశాల ప్రతిపాదన చేయటం, జాగర్లమూడి చంద్రమౌళి గారు కుటుంబం తరుఫున లక్ష రూపాయల విరాళం ప్రకటించడం జరిగింది. కళాశాల పేరు ప్రతిపాదనలో చేబ్రోలు హనుమయ్య గారు ముందుగా మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రముఖంగా వినిపించే పేరు కుప్పుస్వామి గారిది గనుక ఆయన పేరు కళాశాలకు పెట్టడం సమంజసమని పేర్కొనడం అందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారు అధ్యక్షులుగా, డాక్టర్ కాసరనేని సదాశివరావు గారు కార్యదర్శిగా శ్రీ యర్రమనేని ప్రకాశరావు గారు కోశాధి కారిగా వ్యవస్థాపక కార్యవర్గం ఏర్పాటు చేయబడింది. మిగిలిన ప్రముఖులంతా కార్యవర్గ సభ్యులుగా నియమింప బడటం జరిగింది.

ప్రిన్సిపాల్ నియామకం :

ప్రిన్సిపాల్ నియామకం ఒక కసరత్తే. శ్రీ యలవర్తి రోసయ్య గారి వ్యవహారశైలిని తట్టుకోగలమాని కొందరి సందేహం. గుంటూరు సమాజంలో కళాశాల తనకంటూ ఒక పునాదిని, ఒక ప్రత్యేకతను నిలబెట్టుకోవాలంటే ఆయనే సరైన వారనేది కొందరి మతం. అందులో డా।। కాసరనేని సదాశివరావు గారొకరు. వారి ప్రోద్బలంతోనే శ్రీ రోసయ్య గారిని కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా నియమించడం జరిగింది. విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ఎవరి ప్రమేయాన్ని చివరకు పాలకవర్గం వారి సిఫార్సులను కూడా ఖాతరు చేయకుండా విద్యార్థులను క్షుణ్ణంగా రెండు మూడు సార్లు పరిశీలించి అడ్మిషన్ల ప్రక్రియను జరపటం వారి వ్యవహార దక్షతకు నిదర్శనం. ఎవ్వరికీ సరాసరి సీటిచ్చేవారు కాదు. అలా పరిశీలించి చేర్చుకోవటం వల్ల పిల్లలందరిని గుర్తించి ఇంటిపేరుతో సహా పిలువగలిగేవారు. ఆయన కది గొప్ప వరం. కొంత కష్టమనిపించినా పరిపాలనలో గొప్ప సౌలభ్యాన్ని కలిగించింది.

రోసయ్య గారికి జ్ఞాన సంపద ఎక్కువ. ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో నిష్ణాతుడు. అధిక సంఖ్యలో అధ్యాపకుల భాషాదోషాల నివృత్తి ఆయన పుణ్యమే. సెలవు పెట్టాలంటే సెలవు చీటీలో తప్పులు పట్టుకుంటారనే భయంతో సెలవు పెట్టకుండా సర్దుకు పోయిన వారు చాలా మందు న్నారు. న్యూస్ పేపర్లలో తెలుగు ఇంగ్లీషు అనే తేడా లేకుండా ఎర్ర పెన్నుతో తప్పులను కసికొద్దీ క్రాస్‌గా గీతలు

గీసి వాతలు పెట్టేవారు. తెలుగు, ఇంగ్లీషే కాకుండా హిస్టరీ, జాగ్రఫీలలో కూడా ప్రావీణ్య ముండేది. ఆయన కుర్చీ వెనుక ఒక ప్రపంచ పటముండేది. వెనక్కి తిరక్కుండా చూపుడు వేలితో ఏ దేశాన్నైనా క్షణంలో గుర్తించేవారు. కొత్తగా చేరిన అధ్యాపకులకు కూడా పరీక్ష పెట్టేవారు. ఎవరైనాసరే ఆయన ఆఫీసు గదిలో కెళ్లాలంటే సింహం గుహలో ప్రవేశించినంత భయపడేవారు. కఠినంగా కనపడడమే గాని ఆయనంత మంచి మనిషి ఎవ్వరూ ఉండరు. కఠినంగా లేకపోతే అధ్యాపకులు బాధ్యతల్లో నిర్లిప్తత వహిస్తారేమోనని, అందువల్ల పిల్లలకు సరియైన మేలు జరగదేమోనని పైకి కఠినంగా ఉన్నట్లు కనిపించే వారు. ఉద్యోగస్తుల సర్వీసు రిజిష్టర్లలో ఏ ఒక్కరి పైన వ్యతిరేక వ్యాఖ్యానాలు రాయలేదు. రోసయ్యగారు వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా ఉండి ఉండకపోతే జాగర్ల మూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలకి ఇంతటి గుర్తింపు దేశ విదేశ వ్యాప్తంగా వచ్చుండేది కాదని నా ప్రగాఢ విశ్వాసం.

వ్యవస్థాపక కార్యవర్గంలో మహనీయులు :

మంచితనానికి మారుపేరు జాగర్లమూడి చంద్రమౌళి గారు. తెల్లని గ్లాస్కో పంచె, తెల్లని గ్లాస్కో లాల్చీ చూడగా మంచితనం మూర్తీభవించిన పెద్దమనిషనే అభిప్రాయం ప్రత్యర్థులకు కూడా కలుగుతుంది. ఆయన అధ్యక్షతన జరిగే సమావేశాలన్నీ ఏకాభిప్రాయ ముగింపులే. సభ్యులందరకూ ఆయనంటే అపారమైన గౌరవం. వారే వ్యవస్థాపక అధ్యక్షులు. వైద్యం పైన ఎంత అవగాహనుందో విద్యపైన అంతకన్నా ఎక్కువ మక్కువ, అవగాహనున్న వ్యక్తి డాక్టర్ సదాశివరావు గారు. అందుకే వ్యవస్థాపక కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ప్రిన్సిపాల్ నుండి సీనియర్ అధ్యాపకుల వరకు మంచి దార్శనికతతో ఏరి, కోరి వివిధ కళాశాలల్లో నుండి ఉత్తమ ఉపాధ్యాయులను ఆహ్వానించి, జె.కె.సి. కళాశాలకు తీసుకొచ్చారు. కళాశాలంటే పెద్ద, పెద్ద భవనాలు కాదని ప్రధమ ప్రాధాన్యత విద్యాబోధనేనని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజుల్లో డొనేషన్లు తీసుకొని అధ్యాపకులను నియమించే సంప్రదాయానికి భిన్నంగా వృత్తిపై శ్రద్ధ, విద్యార్థులపై ప్రేమున్న గ్రామీణ ప్రాంత వాసులను మాత్రమే నియమించారు. ఈ విధానమే కళాశాల అభివృద్ధికి కష్టించి పనిచేసే సమష్టి నాయకత్వాన్నిచ్చింది.

శ్రీ యర్రమనేని ప్రకాశరావు గారు మంచి సహృదయం కలిగిన వ్యాపారవేత్త. ప్రిన్సిపాల్ ఎంపికలో సదాశివరావు గారికి సహకరించిన వ్యక్తి. రోసయ్య గారికి జూనియర్ కావడం వల్ల ఆయన మనస్తత్వాన్ని అర్థం చేసుకొన్న వ్యక్తి. కోశాధికారిగా కష్టకాలంలో కూడా జీతాలు సకాలంలో ఇవ్వడం, కళాశాల ప్రయోగశాలలకు పరికరాలు సమకూర్చడంలో ఏ లోటూ లేకుండా చూసేవారు. ప్రకాశరావు గారంటే అందరికీ అపారమైన గౌరవం.

యాజమాన్యంలో ప్రముఖులైన ఇతర సభ్యులు :

శ్రీ చేబ్రోలు హనుమయ్య గారు, శ్రీ గోగినేని కనకయ్య గారు, శ్రీ హాజీసులేమాన్ ఖాన్ గారు, శ్రీ మంగళదాస్ గారు, మద్ది వెంకటరత్నం గారు, నవభారత్ కంపెనీ ప్రతినిధులు. తరువాత కాలంలో కళాశాల పరిపాలనలో ప్రవేశించిన డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య గారు భవనాలు సమకూర్చటంలోనూ, శ్రీ జాగర్లమూడి నరేంద్రనాథ్ గారు అధునాతన సౌకర్యాలు కల్పించటం లోనూ, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ గారు తన మంచితనంతో అధ్యాపకుల్లో ఆత్మవిశ్వాసం కల్పించడంలోనూ ఎంతో కృషి చేశారు. ప్రస్తుతమున్న కార్యదర్శి శ్రీ జాగర్లమూడి మురళీమోహన్ గారు సాంకేతిక విద్యలో నిపుణులు. పరిశ్రమలు నడపటంలో మంచి అనుభవజ్ఞుడు. విద్యార్థులకు సజీవస్ఫూర్తిని కలిగిస్తున్నారు.

కళాశాల ప్రారంభ దశలోనే అద్భుత ఫలితాలు :

కళాశాల ప్రారంభించిన 1968వ సంవత్సరంలోనే పి.యు.సి. కోర్సులో అన్ని గ్రూపులున్నాయి. అందులో బై.పి. గ్రూపుకు విపరీత మైన డిమాండు ఉండేది. మొదటి సంవత్సరమే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. తరువాత అడ్మిషన్లపై విపరీతమైన క్రేజు. మేనేజిమెంటుపై తీవ్రమైన వత్తిళ్ళు, ప్రిన్సిపాల్ గారిపై కోపతాపాలు. డిగ్రీలో బి.ఎ. మరియు బి.కాం.లు మాత్రమే మొదటి సంవత్సరం ప్రారంభించ బడ్డాయి. బి.యస్సి. తరువాత సంవత్సరం ప్రారంభించబడటానికి కారణం లాబొరేటరీలు అత్యున్నత ప్రమాణాలతో నిర్మించటం కోసమే. మొదటి బ్యాచ్ సి.బి.జెడ్. విద్యార్థులు ఆంధ్రా యూనివర్శిటీలోనే అత్యుత్తమంగా నిలిచి కళాశాల ప్రతిష్ఠను లోకానికి తెలియజేశారు. పి.యు.సి., ఇంటర్మీడియట్‌ల నుండి ప్రతి సంవత్సరం గుంటూరు మెడికల్ కాలేజిలో 20 మందికి తక్కువ గాకుండా చేరేవాళ్ళు. ఒకే కాలేజి నుండి అధిక సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించిన ఘనత జె.కె.సి. కళాశాలకి మాత్రమే దక్కింది.

ఈ అసామాన్య ఫలితాల సాధనకు కారణం అధ్యాపకుల, విద్యార్థుల సమష్టి కృషి, యాజమాన్య ప్రోత్సాహం. అధ్యాపకులు తక్కువ సంఖ్యలో అనుభవజ్ఞులు, ఎక్కువ సంఖ్యలో ఉత్సాహమున్న యువకులుండేవారు. ఈ అనుభవం, ఉత్సాహం కలయికవల్ల బోధనలో పరిపూర్ణతను సాధించడం సాధ్యమైంది. దానికి తోడు పీరియాడికల్‌గా జరిగే పరీక్షా ఫలితాలను విశ్లేషించి విద్యార్థుల లోటుపాట్లను సవరించి అంతిమ పరీక్షలకు ఒక్క పొరపాటు కూడా జరక్కుండా జాగ్రత్త పడేవాళ్ళం. ప్రతి అధ్యాపకుడు క్లాసులోని ప్రతి విద్యార్థిని పేరుపెట్టి పిలిచే అనుబంధం ఉండేది. ఇది వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ సదాశివరావు గారి సలహా. చాలా మంచి ఫలితాలనిచ్చింది. యువ అధ్యాపకుల సందేహాల నివృత్తికి సీనియర్లు ఎంతగానో ఉపయోగపడ్డారు. డాక్టర్ గారి దార్శనికతకు నిలువెత్తు సాక్ష్యం ఈ ప్రయోగం.

చిన్నయసూరి సాహితీ, సాంస్కృతిక వారోత్సవాలు

కళాశాలలో విద్యార్థులకు సాహిత్యాభిరుచి పెంపొందడానికి ప్రతి సంవత్సరం శ్రీ రోసయ్య గారి ఆధ్వర్యంలో కళాశాల సాహితీ సమితి తరఫున సాహితీ వారోత్సవాలు జరిగేవి. సమావేశాల్లో నిష్ణాతులైన ప్రబంధ, ఆధునిక కవులు ప్రసంగించి అనేక విషయాలు తెలియజేసే వారు. అట్టి ప్రముఖుల్లో డాక్టర్ దివాకర్ల వెంకటావధాని, వానమామలై వరదాచార్యులు, ఉత్పల సత్యనారాయణ, పళ్ళెపూర్ణ ప్రజ్ఞాచార్యులు, గుర్రం జాషువ, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, నాయని కృష్ణకుమారి, కాళోజీ నారాయణరావు, దాశరథి, మాధవ రామశర్మ మొదలైన వారెందరో ఉన్నారు. డాక్టర్ సదాశివరావు గారి సాహితీ అభిలాష, శ్రీ గురు ప్రసాదరావు గారి దక్షత ఎంతగానో తోడ్పడ్డాయి. విద్యార్థుల కెంత వరకు మేలు జరిగిందనే దానికి ప్రతిఫలమే పూర్వ విద్యార్థి డాక్టర్ పాపినేని శివశంకరరావు గారికి గత సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావడం. ఈ అవార్డు 50 ఏళ్ల క్రితం గుంటూరు నుండి గుర్రం జాషువా గారికి వచ్చింది. ఇప్పుడు మన పాపినేని శివశంకర్ గారికి ఆ గౌరవం దక్కింది.

గ్రంథాలయం :

కళాశాల నిర్వహణలో గ్రంథాలయం పాత్ర అతి ముఖ్యమైంది. ప్రిన్సిపాల్ రోసయ్య గారు, కార్యదర్శి సదాశివరావు గారు పుస్తక ప్రియులు గనుక గ్రంథాలయ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు సమకూర్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రోసయ్య గారు, నాగళ్ల గురుప్రసాద రావు గారు కాశీ విశ్వవిద్యాలయానికి వెళ్లి సంస్కృత ప్రామాణిక గ్రంథాలను సేకరించుకొచ్చారు. ఇంగ్లీషు సాహిత్యాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఒకే పుస్తకం పలు ఎడిషన్లు ఉండేవి. ఎక్కడా లభ్యం కాని అరుదైన ఎడిషన్లు మన దగ్గర ఉన్నాయంటే సేకరణపై శ్రద్ధ తెలుస్తుంది. ప్రామాణిక గ్రంథాలన్నింటికి ప్రసిద్ధ కేంద్రం మన పఠన మందిరం.

రోసయ్య గారికి రాగద్వేషాలు చాలా మెండు. ఇష్టమైన పుస్తకాలను ఎంత అభిరుచితో సేకరిస్తారో అయిష్టమైన వాటిని దరిదాపులకు కూడా రానిచ్చేవారు కాదు. ఆయన ప్రిన్సిపాల్‌గా వున్న ఎనిమిది సంవత్సరాల కాలంలో తెలుగు నవలలు గ్రంథాలయం గడప తొక్కలేదు. కొన్ని పత్రికలు కూడా నిషేధానికి గురయ్యాయి.

సబ్జెక్టుతో సంబంధం లేకుండా విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారంతా జె.కె.సి. కళాశాల గ్రంథాలయాన్ని రిసోర్స్‌గా వాడుకొని పిహెచ్.డి. పట్టాలు పొందేవారు. తెలుగు, ఇంగ్లీషు విభాగాల్లో లబ్ధిపొందిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో ఉన్నత ప్రమాణాలకు సృష్టికర్తయైన శ్రీ యలవర్తి రోసయ్య గారి పేరును గ్రంథాలయానికి పెట్టి యాజమాన్యం గౌరవించడం హర్షించదగ్గ నిర్ణయం.

అధ్యాపకుల ప్రత్యేకత :

ఇంతకు ముందే చెప్పినట్లు అనుభవజ్ఞులు, ఉత్సాహంతో కూడిన యువకుల కలయిక మా అధ్యాపక వర్గం. సీనియర్లు అనుభవం పండిన మేధావులు, యువ అధ్యాపకులంతా ఒకరితో ఒకరు పోటీపడి తమ భవిష్యత్తు నిర్మించుకోవాలనే తపనతో విద్యార్థులతో మమేకమై బోధన చేసేవాళ్లం. ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతం నుండి వచ్చినందువల్ల ఒళ్లు దాచుకోకుండా పనిచేసేవాళ్లం. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించి కృషి చేశాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించేవాళ్లం. ఫలితాలు వచ్చిన రోజు మా ఆనందానికి అంతుండేది కాదు. యాజమాన్యం మా ఆనందాన్ని ప్రశంసిస్తూనే వచ్చే సంవత్సరం అడ్మిషన్లలో మాకు మరింత ఇబ్బంది కలిగిస్తున్నారన్నమాట అని ఆనందంలో బాధను వ్యక్తీకరించేవారు.

అధ్యాపకులు కూడా సమాజంలో ఒక భాగమే కనుక వ్యక్తిగత

రాగద్వేషాలు కూడా సహజంగా ఉండేవి. కాని కళాశాల నిర్వహణలో అందరూ ఒకతాటిపై నడిచేవారం. క్రమశిక్షణకు భిన్నంగా ఏ ఒక్క సంఘటన జరిగినా అధ్యాపకులంతా సంఘటితంగా ఎదుర్కొనే వాళ్లం. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరమే ఒక అమ్మాయిపై ఒక అబ్బాయి అసభ్యంగా ప్రవర్తిస్తే తీవ్రంగా దండించడం జరిగింది. ఆ సంఘటన తర్వాత ఆడపిల్లల భద్రతకు ఒక భరోసా ఏర్పడింది. 2400 మందిలో దాదాపు 1000 మంది ఆడపిల్లలు నిశ్చింతగా చదువుకునేవారు. కులాలు మతాలు వేరైనా ఐక్యంగా పనిచేయడం అధ్యాపకుల ప్రత్యేకత.

విద్యార్థుల ఆసక్తి – ఉన్నతంగా ఎదగాలనే పట్టుదల :

ప్రారంభ దశలో విద్యార్థులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చేవారు. వ్యవసాయం తగ్గుముఖం పట్టిన తరువాత గత్యంతరం లేని పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తును ఆలోచించి పొలం అమ్మైనా చదివించాలనే కోరిక రైతు కుటుంబాల్లో కలిగింది. అంతకు ముందే గ్రామాల నుండి బాగా చదువుకొని అమెరికా వెళ్లడం, వారు తల్లిదండ్రులకు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేయడం కూడా కొంత ప్రోత్సాహాన్నిచ్చింది. పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందిందంటే ప్రభుత్వ పథకాల వల్ల కాదు కేవలం పిల్లల చదువుల వల్లే. ప్రతి గ్రామంలోనూ పది నుండి పదిహేను శాతం అమెరికాలో స్థిరపడ్డారు. గ్రామాల అవసరాలకై కొంత సొమ్ము వెచ్చిస్తున్నారు. ఈ విషయంలో ప్రముఖంగా పేర్కొనదగినవాడు మన పూర్వ విద్యార్థి డాక్టర్ పొదిలి ప్రసాద్, సత్తెనపల్లి మండలం, ఫణిదం గ్రామం, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తనొక్కడే పదికోట్ల రూపాయల విరాళ మివ్వడం విశేషం.

చదువుతో పాటు సంస్కారం నేర్చుకున్నారు. యాజమాన్య పెద్దలు సమాజంలో ఆదర్శంగా జీవించారు. వారి జీవిత విధానం ఎక్కువ మంది పిల్లలకు ఆదర్శమైంది. డాక్టరు సదాశివరావు గారు అధ్యాపకుల నుద్దేశించి మాట్లాడుతూ "విద్యకు సిలబస్ ఉంటుంది, బుద్ధికి సిలబస్ ఉండదు" గనుక విద్యార్థులకు వ్యక్తిత్వం పెంచుకోవడానికి అనేక విషయాలు చెప్పండని ప్రోత్సహించేవారు. రోసయ్య గారు, అనంతం గారు, అమరేంద్ర గారు, గురుప్రసాదరావు గారు అనేక విషయాలను చెప్పేవారు.

రజతోత్సవ వేడుకలు – 1993 :

కళాశాల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 1993లో రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యాపక సంఘం నుండి నేను కన్వీనర్‌గా, పూర్వ విద్యార్థుల నుండి త్రిపురనేని ప్రసాద్ కార్యదర్శిగా ఒక ప్రణాళిక ప్రకారం మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించాం. మొదటి రోజు ముఖ్య అతిథిగా జస్టిస్ ఆవుల సాంబశివరావు గారు పూర్వ విద్యార్థుల సమావేశంతో రజతోత్సవ వేడుకలను ప్రారంభించి విజ్ఞానవంతమైన సందేశాన్నిచ్చారు. సాయంత్రం సభకు ప్రముఖ యువ పారిశ్రామికవేత్త పాతూరి రామారావు స్ఫూర్తినింపడమే కాకుండా పేద విద్యార్థుల సహాయార్థం పది లక్షల విరాళాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మాతృ సంస్థకు తమ వంతు సహాయం అందిస్తామని తమ ఆసక్తిని వ్యక్తీకరించారు.

రెండవ రోజు సాంస్కృతిక ఉత్సవం అతిగొప్పగా జరిగింది. దిగ్దంతులైన ఇద్దరు ప్రముఖ అతిథులు ఆనాటి సమావేశంలో పాల్గొన్నారు. ఒకరు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు, రెండవ వారు దాదా ఫాల్కే అవార్డు గ్రహీత నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గారు. అధ్యక్షత వహించింది సాహితీ స్రష్ట డాక్టర్ కాసరనేని సదాశివరావు గారు. ఇద్దరు అతిథులు తమ ఉపన్యాసాల ద్వారా సభలో ఆహ్లాదాన్ని ఆనందాన్ని కలిగించారు. డాక్టరు గారు అక్కినేనికి ఒక చిన్న పరీక్ష పెట్టారు. మా అమ్మాయి రాధికకు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న నాగేశ్వరరావు గారిని ఈ అమ్మాయి ఎవరై ఉంటుందని అడిగితే క్షణం ఆలోచించుకోకుండా ముఖం చూస్తే తెలియడంలా ఈ అమ్మాయి కోటేశ్వరరావు గారి అమ్మాయే ! అంతటి నిశిత దృష్టి అక్కినేని నాగేశ్వరరావు గారిది. ఆయన్ని ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు దాదాపు గంటకు పైగా అనేక విషయాలు మాట్లాడారు. ఆ అనుబంధం వల్లనే గుర్తించ గలిగారనుకుంటాను.

మూడవరోజు ముగింపుసమావేశంలో యాజమాన్య సభ్యులంతా ఆత్మీయంగా 25 సంవత్సరాల పరిపాలనాను భవాలను స్మరించు కుంటూ కళాశాల ప్రారంభం నుండి పనిచేస్తున్న అధ్యాపకులను, ఇతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు. నూతన ఉత్సాహాన్ని నింపారు. అవి మధురాను భూతులు. బాలారిష్టాలు దాటి సంస్థ

యవ్వన దశకు చేరింది. నూతన ఉత్సాహంతో ముందుకు సాగాలని అందరం ప్రతిన బూనాం. నేడు పరిపక్వ దశను దాటి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవానికి సిద్ధమైంది. మాతృమూర్తిని మీ రాక ద్వారా పరవశింప చేయాలని పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి.

సరిగమలు :

కళాశాల ప్రారంభ దశలో కొన్ని అసక్తికర హాస్య పూరకమైన సంఘటనలు గుర్తు చేసి ఈ వ్యాసానికి ముగింపు పలుకుతాను.

సెలవు ప్రహసనం : ఒక అధ్యాపకునికి కళాశాల ప్రారంభించిన కొద్ది రోజులకే పెళ్లి కుదిరింది. సెలవు కొరకు రోసయ్య గారి దగ్గరి కెళ్లాడు. పెళ్లి ఆదివారం కనుక శనివారం ఒక్కరోజు సెలవిచ్చి సర్దుకోమన్నారు.

పోస్ట్‌మాన్‌పైన పార్శిల్ విసరడం : ఒకరోజు ప్రిన్సిపాల్ గారితో మాట్లాడుతూ ఇద్దరు లెక్చరర్లం ఆఫీసులో కూర్చొని ఉన్నాం. అంతలో పోస్ట్‌మాన్ వచ్చి ఒక పార్శిల్ రోసయ్య గారికిచ్చాడు. ఆయన ఎగాదిగా చూస్తుండగానే ఎక్నాలెడ్జ్‌మెంట్ ఫాం ఇచ్చి ప్రిన్సిపాల్ గారిని సంతకం పెట్టమని అడిగాడు. ఆ ఎక్నాలెడ్జ్‌మెంట్ చూస్తూనే ముఖ కవళికలు మారాయి. పార్శిల్ తీసుకొని పోస్ట్‌మాన్ ముఖానికేసి కొట్టారు. మాకు విషయం అర్థం కాలేదు. పోస్ట్‌మాన్‌కి ఊహించని సంఘటన. మేము తేరుకునేలోపలే పోస్ట్‌మాన్‌ని ఉద్దేశించి "జె.కె.సి. కాలేజి పేరు ఎప్పుడూ పైనే వుండాలి, జె.కె.సి. ప్రిన్సిపాల్ మరొకరి కింద సంతకం పెట్టడు గుర్తుంచుకో" అని గద్దించాడు. దీన్ని ఏమనాలి? అభిమానమా? లేక పిచ్చ అభిమానమా? రోసయ్య గారు కాలేజిని పిచ్చగా అభిమానించారు. ఈ విషయంలో ఎవ్వరికీ సందేహం లేదు.

మిల్టన్ – పారడైజ్‌లాస్ట్ ప్రహసనం : ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో చదివిన పల్నాడు ప్రాంత పూర్వ విద్యార్థి తన కొడుకును అడ్మిట్ చేయడానికి రోసయ్య గారిని కలిశాడు. తన విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ "మీరు మాకు మిల్టన్ పారడైజ్ లాస్ట్ క్లాసులు తీసుకున్నారు సార్" అని చెప్తుండగానే రోసయ్య గారు మధ్యలో అడ్డు తగిలి "పళ్లు శుభ్రంగా తోముకున్నావా? పాచి నోటితో మిల్టన్ పేరు ఉచ్చరిండమే" అనే సరికి అతను బిత్తరపోయి రోసయ్యగారు ఇంకా మారలేదనుకున్నాడు. ఏమైతేనేం ఈ ప్రహసనం ద్వారా కష్టతరమైన సీట్లను సులభంగానే సాధించుకున్నాడు.

దివాకర్ల వేంకటావధాని గారి వరూధిని ప్రహసనం : ఒక సంవత్సరం కళాశాల వేడుకలకు పండిత శ్రీ దివాకర్ల వేంకటావధాని గారిని ముఖ్య అతిధిగా పిలవడం జరిగింది. సభ ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశ్యంతో అధ్యాపకు లందరమూ ప్రాంగణం చుట్టూ నిలబడి విద్యార్థులను గమనిస్తూ ఉన్నాం. ఇది గమనించి దివాకర్ల వారు "అధ్యాపకులందరు వచ్చి ముందు వరుసల్లో అతిధుల్లా కూర్చోండి. విద్యార్థులను అదుపులో ఉంచే బాధ్యత నాకు వది లేయండి" అని పిలువగానే మేమంతా వెళ్లి ముందు వరుసల్లో కూర్చొన్నాం.

ఉపన్యసించడానికి లేవగానే విద్యార్థుల నుండి పెద్దగా అరుపులు. అనుభవజ్ఞుడు కనుక రెండు నిముషాలు మౌనం వహించి పిల్లల కిష్టమైన అంశం ఒకటి తీసుకొని మను చరిత్రలోని ప్రబంధ నాయికి వరూధిని వర్ణన అతిరసరమ్యంగా మొదలుపెట్టారు. అంతా నిశ్శబ్దం ఉత్సుకత. అసలే పండితుడు. అందులోనూ వరూధిని వర్ణన. రసరంజకంగా వర్ణించి అందరి మెప్పు పొందారు. ఆరోజు విజ్ఞాన వంతమైన ఒక గొప్ప ఉపన్యాసం చేశారు.

జె.కె.సి. కళాశాలలో సీటు సంపాదించడమంటే బ్రహ్మప్రళయం. అందునా రోసయ్య గారి చేతుల మీదుగా సాధించడం. ఒకరోజు ఉదయం డాక్టరు గారి వద్దకు ఎవరో వెళితే ప్లీజ్ అడ్మిడ్ అని ప్రిస్క్రిప్షన్ స్లిప్‌పై రాసి పంపించారట. అతను రోసయ్య గారంటే భయపడి సాయంత్రం డాక్టరు గారు వచ్చే సమయంలో వెళ్లి ఇచ్చాడు. రోసయ్య గారు "ఏంటిది, అని విసిరి ఆ కాగితాన్ని అతని మొఖాన కొట్టారు" ఆవేశం తగ్గిన తరువాత సీటు ఇప్పించడం జరిగింది.

ఇలాంటి సరిగమలెన్నో మాకు తీపి జ్ఞాపకాలు. కళాశాలలో పనిచేసిన అధ్యాపకులందరూ గర్వించ దగిన అంశాలు ఎన్నో. ముఖ్యంగా విద్యార్థుల స్థాయిని బట్టి ఉన్నత శిఖరాల నధిరోహింప చేయడం పవిత్ర కార్యంగా వృత్తి గౌరవాన్ని నిర్వహించినందుకు గర్వపడుతున్నాం. సమాజంలో మా గౌరవాన్ని ఇనుమడింపజేసిన జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల చిరస్మరణీయం.

కళాశాల ఆధునిక రూపశిల్పి – శ్రీ జాగర్లమూడి నరేందర్‌నాథ్

శ్రీ ఎస్.ఆర్.కె. ప్రసాద్



స్వర్గీయ జాగర్లమూడి నరేందర్‌నాథ్ అనగానే ఆధునికత కలిగిన ధృఢస్వరూపం, కల్మషం లేని కనుదోయి, మందస్మితంతో కూడిన ఆత్మీయ సమ్మోహనత్వం వెరసి నిండైన మూర్తిమత్వం మనకు గోచరిస్తుంది. కీ॥శే॥లు జాగర్లమూడి చంద్రమౌళి గారి కుమారుడి గానే కాక దాతృత్వంలోనూ, అందరినీ ఆప్తులుగా చూసే స్వభావం లోనూ వారి వారసత్వాన్ని ముమ్మూర్తులా పుణికి పుచ్చుకున్నారు. శ్రీ చంద్రమౌళిగారి మరణానంతరం 1988లో కళాశాల పాలకవర్గం లోనికి అడుగిడిన నాటి నుండి మరణించే వరకూ అనగా 2014 వరకూ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల పురోభివృద్ధి పథంలో వారు వహించిన పంథా, పాత్ర మరువలేము.మరిచిపోలేము. అందుకే ఈ స్వర్ణోత్సవ సంబరాల వేళ ఆ మహనీయునిడిని స్మరించుకోవటం సముచితం, కర్తవ్యం కూడా...!

1968వ సంవత్సరంలో కళాశాల స్థాపించిన నాటి నుండి 1987లో మరణించే వరకూ శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు కళాశాల పాలకవర్గ అధ్యక్షులుగా, జె.కె.సి. కళాశాలను పసిపాపవలే సాకి పెంచి పోషించారు. అందరి తోనూ అజాత శత్రువని అనిపించు కున్న తిరుగులేని నాయకులు. పెద్దాయనగా చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయారు. అటువంటి వీరి వారసత్వాన్ని శ్రీ జాగర్లమూడి నరేందర్‌నాథ్ గారు కొనసాగించారు. ఫిబ్రవరి 25, 1948వ సంవత్సరంలో జన్మించిన నరేందర్‌నాథ్ గారు విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో, గుంటూరు హిందూకళాశాలలో చదువుకున్నారు. ఆ రోజుల్లో వీరు మంచి క్రికెటర్‌గా కూడా పేరును గడించారు.

1968లో ప్రారంభమైనప్పటి నుండి అంకిత భావంగల అధ్యాపకులు, ఆదర్శవంతమైన యాజమాన్యం ఆధ్వర్యంలో కళాశాల దినదినాభివృద్ధిచెంది అనతి కాలంలోనే అత్యుత్తమ ఫలితాలతో ఉన్నత స్థాయికి చేరింది. శ్రీ చంద్రమౌళిగారి మరణానంతరము 1988వ సంవత్స రంలో వీరు జెకెసి కళాశాల కార్యదర్శి మరియు కార్యనిర్వహణాధికారిగా (సెక్రటరీ మరియు కరస్పాండెంట్) బాధ్యతలు స్వీకరించారు. ఆ పదవిని బాధ్యతగానే కాకుండా అద్వితీయమైన అంకితభావంతో నిర్వర్తించి ప్రగతికారక సోపానాల నందించి కళాశాల చరిత్రలో చిరస్థాయిలవ్వటం అపురూపం. శ్రీ నరేందర్‌నాథ్ గారు సెక్రటరీగా బాధ్యత లను స్వీకరించే నాటికి సమాజంలోను, విద్యావిధాంలోను పెను మార్పులు రావడం మొదలైంది. విద్య ప్రైవేటీకరణ మొదలై డిగ్రీకోర్సుల్లో సమూలమైన మార్పులకు ప్రాధాన్యత ఏర్పడిన కాలమది. అటువంటి నవీన సంధికాలంలో శ్రీ నరేందర్‌నాథ్ కళాశాల సెక్రటరీగా బాధ్యతలను స్వీకరించి మారిన విద్యావిధానాలకనుగుణంగా అధునాతన కోర్సులను ప్రవేశపెట్టి కళాశాల తీరుతెన్నులకే వన్నె తెచ్చారు.

శ్రీ నరేందర్‌నాథ్ పదవీ బాధ్యతలు స్వీకరించగానే కళాశాలకు కావలసిన ముఖ్యమైన మౌళిక వసతులు, సౌకర్యాల రూపకల్పనకు కంకణం కట్టారు. ఐతే "తానొకటి తలిస్తే దైవమొకటి తలచిం దన్నట్లు" ఆధునిక సాంకేతిక విద్యావిధానాలతో త్వరితగతిన పురోగమిస్తున్న కళాశాలకు అనుకోని దుస్సంఘటన ఆనాటి కొన్ని అరాచక శక్తుల రూపంలో రంగా హత్యానంతరం దాపురించింది. 1989లో రంగా హత్యానంతర ఘటనల్లో కళాశాల గ్రంథాలయం, ప్రయోగశాలలు, చివరకు ఆ సంఘటననాటి ప్రిన్సిపాల్ శ్రీ భాస్కరరావు గారి కారుతో సహా అరాచక ముష్కరుల దాడిలో ధ్వంసమయ్యాయి. కళాశాల విద్యార్థిలోకం, అధ్యాపకులు, యాజమాన్యం, చివరకు సభ్యసమాజం కూడా ఈ సంఘ టనతో ఖిన్నులయ్యారు. ఆనాటి రాష్ట్రప్రభుత్వ పెద్దలూ ఈ విషాదఘటనకు తమ సానుభూతిని తెలియ జేశారు.

కాలం అనంతం. ఏ ఒక్క సంఘటన దగ్గరా ఆగదనేది గొప్ప చారిత్రక సత్యం. పై దుర్ఘటన వ్యవస్థ యొక్క రూపురేఖలను సమూలంగా మార్చివేసింది. 'యంగ్ & డైనమిక్ సెక్రటరీ'గా పేరున్న శ్రీ నరేందర్‌నాథ్ కళాశాల పునర్నిర్మాణానికి నడుం బిగించారు. సంపూర్ణ సహాయ సహకారాలనందించే యాజమాన్య పెద్దల తోడుగా, మీ వెంట మేమున్నామనే అధ్యాపకుల అండతో విద్యార్థుల్లో మనోబలాన్ని పెంచి కళాశాల రూపురేఖలకు శ్రీకారం చుట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు, యాజమాన్య పెద్దలతో కలసి

ఒక పెద్ద ఊరేగింపు కలెక్టర్ ఆఫీస్ వరకూ కొనసా గించారు. ఇదొక అపూర్వ ఘట్టం. వేలాదిమంది విద్యార్థులు ప్లకార్డులు చేబూని మౌనంగా నడుస్తుంటే నాటి గుంటూరు ప్రజానీకం కళ్ళప్పగించి చూసి తమ సంఘీభావాన్ని తెలిపింది.

విజయంలో కంటే విపత్తులోనే మనిషి యొక్క గొప్పతనం తెలుస్తుంది. కష్టాలు అవకాశాలను వెంట తీసుకొని వస్తాయి. కాలానికీ నిజాన్ని నిరూపించుకొనే శక్తి ఉంటుంది. "ఏతమేసి తోడినా ఏరు ఎండదు. పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు" అన్నట్లుగా జరిగిన నష్టాన్ని గూర్చి తలచుకుంటూ కూర్చోకుండా నరేందర్‌నాథ్ గారు సంయమనంతో, మంచి అవగాహనా దృక్పథంతో కళాశాలకు నూతన రూపునివ్వటం మొదలుపెట్టారు. ఆశావాది ప్రతికష్టంలోనూ అవకాశాలను అన్వేషిస్తాడు. ఎంత కోల్పోయినా భవిష్యత్తు మిగిలే ఉందనే ఆశావాద దృక్పథం ఆనాడు వారిలో కనిపించింది. సారాన్ని వెదికే వారు భారాన్ని లెక్కచేయరనే మాట వీరికి చక్కగా సరిపోతుంది. పరిస్థితులు మనచేతుల్లో ఉండవు కానీ ప్రవర్తన ఆచరణలు మన చేతుల్లోనే ఉంటాయని వీరు నిరూపించారు. కళాశాల పునర్నిర్మాణ విషయంలో వారి ఆలోచనలు ఉన్నతం. ఆచరణ మహోన్నతం. తనదైన వ్యవహారశైలితో వినూత్న ప్రయత్నాలు ప్రారంభించి కృతకృత్యులయ్యారు. అనేక నూతన భవనాలు నిర్మించబడ్డాయి. ఈ దుస్సంఘటనకు ముందు తరగతి గదులన్నీ రేకుల షెడ్‌లో ఉండేవి. ఆ షెడ్లను తీసివేసి మూడు అంతస్తుల భవనాలను నిర్మింపచేశారు. అన్ని ప్రయోగశాలలకూ ధ్వంసమవ్వటానికి ముందున్న వాటికన్నా మిన్నగా సౌకర్యాలను సమకూర్చారు. కళాశాల గ్రంథాలయం ఠీవిగా "యలవర్తి రోసయ్య గ్రంథాలయంగా" బహుళ అంతస్తుల భవనంలోకి మారిపోయింది. అలా అలా ఆయన ఆధ్వర్యంలో పునర్నిర్మితమైన కళాశాల తరగతి గదులు సకల సౌకర్యాలకు నెలవులై విద్యాబోధనకు కొత్త మార్గాలు తెరిచాయి.

ఇంతకుముందే పేర్కొన్నట్లు, 1985-'90ల నాటికాలం విద్యావ్యవస్థలో మార్పులకు గురైనకాలం. కాలానికి తగ్గట్లుగా మార్పులను ఆహ్వానించే హృదయంగా, అభ్యుదయ భావాలు, ఆధునిక విద్యపట్ల మమకారంగల శ్రీ నరేందర్‌నాథ్ కళాశాలలో బోధించే కోర్సులపై దృష్టిపెట్టారు. అప్పుడే "కంప్యూటర్ యుగం" ప్రారంభ మౌతోంది. వెంటనే దాని భవిష్యత్‌ను బేరీజువేసిన శ్రీ నరేందర్‌నాథ్ మన కళాశాలలో కంప్యూటర్ కాంబినేషన్‌లో అనేక కొత్త కోర్సులను ప్రారంభింపచేశారు. బి.యస్సీలో కంప్యూటర్ కాంబినేషన్‌తో "సెల్ఫ్ ఫైనాన్సింగ్" పద్ధతితో అనగా ప్రభుత్వ ఆర్థిక సహకారం లేకుండా నడిచేలా కోర్సులను ప్రారంభించారు. క్రమేణా M.C.A., M.A., (English), M.Sc., (Maths), M.Sc., (Microbiology), M.Sc., (Biotech), M.Sc., (Chemistry) లాంటి పిజి కోర్సులనూ ప్రారంభింపచేశారు. తద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగింది. అధ్యాపకుల సంఖ్య పెరిగింది. నూతన భవనాలు అమరాయి. జాతీయ స్థాయికి సరితూగేలా ప్రయోగశాలలు ఏర్పడ్డాయి. క్రమేణా అవసరాని కనుగుణంగా అదనపు తరగతిగదుల నిర్మాణంలో కళాశాల పూర్వ విద్యార్థులు, దాతృత్వ సంస్థలు చేయూతనిచ్చాయి. ఈ క్రతువంతా శ్రీ నరేందర్‌నాథ్‌గారి వ్యక్తిత్వ ప్రభావమే.

నేడు కళాశాల తూర్పుభాగంలో ఠీవిగా నిలుచున్న కంప్యూటర్ సైన్స్ ప్రయోగశాలతో కూడిన భవనం మరియు డిపార్టుమెంటు ఆనాడు శ్రీ నరేందర్‌నాథ్ గారి సంకల్ప బలం, చొరవలతోనే ఏర్పడ్డాయి. UG మరియు PG స్థాయిలో కొత్త కోర్సులు అందునా సెల్ఫ్‌ఫైనాన్సింగ్ కోర్సుల ప్రారంభంతో కళాశాలకు కాస్త ఆర్థికంగా వెసులుబాటు కలిగి వేగంగా పరుగిడేకాలంతో పోటీపడి కళాశాల అభివృద్ధినే ధ్యేయంగా నడిపిన నరేందర్‌నాథ్ గారి ముందుకు 1993లో కళాశాల రజతోత్సవాలు వచ్చేశాయి. కళాశాల ప్రారంభమై అప్పుడే పాతిక సంవత్సరాలు పూర్తయ్యాయి. కళాశాల రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో ప్రఖ్యాత సంస్థగా గుర్తింపు తెచ్చుకొంది. అందుకే రజతోత్స వాలను మూడు రోజులపాటు ఘనంగా జరపాలని నిశ్చ యించారు. ప్రసిద్ధి చెందిన మానవతా వాదిగా ముద్రపడిన జస్టిస్ ఆవుల సాంబశివరావు గారు రజతోత్సవాల ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. రెండవరోజు పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో వివిధ వినోద కార్యక్రమా లను ప్రదర్శించిన వారికి శ్రీ నరేందర్‌నాథ్ జ్ఞాపికలు అందజేశారు. మూడవరోజు సాంస్కృతిక దినోత్సవములో ముఖ్య అతిథులుగా మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు గారు, సుప్రసిద్ధకవివరేణ్యులు ఆచార్య సి.నారాయణరెడ్డి గారు హాజరై విద్యార్థులకు ఆశీస్సులందజేసి కళాశాల భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. మొదటిరోజు వ్యవస్థాపకుల దినోత్సవానికి ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి గారు, ఆచార్య వై.సి. సింహాద్రిగారు, డాక్టర్ యల్. సూర్యనారాయణగారు, డాక్టర్ యలమంచిలి శివాజిగారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులను, దాతలను సన్మానించారు. కళాశాల ప్రారంభం నుండి పనిచేస్తున్న అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందికి రజతపతకాలనందజేశారు.

స్వతహాగా క్రీడాకారుడైన శ్రీ నరేందర్‌నాథ్‌కు క్రీడలంటే అపారమైన మమకారం. కళాశాల విద్యార్థులు చదువులోనేకాదు, ఆటపాటల్లోనూ ముందుండాలని భావించారు. కళాశాలలో చదువుకొనే విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలవారే కనుక శారీరక దృఢత్వం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తే ఉన్నతస్థాయిలో రాణిస్తారని వారి నమ్మకం. అందుకే ఉన్నతస్థాయి ప్రమాణాలతో "ఇండోర్ షటిల్ కోర్టులు", అత్యున్నతస్థాయిలో జిమ్‌ను ఏర్పాటు చేయించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో మాచ్‌లు ఆడుకొనేలా మంచి బాస్కెట్‌బాల్ కోర్టును నిర్మింపచేశారు. వారి కృషి వృధా కాలేదు. మన కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా "చందూస్ సిల్వర్ కప్" క్రికెట్ టోర్నమెంటు ఆంధ్రప్రదేశ్ కళాశాలల అధ్యాపకుల కోసం నిర్వహించటంలోనూ వీరి పాత్ర మరువలేనిది. విన్నర్స్‌కి, రన్నర్స్‌కి ఇచ్చే ట్రోఫీలను తానే స్వయంగా సమకూర్చారు. ఆటలలో ప్రతిభ కనబరచే విద్యార్థులకు ఆర్థిక సాయం కళాశాల నుండి అందేలా చర్యలు తీసుకొన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో MOU చేసుకొని కళాశాల ఆటస్థలంలో గొప్ప క్రికెట్ టర్ఫ్, క్రికెట్ మైదానాలను ఏర్పాటు చేయించారు. జాతీయస్థాయి మహిళా క్రికెటర్లు శిక్షణ తీసుకొనేవిధంగా ఆధునిక సౌకర్యాలతో భవన నిర్మాణం గావించారు. నేడు అనేక జాతీయ, అంతర్జాతీయ మహిళా క్రికెట్ టీములు వచ్చి మన కళాశాల మైదానంలో శిక్షణ పొందుతున్నాయంటే అది ఆయన తీసుకొన్న చొరవ ఫలితమే.

అది 2004వ సంవత్సరం. కళాశాల దినదినాభి వృద్ధి చెంది అత్యున్నతస్థాయిలో గొప్ప ఫలితాలతో వెలు గొందుచున్నవేళ కళాశాల NAAC అక్రిడిటేషన్‌కి వెళ్ళాలని వారు భావించారు. అందుకు కళాశాల విభాగాలను సకలసన్నద్ధం చేయించారు. ఈ ప్రయత్నంలో స్వయంగా తాను, ప్రెసిడెంట్ డా॥ బసవపున్నయ్య గారు ఇరువురూ కలసి ప్రతిడిపార్టుమెంటును సందర్శించి తగు సూచనలిచ్చి అధ్యాపకుల మనోధైర్యాన్ని పెంచారు. 2005వ సంవత్సరంలో మన కళాశాల సందర్శనకు వచ్చిన NAAC బృందం కళాశాల అన్నివిభాగాలను సునిశిత పరిశీలనచేసి కళాశాలకు 'A' గ్రేడ్ ఇవ్వటమే కాకుండా కళాశాల అభివృద్ధిలో యాజమాన్యం వారి కృషిని ఎంతో కొనియాడింది. కళాశాల 'A' గ్రేడ్ పొందిన సందర్భంగా, నాడు శ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ బి. వేణుగోపాలరెడ్డి గార్లు ముఖ్య అతిథులుగా అభినందన సభ జరిపారు.

కళాశాల ప్రగతి పథంలో మరొక మైలురాయి "స్వయం ప్రతిపత్తి" (Autonomy). వీరి ఆధ్వర్యంలోనే 2007లో కళాశాల "స్వయం ప్రతిపత్తి" గల కళాశాలగా UGC వారి నుండి గుర్తింపు పొందింది. నేడు జెకెసి కళాశాల స్వయం ప్రతిపత్తి గల కళాశాలల్లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రత్యేక స్థానం పొందింది. దానికి వారు చేసిన కృషి అనుపమానం.

కళాశాల ప్రారంభకాలంలో విద్యార్థుల క్రమశిక్షణ మరియు విద్యావిషయాలమీదే ప్రధానంగా దృష్టిపెట్టబడింది. కానీ మారుతున్న కాలంలో విద్యావ్యవస్థలో వచ్చిన మార్పుల్లో భాగంగా కళాశాల ఎన్నో జాతీయ మరియు అంతర్జాతీయస్థాయి సెమినార్లను నిర్వహించింది. వీటి నిర్వహణలో కళాశాల సెక్రటరీగా శ్రీ నరేందర్‌నాథ్ అందించిన సహాయ సహకారాలు మరువలేనివి.

ఇక వ్యక్తిత్వపరంగా శ్రీ నరేందర్‌నాథ్ నిగర్వి. అందరితోనూ మరణించేవరకూ "యంగ్ అండ్ డైనమిక్ సెక్రటరీ"గా కొనియాడబడ్డ ఆధునిక స్ఫూర్తి కలిగిన అభ్యుదయవాది. నిరంతరం కళాశాల పురోభివృద్ధి గురించి తపించినవ్యక్తి. అధ్యాపకుల యెడల అపారమైన గౌరవాదరాలు చూపిన మహానుభావుడు. ఒకవేళ ఏ అధ్యాపకుడైనా తన స్వీయకారణాల వలన కళాశాలను విడిచివెళ్ళాలని భావిస్తే, నిరభ్యంతరంగా, సాదరంగా వారి నిష్క్రమణకు సహకరించిన గొప్పవ్యక్తి ఆయన. కళాశాల యాజమాన్యంతో మిగిలిన వారితోనూ చక్కని సమన్వయం చూపిస్తూ తాను ముందుకు నడుస్తూ, కళాశాలను ముందుకు నడిపిన దార్శనికుడాయన. యాభయ్యేళ్ళ జెకెసి కళాశాల ప్రస్థానంలో పాతిక సంవత్సరాలు ఆయన మార్గదర్శకత్వంలోనే కళాశాల ముందుకు సాగిందని చెప్పవచ్చు. అది కూడా కళాశాల ఆధునిక భవన నిర్మాణపరంగా, NAAC వారి 'A' గ్రేడ్ పొందటం పరంగా, 'అటానమస్' కళాశాలగా మారటం పరంగా పొందిన గొప్ప గుర్తింపులన్నీ వీరికాలంలోనే జరిగాయి.

వీరి ఆదరాభిమానాలను చవిచూసిన కళాశాల అధ్యాపకులు వీరి మరణానంతరం శ్రీ నరేందర్‌నాథ్‌గారి కాంశ్య విగ్రహాన్ని కళాశాలలో నెలకొల్పుకొని వారి పట్ల తమకుగల మక్కువను కృతజ్ఞతను తెలుపుకొన్నారు.

అందుకే ఆయన జెకెసి కళాశాల చరిత్రలో "ఆధునిక రూపశిల్పి"గా చిరస్థాయిగా, నిలిచిపోయారు. ఎప్పటికీ నిలచిపోతారు. ఈ స్వర్ణోత్సవాలవేళ వారి దివ్యస్మృతికి అంజలిఘటిస్తూ... "మంచి మనసు కలిగినవారికి మరణమే ఉండదు".

మా జె.కె.సి. కళాశాల – మా ఆంధ్రశాఖ

శ్రీ గొల్లపూడి ప్రకాశరావు
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు



జె.కె.సి. కాలేజి జరుపుకుంటున్నది స్వర్ణోత్సవం. ఈ సంతోషవార్త వినగానే మూడు పాతికల వయస్సు గల నాలో పాతికేళ్ల యువకునిలోని ఉత్సాహం. జె.కె.సి. కాలేజిని తలచుకోగానే నాలో ఎన్నో మధుర జ్ఞాపకాలు. ముప్పై యేళ్ల నా జె.కె.సి. జీవితంలో సాగించిన ఎన్నో వ్యాపకాలు.

జె.కె.సి. కాలేజి అంటే జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కాలేజి. కుప్పుస్వామి చౌదరి గారికి ఆ రోజులలో అంతులేని కీర్తి ప్రతిష్ఠలు. గుంటూరులో మరొక కాలేజి అవసరాన్ని గుర్తించిన పెద్దలు ఒక కమిటీగా రూపొందారు. కాలేజి పేరు విషయంలో ఆ పెద్దలందరూ ఏకగ్రీవంగా నిర్ణయించిన పేరు కుప్పుస్వామి చౌదరి గారి పేరు. గొప్ప గుణముల ఆసామి కుప్పుస్వామి అని కవి పండితులచే ప్రశంసితులైన మహానుభావుడు కుప్పుస్వామి చౌదరి గారు. వారు గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఎందరో తెలుగు పండితులకు ఉద్యోగాలిచ్చారు. ఎందరో కవులను సన్మానించారు. వారి పేరుతో వెలసిన జె.కె.సి. కాలేజిలో ఎందరో విద్యాధిక యువకులకు ఉద్యోగాలు లభించాయి. ఆ ఆదర్శమూర్తికి నా 'ప్రకాశం జిల్లా సాహిత్య ప్రకాశిక' ను అంకితం ఇస్తూ

"ఎందరో పాఠశాలాధ్యాపకులకు కుప్పుస్వామి పెట్టింది భిక్ష.
ఎందరో పాఠశాలాధ్యాపకులకు కుప్పుస్వామి ఇచ్చింది రక్ష.
అందుకే వంచుతున్నాను వారి ముందు నా మస్తకం
అంకితంగా ఉంచుతున్నాను వారి ముందు నా పుస్తకం" అని స్తుతించాను.

జె.కె.సి. కళాశాలకు ప్రథమ అధ్యక్షులు జాగర్లమూడి చంద్రమౌళి గారు. ప్రథమ కార్యదర్శి డాక్టర్ కాసరనేని సదాశివరావు గారు. వీరిరువురూ ఏకమనస్కులై కాలేజి అభివృద్ధికి పాటుపడ్డారు. చంద్రమౌళి గారు చెబితే సదాశివరావు గారు కాదనరు. సదాశివరావు గారు చెబితే చంద్రమౌళి గారు వద్దనరు.

జె.కె.సి. కాలేజికి ప్రిన్సిపాల్స్‌గా పనిచేసిన మొదటి ముగ్గురు సర్వశ్రీ వై. రోసయ్య, డాక్టర్ యస్. అనంతం, డాక్టర్ సి. నరసింహశాస్త్రి, కుప్పుస్వామి కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ముత్తుస్వామి గారిని నియమించా లనుకున్నారు. ఎందుకో గాని ఆ ప్రయత్నం ఫలించలేదు. అప్పుడు ఎ.సి. కాలేజిలో చాలాకాలం ఆంగ్లోపన్యాసకులుగా ఉద్యోగం చేసిన రోసయ్య గారిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. రోసయ్య గారు చండశాసనులు. తనకు నచ్చితేనే తప్ప ఎవరి మాటా వినరు. మేనేజ్‌మెంటు వారు చెప్పినా సరే. ఆ విషయం తెలిసి గూడా మా యాజమాన్యం వారు కాలేజి అభివృద్ధి కోసం వారినే రప్పించారు. ఆ మొదటి రోజులలోనే అనంతం గారిని, అమరేంద్ర గారిని ఇంగ్లీషు డిపార్టుమెంటులో చేర్చుకున్నారు. ముగ్గురూ ఆంగ్ల పండితులు. ముగ్గురూ వరుసగా ప్రిన్సిపాల్స్‌గా వ్యవహరించి జె.కె.సి. కాలేజి ప్రతిష్ఠను పెంచారు.

వేదాలు ప్రభుసమ్మితాలనీ, పురాణాలు మిత్రసమ్మితా లని, కావ్యాలు కాంతాసమ్మితాలని సాహిత్యంలో ప్రసిద్ధి. మేము మా మొదటి ముగ్గురు ప్రిన్సిపాల్స్‌ను వేదపురాణ కావ్యాలతో పోల్చుకునే వాళ్లం. వేదాలు రాజశాసనాల వంటివి రోసయ్య గారి మాటకు తిరుగులేదు. పురాణాలు మిత్రునిలా బోధిస్తాయి. అనంతం గారి మాటలు మిత్రుడిచ్చే సలహాలలా అనిపిస్తాయి. అమరేంద్ర (సి. నరసింహశాస్త్రి గారి కలంపేరు) గారి మాటలు మృదు మధురంగా, మనోహరంగా మనస్సును రంజింపజేస్తాయి. ఆ తర్వాత ప్రిన్సిపల్స్‌గా వ్యవహరించిన సర్వశ్రీ భాస్కరరావు, సోములరావు, సోమేశ్వరశర్మ, ఎస్.ఆర్.కె. ప్రసాద్, భూషయ్య, కుమార్ ఆ ముగ్గురి అడుగుజాడలలో నడిచి బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత ప్రిన్సిపల్ నాగేశ్వరరావు నడుస్తున్నది గూడా అదే బాట.

జె.కె.సి. కాలేజి స్థాపించే నాటికి గుంటూరులో ప్రసిద్ధి గాంచిన ఎయిడెడ్ కాలేజిలు రెండు. ఒకటి ఆంధ్ర క్రైస్తవ కళాశాల, రెండు హిందూ కళాశాల. సీట్లు పరిమితం. విద్యార్థులు అపరిమితం. సీటురాని విద్యార్థులకు నిరాశ. ఈ పరిస్థితిని అధిగమించడానికే

జె.కె.సి. అవతరణ. దశాబ్దాలుగా రంగంలో ఉన్న కాలేజిలు గనుక అధ్యాపకులుగా రెండు కాలేజీలలో లబ్ధప్రతిష్ఠులు ఉండేవారు. ఆంధ్రశాఖలో గూడా ప్రతిభావంతులు పలువురు బోధకులుగా ఆ రెండు కాలేజీలకు ఖ్యాతి తెచ్చారు. ఏ.పి. కాలేజీలో సర్వశ్రీ తెలికచర్ల వేంకటరత్నం, జమ్ములమడక మాధవరామశర్మ, కరుణశ్రీ, స్ఫూర్తిశ్రీ మొదలగువారు, హిందూ కాలేజీలో వావిలాల సోమయాజులు, ప్రసాదరాయ కులపతి వంటివారు ఇందుకుదాహరణ.

జె.కె.సి. కాలేజి యాజమాన్యం వారు అన్ని శాఖలలో సమర్థులైన యువకుల నెన్నుకొని ఆ కాలేజీలతో పోటీపడా లనుకున్నారు. ఎన్నికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకొనేవారు. ఆంధ్రశాఖ పట్ల కార్యదర్శి డాక్టర్ కాసరనేని సదాశివరావు గారు ప్రత్యేకశ్రద్ధ వహించారు. వారు ప్రఖ్యాత శస్త్ర వైద్య నిపుణులు. అంతేకాదు. కావ్యరస గ్రహణ పారీణులు. వారు స్థాపించి, నిర్వహించిన సాహితీ సదస్సులో పాల్గొనని సమకాలీన కవి పండితులు ఉండేవారు కారు. శ్రీ కొల్లా శ్రీకృష్ణారావు కార్యదర్శిగా వ్యవహరించిన సాహితీ సదస్సు నెలనెలా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేది. నేను ప్రచురించి, డాక్టర్ సదాశివరావు గారికి అంకితమిచ్చిన 'కరుణశ్రీ కవితాశ్రీ', డాక్టర్ యస్. అనంతం గారికి అంకిత మిచ్చిన 'తెనుగులెంక తుమ్మల' గ్రంథాలు రెండూ సాహితీ సదస్సులోనే ఆవిష్కరణకు నోచుకున్నాయి.

లెక్చరర్ల ఎన్నిక సమయంలో డాక్టర్ సదాశిరావు గారు, విజయవాడ లయోల కాలేజి ఆంధ్రోపన్యాసకుడు గురుప్రసాదరావు సమర్థుడని ఆ నోటా, ఈ నోటా విన్నారు. అంతేకాదు, వారి సాహిత్యోపన్యాసాన్ని స్వయంగా విన్నారు. సంతృప్తి చెందిన తర్వాత జె.కె.సి. కాలేజికి ఆంధ్ర శాఖాధ్యక్షులుగా ఆహ్వానించారు.

నాగళ్ల గురుప్రసాదరావు ఉపన్యాస కళలో మేటి. స్తుతి యోగ్యం వారి వాగ్ధాటి. ప్రాచీనాధునిక ప్రసిద్ధ కవుల కవితలన్నీ వారికి కంఠస్థం. ప్రాచీనాధునిక ఆలంకారిక విమర్శ రీతులన్నీ వారికి హృదయస్థం. వారిచుట్టూ ఎప్పుడూ శిష్యగణం. శిష్యవాత్సల్యం వారి సహజ గుణం. విద్యార్థు లకు కొన్ని శీర్షికలిచ్చి వారిచేత కళాశాల వార్షిక పత్రికకు (మేగజైన్) వ్యాసాలు రాయించేవారు. వాటిని సరిజూసి, అవసరమైతే చర్చించి, మార్పులు చేర్పులు చేయించేవారు. ఆ ప్రామాణికమైన వ్యాసాలతో మా కళాశాల మేగజైన్ ఆనాటి సాహిత్య మాసపత్రిక 'భారతి'కి సరిజోడుగా ఉండేది. అన్నట్లు నాగళ్లవారు ఆ రోజులలో 'భారతి' పత్రికలో ఉన్నత స్థాయి సమీక్షలు రాసేవారు. 'భారతి' సంపాదకుడు శివలెంక శంభుప్రసాద్ ప్రత్యేకంగా అడిగి 'భారతి'కి వ్యాసాలు రాయించుకునే వారు.

గురుప్రసాదరావు గారు గ్రాంథిక భాషాభిమానులు. ప్రామాణిక భాషలోనే కవితా వ్యాసంగం సాగించిన తుమ్మల సీతారామమూర్తి వారికి దైవసమానులు. ''చిన్నయ నాలో కొలువున్నవాడు జీవాత్మవలెన్" అని తుమ్మలవారు భావిస్తే, చిన్నయ పేరిట సాహిత్య సభలు నిర్వహించి తుమ్మలకు ప్రీతిపాత్రులయ్యారు నాగళ్ళ వారు. కేంద్ర సాహిత్య అకాడమి వారు నాగళ్ల వారి సమర్థతను గ్రహించి తుమ్మల వారిపై మోనోగ్రాఫ్‌ను రాయించారు. జె.కె.సి. కళాశాల కేంద్రంగా వెలసిన తుమ్మల కళాపీఠం వారు తుమ్మల వారి పేరిట ఇచ్చే తుమ్మల అవార్డును ఒక సంవత్సరం గురుప్రసాదరావు గారికి ఇచ్చి గౌరవించారు.

కొన్ని సంవత్సరాల తర్వాత గురుప్రసాదరావు గారు తాడికొండ సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్ళారు. పిమ్మట విజయవాడ సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం వారు గురుప్రసాదరావు గారికి లలితకళా వేదిక నిర్వహణ బాధ్యత నప్పగించారు. ఇటీవలవారికి, వారి(మా) శిష్యుడైన పాపినేని శివశంకర్‌కు కేంద్ర అకాడమీ అవార్డు లభించింది. యాదృచ్ఛికమే అయినా గురుశిష్యులిద్దరికీ ఒకే సంవత్సరం లభించిన ఈ అవార్డు వారిద్దరికీ, మా కందరికీ అమితానందం కలిగించిన అవార్డు.

గురుప్రసాదరావు గారి తర్వాత మిత్రులు కడియాల రామమోహనరాయ్ ఆంధ్రశాఖాధ్యక్షులయ్యారు. ఏ.సి. కాలేజీలో మూడు సంవత్సరాల అనుభవంతో వారు జె.కె.సి.కి వచ్చారు. 'భారతి' మాసపత్రికలో సమర్థులైన సమీక్షకులనే ఖ్యాతితో వచ్చారు. వచ్చిన తర్వాత మంచి బోధకుడని విద్యార్థులు మెచ్చారు. మంచి వక్త అని సాహిత్య సభల నిర్వాహకులు మెచ్చారు. తమను గూర్చి రాయ్ ఒక ప్రశంసా వాక్యం పలకడమే మహాభాగ్యంగా భావిస్తారు. ఆధునిక యువ కవులు. సమగ్ర ఆధునిక సాహిత్యం వారికి కరతలామలకంగా భావించి తెలుగు సాహిత్య అకాడమీ వారు వారిచే తెలుగు సాహిత్య వికాసం గ్రంథాన్ని రాయిం చారు. ఆధునిక సాహిత్యంలో అది ఒక ప్రామాణిక గ్రంథమని సాహిత్యాభిమానులు భావిస్తున్నారు.

యుజిసి వారు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని రామమోహన్‌రాయ్ కర్షక సాహిత్యంపై పరిశోధన సాగించి డాక్టరేట్ పొందారు. యుజిసి వారి పోస్టు డాక్టరేట్ రీసెర్చి స్కీమ్ కింద ఆధునిక సాహిత్యంపై ప్రామాణిక పరిశోధన సాగించారు. సమీక్షా సరస్వతికి రాయ్ కలికితురాయి.

డాక్టర్ గుండవరపు లక్ష్మీనారాయణ ఎం.ఏ.లో సర్వ ప్రథముడుగా నిలిచి బంగారు పతకం సాధించిన ప్రతిభావంతుడు.

శ్రీనాథ మహాకవి భీమేశ్వర పురాణానికి దక్షిణ కాశిక పేర వ్యాఖ్యానము రాసిన పండితశ్రేష్ఠుడు. వారు కవిత్వం రాశారు (కళాకేళి, చతురాస్య). వ్యాస సంపుటులు ప్రచురించారు. (మణిహారము, పంచముఖి, వాల్మీకి రామాయణము, కొప్పరపు సోదర కవులు మొ॥వి). నాటకం రాశారు (తిరుపతి వేంకటీయము). డిగ్రీ విద్యార్థులకు అది కొంతకాలం పాటు పాఠ్యగ్రంథం. హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు పై పరిశోధన గావించి పిహెచ్.డి. పట్టా పొందడంతో పాటు ఆ గ్రంథాన్ని వ్యయప్రయాసలకోర్చి ముద్రించారు. డజను ముద్రిత గ్రంథాలకు, అరడజను అముద్రిత గ్రంథాలకు కృతి కర్తయైన లక్ష్మీనారాయణ నా 'ప్రకాశం జిల్లా సాహిత్య ప్రకాశిక' మూడవ భాగానికి కృతికర్త.

చిన్నం రామయ్య చౌదరి మంచి పండితుడు. తుమ్మల సీతారామమూర్తి గారికి నచ్చిన పండితుడు. జిల్లా పరిషత్తు వారి పలు పాఠశాలలలో పెక్కేండ్లు పనిచేసి జె.కె.సి. కళాశాలలో ప్రవేశించారు. విద్యార్థులకుపకరించే గ్రంథాలు కొన్ని రాశారు. సాహిత్య విషయకంగా మాకు ఏ సందేహం కలిగినా, వారే మాకు ఆ సందేహాలను తీర్చే పెద్ద దిక్కు వారి పదవీ విరమణానంతరమే మాకు అర్ధాది నిర్ణయాలకు నిఘంటువు లయ్యాయి దిక్కు. ఆ తర్వాతే నడిచాము మేము గ్రంథాలయం దిక్కు.

జె.కె.సి. కాలేజి ఆంధ్రశాఖకు అలంకారప్రాయులు పులిచెర్ల సోదరులు. వారిలో పెద్దవారు పులిచెర్ల సుబ్బారావు గారు. వారు హైస్కూల్‌లో తెలుగు టీచరుగా ఉద్యోగం చేస్తూ మూడు ఎం.ఏ. డిగ్రీలు సాధించారు. ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. సంస్కృతం బోధించారు. వారు, తమ చరిత్రాభి మానాన్ని రచనల ద్వారా తీర్చుకున్నారు. 'జై భవానీ – జై శివాజీ' ఛత్రపతి శివాజీ చరిత్ర. అది పలు ముద్రణల నందించినది. 'ప్రాంచీల బూచి బుస్సీ' ఫ్రాన్స్ అధికారి బుస్సీ చరిత్ర. 'సైతాన్ కా బచ్చా' మొగలాయి చరిత్ర. 'బాబు' వారి పద్య ఖండికా సంపుటి. 'హంసావళి' వారి కథావళి. హంసావళిలోని పరమాన్నం వంటి కథలు చదివిన వికాస్ విద్యా సంస్థల నిర్వాహకుడు శంకరరావు మనస్సు కరిగిపోయి ఆ పుస్తకాన్ని సొంత ఖర్చుతో పునర్ముద్రించారు. పులిచెర్ల వారికి భక్తి, దేశభక్తి అధికం. వారి నవలలు దేశభక్తికి నిదర్శనాలు. పోతన భాగవతంలోని ప్రధాన ఘట్టాలను ఒక గ్రంథంగా ముద్రించడం, భాగవత సభలను నిర్వహించడం వారి భక్తికి తార్కాణాలు. తన గురువు మన్నవగిరిధరరావు హిందూ ధర్మాభిమానంతో నిర్వహించిన 'భారతీయ మార్గం' పత్రిక ఆగిపోతే, తాను సంపాదక బాధ్యతను జీవితాంతం నిర్వహించడం భారతీయత పట్ల వారికి గల అభిమానానికి ఉదాహరణ. తుమ్మల వారి శతజయంతి సందర్భంగా గుంటూరు సాహిత్యాభిమానులు తుమ్మల వారికి గల అభిమానానికి ఉదాహరణ. తుమ్మల వారి శతజయంతి సందర్భంగా గుంటూరు సాహిత్యాభి మానులు తుమ్మల వారి సాహిత్య సర్వస్వాన్ని నాలుగు సంపుటాలుగా ప్రచురిస్తే ఆ ముద్రణ భారాన్నంతా భరించి సాహితీ ప్రియుల సంస్తుతికి పాత్రులయ్యారు. కవిబ్రహ్మ ఏటుకూరి వెంకటనరసయ్య కృతులను రెండు సంపుటాలు గా ప్రచురించిన సందర్భంలో గూడా ఆరోగ్యం సహకరించక పోయినా ఆ సాహిత్య కార్యక్రమానికి సహకరించారు. రంగా మరణానంతరం జరిగిన అల్లర్లలో జె.కె.సి. కాలేజి నష్టపోయింది. నష్టనివారణకు ఎందరెందరో సహకరిం చారు. సుబ్బారావుగారు తాను రాసిన వీరపాండ్య కట్ట బ్రహ్మన నాటకాన్ని జె.కె.సి. కాలేజి ఉద్యోగులచే పలు ప్రాంతాలలో ప్రదర్శింపజేసి, వచ్చిన మొత్తాన్ని జె.కె.సి. కాలేజికి విరాళంగా ఇచ్చారు. కాలేజిపై వారికి గల అభిమానమే ఇందుకు కారణం. ఇంకా ఎంతో కాలం జీవించవలసిన సుబ్బారావు గారు అకాల మరణం పొందడం దురదృష్టం.

పులిచెర్ల సాంబశివరావు అన్నకు తగ్గ తమ్ముడు. అన్నకు తగ్గని తమ్ముడు. అన్నను మించిన తమ్ముడు. సాంబశివరావు తెలుగులో డాక్టరేటు చేశాడు. అన్న మొగలు చక్రవర్తి ఔరంగజేబు నెదిరించిన శివాజీ చరిత్ర నవలగా రాస్తే తమ్ముడు అక్బరు నెదిరించిన రాణాప్రతాప్ చరిత్రను నవలగా రాశాడు. అనేక కథా సంపుటులను ప్రచురిం– చాడు. సాంబశివరావు గొప్ప వ్యంగ్య చిత్రకారుడు. ఒకప్పుడు ప్రతిరోజు ఏదో ఒక పత్రికలో వారి వ్యంగ్య చిత్రాలు ప్రచురితమయ్యేవి.

డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య జె.కె.సి. కాలేజీలో నిర్వహించారు పెక్కు పదవులు. వారి మనోభావనలన్నీ సమాజాభి వృద్ధికి నెలవులు. వారు ఆంధ్ర సాహిత్యాభిమానంతో జె.కె.సి.లో తుమ్మల కళాపీఠాన్ని నెలకొల్పారు. కార్యదర్శిగా సాంబశివరావు గారిని నియమించారు. పీఠం తరఫున తుమ్మల వారి జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు. తుమ్మలవారి పేర ప్రతి సంవత్సరం ఒక సాహితీ సేవకునికి పదివేల రూపాయలిచ్చి సత్కరిస్తున్నారు. సాహిత్య గ్రంథ ప్రచురణ గావిస్తున్నారు. ఈ బాధ్యతలన్నీ జె.కె.సి. ఆంధ్రశాఖాధ్యక్ష బాధ్యతను నిర్వహిస్తూనే సాంబశివరావు నెరవేర్చేవారు.

అంబటి శంకరరెడ్డి మాకు మంచి మిత్రుడు. ఎం.ఏ. తర్వాత చంద్రికా పరిణయం గ్రంథంపై పరిశోధన సాగించి పిహెచ్.డి.

సాధించాడు. క్లాసు ఉన్నప్పుడు క్లాసులో, క్లాసు లేనప్పుడు లైబ్రరీలో అతని కాలక్షేపం. విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో పాఠాలు బోధించడంలో సమర్థుడు.

అన్నదానం రామస్వామి శాస్త్రి హైస్కూలులో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయుడు. ఏ.సి. సాయం కళాశాలలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు వారు విద్యాబోధన చేసే విధానాన్ని, వారి రాగయుక్త పద్య పఠనాన్ని అప్పటి ప్రిన్సిపాల్ ఎం.జి. థామస్ స్టాఫ్ మీటింగ్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించారు. వారు వయస్సులో పెద్ద అయినా మా అందరితో కులాసాగా, స్నేహపాత్రంగా ప్రవర్తించేవారు. మా మిత్రుడు పులిచెర్ల సాంబశివరావు తాను రచించిన 'స్వర్ణయోగి' నవలలో ఒక కల్పిత పాత్రకు రామస్వామి శాస్త్రి అని పేరు పెట్టారు.

మా ఆంధ్ర శాఖలో ఎక్కువ కాలం ఉపన్యాసకులుగా ఉద్యోగం చేసిన అంగనామణులు ముగ్గురు. శ్రీమతులు పి. శాంతకుమారి, వి. అరుణ కుమారి, టి. లక్ష్మీప్రసన్నం. శాంతకుమారి విద్యార్థి దశ నుండి విద్యార్థి సంఘ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. అందువలన బోధన వారికి కష్టమైన పని కాదు. ఇష్టమైన పనే. అరుణకుమారి నెమ్మదిగా విద్యార్థుల మది కింపుగా పాఠ్యబోధన గావించేవారు. లక్ష్మీప్రసన్నం గారు భాషా ప్రవీణగా తెలుగు భాషాశాఖలో ప్రవేశించారు. తర్వాత ప్రైవేటుగా ఎం.ఏ. ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులై, రంగాజమ్మ ఉషాపరిణయంపై పరిశోధన చేసి పిహెచ్.డి. అందు కున్నారు. సరస్వతీ ప్రసన్నత నందిన లక్ష్మీప్రసన్నం గారు జె.కె.సి.లో ఆంధ్రశాఖకు అధ్యక్షత వహించి పదవీ విరమణ నందారు.

జె.కె.సి. కాలేజీలో సంస్కృత, హిందీ బోధకులు కూడా మా శాఖలో భాగమైపోయారు. ఒకే స్టాఫ్‌రూమ్‌లో మేమంతా ఉండేవారం. జ్యోతిష పండితులైన, వివాహాది శుభాకార్య నిర్వాహకులైన డా॥ శంకరసాయి, సుప్రసిద్ధ సంస్కృత పండితులు కోగంటి సీతారామచార్యుల వారి పుత్రులు డాక్టర్ అప్పలాచార్యులు జె.కె.సి.లో సంస్కృతోపన్యాసకులు. శ్రీ తిమ్మయ్య, శ్రీ నాగభూషణం ఇద్దరి తర్వాత జాతీయ భాషకు శ్రీ భాస్కరరావు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. భాస్కరరావు గారు ప్రాచ్యభాషాశాఖాధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తు–న్నారు.

కొద్దికాలం మా శాఖలో పనిచేసి కారణాంతరాల వలన కాలేజి వదిలినవారు గూడా కొందరున్నారు. వారిలో జె.కె.సి.లో విద్యాభ్యాసం చేసి, జె.కె.సి.లో ఉద్యోగం చేసి ప్రస్తుతం విజయవాడలో 'శిఖర' విద్యా సంస్థను నిర్వహిస్తున్న బండ్ల మాధవరావు సమర్థుడైన ఆధునిక కవి.

ఇంతకు ముందు వివరించిన నా సహాధ్యాపకు– లందరూ నా సన్నిహితులు, స్నేహితులు. జె.కె.సి. కాలేజి సారస్వత సమితి నిర్వహణలో, వార్షిక పత్రిక ముద్రణ వ్యవహారంలో, ఆంధ్రా యూనివర్శిటీ వారి దూరవిద్యాకేంద్ర నిర్వహణలో, వీరందరూ నాకు సహకరించే వారు. ప్యూను నుండి ప్రిన్సిపాల్ వరకు అందరూ నన్ను అభిమానించే వారు. నా రచనా వ్యాసంగానికి గూడా ఈ మిత్రులందరి ప్రోత్సాహమే కారణం. తుమ్మల వారిపై మొట్టమొదటగా విమర్శ గ్రంథం రాశాననే అభిమానంతో ఒక సంవత్సరం తుమ్మల పీఠం వారు ఇచ్చిన అవార్డు నందుకున్నాను. ఇటీవల నేను రాసిన నవయుగకవి చక్రవర్తి జాషువ గ్రంథాన్ని గూడా తుమ్మల కళాపీఠం వారే ప్రచురించారు. డాక్టర్ ముద్దన హనుమంతరావు గారి అభ్యర్థనలతో కొన్నేండ్లపాటు నేను నిర్వహించిన అమరావతి సంస్కృతిక వేదిక కార్యక్రమాలు విజయంతం కావడానికి కూడా పులిచెర్ల సోదరులు, తక్కిన మిత్రులు ఎంతగానో సహక– రించారు.

జె.కె.సి. కాలేజీ ఆంధ్రశాఖలో ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న నలుగురు ఉపన్యాసకులు శ్రీమతి విజయశ్రీ, శ్రీమతి ప్రశాంతి, శ్రీ సుబ్బారావు, శ్రీ మస్తాన్‌రావు నలుగురి మెప్పు పొందుతున్నవారు. వీరందరూ ఎమ్.ఫిల్. డిగ్రీలు పొందినవారు. వీరిలో కొందరు పిహెచ్.డి. డిగ్రీ గూడా పొందారు, కొందరు పొందనున్నారు. వీరిలో కొందరు జె.కె.సి. విద్యార్థులు. అందరూ జె.కె.సి. అభిమానులు. కొందరు సాహిత్య విషయంలో కృషి చేస్తే, కొందరు భాషా శాస్త్ర విషయంలో కృషిచేసిన వారు. అందరూ తాము సాధించిన విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించాలనే దృఢనిశ్చయంతో ఉన్నవారు. అందరూ జె.కె.సి. కాలేజి కీర్తి ప్రతిష్ఠలను దశదిశలా వ్యాప్తి గావించాలనే దృఢ సంకల్పంతో ఉన్నవారు.

ఇటువంటి ఉత్తమోత్తములైన ఉపన్యాసకుల సహకారంతో జె.కె.సి. కాలేజీ ధీరగంభీర గమనంతో ముందుకు నడుస్తూ భవిష్యత్తులో వజ్రోత్సవాలను, ప్లాటినమోత్సవాలను, శత వసంతోత్స వాలను ఆనందంతో జరుపుకోవాలని అస్మదాదుల ఆకాంక్ష.

అభినందనలు

శ్రీ బాలినేని రామారావు

పూర్వ విద్యార్థి
ఏబిఎన్–ఆంధ్రజ్యోతి



జీవితంలో విద్యనే కాదు... క్రమశిక్షణ... కృషి, పట్టుదల, ఎదిగే తత్వాన్ని నేర్పింది... ఆ కళాశాలలోని విద్యాభ్యాసం... అందుకే జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాలతో మాకు అవినాభావ బంధం. ఈ రోజు మా వృత్తిలో మేము ఎదుగుతున్నామంటే జె.కె.సి. కళాశాలలో ఆనాటి గురువులు నేర్పిన విద్యాబుద్ధులే... నా పేరు బాలినేని రామారావు. మాది పెదకూరపాడు. నేను జె.కె.సి.లో ఇంటర్మీడియట్ బై.పి.సి., డిగ్రీ బి.ఎ. చదివాను. 1986 మార్చిలో డిగ్రీ పూర్తి చేశాను. నేను ఆ తరువాత ఆంధ్రజ్యోతి, గుంటూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా జాయిన్ అయ్యాను. 2009 వరకు ఆంధ్రజ్యోతి, గుంటూరు బ్యూరో ఇన్‌చార్జ్‌గా పనిచేసి, ఆ తరువాత ఆంధ్రజ్యోతి సంస్థ నుంచి వచ్చిన ఏ.బి.ఎన్. న్యూస్ ఛానల్, విజయవాడ రీజినల్ ఇన్‌చార్జ్‌గా పనిచేశాను. రాష్ట్ర విభజన తరువాత పరిపాలన అమరావతికి తరలివచ్చింది. నేను ఏ.బి.యన్ – ఆంధ్ర జ్యోతి న్యూస్ ఛానెల్‌కు ఆంధ్రప్రదేశ్ న్యూస్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నాను. ఇది నా స్వగతం.

జె.కె.సి. కళాశాలలో మా అన్నయ్య కూడ చదివారు. ఆయన పేరు బాలినేని రఘునాధరావు. ఆయన బి.కాం. మన కాలేజిలో పూర్తిచేసి తరువాత సి.ఏ. చేశారు. ప్రస్తుతం గుంటూరు బ్రహ్మయ్య అండ్ కంపెనీలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. నేను 10వ తరగతి పూర్తి చేసిన సమయానికి అప్పట్లో గుంటూరు జె.కె.సి. కళాశాలలో చేరడం అంటే మంచి క్రేజ్, ఆ కళాశాలలో కూడా సీటు వస్తే చాలనుకునేవారు. నాకు కళాశాలలో బై.పి.సి. తెలుగు మీడియంలో సీటు వచ్చింది. రోజూ పెదకూరపాడు నుంచి రైలులో వచ్చి స్తంభాలగరువు వద్ద రైలు చైను లాగి ఆపివేసి కళాశాలకు హనుమయ్య కంపెనీ మీదుగా నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళం. ఆ తరువాత 1983 నుంచి 1986 వరకు డిగ్రీ కూడ జె.కె.సి. కళాశాలలోనే చదివాను. బి.ఏ. ఇంగ్లీష్ లిటరేచర్ చదివాను.

జె.కె.సి. కళాశాలలో మేం చదువుకునే సమయంలో అధ్యాపకుడు – విద్యార్థి మధ్య సంబంధాలు చాలా ఉన్నతంగా ఉండేవి. ఎవరైనా దారితప్పినా పిలిపించి మాట్లాడేవారు. యూనిట్ పరీక్షల నుంచి క్వార్టర్లీ, హాఫ్‌యర్లీ పరీక్షలు వరకు మార్కులు, అటెండెన్స్ ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డ్ ఇంటికి వచ్చేది. చదువులో వెనుకబడినా ఒకటికి రెండుసార్లు వెళ్లి అడిగినా, లేదా స్టాఫ్ రూంకు పిలిపించి చెప్పేవారు. అప్పట్లో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఉన్న పి.ఎస్. గారు మాకు డిగ్రీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో షేక్‌స్పియర్ రచించిన AS YOU LIKE IT నాటకం ఆయన చెబుతుంటే వినాలనిపించేది. ఆయన క్లాస్‌కు వచ్చిన కొద్దిసేపటి వరకు సబ్జెక్ట్ కాకుండా జీవితానికి సంబం ధించిన విషయాలు చెప్పేవారు. అందుకే క్లాస్‌మిస్ కాకూ డదు అనిపించేది. ఇంగ్లీష్ లెక్చరర్ నర్రా నాగేశ్వరరావు గారు (మా నాన్నగారికి మంచి స్నేహితుడు) నేను సెకండ్ ఇయర్‌లో స్పెషల్ ఇంగ్లీష్‌లో ఒక పేపర్ ఫైనల్ ఎగ్జామ్‌లో మార్కులు తక్కువ వస్తాయనే ఉద్దేశ్యంతో రాయలేదు. అది తెలుసుకున్న ఆయన నన్ను డిపార్టుమెంట్‌కు పిలిపించి అడిగారు. కష్టపడి చదవాలి అని చెప్పారు. కష్టపడితే సాధ్యం కానిది ఏది ఉండదు అని చెప్పారు. ఆ మాటలు నాకు ఎప్పుడూ గుర్తుంటాయి. తెలుగులో ఏదైనా సమస్య వస్తే గొల్లపూడి ప్రకాశరావు గారి వద్దకు వెళ్ళేవాళ్ళం. ఆయన కుమారుడు జగదీష్ (ప్రస్తుతం త్రివేణి స్కూల్స్, కళాశాలల ఎం.డి.), కుమార్తె ప్రమద్వర, నాకు క్లాస్‌మేట్స్. మా క్లాస్‌లో తెలుగు లిటరేచర్‌లో బండ్ల మాధవరావు అప్పట్లోనే వాడిని కవి అని పిలిచేవాళ్లం. ఇప్పుడు వాడు నిజంగానే కవి. చాలా ఆనందంగా ఉంటుంది. నా క్లాస్‌మేట్స్ మహేష్, వెంకటేశ్వరరావు (డొంకరోడ్డు), వెంకటేశ్వర్లు (ఎం.ఎల్.ఏ.), నాగార్జున,

కైలాస్, రాంప్రసాద్, ఇలా అందరూ కలిసి ఉండేవాళ్ళం.

అన్నట్లు మరచిపోయాను. జె.కె.సి.లో విద్యార్థి, అధ్యాపకుడి మధ్య సంబంధాలు గురించి చెప్పాలంటే మాకు డిగ్రీలో పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్ ఉంది. ఆ సబ్జెక్ట్‌ను పి.వి.సి. (పులివర్తి వెంకటాచలం) చక్కగా చెప్పేవారు. నాకు ఆరోగ్యం బాగోలేక కాలేజీకి నాలుగు రోజులు రాకపోతే ఆయన పెదకూరపాడు కబురుచేశారు. అది ఆనాడు విద్యార్థులపై లెక్చరర్లకున్న శ్రద్ధ. మేము కాలేజి ఎన్నికల్లో పాల్గొనేవాళ్లం. కాని చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. నేను ఇంటర్ బై.పి.సి. చదివాను. అప్పుడు కెమిస్ట్రీ మాకు పాతూరి కోటేశ్వరరావు గారు చెప్పేవారు. ఆయనకు గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారంటే బాగా ఇష్టం. మమ్ములను ఊరు పేరు పెట్టి పిలచేవారు. తల్లిదండ్రుల కష్టం, విద్యాభ్యాసం, శ్రమ, కష్టపడి చదవాలని చెప్పేవారు. ఆయన మాటలు అప్పట్లో నా మీద తీవ్ర ప్రభావం చూపాయి.

ఇలా మా కళాశాలలో చదివిన ప్రతిరోజు, గడిపిన ప్రతిక్షణం మాకు మధురానుభూతులే. కళాశాల వాతావరణం, గ్రౌండ్స్, క్రమశిక్షణ, అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ ఇవన్నీ కూడ జె.కె.సి.లో చదివిన నాలాంటి ఎందరినో చక్కగా తీర్చిదిద్దాయి. పెదకూరపాడు, లింగంగుంట్ల, సిరిపురం, మందపాడు, బండారుపల్లి గ్రామాల నుంచి జె.కె.సి. కళాశాలకు ప్రతిరోజు 300 నుంచి 400 మంది వరకు చదువుకోవడానికి వచ్చేవారు. నాతోపాటు. నా క్లాస్‌మెట్స్, ఫ్రెండ్స్ అందరూ బాగా స్థిరపడినవాళ్లే. అందుకే ఎక్కడా, ఏ రంగంలో చూసినా జె.కె.సి.లో చదువుకొన్న వాళ్లు చాలామంది ఉంటారు.

అప్పట్లో కళాశాలలో ఇనాగరల్ ఫంక్షన్, యానివర్సిరీ బాగా చేసేవాళ్ళు. ఒక వార్షికోత్సవ సభలో అప్పటి ప్రిన్సిపల్ అమరేంద్ర గారు (CN Sastry) జె.కె.సి. అంటే జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల అంటే 'జె' అంటే జ్యోతి (నిత్యం వెలుగులు నింపడం), 'కె' అంటే కృషి (కృషితో సాధ్యం కానిది ఏదీ లేదు), 'సి' అంటే చైతన్యం (నిత్య చైతన్యవాహినిగా ఉండాలి) గా ఉండాలి అని చెప్పారు. ఈ మాటలు అక్షరాలా నిజం... జె.కె.సి. కళాశాల ఎప్పుడూ అలానే ఉండాలి. ఇంకా మాలాంటి వాళ్ళకు ఎంతో మందికి విద్యా సుగంధాలు పంచాలి. ఎయిడెడ్ కళాశాలల శకం పోయి కార్పోరేట్ విద్య వైపుకు, ఇంజనీరింగ్ కళాశాలల వైపుకు పరుగులు తీస్తున్న తరుణంలో మా కాలేజి మాత్రం ఇప్పటికీ ఆ ప్రతిష్ఠను కోల్పోలేదు. భవిష్యత్తులో కోల్పోదు కూడ. అదే మాకు గర్వకారణం. నాకు మరో గురువు అప్పటి బాటనీ లెక్చరర్ ఎస్.ఆర్.కె. ప్రసాద్. ఆయనను తరచూ కలుస్తుంటాను. పాతూరి కోటేశ్వరరావు గారిని కూడా కలుస్తాను. ఇప్పటికీ మా మధ్య గురు, శిష్యుల సంబంధాలే. వారు కనిపిస్తే ఇప్పటికీ కాలేజీ ఎలా ఉంది, విద్యార్థినీ, విద్యార్థులు ఎంతమంది ఉన్నారని ఎస్.ఆర్.కె. ప్రసాద్ గారిని అడుగుతాను. స్టూడెంట్స్ ఎక్కువ మంది ఉన్నారంటే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. మా కళాశాల నిత్య చైతన్య స్ఫూర్తే, నిత్య విద్యా సుగంధాలను పంచే విద్యా పుష్పమే. భవిష్యత్‌లో కూడా ఇలానే ఉండాలి. మరింతమందికి విద్యాబుద్ధులు నేర్పాలి అని, స్వర్ణోత్సవమే కాదు, శత వసంతాలు జరుపుకోవాలి... అని మనసారా కోరుకుంటున్నాను.

శుభాశీస్సులు

(మన కళాశాల ప్రారంభోత్సవ సమయములో
కవిపుంగవులు **శ్రీ గుర్రం జాషువ** చెప్పిన పద్యం)

తెలుగుబొలాన దావమున దిగ్రమణీ కమనీయకీర్తిచే
వెలిగిన కుప్పుస్వామియె నవీనకళాశాలయై జనించి, యాం
ధ్రుల హృదయాక్షిగోళముల దోచి, నతుల్ గొనజొచ్చె, నీ కళా
నిలయము సత్కళల్ గురిసి నించుతగీర్తమణీ వితానముల్.

పరమాన్నం

శ్రీ పులిచెర్ల సుబ్బారావు
పూర్వ తెలుగు ఉపన్యాసకులు



పండుగ వొస్తే చాలు, మహాలక్ష్మమ్మ ఏది చేసినా చెయ్యక పోయినా సగ్గు బియ్యపు పరమాన్నం చేసి తీరుతుంది. పరమాన్నం అంటే పడిచస్తుందావిడ. ఆ ఇంటి జీతగాడు కోటయ్యకు ఆ సంగతి బాగా తెలుసు.

అందుకే ఆ ఉగాది నాడు పొద్దుటి నుంచీ ఏ పని చేస్తున్నా వాడినోరు ఊరిపోతూనే ఉంది.

మధ్యాహ్నం వాడి పెద్ద కంచంలో మహాలక్ష్మమ్మ ఏవేవో కూరలు వడ్డిస్తూంటే "ముందు పరవాణ్ణం తేవమ్మా" అని గద్దించాడు.

జీతగాడు ఇంటి యజమానురాల్ని గద్దించడం ఏమిటా అని ఎవరూ నివ్వెరపోనక్కరలేదు. నవ నాగరికత ముదరని తెలుగు రైతు కుటుంబాల్లో ఇది మామూలే. ఇంటా బయటా ఎంత చాకిరీ చేసినా తిండి తిప్పల్లో మటుకు జీతగాడికి సరిభోజనం వుండక తప్పదు. తెచ్చికోలు మర్యాదలకు అసలు స్థానమే ఉండదు.

"ఓరి నీ పొట్టపగల ! తరవాత పరవాన్నం పోస్తాను" అంటూ కంచాన్ని పిండివంటల్తో నింపింది మహాలక్ష్మమ్మ.

"ఇయ్యన్నీ తిన్నాక పొట్టలో పరవాణ్ణం ఎక్కడ పట్టుద్దమ్మా?"

అదే పంక్తిలో ఇంటి యజమాని రాఘవయ్యా, పెద్ద కొడుకు రమణారావూ, చిన్నకొడుకు శేషగిరీ, కూతురు పద్మా కూడా భోంచేస్తున్నారు.

"ఇంతకీ పరమాన్నం మనదాకా వొస్తుందంటావురా కోటయ్యా !" అన్నాడు రాఘవయ్య నవ్వుతూ.

"నిజమేనయ్యా ! అమ్మకి పరవాణ్ణం అంటే ప్రాణం కదూ ! వొట్టి పరవాణ్ణమే తాగుతుందేమో !"

"నోరుముయ్యరా గాడిద కొడక ! అయ్యగారూ, జీతగాడూ బాగా కుదిరారు" నవ్వుతూనే విసుక్కుంది మహాలక్ష్మమ్మ.

"ఇందులో అబద్ద మేముందమ్మా ! కాకపోతే అబ్బురాల పెద్ద కొడుక్కి అంత వేస్తావేమో ! పెద్దకొడుకేదో ఉద్ధరిస్తాడనుకుంటున్నా వేమో ! ఎప్పటికైనా చిన్నకొడుకే నిన్ను చూడాలి."

ఇలాంటి సంభాషణ ఆ ఇంటిలో పరిపాటే. అందువల్ల ఎవరి మాటా ఎవరూ అంతగా పట్టించుకోరు.

కోటయ్య పోరుపడలేక అందరికంటే ముందు వాడి కంచంలో పరమాన్నం వడ్డించింది మహాలక్ష్మమ్మ. ఇహ ఆ తరువాత జోరు పరమాన్నం జుర్రుకోడంలో మునిగి పోయాడు కోటయ్య. అంతులేని వాత్సల్యంతో వాడి వైపే చూస్తూ వుండిపోయింది మహాలక్ష్మమ్మ.

** ** **

మరో పది ఉగాదులు గడిచాయి.

పదకొండో ఉగాదినాడు పెద్దకంచం చేతబట్టుకుని ఆ ఇంటిలోని కడుగెట్టాడు కోటయ్య.

అడుగెడుతూనే "ఈ రోజు నీ చేతి కూడు తినాలమ్మా" అన్నాడు.

"తినరా కోటయ్యా ! నీకంటే ఎక్కువేముంది?" అంది మహా లక్ష్మమ్మ.

పచ్చి పసుపుకొమ్ము లాంటి ఆ ఇల్లాలి నుదుట కుంకుమ బొట్టు కరువైంది ఈనాడు. కోటయ్య కూడా నేడు ఆ ఇంట జీతగాడు కాడు. ఐనా ఆనవాయితీ కొద్దీ తల్లిలాంటి మహాలక్ష్మమ్మ చేతి భోజనం మీద మక్కువ చావక ఇలా వచ్చాడు.

ఆప్యాయంగా అన్నదేగాని వాడికి కడుపారా భోజనం పెట్టే స్తోమతు ఆమెకు లేదు.

తన మామూలు మొత్తకు ఆనుకుని కూచున్నాడు కోటయ్య.

దూరంగానైనా ఎవరూ పళ్లెంవాల్చి కూచోకపోవడం గమనించి అతనికి చిర్రెత్తుకొచ్చింది. "ఏవమ్మా ! నేనేం బిచ్చానికొచ్చానా ఓ మూల కూచోబెట్టి ఇంతకూడు పడెయ్యడానికి?" పెద్దగా అరిచాడు.

"ఓర్నీకడుపుడక ! ఎందుకు అరిచి చస్తావురా? నేనూ కూచుంటాలే" అంటూ ఓ పక్కన కూలబడి "అమ్మాయి !! నాక్కూడా తీసుకురావే" అని కేకేసింది మహాలక్ష్మమ్మ.

ఇల్లంతా పారజూశాడు కోటయ్య.

వాడి గుండె పిండినట్లయింది.

తను పుట్టి బుద్ధెరిగినదగ్గర్నుండీ కలకలలాడుతున్న ఇల్లు ఇప్పుడెంత వెలవెల బోతూంది ! ఏవీ ఆ నవ్వులు? తనకి పెళ్ళీ పెటాకులు చేసిన మహానుభావుడు కాస్తా తెల్చార్చుకుపోయాక వ్యాపారం, వ్యవసాయం రెండూ మూలబడ్డాయి. ఆ ఇంటికి తను బరువేనని గ్రహించి ఎక్కడో కూలీనాలీ చేసుకుని బతుకుతున్నాడు.

తన కంచంలో అన్నమూ పచ్చడీ వడ్డించిన స్త్రీవైపు చూశాడు కోటయ్య.

"ఏంట్రా అట్లా చూస్తావు? రెండోవాడు శేషగిరి భార్య."

కోటయ్య తలొంచుకుని పచ్చడి కలుపుకుంటూ "పండక్కి అమ్మాయినీ అల్లుణ్ణీ తీసుకురాలేదూ?" అన్నాడు.

"తీసుకురావడం కుదర్లేదురా."

వంచిన తలెత్తకుండా ఆ పచ్చడి మెతుకులే నిదానంగా తింటున్నాడు కోటయ్య.

"ఉరేయ్ కోటయ్యా! వెనకటిలాగా గార్లూ బూర్లూ లేకపోయినా పరవాన్నం ఉందిలే !"

కోటయ్య ఉలకలేదు పలకలేదు. క్రీగంట మహా లక్ష్మమ్మ పళ్ళెరంలోని పచ్చడినే చూస్తున్నాడు.

"ఏంట్రా మొద్దువెధవ ! పలకవేం?"

పూడుకుపోయిన గొంతు పెకలించుకుని "ఏంలేదు లేవమ్మా" అని మాత్రం అన్నాడు.

ఓ చిన్న గిన్నెలో పరమాన్నం తెచ్చి అత్త పళ్ళెం పక్కనుంచింది కోడలు. ఆ గిన్నె కోటయ్య కంచందాకా నెట్టి "ఇది వేసుకోరా !" అంది మహాలక్ష్మమ్మ.

గిన్నెవేపూ, ఆమె పళ్ళెం వేపూ తేరపార జూసి "నువ్వు తిన్నావంటమ్మా?" అని తీక్షణ స్వరంతో ప్రశ్నించాడు.

"ఉరేయ్ కోటయ్యా! పరమాన్నం అంటే నాకెంత ఇష్టమో నీకు తెలియదూ? వండగానే తినేశానురా."

"తింటే తిన్నావుగాని మళ్ళీ తిను" అంటూ చెయ్యి కడుక్కో బోయాడు కోటయ్య.

"తిన్నానంటే నమ్మవేరా దొంగముండాకొడకా? తినకపోయావా నీ మాడు పగలగొడతాను" అని గద్దించింది.

"సరే ! నువ్వు సగం వేసుకో. తక్కింది నేను తింటాను."

వాడి నిర్భంధానికి తట్టుకోలేక కొంత తనపళ్ళెంలో వేసుకుంది మహాలక్ష్మమ్మ.

ఇద్దరూ నిదానంగా నంజడం మొదలెట్టారు.

"రేపు పట్నం వెళ్ళిపోతున్నారా కోటయ్యా!" మహాలక్ష్మమ్మ గొంతు జీరపోయింది.

"పెద్దకొడుకు దగ్గిరికా?"

"అవున్రా ! ఇక్కడ చిన్నాడు బాగానే చూస్తున్నాడు. కాని, చాలీచాలని జీతంలో వాడు మాత్రం ఎన్నాళ్ళు ఊరేగుతాడు? పెద్దాడు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. అత్తగారి తరఫున చాలా ఆస్తికూడా కలిసొచ్చింది. అక్కడే ఓ ముద్దతిని పడుంటే కాలం వెళ్ళమారి పోతుంది."

ఇహ ఆపైన కోటయ్య జిహ్వకు పరమాన్నం సయించలేదు.

"ఇల్లొదిలి ఊరొదిలి వెళ్ళిపోతావంటమ్మా?" అన్నాడు గద్గద స్వరంతో.

"అవున్రా ! రాసిపెట్టి వుంటే మళ్ళీ ఎప్పుడైనా వస్తాను. లేకపోతే ఇంతే" అంటూ పమిటచెంగు ముఖాని కడ్డుపెట్టుకుంది.

కోటయ్య కళ్ళంట జొటజొట అశ్రుబిందువులు రాలి కంచంలోని పరమాన్నంలో కలిసిపోయాయి.

** ** **

తనుకూడా పట్నం వొచ్చేశాక ఇన్నాళ్ళకు మహా లక్ష్మమ్మ గార్ని చూడాలన్న కోరిక కలిగింది కోటయ్యకు. అందుకే ఎంతో దూరం నుంచి నడిచి వచ్చి ఆ పెద్ద భవంతి ముందు తచ్చాడుతున్నాడు.

ఊరివాళ్ళు చెప్పిన గుర్తులన్నీ ఆ ఇంటికున్నాయి. ఐనా ఆ గేటూ, ఆ కథాకమామిషూ చూస్తుంటే లోనికి అడుగు పెట్టాలంటే ఏదో బెరుగ్గా ఉంది.

"బాబూ ! మాలక్ష్మమ్మ గారిల్లిదేనా?" ఎవర్నో అడిగాడు.

ఆ పెద్దమనిషి బోర్డును పరికించి, "కాదు, ఇది రమణారావు గారిల్లు" అనిచెప్పి వెళ్ళిపోయాడు.

రమణారావు ! మహాలక్ష్మమ్మ పెద్దకొడుకు ! ఇంకేం?

ధైర్యంతో గబగబా లోనికి నడిచాడు.

"ఎవరు కావాలి?" తీవ్రంగా వినిపించింది కంఠస్వరం.

వరండాలో సోఫామీద కూచున్న ముసలాయన తనవైపే కోపంగా చూస్తున్నాడు.

"రమణారావు గారి ఊర్నించి వొచ్చానండి."

"రమణారావు ఇంకా రాలేదు. అలా కూచో" అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయాడాయన.

"మావగారు కామాలి" అని గొణుక్కుంటూ నెమ్మదిగా ఇంటి చుట్టూ కలయజూస్తూ వచ్చి వంటగది వసారా పక్కనున్న తడికను ఆనుకుని నిలబడ్డాడు కోటయ్య.

"ఇంకాస్త ఎయ్యండమ్మగోరూ !" వంటగదిలోంచి వినబడుతోంది.

"ఇంకా ఎక్కడిదిరా నీ బొంద ! దీంతో పాత్రలు కూడా కడిగేస్తోంటేనూ !" రమణారావు భార్యకాబోలు.

"మీ అత్తగారికి ఎయ్యకుండానే పాత్ర కడిగేస్తున్నారా? పరవాణ్ణం అంటే పడిచస్తారు కదా ! పాపం ! ఈ రోజన్నా కాస్త వేస్తారేమోనని నోరూరించుకుంటూ కూచున్నారు."

"నోర్ముసుకు అవతలికి పో" రమణారావు అత్తకాబోలు విరుచుకుపడింది. "అత్తట అత్త ! ఎక్కడా గతిలేక ఇక్కడి కొచ్చిపడితే అడ్డమైన వాళ్ళందరికీ తిండి పెట్టలేక చస్తున్నాం. దాని మొఖానికి తోడు పరమాన్నం కూడాను !"

"పెట్టకపోతే పెట్టకపోయారుగాని తిట్టకండమ్మా ! పాపం ! బాగా బతికిన మనిషి ! వినబడుతుందేమో !"

"వినబడాలనే అంటూంట ! అంత బాగా బతికిన మనిషయితే నాలికలు చాపుకుంటూ ఎత్తుడు ముద్దలు తినే కర్మేం పట్టింది? రోషం ఉన్నదైతే కూతురు దగ్గరకో, చిన్నకొడుకు దగ్గరకో పోవాలి."

"గంపెడు పిల్లల్తో వాళ్ళకే తినడానికి లేకుండా ఉంటే వాళ్ళ దగ్గరికి ఎట్లా పోతార్లెండి అమ్మగారూ?"

"గతిలేనప్పుడు పెట్టింది తిని పడుండాలి గాని నిక్కులు పోగూడదు... ఊ... తొందరగా తినేసి దాని మొహాన ఇంత పడేసిరా."

ఒక్కోమాటా తనను పాతాళానికి దిగేస్తుంటే భ్రమ్నప్పడిపోయాడు కోటయ్య. అప్రయత్నంగా అతని కళ్ళు పక్కనే పాకలో కుక్కిమంచం పక్కన చింకి చాప మీద కూచుని ఉన్న స్త్రీ మూర్తి మీదికి మళ్ళాయి. ఎవరామె?

తలంతా ముగ్గుబుట్టలా నెరిసిపోయి, ముఖమంతా పీక్కుపోయి పక్కనే ఉన్న కంచుచెంబులోని నీళ్ళతో మాటిమాటికీ నోరు తడుపుకుంటూ, వంటింటి వేపు సారెసారెకూ ఆశగా దృష్టి సారిస్తున్న వృద్ధురాలు ! మహాలక్ష్మమ్మ !

తనకి వినివంచిన కఠోర వాక్కులు ఆమెకి మాత్రం వినిపించవా?

కోటయ్య కడుపు చెరువైంది. కళ్ళార్పకుండా తడికమాటునుండి అలాగే ఆమెవైపే చూడసాగాడు.

"అమ్మగారూ ! ఇదిగో అన్నం."

కంపించే చేతుల్తో కంచం అందుకుని గబగబా కలుపుకోసాగింది మహాలక్ష్మమ్మ. ఆ కంచంలో ఏ యే కూరలున్నాయో దూరాన్నించి కనబడటం లేదు కోటయ్యకి. కాని ముద్ద నోట్లో పెట్టుకుని ఆర్చటం కనిపిస్తోంది.

"బాబూ ! కాసిని మజ్జిగ ఇస్తావా?" అంది ఆర్చుతూనే.

"అట్లాగేనమ్మా." నౌకరు మజ్జిగ తెచ్చియిచ్చాడు.

మహాలక్ష్మమ్మ కళ్ళు తుడుచుకుంటోంది.

కన్నీరు ఉబికుబికి రాసాగింది కోటయ్యకి. పప్పూ, కూరలూ, పిండి వంటలూ, పెరుగూ, అన్నిటినీ మించి పరవాన్నమూ తన కంచంలో నింపి తృప్తిపడే మహాలక్ష్మమ్మ అతని మనోనేత్రం ఎదుట సాక్షాత్కరించింది.

"అమ్మా ! అమ్మా !" అంటూ నిశ్శబ్దంగా విలపించసాగాడతడు.

కాస్సేపాగి నిదానంగా పాకను సమీపించాడు.

కుక్కిమంచంలో కూచుని బియ్యం నవుల్తున్న మహాలక్ష్మమ్మ "ఎవరు బాబూ?" అంది.

"నేనమ్మా కోటయ్యని."

"కోటయ్యా ! ఎంతమారిపోయావురా ! ఎప్పుడొచ్చావ్? రా కూచో."

ఎంత ఆప్యాయత ! ఎంత వాత్సల్యం !

కోటయ్య కింద చాప మీద కూచున్నాడు.

"ఊళ్లో అందరూ బాగున్నారా? నీకు పిల్లలెంతమంది? ఏం చేస్తున్నావు? ఇల్లేమైనా వేసుకున్నావా?"

"ఏడాది నుంచి ఈ ఊళ్ళోనే ఉంటున్నానమ్మా !"

"చచ్చినాడ ! ఏడాది నుంచి ఇక్కడే ఉంటూ ఇప్పటికి గుర్తు కొచ్చానా నీకు? దొంగ గాడిదకొడకా !"

"సర్లేగాని నువ్వేంటమ్మా ఇంత చిక్కిపొయ్యావు?"

"ముసల్దాన్నై పోలేదంట్రా !?"

"చిన్నబ్బాయి, అమ్మాయి బాగున్నారా?"

"నీకు తెలియందేముందిరా? ఏదో వాళ్ళ బతుకు వాళ్ళు బతుకుతున్నారు. వాళ్ళు రమ్మంటున్నా ఓపిక లేక నేనే పోవడం లేదు. వచ్చినప్పుడల్లా చిన్నోడు పదో పరకో ఇచ్చిపోతుంటాడు."

"దాచకుండా నిజం చెప్పు. నిన్నిక్కడ బాగా చూస్తన్నారంటమ్మా?"

"ఎందుకు చూడర్రా కోటయ్యా? ఐనా నా కొడుకు ఇంటిలో నన్ను ఒకరు చూసేదేంట్రా? హాయిగా దర్జాగా ఉన్నాను."

"మరి పూరిపాకలో ఉండే కర్మేం పట్టిందమ్మా?"

"ఆ పాడు గదుల్లో గాలాడదురా కోటయ్యా! అందుకని కొడుకూ కోడలూ వొద్దంటున్నా వినకుండా నేనే ఇక్కడ మంచం వేయించు

కున్నాను."

ఇక ఆ ప్రసక్తి వొదిలేసి పిచ్చాపాటి మాట్లాడాడు కోటయ్య.

మాట్లాడుతున్నాడన్న మాటేగాని మహాలక్ష్మమ్మ స్థితికి లోలోపల, విలవిల్లాడిపోతూనే ఉన్నాడు.

"సరే నేను వొస్తానమ్మా" అంటూ లేచాడు.

"అప్పుడే వెళ్తావంట్రా?" అంటూ రొండిని వున్న చిల్లర డబ్బులు తీసి కోటయ్య చేతిలో పెట్టి "ఇంట్లో అన్నమూ కూరలూ అన్నీ నిండుకునిఉంటాయి. హోటల్లో కాఫీ తాగిపోరా" అంది మహాలక్ష్మమ్మ.

ఎంత ఆపుకుందామనుకున్నా కన్నీళ్లు ఆగలేదు కోటయ్యకు.

"ఎందుకురా ఏడుస్తావ్ కోటయ్యా?"

"ఏం లేదమ్మా ! ఈ డబ్బు నీ దగ్గరే ఉంచు" అంటూ డబ్బులు ఆమెకే ఇవ్వబోయాడు."

"ఒరే కోటయ్యా ! ఈ చేత్తో ఎన్నో ఏళ్ళు నీకు అన్నం పెట్టాను. నా ఇంటికొచ్చి అన్నం తినకుండా ఎప్పుడూ తిరిగి వెళ్లలేదు. ఈరోజు వేళ తప్పి వచ్చావు. అందుకనే ఇస్తున్నాను. నా కొడుకుల్లో నువ్వూ ఒకడివి. నీకు తల్లిలాంటిదాన్ని నా దగ్గర డబ్బు తీసుకోకూడదా?"

"అది గాదమ్మా."

"ఏదీగాదు, నోరు మూసుకుని తీసుకోరా గాడ్దెకొడకా !" అంటూ గద్దించింది మహాలక్ష్మమ్మ.

మారుమాట్లాడకుండా ఆ చిల్లర డబ్బులు జేబులో వేసుకున్నాడు.

"అమ్మా ! రేపు ఉగాదినాడు మన ఇంటికి రావాలి."

"పండగపూట నీ ఇంటికి రమ్మంటావురా !?"

"ఏం రాగూడదా? నేను మాత్రం నీ కొడుకుల్లో ఒకణ్ణి గాదా?"

మహాలక్ష్మమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఎందుక్కాదురా ! నువ్వు ఎప్పటికీ నా కొడుకువేరా కోటయ్యా! తప్పకుండా వొస్తాను."

"ఆరోజు పొద్దున్నే వొచ్చి తీసుకెళతాను. వస్తానమ్మా!" అంటూ గబగబా ఇంటి ఆవరణదాటి రోడ్డెక్కాడు కోటయ్య.

** ** **

"ఇదేనమ్మా మనిల్లు. లోపలికిపద."

పట్టణం శివార్లలో ఓ పూరిపాక చుట్టూ చిన్న గడ్డివామీ, గొడ్డూ, గోదా, పిల్లా మేకా – ఇది కోటయ్య ఇంటి స్వరూపం.

"బాగుందిరా కోటయ్యా ! అంతా ఊళ్లో మనిల్లు గుర్తుకొస్తుంది" అంటూ లోపలికొచ్చి గొడ్లపాక పక్కనే వున్న మంచంవాల్చి కూచుంది మహాలక్ష్మమ్మ.

సద్దువిని పొయ్యిదగ్గరున్న కోటయ్య భార్యా, పేడకళ్ళు తీస్తున్న పెద్దకొడుకూ, కుడితి తాపుతున్న చిన్న కొడుకూ, పిడకలు ఎండ పెడుతున్న కూతురూ గబగబా వొచ్చి చుట్టూమూగారు.

"నీ కోడలు పుగాకు కంపెనీ కెల్లుద్ది. నేనూ, పిల్లలూ గొడ్లమీదే బతుకుతున్నాం."

కోటయ్య పెళ్ళాన్నీ, పిల్లల్నీ ఎగాదిగా చూసిన మహాలక్ష్మమ్మ ముఖం తృప్తితో వెల్లివిరిసింది.

"ఏమే? నేను గుర్తున్నానంటే !?"

"నిన్నెట్టా మర్చిపోతామత్తా?"

మాటా మంతీ సాగుతూండగానే కోటయ్య అందు కున్నాడు.

"తరవాత మాట్లాడుకుందాం గాని లేచి బువ్వ తినవమ్మా!"

"నువ్వు?"

"మేం తరవాత తింటాంగాని ముందు నువ్వుతిను."

"దొంగచచ్చినోడ ! నన్ను ఒంటరిగా తినమంటావురా?"

"సరే. నాగ్గూడా పెట్టవే" అని భార్యని పురమాయించాడు.

కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చి పీటమీద కూర్చున్న మహాలక్ష్మమ్మ తన ముందు పరిచివున్న విస్తరాకు చూసి మండిపడింది.

"ఎవతవే నువ్వు? నాయింట్లో నాకు విస్తరాకు వేస్తావా?"

ఏమనాలో తోచక నిలుచుండి పోయింది కోటయ్య పెళ్ళాం.

"కంచంలో పెట్టవే మీ అత్తకి" అన్నాడు కోటయ్య నవ్వుతూ.

విస్తరితీసి కంచంవాల్చి ఒక్కోటేవడ్డించ నారంభించింది.

ఐనా కోటయ్య పురమాయింపుకు తట్టుకోలేక ఉరుకులు పరుగులు పెడుతోంది.

"పప్పు మరింత వెయ్యి."

"నెయ్యి వేశావా లేదా?"

"కందిపచ్చడేదీ కనపడదేం?"

"గారెలు ఓ పక్కన పెట్టు."

"అప్పడం మెత్తపడిందేమే దరిద్రపు మొఖందానా?"

"అరిసెలు ఇప్పుడు తినదు తీసెయ్యి"

కోటయ్య చేసే హడావిడి అంతా తడికమాటున నిక్క చూస్తున్నారు పిల్లలు.

''ఎందుకురా దాన్ని ఉరికిస్తావు కోటయ్యా?'' అంది మహాలక్ష్మమ్మ మురిపెంగా నవ్వుతూ.

"దాని ఉరుకులకేం గాని నువ్వు కడుపునిండా తినమ్మా!"

"అప్పటికి నేనేదో తిండికి మొఖం వాచివున్నట్టు మాట్లాడతా

వేంటిరా ముదనష్టపోడా !"

"సరేగాని ఇంతకి గారె ఒక్కటీ ముట్టుకోలేదేం టమ్మా?"

నిజానికి మహాలక్ష్మమ్మ గారెలేకాదు, మరే పిండి వంటలు గాని కూరలు గాని ఇంకా ముట్టుకోనేలేదు. చారన్నం కలుపుకుని నిదానంగా నంజుతోంది. వూరికే కంచం చుట్టూ వున్న పదార్థాలన్నీ కలయజూస్తోందిగాని దేనిమీదా ఇష్టం ఉన్నట్లు కనిపించలేదు. ఆమె కళ్ళలో ఏదో అసంతృప్తి గోచరించింది.

"ఏవేవ్ ! పరవాణ్ణం తీసుకురా !" అరిచాడు కోటయ్య.

మహాలక్ష్మమ్మ కళ్ళు మెరిశాయి. ముఖంలోనికి వింత వెలుగు వచ్చింది.

"మా అమ్మకి పరమాణ్ణం అంటే ప్రాణమే. నా చిన్నప్పుడు వారంవారం పరవాణ్ణంకాసి నా కంచంనిండా పోసేదే మా అమ్మ !" అంటూండగా కోటయ్య గొంతు గద్గదమైపోయింది.

మహాలక్ష్మమ్మ కోటయ్య ముఖంవైపు చూసి తల దించుకుంది.

గిన్నె నిండుగ పరమాన్నం తెచ్చి ఆమె కంచం పక్కన పెట్టింది కోటయ్య భార్య.

"పరవాణ్ణం తాగమ్మా! దీనికోసమే నిన్ను ఇంతదూరం తీసుకొచ్చాను" అన్నాడు కోటయ్య వినయం ఉట్టిపడేట్టు.

కంచంలోని ఆహారపదార్థాలన్నీ ఓ పక్కకు నెట్టివేసి పరమాన్నం గుమ్మరించుకుంది మహాలక్ష్మమ్మ. ఒకటి రెండు క్షణాల్లో నిదానంగా రుచిచూసింది.

ఆపైన చేరతో తీసుకుని జుర్రుకోసాగింది.

రుచిని కడకంటా అనుభవిస్తూ, ముక్కుకీ, మూతికీ పరమాన్నం అంటుకున్నా లెక్కించడంలేదు.

కోటయ్య సంతానం ఎదురుగ్గా నిలబడి ఆ వృద్ధ స్త్రీ ఆవేగం చూస్తూ నవ్వసాగారు.

కోటయ్య వాళ్ళవైపు గుడ్లెర్రజేసి చూసి "అవతలికి పోండి" అని గద్దించాడు.

"వాళ్ళ మొఖాలు ! వాళ్ళతో యేంటి గాని నువ్వు కడుపునిండా తాగమ్మా ! ఇంకా తీసుకురావే."

అతని కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

కాని అతని పిల్లలు అట్టహాసం చేస్తున్నారు.

"నవ్వారంటే నరుకుతాను దొంగ లంజాకొడకల్లారా!" అంటూ వాళ్లను తరిమికొట్టి "అట్లాగే నించున్నావేమే దేబె మొఖందాన! కాచిందంతా తీసుకురా" అంటూ పెళ్ళాంవేపు చూసి పెద్దగా అరిచాడు.

అతని కళ్ళనుండి జొటజొట అశ్రుబిందువులు రాలుతున్నాయి.

పిల్లలు గొడ్లపాక దగ్గర నుంచుని నవ్వేనవ్వులు స్పష్టంగా వినబడుతూనే వున్నాయి.

కాని వాళ్ళ ఎగతాళి గాని, కోటయ్య కళ్ళనుండి జాలువారే బాష్పాలు గాని, అతని భార్య వింత చూపులు గాని, బయట గొడ్ల అరుపులు గాని, మరేవీ గాని పట్టించుకోకుండా మహాలక్ష్మమ్మ పరవశంతో పరమాన్నం జుర్రుకుంటోంది.

(ఈ కథానిక హంసావళిలో ప్రచురించబడినది)

జె.కె.సి. పరమ చరిత

డా॥ గుండవరపు లక్ష్మీనారాయణ


తెలుగు విశ్రాంత ఉపన్యాసకులు

ఎందరెందరో దూరదృష్టి విత్తములు, వి
ద్యా స్నాతకులు తీవ్ర తపము సలుప
చంద్రమౌళీ ప్రభా సాంద్ర సదాశివ
విభవ తాండవకేళి అభయమిడగ
సద్బుద్ధి రాజులు సచ్చిదానంద పూ
ర్ణ ప్రజ్ఞులాశీర్వదంబు లొసగ
విద్యార్థులకు సంత–విజ్ఞానులకు పుంత
గుంటూరు పురకాంత కులికి గంత

తల్లిదండ్రుల తాపంబు చల్లజేసి
చదువరులకు విద్యాతృష్ణ శాంతిచేసి
తెలుగుదేశ ప్రజల స్తుతి దివిటి జేసి
వెలసె – జె.కె.సి. – జేజేల విరియబూసి.

'జె' యన జయంబు – 'కె' యన నౌయెని యని
'సి' యనంగ – శ్రీ – వీనిని జేర్చి చూడ
'ఏయవి సకలైశ్వర్యంబు లిచ్చు నట్టి
కృత్యములకౌను జయము' – జె.కె.సి. యనగ

(ఆ) పాత మధుర క్షణాలు



డా॥ నాగభైరవ ఆదినారాయణ

విశ్రాంత అధ్యాపకులు, తాడికొండ

"Why are you standing here like stones ? Go to your classes, you idle creatures !"

అవి బి.ఏ., సెకండ్ ఇయర్ చదువుతున్న రోజులు. లంచ్ బ్రేక్ అయిపోయింది. క్లాసులు మొదలయ్యాయి. మా తరగతిలోని విద్యార్థులెవరూ క్లాసుకు వెళ్ళలేదు. క్లాసు క్లాసంతా రోడ్డుమీద చెట్టు కింద నిలబడి ఉన్నాం. సూటు, బూటు వేసుకొని, రెండు చేతులతో జారిపోతున్న ప్యాంటును పైకి లాక్కుంటూ వచ్చిన ప్రిన్సిపల్ రోసయ్య గారు గద్దిస్తూ అన్నమాటలు అవి.

రోసయ్య గారు మన కళాశాలకు మొదటి ప్రిన్సిపల్. ఆయనంటే మాకు చచ్చేంత భయం. మాకేమిటి, మాకు పాఠాలు బోధించే వారికి కూడా ఆయన దగ్గరకు వెళ్ళాలంటే బెరుకే. ఆయనే వచ్చి ఆలా గద్దించి మాట్లాడే సరికి మాకెవరికీ నోట మాట రాలేదు.

"ఉలుకూ పలుకూ లేకుండా బెల్లం కొట్టిన రాళ్ళులా నిలబడడం ఎందుకు? విషయం ఏమిటో చెప్పి చావండి" విసుక్కుంటూ మళ్ళీ గద్దించారు.

"మేము క్లాసుకు వెళ్ళం. స్ట్రయిక్ చేస్తున్నాం" వెనుగ్గా నిలబడి తలవంచుకొని రోసయ్య గారు గుర్తు పట్టకుండా అన్నాడొక మిత్రుడు.

"ఎందుకు?" అదే గద్దింపు స్వరం

"ఫలానా లెక్చరర్ చెప్పేది మాకు అర్థం కావడం లేదు. వారిని మారిస్తేనే క్లాసుకు వెళతాం" సన్నగా చిన్నగా గొణిగాం.

"అందరూ ఆఫీసుకు రండి" అంటూ తిరిగి ఆఫీసు లోని తన రూమ్‌లోకి వెళుతూ "వెంకట్రావ్ ! ఒక్కొక్కరినే పంపించు" అని ఆజ్ఞాపించారు. వెంకట్రావు రోసయ్య గారి అటెండరు. రోసయ్య గారికి హనుమంతుని లాంటి భక్తుడు. ముందుగా ఒకతనిని లోపలికి పంపించాడు. బయట ఉన్న మేమంతా చెవులు రిక్కించి ప్రిన్సిపాల్ గారు ఏమడుగుతారో అని ఆత్రంగా చూస్తున్నాం. ఆ ప్రశ్నలను బట్టి మేము సమాధానాలు తయారు చేసుకొని లోపలికి వెళ్ళాలని మా ఆలోచన.

"ఎందుకురా స్ట్రయిక్?"

"ఆ లెక్చరర్ చెప్పేది మాకు అర్థం కావడం లేదు"

"మొన్న క్వార్టర్లీ పరీక్షలు జరిగాయి కదా ! ఆ సబ్జక్టులో నీకు ఎన్ని మార్కులు వచ్చాయిరా?"

"ఇరవై రెండు"

"ఇరవై రెండు మార్కులు వచ్చిన వెధవకు ఎవరు చెప్పినా ఏమర్థమవుతుంది? నీదొక మట్టి బుర్ర. నువ్వొక బండవు. నీకెవరు చెప్పినా అర్థంకాదు." అతనిని తిడుతూనే "నెక్ట్స్" అన్నారు ఆయన.

వెంకట్రావు ముందున్న మరొకరిని లోపలికి పంపాడు. ఆ పరీక్షల్లో అతనికి వచ్చిన మార్కులు ఇరవై తొమ్మిది. అవే ప్రశ్నలు పదాలు మారినా అవే తిట్లు.

నాకు ఆ పరీక్షల్లో అరవై రెండు మార్కులు వచ్చాయి. నా మార్కులే రోసయ్య గారి ప్రశ్నలకు సమాధానం అని అనుకున్న మిత్రులు నన్ను లోపలికి తోశారు.

"నీకూ అర్థం కావడం లేదా?"

"లేదండి"

"నీకెన్ని మార్కులు వచ్చాయి?"

"అరవైరెండు"

"రోసయ్యగారు కుర్చీలోంచి లేచారు." ఆ లెక్చరర్ చెప్పేది అర్థం కాకుండానే అరవై రెండు మార్కులొచ్చాయా? అర్థం కాకుండా అన్ని మార్కులు సంపాదించడానికి నీవేమన్నా షేక్స్‌పియర్ తల్లో నుంచి ఊడిపడ్డావా? మిల్టన్ నాలుక నుంచి జారిపడ్డావా?"

నాకు నోరు పెగల్లేదు. ఆయన నాలుకకు రెండు పక్కల పదునే. అటయినా, ఇటయినా తార్కికంగా మాట్లాడి, అవతలి వారి నోరు మూయించడంలో దిట్ట. అదే ఆయన సామర్థ్యం. అదే కాలేజీని ఒక దారిలో పెట్టింది.

మా సమస్యను ఎలా పరిష్కరించి, మమ్ములను పంపారో ఇక్కడ

అవసరం లేదు గాని, సంస్థను నిర్వహించే వారు ఎలా మాట్లాడాలో దానివలన తరువాతి కాలంలో నాకు బాగా తెలిసింది. నేను ఎదిగి తాడికొండలోని భగవాన్ శ్రీసత్యసాయిబాబా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అయిన తరువాత రోసయ్య గారి లాగా మాట్లాడి ఎన్ని క్లిష్ట పరిస్థితుల నుండి తప్పించుకున్నానో, ఎన్ని సమస్యలను చాకచక్యంగా పరిష్కరించానో నాకు తెలుసు.

* * * * *

డాక్టర్ ఎస్. అనంతం గారు మాకు ఇంగ్లీషు బోధించేవారు. అప్పటికి ఆయన ఇంగ్లీషు లెక్చరర్. మేము కళాశాల నుండి వెళ్ళిన తర్వాత ఆయన ప్రిన్సిపల్ అయ్యారు. వారు ఆంగ్ల భాషను మాట్లాడుతుంటే అర్థం కాకపోయినా చెవులకు సంగీతం లాగా వినసొంపుగా ఉండేది. కాని వారికి తెలుగు నుడికారపు సొంపులు తెలియవు. 'దారం తెగింది' అనడానికి బదులు 'దారం పగిలింది' అనేవారు. 'చొక్కా చిరిగింది' అనడానికి బదులు 'చొక్కా తెగింది' అనేవారు.

'Hero', 'Zero' అనే పదాలను సాధారణంగా మనం హీరో, జీరో అని ఉచ్చరిస్తుంటాం. కాని ఇంగ్లీషులో వాటిని హియరో, జియరో అని ఉచ్చరించాలట. అనంతం గారు వాటిని ఉచ్చరించే విధానం చెప్పి క్లాసులో మాచేత అనిపించేవారు. క్లాసు మొత్తం హియరో, జియరో అను దీర్ఘం తీస్తూ పలికి నవ్వుకునేవాళ్ళం.

మా క్లాసులో ఐదుగురు ఆడపిల్లలు ఉండేవారు. ఇప్పటికీ వాళ్ళపేర్లు నాకు గుర్తే. ఒకరోజు అనంతం గారు క్లాసులో "సప్తస్వరాలు, అష్టదిక్కులు లాగా ఈ ఐదుగురికి ఒకపేరు పెట్టండి" అన్నారు.

వెంటనే నల్లూరి పూర్ణచంద్రరావు లేసి "పంచభూతాలు సార్!" అన్నారు. క్లాసంతా అమ్మాయిలతో సహా నవ్వితే అనంతంగారు ఆనందంగా చిరునవ్వులు చిందించారు. హాస్యాన్ని అనందించ గలగడం ఒక కళ గదా !

అనంతం గారి దృష్టిలో పడితే ఎవరైనా, వారిని ఆయన ప్రత్యేకంగా పరీక్షించి చూసేవారు. నేనూ ఎందుకనో ఆయన దృష్టిలో పడ్డాను. ఎందరిలో ఉన్నా ఆయన నన్ను గమనిస్తూనే ఉండేవారు. గురువులు ఎదురుగా వస్తే నమస్కారం చెప్పాలనే విషయం తెలియని మొద్దును నేను ఆ రోజుల్లో. ఒకరోజు ఆయనకు ఎదురుగా రాగానే "గుడ్‌మాణింగ్" నన్ను చూస్తూ ఆయన నోటి నుంచి ఈ మాటలు తూటాల్లా దూసుకొచ్చాయి. నేను చెప్పలేదని, గురువులకు నమస్కారం చేయడం సత్సంప్రదాయమని నాకు తెలియజేయడానికి ఆయన 'గుడ్‌మాణింగ్' అన్నారు. నేనయితే అప్పుడు సిగ్గుతో చితికిపోయాను. అంతే ఆనాటి నుంచి ఆయన బతికి ఉన్నంత కాలం ఆయన అల్లంత దూరంలో కనిపించినా దగ్గరికి వెళ్ళి నమస్కరించేవాడిని. ఆయనకే కాదు జెకెసి కళాశాలలో అప్పటి స్టాఫ్ ఎవరు కనిపించినా ఇప్పటికీ నమస్కారం చేస్తూనే ఉంటాను.

అనంతం గారు నాకు నేర్పిన మంచి సంస్కారం అది.

* * * * *

వెంకటాచలం గారు మాకు పాలిటిక్స్ బోధించేవారు. ఆయనకు విద్యార్థులను ప్రేమించడం తెలుసు. ప్రతి విద్యార్థినీ 'నాన్నా' అనేవారు. ఆయన విద్యార్థుల తెలివితేటలను అంచనావేసి లక్ష్యాన్ని నిర్దే శించడంలో దిట్ట. నాకు పరీక్షల్లో మార్కులయితే బాగానే వచ్చేవి గాని స్నేహితులతో కలసి బాగానే అల్లరి చేసేవాడిని. ఒకరోజు ఆన్సర్ పేపర్లు ఇస్తూ వెంకటాచలంగారు క్లాసును ఉద్దేశించి "ఆదినారాయణకు అరవై అయిదు. ఫస్టు మార్కు. మీరు అతనితో తిరిగితే నష్టపోతారు. అతనికేమో ఒకసారి చదివితే వస్తుంది. ఎప్పుడో చదువుతాడు. మీరలా కాదు కదా ! అంచేత అతనికి దూరంగా ఉండండి. లేకపోతే నష్ట పోతారు" అని అన్నారు. నన్ను క్లాసులో, అదీ ఆడపిల్ల లందరిముందు ఆ విధంగా అన్నందుకు బాగా బాధపడ్డాను. గురువు గారి మీద గొంతువరకు కోపం వచ్చింది.

క్లాసయిన తరువాత నన్ను పిలిచి 'సాయంత్రం నన్ను ఇంటి దగ్గర కలువు నాన్నా !' అన్నారు ఆయన. వారికి డొంకరోడ్డులో కట్టెల అడితి ఉండేది. నేను కమ్మ హాస్టల్‌లో ఉండేవాడిని. వారి దగ్గరకు వెళ్ళాను. కూర్చోమన్నారు.

"నాన్న ! నువ్వు తెలివైన వాడివి. నేను గ్రహించాను. కాని స్నేహితులతో అల్లరి ఎక్కువ. వాళ్ళతో తిరక్కుండా ఉంటే ఫస్టు క్లాసో, యూనివర్శిటీ ర్యాంకో సంపాదించ గలవు. మిగతావాళ్ళ వలన నీ చదువుకు ఆటంకం కలుగకుండా ఉండడానికే క్లాసులో ఆ మాటలు చెప్పాను. బాగా చదువు. ఏ అవసరమయినా నన్ను అడుగు. నీకు సాయం చేస్తా ! నువ్వు మాత్రం ఆ ఆశ తీర్చాలి'.

ఏమీ మాట్లాడకుండా మౌనంగా విని తిరిగివచ్చాను. ఆయన మాటలు నాకు మంత్రాలయ్యాయి. ఆయన ప్రోత్సాహం నన్ను నడిపించింది. స్నేహితులతో తిరగడం మానలేదు గాని బాగా చదివాను. బి.ఏ. పూర్తయింది. రిజల్టు వచ్చాయి. యూనివర్శిటీ మొత్తంలో మూడు మాత్రమే ఫస్టు క్లాసులు. అందులో నాదొకటి. అంటే వెంకటాచలం గారన్నట్లు ఫస్టుక్లాసు, యూనివర్శిటీ ర్యాంకు

వచ్చాయి. జెకెసి కళాశాలకు అది తొలి యూనివర్శిటీ ర్యాంకు.

నాకు ర్యాంకు వచ్చినందుకు మా కుటుంబం ఎంత సంతోషించిందో నేను చూడలేదు గాని వెంకటాచలం గారు మాత్రం నన్ను చూసి అక్కున చేర్చుకొని, ఆనందాశ్రువులు రాల్చారు. ఆ దృశ్యం ఇప్పటికీ కళ్ళముందు కదులుతూనే ఉంటుంది.

ఉపాధ్యాయుడు విద్యార్థిని ఎలా ప్రోత్సహించాలో ఆయన నుండే తెలుసుకున్నాను. నేనూ పాటించాను. అందువల్లనేమో ఆంధ్ర ప్రభుత్వం నన్ను ఉత్తమ అధ్యాపక అవార్డుతో సత్కరించింది.

* * * * *

బి.ఏ.లో నా సబ్జెక్టు స్పెషల్ తెలుగు. అప్పుడు నాగళ్ళ గురుప్రసాదరావు గారు తెలుగు శాఖకు అధ్యక్షులు. మాకు గురుప్రసాదరావు గారితో పాటు గుండవరపు లక్ష్మీనారాయణ గారు, కడియాల రామమోహన్‌రాయ్ గారు, చిన్నం రామయ్య చౌదరి గారు తెలుగు బోధించేవారు. తెలుగు భాషపై పట్టు సాధించడానికి వీళ్ళందరూ కారకులే. మాకు తెలుగుపై అవగాహన కలగడానికి ఉద్దండ పండితులనెందరినో పిలిపించి కాలేజీలో ఉపన్యాసాలు ఇప్పించేవారు. దువ్వూరి వెంకటరమణశాస్త్రి, తిరుమల గుదిమెళ్ళ వరదాచార్యులు, తుమ్మల సీతారామమూర్తి, దివాకర్ల వెంకటావధాని వంటి మహామహులతో మాట్లాడే అదృష్టం, వారి స్ఫూర్తితో తెలుగును చదివే అవకాశం కలిగాయి. గురుప్రసాదరావు గారయితే మాకు బాలప్రౌఢ వ్యాకరణాలు, భాగవతం బోధించేవారు. వ్యాకరణం కొంచెం కష్టం కదా ! అందుచేత ఇంటి దగ్గరకూడా చెప్పేవారు.

మాకు జనరల్ తెలుగులో సంజయ రాయబారమనే భారత సంబంధ పాఠం ఉండేది. అందులోది ఈ పద్యం.

ఆ రాజు మాదెసంగల

కారుణ్యముకతమునను సుఖంబున నిట్లు

న్నారము నిను బుత్తెంచిన

గారవమున నాదుమది వికాసము పొందెన్

గురుప్రసాదరావుగారు ఈ పద్యభావాన్ని, అందులోని వ్యంగ్యార్థాన్ని, తెలుగుదనాన్ని వివరించి తిక్కన గొప్ప కవితా నైపుణ్యాన్ని గురించి వివరించారు. ఆయన చెప్పడం పూర్తయ్యాక నేను లేచి ఇలా అన్నాను.

"ఈ పద్యం గొప్పదయితే కావచ్చు కాని తిక్కన గారు 'గారవము' అనే పదాన్ని సందర్భోచితంగా ప్రయోగించ లేదు. గారవమనేది గౌరవానికి వికృతరూపం. గురువుపట్ల చూపే భావాన్ని మాత్రమే గారవం అనాలి. పెద్దలకు పిల్లల పట్ల ఉండవలసింది వాత్సల్యం. గారవం కాదు. ఈపద్య విషయంలో ధృతరాష్ట్రుడు పాండవుల పట్ల వాత్సల్యం చూపాలిగాని గౌరవం చూపరాదు. కాబట్టి తిక్కన గారు పొరపాటు చేశారు.

గురుప్రసాదరావు గారు అంతా విని నవ్వారు. "నువ్వు చెప్పింది నిజమే! కాని గారవం అనే పదానికి వాత్సల్యం అనే అర్థం కూడా ఉంది. ఒకసారి నిఘంటువు చూడు" అని ఇంకా "ఒక పదానికి చాలా అర్థాలు ఉండే అవకాశం ఉంది వాటినే నానార్థాలు అంటారు. ఒకపదానికి మనం చదివే సందర్భంలో మనకు తెలిసిన అర్థం కుదరకపోతే, నిఘంటువు చూసి ఆ పదానికున్న ఏ అర్థం ఆసందర్భానికి సరిపోతుందో సరిచూసుకోవాలి. సాహిత్య విద్యార్థి ముందుగా ఇది నేర్చుకోవాలి ! తొందరపడి విమర్శలు చేయకూడదు' అన్నారు.

మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకునిగా పని చేయడంతోపాటు పలు గ్రంథాలను పరిశీలించిన నేను ఆయన చెప్పిన విషయాన్ని ఎప్పుడూ మరచిపోలేదు. తొందరపడి విమర్శ చేయలేదు !

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి భాషా సేవా పురస్కారం పొందిన నాకు భాషపట్ల, సాహిత్యం పట్ల కొన్ని సూచనలు, అభిప్రాయాలు మా గురువులు ఏర్పరచడం వల్లనే ఆ పురస్కారం పొందగలిగానని అనుకొంటాను.

* * * * *

ఎన్నో విషయాలు చెప్పి, మేము చేసిన అల్లరి గురించి చెప్పకుండా మానేస్తే ఈ వ్యాసం సమగ్రం కాబోదు. కాలేజీ క్యాంపస్‌లో నైరుతి మూలగా అంటే ఇప్పుడు ఆఫీసు ఉన్నచోట ఆప్పుడొక షెడ్ ఉండేది. అది మా క్లాస్ రూమ్. మా రూమును రెండు భాగాలు చేస్తూ మధ్యలో బెంచి ఎత్తులో చిన్న అడ్డుగోడ ఉండేది. వెనుక రూములో నాలుగు బెంచీలుంటే, మిగిలిన బెంచీలు ముందు గదిలో ఉండేవి. లెక్చరరు ముందు గదిలో పాఠం చెపుతుంటే వెనుక గదిలోని బెంచీలో చేరేవాళ్ళం. బ్యాక్ బెంచి స్టూడెంట్స్ చేసే పనులన్నీ చేసే వాళ్ళం. ఎన్.సి.హెచ్. సాంబశివరావు, నల్లూరి పూర్ణ చంద్రరావు, చుండి వెంకన్నారావు, కావూరి అమర్‌నాథ్, వెన్నిసెట్టి సింగారావు, మదమంచి నాగమల్లేశ్వరరావు, మరికొందరి మిత్రులతో నేను చేసిన అల్లరి పనులకీ, చిల్లర చేష్టలకు, ఆ బెంచీలు, చేలల్లో కనిపించే చెట్లు, మా అంతరాత్మలు సాక్ష్యం. చేసిన పనులకు ఇప్పుడు సిగ్గుపడడం తప్ప చేసేదేమీ లేదు.

అల్లరి అంటే ఒకటి గుర్తు కొస్తుంది. మేము ఫైనల్ ఇయర్‌లో ఉండే రోజులు. స్పెషల్ తెలుగు క్లాసు. లెక్చరర్ సెలవు పెడితే కొత్తగా చేరిన ఒక మేడమ్‌ను మా క్లాసుకు పంపించారు. వారు పోతన గారి పద్యమేదన్నా వస్తే చెప్పమన్నారు. నేను లేచి నిలబడ్డాను. ఈ పద్యం చెప్పాను.

"ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై నంశోత్తరీయంబుపై
పాదాబ్జంబులపై కపోలతటిపై పాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీదై నా కరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే"

నేను పద్యం చదవడం పూర్తయిన వెంటనే మేడమ్ "ఈ పద్యంలో ఒకచోట తప్పు చదివారు" అన్నారు.

"ఎక్కడండీ తప్పు" ప్రశ్నించాను.

"తర్వాత వెళ్ళి భాగవతం చూడండి".

నర్మగర్భిత భావ సమాధానం ఉంది. ఎదిగిన పిల్లలకు కొత్తగా చేరిన వాళ్ళు చెప్పగలిగిన భావన కాదు. అంతలో బెల్లు మా పంతానికి, అల్లరికి అడ్డుకట్ట వేసింది.

ఉద్యోగం చేసేటప్పుడు తెలిసింది ఎదిగిన పిల్లలకు శృంగార పాఠాలు చెప్పడం ఎంత కష్టమో !

* * * * *

మాకు హిస్టరీ చెప్పిన కొరివి సాంబశివరావు, ఒంగోలు సాంబయ్య గారు, పాలిటిక్స్ చెప్పిన దామోదర నాయుడు గారు, ఇంగ్లీషు చెప్పిన అమరేంద్ర గారు – ఇలా అందరితోను ఎన్నెన్నో అనుభవాలు జ్ఞాపకాల పుటల్లో దాగి నిరంతం గుర్తుకొస్తూనే ఉంటాయి. వాటినన్నింటినీ చెప్పాలంటే ఒక పుస్తకం రాయాల్సిందే.

మా క్లాసుకి రాకపోయినా ఎకనామిక్స్ శ్రీహరిరావు గారు, గొల్లపూడి ప్రకాశరావు గారు, పులిచెర్ల సుబ్బారావు గారు, సాంబశివ రావు గారు, లక్ష్మీప్రసన్న గారు, అప్పటికీ ఇప్పటికీ మామీద చూపించిన అభిమానం ఇంతంత కాదు.

సైన్సు సబ్జెక్టులు బోధించేవాళ్ళలో పాతూరి కోటేశ్వర రావు గారు, ఫిజిక్స్ వెంకట సుబ్బయ్య గారు, బాటనీ ఎన్. వెంకటేశ్వర్లు గారు, ఎస్.ఆర్.కె. ప్రసాద్ గారు, జువాలజీ కోటేశ్వరరావు గారు, ఈమధ్యనే పరమపదించిన బెల్లం సుబ్బారావు గారు ఎప్పుడు ఎక్కడ కనిపించినా పేరుపెట్టి పిలిచి ఆప్యాయంగా మాట్లాడడం ఏ పూర్వ సుకృతమో అనుకుంటా !

* * * * *

కాలేజీని విడిచి నాలుగున్నర దశాబ్దాలైనా, కాలేజీతో నాకున్న అనుబంధాన్ని ఆగిపోనీయకుండా ఉండడానికన్నట్లు నన్ను తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబరుగా నియమించి, పది సంవత్సరాలుగా కాలేజికి సేవ చేసే భాగ్యం కలుగజేసినందుకు ఆనందిస్తున్నా. ఆనందిస్తూనే ఉన్నా...!

జె.కె.సి. కేసి నీవు తిలకించుము మిత్రమా !
మనసంతా పరవశించు, తనువంతా పులకరించు
ఓ పూర్వ విద్యార్థీ ! ఓ అపూర్వ విద్యార్థీ ! ॥ జె.కె.సి. ॥


విజ్ఞానపు బోధనలో ఇది మనకు శారదగుడి
సంస్కారం నేర్పుటలో ఇది మనకు అమ్మఒడి
బతుకుతెరువు చూపుటలో ఇదొక కొత్త ఒరవడి ॥ జె.కె.సి. ॥

జె.కె.సి. కళాశాల తలపు తలుపు తడితేనే
ఎన్నెన్నో అనుభవాలు ఇంకెన్నో అనుభూతులు
గిలిగింతలు పెడతాయి పులకింతలు రేపుతాయి ॥ జె.కె.సి. ॥

ఇది స్వర్ణోత్సవ వేడుక ఆత్మీయుల కలయిక
ఆనందం ఆర్ణవమై పొంగిపోవు శుభసమయం
ఉత్సాహం వెల్లువలై ఉరకలెత్తు సుఖమయం ॥ జె.కె.సి. ॥

జె.కె.సి. కాలేజి చదువు చెప్పడమే కాదు, బతకడమెలాగో కూడా నేర్పింది

డా॥ వెన్నిసెట్టి సింగారావు
విశ్రాంత అధ్యాపకులు, అమరావతి



అది 1968 జులై నెల. గుంటూరులో ఊరికి దూరంగా కొత్తగా కాలేజి పెట్టారు. అదే జె.కె.సి. కాలేజి. పి.యు.సి.లో చేరటానికి అప్లికేషన్ పూర్తిచేసి, ప్రిన్సిపల్ గారి రూమ్‌లోకి వరుసలో వెళ్ళా. వరండాలో వెంకట్రావు సైలెన్స్... సైలెన్స్.. అంటూ కేకలేస్తున్నాడు. లోపల కోటు వేసుకొని, టై కట్టిన రోసయ్య గారు ఉన్నారు. నా అప్లికేషన్ చూశారు. మార్కులు ఎన్నొచ్చాయి అన్నారు. 362 అని అన్నాను నేను. ఏ గ్రూపు కావాలి అన్నారు. హెచ్.సి.టి. కావాలన్నా. కింద నుంచి పైకి నన్ను తేరిపారా చూశారు. తెలుగు పద్యం ఒకటి చెప్పమన్నారు. నా కొచ్చిన సుమతీ శతకం పద్యం – అప్పిచువాడు వైద్యుడు – అంటూ పద్యం చెప్పాను. అప్పిచ్చువాడు వైద్యుడా? అని ప్రశ్నించారు. అప్పిచ్చువాడు ఒకడు, వైద్యుడు ఇంకొకళ్ళు అని చెప్పాను. అంతే, అప్లికేషన్ మీద సంతకం పెట్టి, ఫీజు కట్టు, పో.. అన్నారు. అలా జె.కె.సి. కాలేజీలో పి.యు.సి.లో చేరాను

ఆగష్టు ఒకటో తేదీన క్లాసులు ప్రారంభం. ప్రారంభసభ జరిగింది. అప్పటి కేంద్రమంత్రి కొత్త రఘు రామయ్య, ముళ్ళపూడి తిమ్మరాజు, సినీనటుడు గుమ్మడి ప్రసంగించారు. ముఖానికి రంగు పులుముకొని నటించే మమ్మల్ని కాలేజీలో సభకు ఆహ్వానించడం ఆశ్చర్యంగా ఉందని, గౌరవంగా ఉందని – ఆ రోజు గుమ్మడి తన ఉపన్యాసారంభంలో చెప్పిన మాటలు బాగా గుర్తున్నాయి.

పి.యు.సి. ఆర్ట్స్ సెక్షన్‌లో తోటి పిల్లలు పరిచయ మయ్యారు. మాకు హిస్టరీకి కె. సాంబశివరావు, సివిక్స్‌కి చంద్రయ్య, తెలుగుకి నాగళ్ళ గురుప్రసాదరావు,గుండవరపు లక్ష్మీనారాయణ, కడియాల రామమోహనరాయ్, ఇంగ్లీష్‌కి మదనమోహన్, ఫ్రాన్సిస్ చౌదరి, నర్రా నాగేశ్వరరావు గారు వచ్చారు.

డిగ్రీ బి.ఏ. చదవటానికి మళ్ళీ జె.కె.సి.లోనే చేరాను. 1969 నుండి 1972 వరకు బి.ఏ.లో హిస్టరీలో ఓ. సాంబయ్య, పాలిటిక్స్‌లో పి.వి. చలం, తెలుగులో రామయ్య చౌదరి, ఇంగ్లీషులో ఎస్. అనంతం మాకు పరిచయ మయ్యారు. అమరనాథ్, పూర్ణచంద్రరావు, బుడంపాడు సాంబశివరావు, మధుసూదనరావు, సుబ్బారావు, ఆది నారాయణ, వెంకన్నారావు, మేడికొండూరు సాంబశివరావు, నాగమల్లేశ్వరరావు, పి. సుగుణ, చిన్నం విజయలక్ష్మి, అరుణావతి, రాజేశ్వరి, విజయలక్ష్మి వీళ్ళంతా మా క్లాస్‌మేట్స్. ఇంకా ఆరికపూడి ప్రభాకరరావు, గుంటుపల్లి అప్పారావు, రత్తయ్య (బి.యస్సి.), గుండవరపు సాంబశివ రావు, పానకాలరెడ్డి (బి.కాం.), పోతురాజు శ్రీనివాసరావు, ప్రోలయ్య, రంగాచారి మంచి మిత్రులయ్యారు. "రాళ్ళు విసరబోకురా పావురాళ్ళు విసరురా" – అని పాటపాడే సీనియర్ స్టూడెంట్ ఆళ్ళ నాగేశ్వరరావు మంచి మిత్రుడు. అప్పటి స్టూడెంట్స్ బాగా చురుగ్గా ఉండేవాళ్ళు.

ఆ రోజుల్లో స్టూడెంట్స్‌కు ఎన్.సి.సి. కంపల్సరీగా ఉండేది. నేను సరిగ్గా డ్రిల్లు చేయలేకపోయాను. ఎన్.సి.సి. ఆఫీసర్ బెల్లం సుబ్బారావు నాకు గ్రౌండ్ అంతా 3 రౌండ్లు పరిగెత్తి రమ్మని Punishment ఇచ్చారు. తరువాత N.C.C. క్లాస్ కంటే ముందే ఆయన దగ్గరకు వెళ్ళాను. ఎందుకు సరిగ్గా డ్రిల్లు చేయడం లేదు అన్నారు. బూట్లు మోయలేక పోతున్నా అని చెప్పాను. N.C.C. కి Unfit అని సర్టిఫికెట్ తెచ్చుకో అన్నారు. అలా N.C.C. నుండి తప్పుకున్నా.

సీనియర్ స్టూడెంట్స్‌తో కలసి స్ట్రైక్ చేశాం. దానిలో ముందుండటంతో ప్రిన్సిపల్ గారు Half-fee concession ను cancel చేశారు. గత్యంతరం లేక Full Fee చెల్లించా. లిటరరీ కార్యక్రమాల నిర్వహణలో గురుప్రసాదరావు గారి నేతృత్వంలో నేను పాల్గొనడం

గమనించిన ప్రిన్సిపల్ గారు, ఒకరోజున ఆఫీసుకు పిలిచారు. నా అప్లికేషన్ మీద Half-fee concession sanctioned అని రాసి, బాగా చదువుకో, పో అన్నారు. బయటకు వెళుతుంటే, ఇటురా... ఇటురా అంటూ దగ్గరకు పిలిచారు. ఏది వంగు.. వంగు.. అంటూ వీపు మీద చిన్న దెబ్బవేసి, చేతిలో ఒక చాక్లెట్ పెట్టారు. అదీ.. ప్రిన్సిపల్ రోసయ్య గారు స్టూడెంట్స్‌తో వ్యవహరించే తీరు. అలా ఉంటుంది.

నేను కాలేజి మొదటి బ్యాచ్ స్టూడెంట్‌ను కావడం వల్లనో, ఏమో, సైన్సు స్టూడెంట్‌ను కాకపోయినా, ఫిజిక్స్ వెంకట సుబ్బయ్య, బోటనీ ఎస్.ఆర్.కె. ప్రసాద్, మేథ్స్ నోములరావులతో మంచి పరిచయం కలిగింది.

ఇంకో ఆశ్చర్యకరమైన విషయం. నేను బి.ఏ. రెండో సంవత్సరం చదివేటప్పుడు మా నాయన అనారోగ్యంతో చనిపోయారు. బి.ఏ. మూడో సంవత్సరం చదవడం ఇబ్బంది అయింది. గురువు గారు గురుప్రసాదరావు గారు బి.ఏ. మూడో సంవత్సరం చదవడానికి 10 నెలలకు గాను రూ. 1050/–లు ఇచ్చారు. అలా బి.ఏ. పూర్తి చేశా. గురువు గారికి సంవత్సరం తర్వాత తిరిగి డబ్బులు ఇచ్చాను.

నేను హిందీ సబ్జెక్టు చదవకపోయినా, హిందీ మాస్టారు మాదాల తిమ్మయ్య గారితో కొద్దిపాటి పరిచయం ఉంది. ఆయనే నన్ను జె.కె.సి. కాలేజి గవర్నింగ్ బాడీ మెంబర్ డాక్టర్ ముద్దన హనుమంతరావు గారి దగ్గరకు తీసుకెళ్ళి, వారి ద్వారా ఎం.ఏ. చదవడానికి సహాయం చేయించారు. తరువాత గుంటూరులోనే తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను.

కాలేజీలో ఏ ఫంక్షన్ జరిగినా మేనేజిమెంటు వారు – డాక్టర్ సదాశివరావు, ప్రకాశరావు, డాక్టర్ బసవ పున్నయ్య, నన్నపనేని వీరయ్య చౌదరి, విద్వాన్ గోగినేని కనకయ్య – అందరూ వచ్చేవారు. యూనివర్సిరీ ఫంక్షన్స్‌కు జాగర్లమూడి చంద్రమౌళి గారు తప్పనిసరిగా వచ్చేవారు. అట్లా మేనేజిమెంట్, టీచింగ్ స్టాఫ్, స్టూడెంట్స్‌తో కలివిడిగా ఉండేవారు.

నేను, నా మిత్రులు కాలేజి చదువు ముగించుకొని బయటకు వెళ్లినా మేము సాహిత్య విద్యార్థులం కావటంతో, డాక్టర్ సదాశివరావు, డాక్టర్ బసవపున్నయ్య గార్లతో సాహిత్య సంబంధాలను నెరుపు తున్నాం. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య గారు అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న తుమ్మల కళాపీఠంలో సభ్యులుగా కొనసాగుతూ, కార్యక్రమాల నిర్వహణలో పాల్గొంటున్నాము.

ఆ విధంగా జె.కె.సి. కాలేజి చక్కగా డిసిప్లైన్‌గా చదువు చెప్పటమే కాకుండా, బతకటాన్ని కూడా నేర్పిందని నేను గర్వంగా చెప్పగలను.

శుభాశీస్సులు

(మన కళాశాల ప్రారంభోత్సవ సమయములో
కవిపుంగవులు **శ్రీ తుమ్మల సీతారామమూర్తి** చెప్పిన పద్యం)

కాలేజీలకు లోటు లేదు మన మాగాణమ్ము నం, దెవ్వడీ
బాలుం, డీ వినయాంక, మీ చతురతాభాస్వంతుడంచె న్వరే
నాలాపించిన గుప్పుస్వామి పద విద్యాశాల “యీ బిడ్డ నా
పాలన్ దేఱినవా”డనన్ వలయు సంపద్భారయై ధీరయై

జె.కె.సి. కళాశాల – నా తొలి మజిలి

శ్రీ గుంటుపల్లి సాంబశివరావు
సూపరింటెండెంట్ (రిటైర్డ్)



నేను నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ ఆఫీసులో 24.2.1968 లో క్లర్క్ కమ్ టైపిస్టుగా చేరాను. అప్పుడు ఆఫీసు శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో ఉండేది. ఒక నెల తరువాత అప్పటి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అయిన కే.శే. నన్నపనేని వీరయ్య చౌదరి గారి ఇంటికి (పట్టాభిపురం) మార్చబడింది. తరువాత మే నెలలో ఇప్పటి ఆడిటోరియం ఎదురుగా మూడు పెంకుల గదులు ఉండేవి. మొదటి గది ప్రిన్సిపల్ ఆఫీసు, రెండవది మేనేజ్‌మెంటు ఆఫీసు, మూడవది ఆఫీసురూము. ప్రిన్సిపల్ రూములోకి ప్రవేశించామంటే తిరుపతి వెంకటేశ్వరస్వామి గర్భగుడిలోకి ప్రవేశించినట్లుండేది. ఆఫీసు బీరువాలు పరిశుభ్రంగా ఉండేవి. సుగంధ శృంగార్ సాంబ్రాణీ కడ్డీలు వెలుగుతూ దేవుని గుడిని తలపిస్తూ ఉండేవి.

అప్పట్లో కళాశాల సీట్లకు చాలా కొరతగా ఉండేది. దానికి తగ్గట్లు పోస్టు గ్రాడ్యుయేషన్ ముగించుకున్న కొంతమంది, వేరే కళాశాలలో ఉద్యోగాలు చేస్తున్న మరి కొంతమంది, ఉద్యోగాలు దొరకక పట్టణంలోని పెద్దలను చేరి కళాశాల పెట్టమని కోరారు. కళాశాల అవసరాన్ని గుర్తించి పట్టణములోని పెద్దలందరూ కమ్మ హాస్టల్‌లో సమావేశమై కళాశాలను ఏర్పాటు చేయుటకు నిర్ణయించి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో చంద్రమౌళిగారు అధ్యక్షులుగాను, చేబ్రోలు హనుమయ్య గారు ఉపాధ్యక్షులు గాను, డాక్టర్ సదాశివరావు గారు కార్యదర్శిగాను, వై.కె. ఎస్. ప్రకాశరావు గారు ట్రెజరర్ గాను, గోగినేని కనకయ్య గారు అడిషినల్ సెక్రటరీ గాను, ఏకగ్రీవంగా ఎన్నుకో బడ్డారు. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారి కుమారులు చంద్రమౌళి గారు, మదన్ మోహన్ చౌదరి గారు, లక్ష్మయ్య చౌదరి గారు లక్ష రూపాయలు కాలేజీ కొరకు విరాళము ఇచ్చారు. ఉదార స్వభావులు మరికొంతమంది భూరి విరాళాలు ఇచ్చి కళాశాల స్థాపనలో తమవంతు సహకారాన్ని అందించారు. కుప్పుస్వామి చౌదరి గారు గుంటూరు జిల్లాలో చాలాకాలము జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా అందిచిన సేవలను దృష్టిలో ఉంచుకొని వారిపేరును కళాశాలకు పెట్టుటకు పెద్దలు సమష్టిగా నిర్ణయించారు.

ఆ టైములోనే శ్రీ నన్నపనేని వీరయ్య చౌదరి గారు డి.ఇ.ఓ.గా రిటైరయ్యారు. వారిని జాయింట్ సెక్రటరీగా నియమించారు. వీరు అడ్మినిస్ట్రేషన్ విషయాలలో అపార అనుభవం కలిగినవారు. కళాశాల స్థాపనలోను, నిర్వహణ లోను వారు ఎనలేని కృషి చేశారు. తదుపరి యూనివర్శిటీ వారిని అభ్యర్థించి 1968 జూలైలో కళాశాలను స్థాపించారు.

డాక్టర్ సదాశివరావు గారు ప్రాక్టీసు ఎంత బిజీగా ఉన్నా ఏదో ఒక టైములో వీలు చూసుకొని కాలేజీ వ్యవహారాలు సునిశితంగా సహనంతో చూసేవారు. మంచి అనుభవము కలిగిన అధ్యాపకులను ఇతర కాలేజీల నుండి (ఎ.సి. కాలేజి, హిందూ కాలేజి, లయోలా కాలేజి) వగైరాల నుండి తీసుకు వచ్చి వారి జీతాలకు ప్రొటెక్షనిచ్చి టీచింగు స్టాండర్డ్‌ను పెంపొందించుటకు కృషి చేశారు. ఆ రోజుల్లో ఒకనానుడి ఉండేది. జె.కె.సి. కాలేజీలో ఎం.పి.సి. సీటు దొరికితే ఇంజనీర్, బై.పి.సి. సీటు దొరికితే డాక్టరు అని చెప్పుకునేవారు. దానికి తగ్గట్టే జె.కె.సి. కాలేజి నుండి ఎందరో డాక్టర్లు, ఎందరో ఇంజనీర్లు తయారయ్యారు.

నేను ఆఫీసులో చేరినప్పుడు నా చదువు మెట్రిక్యు లేషన్ మరియు ఇంగ్లీషు టైప్ రైటింగ్ హయ్యర్ మాత్రమే. నాకు ఎలాగైనా డిగ్రీ తెచ్చుకోవాలని ఉండేది. అందుకోసం ఆంధ్రా యూనివర్శిటీ పి.యు.సి. (ఇప్పుడు ఇంటర్మీడి యట్) ప్రైవేటుగా రాయటానికి ఫీజు కట్టాను. అప్పట్లో (1968) రాత్రి తొమ్మిది దాటితే కరెంటు కాలుతుందని ఇంటి యజమానులు లైట్లు వేస్తే ఊరుకునేవారు కారు. అందుకని 0.60 పైసలు పెట్టి కిరోసిన్ దీపం కొని ఆ వెలుతుర్లో చాలా కష్టపడి పి.యు.సి. పరీక్షలకు తయారయ్యాను. తెల్లవారి పరీక్షలనగా సెలవుకోసం రోసయ్య గారిని అడిగాను. ఆయన నన్ను పల్లెటూరి బైతులాగా ఉన్నావే ఎవరిని అడిగి పరీక్షకు ప్రిపేరు

అయ్యావు. ముందు పర్మిషన్ తీసుకోవాలని తెలియదా? రాయటానికి వీల్లేదు అన్నారు. తరువాత సెప్టెంబరులో పరీక్షకు రాతపూర్వ కముగా రాసి పర్మిషన్ తీసుకొని పరీక్షలు రాశాను. అదికూడా ఎలాగంటే నమ్మకమైన, టైపింగ్ వచ్చినతన్ని నా ప్లేస్‌లో కూర్చోపెట్టి పరీక్షలు రాశాను. తరువాత డిగ్రీ పరీక్షలకు రోసయ్య గారే పర్మిషన్ ఇచ్చారు.

గోళ్ళమూడి శివాజీ గారు ఇంగ్లీషు డిపార్ట్‌మెంటులో ట్యూటర్‌గా చేసేవారు. ఆయన ఒకరోజు మా ఇంటికి లీవ్‌లెటర్ తీసుకొచ్చి ఇచ్చి ఇది ప్రిన్సిపల్ గారికి ఇవ్వమని చెప్పాడు. సరే అని తీసుకుని ప్రిన్సిపల్ గారికిచ్చి శివాజీ గారిమ్మన్నారని చెప్పాను. దానికి ప్రిన్సిపల్ గారు అగ్గిమీద గుగ్గిలమై నీవెవరు తీసికొని రావటానికి అని కేకలేశారు. అప్పట్లో ఒకరి లీవు లెటరు ఇంకొకరు తీసికొని రావటం కూడా నేరమే. ఒకసారి రేపు ఆదివారం ఉదయం 11.00 గం.లకు ఆఫీసుకు రావాలని ప్రిన్సిపల్‌గారు అన్నారు. ఆ ఆదివారం ఉదయం 9.00 గం.లకు కారేసుకుని నా ఇంటికి మా చెల్లెలిని చూడటానికి పెళ్ళివారు వచ్చారు. మా ఊరు కంతేరు. మీ ఊరు వెళదాం రండి అని పెళ్ళివారు పిలిచారు. వారిని తీసుకొని వెళ్ళటం నా బాధ్యత. కానీ రోసయ్య గారికి దడిసి నేను కాలేజీకి వెళ్ళాలండీ అని వారికి చెప్పాను. దానికి వారు కారులోనే కదండీ మిమ్మల్ని పదకొండు గంటలకు కాలేజీ దగ్గర వదుల్తాం రండి అని తీసుకుని వెళ్ళారు. తిరిగి వారు నన్ను 11.20 నిముషాలకు కాలేజీ దగ్గర వదిలారు. ఆ 20 నిమిషముల లేటుకు రోసయ్య గారు వారం రోజుల పాటు తిడుతూనే ఉన్నారు. చివర్లో అసలు విషయం చెప్పాను. అప్పుడు ఆయన శాంతించి మరి చెప్పవేం అన్నారు. కానీ ఆయన చెప్పనిస్తేగా..

నాకు బూటు బకిల్ గుచ్చుకుని కాలి మడమ సెప్టిక్ అయ్యి కాలు బాగా వాచి నడవనివ్వటం లేదు. అప్పుడు తమ్ముడు భుజమ్మీద చెయ్యివేసి కుంటుకుంటూ రోసయ్య గారింటికి వెళ్ళి కాలు చూపాను. దానికి ఆయన అన్నన్నా! పల్లెటూరి బైతులా వున్నావే రేపు పొద్దున్నే డాక్టరు గారికి చూపి ఆపరేషను చేయించుకుని మధ్యాహ్నం 12.00 గం.లకు కాలేజీకి రమ్మన్నారు. అప్పుడు కాలేజీ సెక్రటరీ డాక్టర్ సదాశివరావు గారు. ఆయన కాలుకి రెండు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి ఆపరేషను చేసి మూడు రోజులు సెలవు పెట్టుకోమన్నారు. కానీ రోసయ్య గారు 12.00 గం.లకు కాలేజీకి రమ్మన్నారు. ఆపరేషను అయిన తరువాత రిక్షా మాట్లుడుకుని (అప్పుడు ఆటోలు లేవు) కాలేజీకి వచ్చాను అప్పటి పరిస్థితులు అవి.

ఆ సంవత్సరం అడ్మిషన్లకి చాలా డిమాండ్ ఉంది. సీట్లన్నీ అయిపోయాయి. రోసయ్య గారు అప్లికేషన్లు అమ్మటం ఆపివేయ మన్నారు. మేనేజ్‌మెంటు రూమ్‌లో ఫోను మోగుతుంది. ఎవ్వరూ తియ్యటం లేదు. ఇక తప్పక నేను ఫోను ఎత్తాను. అవతల సదాశివ రావు గారు మాట్లాడుతున్నారు. అప్పట్లో ఆయన ప్రాక్టీసు చాలా బిజీగా ఉండేది. అప్లికేషన్సు అమ్మటం ఆపిన తరువాత పేరెంట్స్ ఆయన హాస్పిటల్‌కి వెళ్ళి అప్లికేషన్లు ఇప్పించమని గొడవ పెట్టారు. అప్పుడు ఆయన కాలేజీకి ఫోనుచేశారు. నా ఖర్మకాలి నేను ఫోను ఎత్తాను. సాంబశివరావు నేను చెప్పానని చెప్పు రోసయ్య గారికి. అప్లికేషన్సు అమ్మమని చెప్పు. ఇక్కడ పేరెంట్సు నన్ను ప్రాక్టీసు చేసుకోనివ్వటం లేదు అని చెప్పారు. నేను బిక్కుబిక్కు మంటూ రోసయ్య గారి రూముకి వెళ్ళి సర్.. డాక్టరు గారు ఫోను చేశారు. అప్లికేషన్సు అమ్మమన్నారని చెప్పాను. దానికి ఆయన ఇంతెత్తున ఎగిరారు. నేను నెమ్మదిగా ఒక్కొక్క అడుగు వెనక్కు వేస్తూ అక్కడి నుండి జారుకున్నాను. డా. సదాశివరావు గారిది పెద్ద మనస్సు. దానిని సహృదయంతో అర్థం చేసుకొన్నారు.

రోసయ్య గారు అడ్మిషన్స్ చేసే విధానం కూడా చాలా స్పెషల్‌గా ఉండేది. పేరెంట్ M.P.C. అడిగితే Bi.P.C. తీసుకొమ్మని, Bi.P.C. అడిగితే M.P.C. తీసుకొమ్మని చెప్పేవారు. మెరిట్ ఉన్నా ఐదారుసార్లు తిప్పుకొని సీటు ఇచ్చేవారు. అప్పుడు గాని పేరెంటుకి గానీ స్టూడెంటుకు గాని ఆ సీటు విలువ తెలియదు అని ఆయన భావన.

నా వివాహం 1973లో అయింది. అప్పుడు ఆంధ్రా యూనివర్శిటీ పరీక్షలు జరుగుతున్నాయి. వివాహము తెల్లవారు ఝామున 4.00 గం.లకు వివాహము అయిన తరువాత ఉదయం 7.00 గం.లకు కాలేజీలో ఉన్నాను. పెళ్ళికూతురు వాళ్ళు నేను అలిగి వెళ్ళానని బాధపడ్డారట. అలా ఎందుకంటే రోసయ్య గారు వేసే యక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పలేక. తరువాత ఎవరు సెలవు పెట్టినా గుంటుపల్లి సాంబశివరావు తన పెళ్ళికి కూడా ఒక్కరోజు సెలవు పెట్టలేదు. నీకు ఇన్ని రోజులు సెలవు ఎందుకు అని అరిచేవారు. వాళ్ళు వచ్చి నన్ను ఒకటే తిట్టటం. నీవు సుఖపడవు. ఇంకొకళ్ళను సుఖపడనీయవు అని.

రోసయ్య గారు మొదటి ఐదు సంవత్సరములు చంద్రనిప్పులు చెరుగుతుండేవారు. ఆయన రూములోకి వెళ్ళాలంటే అందరూ భయపడేవారు. అప్పటికి టీచింగు స్టాఫ్, మా నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఆ మహానుభావుడు చాలావరకు దారిలో పెట్టారు. ఎక్కువ మంది

స్టాఫ్ 25 సంవత్సరములలోపు వారే. ఆయన అంత కఠినంగా ఉండి అందరినీ సరైన మార్గంలో పెట్టి ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా చేసుకొనేట్లు తయారు చేశారు. తరువాత మూడు సంవత్సరాలు ఆయన చాలా సాఫ్ట్‌గా ఉన్నారు.

మేనేజ్‌మెంటు వారు ఆయనకు కావలసినంత స్వేచ్ఛ ఇచ్చి ఎంతమంది ఆయన మీద కంప్లయింట్ చేసినా పట్టించుకోకుండా ఉండి ఆయనపట్ల చాలా లిబరల్‌గా ఉన్నారు. దానిని ఆయన సక్రమంగా ఉపయోగించుకొని కాలేజీని చక్కగా పట్టాలు ఎక్కించారు. ఆ సాంప్రదాయమే ఇప్పటికీ కంటిన్యూ అవుతూ కాలేజీ చాలా సాంప్రదాయ బద్ధంగా సాగిపోతుంది.

ఈ విధంగా కళాశాల స్థాపించిన తొలి రోజుల్లో మరియు తదనంతరం కాలేజి ప్రతిష్ఠకు తమతమ పంథాల్లో ఎనలేని కృషి చేసిన మాన్యులకు నా నమస్సులు.


తల్లిదండ్రుల ఆవేదన

కె. దివ్య, ద్వితీయ బి.కాం.

ఒక గ్రామంలో సుబ్బమ్మ, వెంకయ్య అనే దంపతులు నివసించేవారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. వెంకయ్య సుబ్బమ్మ వీరు తల్లిదండ్రులు. వీరు చాలా దౌర్భాగ్యమైన (పేదరికం) స్థితిలో జీవిస్తుండేవారు. ఎంతో శ్రమ అయినా భార్య భర్తలు ఇరువురు కలిసి తన కొడుకులను చదివించి వారి వివాహాలు తగిన వారికిచ్చి వివాహం చేశారు. అలా తన కొడుకులు వివాహం ఐన తరువాత వారి భార్యలతో ఎంతో సంతోషంగా ఇతర దేశాలకు వెళ్ళిపోయారు. కూతురు కస్తూరికు వివాహం చేయాలనే ఉద్దేశ్యంతో కస్తూరి తండ్రి తన శక్తిమేరకు కష్టపడి పనిచేశాడు. వచ్చినవారు కట్నం ఎక్కువ మొత్తంలో ఆశించడం ద్వారా తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. వారి స్థితి తెలిసినదే. "రెక్క ఆడితే గాని డొక్క ఆడదు". ఈ స్థితిలో వారు అడిగిన కట్నం ఇవ్వలేక తన కొడుకులకు డబ్బు పంపమని ఒక ఉత్తరాన్ని రాశారు. అలా రాసిన ఉత్తరానికి జవాబు రాకపోవడంతో తల్లిదండ్రులు ఎంతగానో బాధపడ్డారు. అతికష్టం మీద కూతురుకు (కస్తూరి) వివాహం జరిపించారు. అలా వివాహం జరిగిన కొద్ది కాలానికి కట్నం తాలూకు కొంత మేరకు ఇవ్వాలి అని తన కూతురైన కస్తూరిని వేధింపులకు గురిచేస్తూ, బాధించడంతో ఆ వేధింపులకు భరించలేని కస్తూరి తన పుట్టింటికి వచ్చేసింది. సుబ్బమ్మ, వెంకయ్య దంపతులు తమ కూతురు కాపురం ఇలా కష్టాలమయంలో ఉండటం చూడలేక కొడుకులు దూరమైన బాధ, కస్తూరి కాపురం యొక్క స్థితిని చూసి ఎంతో దిగులు చెందారు. వెంకయ్య అనారోగ్యానికి గురికావడంతో తల్లి సుబ్బమ్మ ఎంతో బాధతో కుమిలిపోయింది. ఆ పరిస్థితుల్లో తన కూతురుకు నచ్చచెప్పి అత్తవారింటికి పంపించింది. కొంతకాలం తరువాత తల్లిదండ్రులు వృద్ధాప్యంలో తమ కొడుకులను చూడటానికి వెళ్ళారు. ముందుగా తన పెద్ద కుమారుడు వద్దకు వెళ్ళారు. వెంకయ్య పెద్దకొడుకు తల్లిదండ్రులను చూసి వారిని తమ చిన్న కొడుకు వద్దకు వెళ్ళమని తన ఇంటినుండి పంపించాడు. వెంకయ్య, సుబ్బమ్మ తన చిన్న కొడుకు వద్దకు వెళ్ళారు. తమ చిన్నకోడలు వారిని గౌరవంగా ఇంట్లోకి రమ్మని పిలిచింది. తమ చిన్న కుమారుడు ఉన్నపుడు వారిని ఎంతో ప్రేమతో చూసుకుంటూ అతను వెళ్ళిన వెంటనే తల్లి సుబ్బమ్మ చేత ఇంటిపనులు చేయిస్తూ ఎన్నో చిత్రహింసలు, చివాట్లు, కష్టాలు పెడుతూ వారిని చాలా ఇబ్బందిపాలు చేసేది. తల్లిని పనిమనిషిని చేశారు. ఆ స్థితిలో కొద్ది రోజులకు తండ్రి వెంకయ్య మరణించాడు. అతని అంత్యక్రియలు గొప్పగా చేయడానికి అన్నదమ్ములు పోటీపడ్డారు!

నేను-నా కళాశాల

శ్రీ తల్లపనేని బాలనరేంద్ర ప్రసాద్
అధ్యాపకులు, భౌతికశాస్త్ర విభాగం



ఏరా కోటీ! మీవాడికి పదవతరగతిలో మంచి మార్కులే వస్తాయి. మరి ఇంటరు ఎక్కడ చేరుస్తున్నావ్?

ఏమో మావయ్యా! నువ్వెక్కడ చేర్చమంటే అక్కడే.

ఒరేయ్! చేరిస్తే గుంటూరు జె.కె.సి. కాలేజిలో చేర్చు. లేకపోతే విజయవాడ లయోలా కాలేజిలో చేర్చు. ఇంకెక్కడావద్దు.

సరే మావయ్యా!

ఇది 1985 ఏప్రిల్ నెల చివరలో మావూరు పెదపులివళ్ళులో జరిగిన సంభాషణ.

"కోటి" అంటే మానాన్న రామకోటేశ్వరరావు.

"మావయ్య"గా పిలవబడ్డ వ్యక్తి మాస్కూల్ "నాదెళ్ళ సుబ్బరాయ చౌదరి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మా లెక్కల మాష్టారు శ్రీ గొర్రెపాటి ఉమామహేశ్వరరావుగారు".

ఆనాడు తొలిసారిగా విన్నాను "జె.కె.సి. కాలేజి" అనేపేరు. తిరిగి ఈనాడు కాలేజి స్వర్ణోత్సవాలవేళ వెనుకకు తిరిగి చూసుకొంటే, నాజీవితంలో మూడింట రెండువంతు లకు పైగా జెకెసి కాలేజి ఆక్రమించేసింది.

ఇంటర్మీడియట్ యం.పి. గ్రూప్‌తో 1985లో ఈకాలేజిలో ప్రవేశించిన నేను 1990లో బి.ఎస్సి. పూర్తి చేసి బయటకు వచ్చాను. మరలా 1994లో ఫిజిక్స్ అధ్యాపకుడుగా కళాశాలలో ప్రవేశించి, "అధ్యాపకులు, జెకెసి కళాశాల" అనే ఒక అడ్రస్‌తో సగర్వంగా జీవిస్తున్నా ననంటే అది ఈ కళాశాల నాకిచ్చిన భిక్ష.

కళాశాల ప్రారంభమై యాభయ్యేళ్ళు పూర్తవుతున్నా యని విన్నప్పుడు ఒక హర్షాతిరేక పులకింత. మదినిండా ఎన్నో ఆలోచనలు, మరెన్నో భావాలు ఉత్తుంగ తరంగ మృదంగనాదమై నాలో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. 1968వ సంవత్సరం జులై 17వ తారీఖున ప్రారంభమైన నాకళాశాల ఎన్నోదశలు దాటింది. నాటితరంలో ధీరోదాత్తతకు, దాతృత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా భాసిల్లిన స్వర్గీయ "జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి" గారి పేరు మీద స్థాపించబడినదీ కళాశాల. సమాజంపట్ల బాధ్యత మరియు భవిష్యత్‌పట్ల అపార నమ్మకం కలిగిన నాటి తరం పెద్దలు శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారి అధ్యక్షతన నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీగా ఏర్పడి ప్రారంభించిన మొదటి సంస్థ యీ కళాశాల.

నా కళాశాల తొలినాళ్ళ ప్రయాణం గురించి నా గురువులు ఆ పిమ్మట సహఅధ్యాపకులైన పెద్దల ద్వారా ఎన్నో విశేషాలు విన్నాను. గత మూడు దశాబ్దాలుగా ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఎలాంటి ప్రయాణమది! ఆంధ్రదేశవిద్యారంగ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకొన్న నా కళాశాల ప్రయాణమొక అపూర్వ చరిత్ర. క్రమశిక్షణకే శిక్షణ నేర్పే నిశ్చలతత్వంగల స్వర్గీయ యలవర్తి రోసయ్య గారు ప్రిన్సిపల్‌గా, "ఈ కళాశాల నాది. విద్యార్థులు నాబిడ్డలు" అని భావించి వారి అభ్యున్నతికి అహరహం శ్రమించిన అధ్యాపకుల అండతో, "పదండి ముందుకు మీవెనుక మేమున్నాం" అని వెన్నుతట్టి నడిపిన యాజమాన్యం వారి మార్గ నిర్దేశకత్వంలో కళాశాల అచిరకాలం లోనే అపారఖ్యాతిని ఆర్జించింది.

జె.కె.సి. కాలేజి ఒక కళాశాల మాత్రమేకాదు. ఎందరో విద్యార్థుల జీవనమార్గదర్శి. కాలేజి అంటే చదువుకోవడానికి మాత్రమే కాదని, సంస్కారయుతమైన మూర్తిమత్వం పొందటానికని చెప్పి, చేసి చూపింది. స్వచ్ఛమైన మట్టిముద్దలులాంటి గ్రామీణ విద్యార్థులను ఆప్యాయంగా అక్కున చేర్చుకొని, చక్కటి వ్యక్తిత్వంతో వివిధ రూపాలుగా ఎదిగేలా తీర్చిదిద్దిందీ కళాశాల. తనదగ్గర చదువుకొన్న బిడ్డలకు గుండెలనిండా ఆత్మస్థైర్యాన్ని నింపి బంగారు భవితవైపు నడిపింది. అందుకే, ఎందరో గ్రామీణ రైతుబిడ్డలు డాక్టర్ గోఖలేలాగా

డాక్టర్లయ్యారు. కళాశాల నేర్పిన జీవనాదర్శాలను పండించు కోవడానికి కొందరు ఇంజనీర్లయ్యారు. కొందరు IAS మరియు IPS ఆఫీసర్లయ్యారు. ఆంధ్రప్రదేశ్ DGP గా బాధ్యతలు చేపట్టిన పూర్వవిద్యార్థి శ్రీ మాలకొండయ్యను చూసి నాకళాశాల ఎంతమురిసిపోతోందో! కళాశాలలో చదువుకుంటూ తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకొన్న పిల్లలు కొందరు సినిమా డైరెక్టర్లయ్యారు. మరికొందరు అంతర్జాతీయస్థాయి శాస్త్రవేత్తలయ్యారు. ఇంకొందరు విజ్ఞాన్ రత్తయ్యగారిలా ప్రఖ్యాత విద్యావేత్తలయ్యారు. మరికొందరు CA లయ్యారు. కొందరు పాపినేని శివశంకర్‌లా ప్రఖ్యాత రచయిత లయ్యారు. ఇంకొందరు రాజకీయ నాయకులయ్యారు. మరికొందరు ప్రముఖ పారిశ్రామిక వేత్తలయ్యారు. కొందరు ఉత్తమ అధ్యాపకులయ్యారు. అత్యధికులు సాఫ్ట్‌వేర్ రంగంలో దేశవిదేశాలలో తమకీర్తి పతాక నెగురవేశారు. అసలు "అది ఇది" అని అననేల? అన్నిరంగాలలో తమదైన ముద్ర వేశారు. ఈనాడు నాకళాశాల తనదగ్గర చదువునేర్చుకొని ఎదిగిన బిడ్డలను చూసి ఎంత పొంగి పోతోందో!

కళాశాల ప్రారంభోత్సవ సమయంలో తుమ్మల సీతారామ మూర్తిగారు ఆశీస్సులందిస్తూ చెప్పిన పద్యం నన్నెప్పుడూ కదిలిస్తుం టుంది.

కాలేజీలకు లోటు లేదు మన మాగాణమ్ము నం; దెవ్వఁడీ
బాలుం, డీ వినయాంక, మీ చతురతాభాస్వంతుఁడంచె వ్వరే
నాలాపించినఁ గుప్పుసామి పద విద్యాశాల "యీ బిడ్డ నా
పాలన్ దేఱినవాఁ" డనన్‌వలయు సంపద్భారయై ధీరయై

అవును నేడు అంతర్జాతీయస్థాయిలో వెలిగిపోతున్న తనబిడ్డలను చూసి "వీడునాపాలన్ తేరినవాడ"ని నాకళాశాల పొంగి పోతోంది 'సంపద్భారయైధీరయై'. నాటి ప్రారంభోత్సవసభలో తుమ్మలవారితో పాటు తమ ఆశీస్సులందించిన ప్రఖ్యాత కవిపండితులందరికీ కృతజ్ఞతా పూర్వక నమస్సులు.

జెకెసి కళాశాల ఒక్కరోజులో కట్టబడలేదు. ఒక్కరోజులో ఎదగనూలేదు. రేకులషెడ్‌లో తరగతులు, తలుపులు లేని గదులు. అయితేనేం మేమున్నామని పాఠాలు చెప్పిన అధ్యాపకుల కృషి ఫలితంగా అనతికాలంలోనే నాటి ప్రముఖ కళాశాలలకు దీటుగా ఎదిగి అత్యున్నత ఫలితాలు చూపింది. విద్యార్థులు "ఎక్కడినుండి వచ్చారు"? అని ప్రశ్నించకుండా "ఎంతస్థాయికి ఎదగగలరు"? అని మాత్రమే చేసిచూపింది నాకళాశాల.

శ్రీశ్రీ అంటారు "బస్తాలతో బళ్ళకెత్తుపద్యాలా కవిత్వం"అని. అదేమాట నా కళాశాలదికూడా. చదువంటే పుస్తక పరిజ్ఞానం మాత్రమేకాదు, విద్యార్థి మూర్తిమత్వం సంపూర్ణంగా ఎదగడమేనని నమ్మింది. అందుకే, నాటితరంలో దిగ్ధంతులైన కవిపండితులను ఆహ్వానించి సాహితీ మహోత్సవాలు జరిపింది. జాషువా, తుమ్మల, దివాకర్ల, పళ్ళెపూర్ణప్రజ్ఞాచార్యులు, కులపతి, మేడసాని, సంజీవదేవ్, కరుణశ్రీ, బేతవోలు తదితర కవిపండితుల అమృతవాగ్ధారలలో తడిసిమురిసింది. "సంగీత సాహిత్య సమలంకృత" నాకళాశాల. "స్పిక్‌మెకే" కార్యక్రమం ద్వారా సంగీత నృత్యాలలో తలపండిన ఈమని శంకరశాస్త్రి, సిక్కిల్ సిస్టర్స్, కేలూచరణ మహాపాత్రో తదితరుల సంగీత, నృత్యప్రదర్శనలు ఏర్పాటుచేసి, తనకు తాను స్వరాభిషేకం చేసుకొన్నది. విద్యార్థుల మనోల్లాసమే తన ధ్యేయం కనుకనే, సినీజగత్తులో మేటి తారలైన అక్కినేని, మిక్కిలినేని, జగ్గయ్య, మురళీమోహన్ తదితరులను రావించి వార్షికోత్సవాలు జరుపుకొన్నది.

ప్రారంభం రేకుల షెడ్‌లో అయినా, ఎదిగేక్రమంలో అనేక ఆధునిక హంగులమర్చుకొన్నది. రేకులషెడ్‌లు బహుళఅంతస్తుల భవనాలయినాయి. కాలం మారింది. మారినకాలంలో క్రొత్త అవసరాలు ఏర్పడ్డాయి. విద్యావ్యవస్థలోనూ పెనుమార్పులు. మార్పును అతినేర్పుగా ఒడిసిపట్టడం నాకళాశాలకు వెన్నతో పెట్టిన విద్య. "అన్‌ఎయిడెడ్" విభాగంలో అనేక కొత్త గ్రూపులతో కోర్సులు ప్రారంభమయ్యాయి. జాతీయస్థాయి విద్యా సంస్థలకు ధీటుగా కంప్యూటర్ ల్యాబ్‌లు, అత్యాధునిక సైన్స్ ప్రయోగశాలలు కళాశాలకు ఏర్పడ్డాయి. గొప్ప జిమ్, అంతకన్నా గొప్ప క్రికెట్ గ్రౌండ్, బాస్కెట్ బాల్‌కోర్టు ఎన్నో మరెన్నో క్రీడా సదుపాయాలు! అబ్బ! ఎంతగొప్ప కలెక్షనో"? అనిపించేలా గ్రంథాలయం. ఇవన్నీ అనతికాలంలోనే కళాశాల కంఠాభరణాలయ్యాయి. ఈ పరిణామ క్రమంలో, శాస్త్రసాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులను విద్యార్థు లకు పరిచయం చేయాలనే తలంపుతో ఎన్నో జాతీయ మరియు అంతర్జాతీయ సెమినార్లు నిర్వహించబడ్డాయి.

పేరుకు "కోఎడ్యుకేషన్" కాలేజి అయినా సంఖ్యా పరంగా విద్యార్థినులే ఎక్కువ అనేలా వేలాది ఆడపిల్లలకు చదువునేర్పి, జాతి నిర్మాణంలోను, స్త్రీ సాధికారతలోనూ తనవంతు పాత్ర నిర్వర్తించింది నాకళాశాల.

ఆధునిక విద్యావ్యవస్థలో మార్పులకనుగుణంగా తానూమారి 2007వ సంవత్సరంలో "స్వయంప్రతిపత్తి"గల కళాశాలగా రూపాంతరం చెంది ధృఢంగా నిలిచింది. మార్పు ఏదైనా విద్యార్థుల అభ్యున్నతికే అని భావించి, నిరంతరం శ్రమిస్తున్న బంగారుతల్లి నాకళాశాల. గతంలో కళాశాల గొప్పతనాన్ని అధ్యాపకుల అంకితభావం మరియు విద్యార్థుల పరీక్షా ఫలితాలతో కొలిచేవారు. ఆధునిక కాలంలో అనేక అంశాలలో కళాశాల స్థితిగతులను బట్టి జాతీయస్థాయిలో గ్రేడింగ్ ఇచ్చే విధానం వచ్చింది. ఈ పరామితులపరంగా కూడా రెండుసార్లు "A" గ్రేడ్ తెచ్చుకొని తనఆధిపత్యాన్ని నిలుపుకొంటున్నది నాకళాశాల.

కళాశాల ప్రారంభంలో అంకితభావంగల మరియు తమ రంగాలలో గుర్తింపు ఉన్న అధ్యాపకులు కళాశాలకు మూలస్థంభాలయ్యారు. కాలం గడిచేకొద్దీ మొదటితరం అధ్యాపకులు పదవీ విరమణ చేశారు. కొత్తతరం యువత అధ్యాపకత్వం చేపట్టింది. అందులోనూ అధికసంఖ్యలో పూర్వవిద్యార్థులే అధ్యాపకులుగా చేరారు. కాలంమారినా, విద్యావిధానాలు మారినా, అధ్యాపకులు మారినా మారనిది ఒక్కటే. అది విద్యార్థుల యెడ ఆపేక్ష, కళాశాల మీద గౌరవం. అందుకే నేటితరం అధ్యాపకులు కూడా తమముందుతరం వారి అడుగుజాడలలోనే నడుస్తూ కళాశాల పురోభివృద్ధికి అహరహం శ్రమిస్తున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే, నాకళాశాల పురోభివృద్ధి గురించి ఎంతయినా చెప్పవచ్చు. శుద్ధమైన "ఆత్మ" (soul) నడిపే సక్రమమైన "మేధస్సు" (mind) గల "శరీరం" (body) ఒక మనిషిని మనీషిగా మారుస్తుంది. సమున్నత ఆశయంతో కళాశాల నడిపే యాజమాన్యం" "ఆత్మగా", విద్యార్థుల ఉన్నతికై నిరంతరం పాటుపడే అధ్యాపకవర్గం "మేధస్సు"గా, తద్వారా తమను తాము సమున్నతంగా తీర్చిదిద్దు కొంటున్న విద్యార్థులు "శరీరం"గా, వెరసి ఒక మహామనీషిలా కనిపిస్తోంది నా కళాశాల. 1968లో ప్రారంభమై 1993లో రజతోత్సవం జరుపుకొని, ప్రస్తుతం 2018లో స్వర్ణోత్సవం జరుపుకొంటున్న జెకెసి కళాశాల ఆంధ్రదేశ విద్యాలయాలకే తలమానికం.

ఇక నా విషయానికి వస్తే... కళాశాల నాకేమిచ్చింది? అని ప్రశ్నించుకుంటే, సమాధానం "చాలా ఇచ్చింది". ఐదేళ్ళు విద్యాబుద్ధులు నేర్పింది. ఆ పిమ్మట ఉద్యోగమిచ్చి అధ్యాపకుణ్ణి చేసి జీవనభృతి నిచ్చింది. మంచి గురువులనిచ్చింది. మంచి శిష్యుల నిచ్చింది. ఇంటర్మీడియట్ చేరేవరకూ గుంటూరు మొఖమెరుగని నన్ను గత 30 ఏళ్ళుగా గుంటూరువాసిని చేసింది.

అందుకే నాకళాశాలకు ఎంతో రుణపడిపోయాను. ఏమివ్వ గలను నా కళాశాల తల్లికి? శిరస్సువంచి అభి వందనం చేయడం తప్ప. కళాశాల ఇంతటి స్థాయికి ఎదగడంలో ప్రముఖపాత్ర వహించిన యాజమాన్య పెద్దలకు వందనం. అకుంఠిత దీక్షతో, క్రమశిక్షణతో కళాశాల నడిపిన ప్రిన్సిపాల్స్‌కు వందనం. "ఇది నాకాలేజి" అని మమేకమైపోయి పనిచేసిన, చేస్తున్న అధ్యాపకులకు వందనం. ముఖ్యంగా విద్యార్థిదశలో నావ్యక్తిత్వంపై బలీయమైన ముద్రవేసి నా జీవనగమనాన్ని నిర్దేశించిన మాగురువర్యులు, నాజీవనమార్గదర్శి శ్రీ పాతూరి కోటేశ్వరరావుగారికి కృతజ్ఞతాభివందనం. "నేను జెకెసి స్టూడెంట్‌ని" అని గర్వంగా చెప్పుకొనేలా ఎదిగిన విద్యార్థులకు వందనం. కళాశాల పురోభివృద్ధిలో అంతర్లీనంగా భాగమై శ్రమించిన, శ్రమిస్తున్న అధ్యాపకేతర సిబ్బందికి వందనం.

ఈ స్వర్ణోత్సవ సంబరాలవేళ నన్ను – "నేను"గా యీ సమాజానికి అందించిన నా జెకెసి కళాశాలకు హృదయపూర్వక కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ విద్యా వినీలాకాశాన నా కాలేజి చిరస్థాయిగా ధృవతారలా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాను.

సదా జె.కె.సి. సేవలో ....
కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం

శ్రీ యెండూరి పాండురంగారావు

కార్యదర్శి, జె.కె.సి. కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం



జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల స్వర్ణోత్సవాలు వైభవంగా జరిగి అందరికి మధుర స్మృతులుగా నిలిచి పోవాలని మా ఆకాంక్ష. మన కళాశాల ఉమ్మడి కుటుంబంలాంటిది. పాలకవర్గం వారు అందరిని ప్రేమాభిమానాలతో సమదృష్టితో కన్న బిడ్డల్లాగ చూసుకుంటారు. అందువల్ల స్వర్ణోత్సవాలు మన ఇంటిలో పండుగ లాగ ప్రతి ఒక్కరి హృదయాల్లో ఆనందపు రంగవల్లులను పరచి అలరించే ఈ శుభ సమయంలో బోధనేతర సిబ్బంది మన సంఘం నిర్వహిన్తున్న పాత్రను సింహావలోకనం చేసికొనుట ఆనందదాయకమే కాకుండా అవశ్యం కూడ. "జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల" బోధనేతర సిబ్బంది, పాలకవర్గం వారిపై పూర్తి శ్రద్ధా భక్తులతో తమ తమ విధులను నిర్వహిస్తూ అంకిత భావంతో సేవ చేస్తున్నాం. ఐతే ప్రభుత్వం వారి నుండి పొందవలసిన సౌకర్యాలను పొందుటకై బోధనేతర సిబ్బంది మొదటిసారిగా 1976లో ఒక సంఘంగా ఏర్పడి దానిని రాష్ట్ర స్థాయి సంఘానికి అనుబంధ సంస్థగా (జత) చేయడమైనది. ప్రారంభ సంవత్సరంలో యెండూరి శ్రీనివాస రావు గారు అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రస్తుతం రాష్ట్రం రెండుగా విడిపోయిన సందర్భంగా మన సంఘానికి రామినేని సాంబశివరావు గారు యూనిట్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు.

1980 వ సంవత్సరంలో మన రాష్ట్ర స్థాయి సంఘ కార్యదర్శి గారైన శ్రీ పి. గోవింద స్వామి గారి ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బంది సంఘం, శ్రీ యమ్.జె. మాణిక్యరావు గారి ఆధ్వర్యంలో (ACTA) ఆక్టాతో కలసి సమస్వయ పోరాటంలో పాల్గొని ప్రభుత్వం నుండి నేరుగా జీతాలు అందుకొను విధానం సాధించాం. ఉమ్మడి రాష్ట్రములో మన కళాశాల నుండి కట్టా కోటేశ్వరరావు, రాష్ట్ర స్థాయి సంఘానికి, కార్యవర్గ సభ్యులుగాను, నిమ్మగడ్డ సుబ్బారావు, రాష్ట్ర స్థాయి సంఘ కోశాధికారిగాను, ఆచార్య నాగార్జున యూనివర్శిటీకి రాష్ట్ర స్థాయి సంఘం తరఫున సెనెట్ సభ్యులు గాను (7) ఏడు సంవత్సరాలు పనిచేశారు. ప్రస్తుతం నవ్యాంధ్ర ప్రదేశ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘానికి 2014లో ఎన్నికలు జరిగాయి. మన కళాశాల నుండి రామినేని సాంబశివరావు రాష్ట్ర స్థాయి సంఘానికి కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి సంఘ కార్యవర్గ సభ్యులుగా యండూరి పాండురంగారావు కొనసాగు తున్నారు. మన కళాశాలలో వున్న అధ్యాపకేతర సిబ్బంది (ఎయిడెడ్) సభ్యులందరు అధిక సంఖ్యలో పదవీ విరమణ చేశారు. మిగిలిన కొద్దిపాటి సభ్యులతో పాటు మన మేనేజ్‌మెంటు వారు అన్ ఎయిడెడ్ సిబ్బందిని నియమించారు. మేము అందరం కలసి పరస్పర సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

మన కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు కీ॥శే॥ శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి గారి కాంస్య విగ్రహానికి,, డాక్టరు కొండబోలు లక్ష్మీ ప్రసాదు పబ్లిక్ స్కూలుకు, అభిమానంతోను ఉడుతా భక్తితో మావంతు ఆర్థిక సహాయం చేశాం.

ప్రస్తుతము మన కళాశాల బోధనేతర సిబ్బంది సంఘమునకు అధ్యక్షులుగా శ్రీ రామినేని సాంబశివరావు, కార్యదర్శిగా యెండూరి పాండురంగారావు, కోశాధికారిగా మేడా శివరామకృష్ణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అందరి ధ్యేయం ఒక్కటే. కళాశాల అభ్యున్నతి.


Nagarjuna Education Society, Guntur.
50
GOLDEN JUBILEE CELEBRATIONS
పూర్వ విద్యార్థుల సమ్మేళనం
Golden Jubilee Year
Fifty Years of Excellence



JKC College

JKC Nagar, Choudaripet (P.O.) Guntur - 522 006, Andhra Pradesh.
Phone : +91 863 2351062
Website : www.jkcc.ac.in • e-mail : jkccoff@gmail.com